ఆదివారం
గత వారంరోజుల పై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

విజయవాడ

fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam


4-5-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 92 పేజీలు: 12 వెల: 8.00

**డ్రాగన్ రహస్యాలు చెప్పండి**
జిన్‌పింగ్ అసంతృప్తులకు యుఎస్‌ఎ ఆహ్వానం

**ఖండాంతర క్షిపణిని పరీక్షించిన పాక్**

9లో

# అభివృద్ధిని అడ్డుకోలేరు



## అమరావతిని మూడేళ్లలో పూర్తి చేస్తాం

## అడ్డంకులు సృష్టించే వారు భంగపడాల్సిందే: సీఎం చంద్రబాబు

**విజయవాడ,మే3,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రాభివృద్ధికి ఎవ్వరెన్ని అడ్డంకులు పెట్టేందుకు ప్రయత్నించిన వారు భంగపడాల్సిందేనని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధిని ఎవ్వరు అడ్డుకోలేరన్నారు. సామాజిక మాధ్యమాలు వేదికగా ఆయన ప్రజలకు పలు అంశాలను వెల్లడించారు. అమరావతి పునర్ నిర్మాణ పనులకు ప్రధాని నరేంద్రమోడీ శంకుస్థాపన చేసారన్నారు. ఇక ఈ కార్యక్రమాలు ముందుకు సాగిపోతా యన్నారు. కచ్చితంగా మూడేళ్ళలో అమరావతి నిర్మాణం తొలిదశ పనులు పూర్తవుతాయన్నారు. ఏపీ అంటే ఆంధ్రప్రదేశ్, పోలవరం అన్నారు. వీటితో రాష్ట్రమం తటా అభివృద్ధికి కేంద్రీకరించి పనులు చేస్తున్నామన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేతులమీదుగా రాజధాని అమరావతి పనులు పునఃప్రారంభమయ్యాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలకు, రాజధాని రైతులకు, కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించిన ప్రభుత్వ యంత్రాంగానికి, అధికారులు, మంత్రులు, ప్రజాప్రతినిధులకు, కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లిన మీడియా, సోషల్ మీడియా వారికి కృతజ్ఞతాపూర్వక నమస్కారాలు తెలియజేస్తున్నానని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రజల సహకారంతో, కేంద్ర ప్రభుత్వ మద్దతుతో, పక్కా ప్రణాళికతో అందరికీ అవకాశాలు సృష్టించేలా, రాష్ట్రానికి చోదక శక్తిగా నిలిచేలా ఫ్యూచర్ సిటీగా రాజధాని అమరావతిని నిర్మిస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి సాధించి తమకు అండగా ఉన్న ప్రజల నమ్మకాన్ని నిలబెడతామని అన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి పేరుపేరునా సీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు 2027 నాటికి పూర్తి చేస్తామన్నారు. గత పాలకులు మూడు రాజధానుల పేరుతో రాజధానిని నిర్వీర్యం చేశారని చంద్రబాబు మండిపడ్డారు. రాష్ట్ర ప్రజలు, రాజధాని రైతుల పోరాటానికి ఫలితం లభించిందన్నారు. గత ప్రభుత్వంలో విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని ఎన్నికల ముందు చెప్పామని గుర్తు చేశారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందుకెళ్తున్నందున ఆర్థిక కష్టాలున్నా ఈ 10 నెలల్లో పెద్దఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టామన్నారు. అన్నదాత, తల్లికి వందనం పథకాలు ప్రారంభించటంతో పాటు పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేస్తామని పునరుద్ఘాటించారు. ప్రపంచం మెచ్చే నగరంగా అమరావతిని తీర్చిదిద్దుతామని సీఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. దశాబ్దం క్రితం ప్రధాని మోదీ చేతుల మీదుగా అమరావతికి శంకుస్థాపన జరిగిం దన్న ఆయన గత ఐదేళ్లు విధ్వంస పాలనలో

>>2


# అమరావతికి ఉజ్వల భవిష్యత్తు: ప్రధాని మోడీ

## రాష్ట్రానికి చోదక శక్తిగా రాజధానిని నిర్మిస్తాం



**విజయవాడ,మే3,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి పునఃప్రారంభంపై ప్రధాని నరేంద్రమోడీ, ఏపీ సిఎం చంద్రబాబులు "ఎక్స్" వేదికగా ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా ఎక్స్‌లో ప్రధాని ఇలా రాసుకొచ్చారు. అమరావతి అభివృద్ధిలో నూతన, చారిత్రాత్మక అధ్యాయాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ లోనేఇ నా సోదర, సోదరీమణుల మధ్య ఉండటం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. అమరావతి భవిష్యత్ పట్టణ కేంద్రంగా ఆవిర్భవిస్తుంది. ఇది ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథాన్ని మెరుగుపరుస్తుందని నేను విశ్వసిస్తున్నాను అని చెప్పుకొచ్చారు. నాకు మంచి మిత్రుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకి అమరావతి పట్ల ఉన్న దార్శనికత, రాష్ట్ర ప్రజల సంక్షేమం పట్ల ఆయనకున్న నిబద్ధతను నేను అభినందిస్తున్నాను అని ప్రధాని మోడీ రాసుకొచ్చారు. ఇక, ప్రధాని నరేంద్రమోడీ చేతుల మీదుగా జరిగిన రాజధాని అమరావతి పనుల పునఃప్రారంభ కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నాను అని సిఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. రాష్ట్రం

>>2



శనివారం న్యూఢిల్లీలో అంగోలా అధ్యక్షుడు జువా లోరెన్కోతో భేటీ అయిన ప్రధాని మోడీ

# మానవాళిని పీడిస్తున్న ఉగ్రవాదం

## అంగోలా అధ్యక్షుడితో భేటీలో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, మే 3:** ఉగ్రవాదం మానవాళిని పీడిస్తున్న అతిపెద్ద ముప్పు అని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. దాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. భారత పర్యటనలో ఉన్న అంగోలా అధ్యక్షుడు జువా లోరెన్సోతో ప్రధానిమోడీ భేటీ అయ్యారు. తర్వాత వీరిద్దరూ కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడి ఘటనను మోడీ ప్రస్తావించారు. ఉగ్రవాదం మానవాళికి అతిపెద్ద ముప్పు. పహల్గాం దాడినేపథ్యంలో సీమాంతర ఉగ్రవాదంపై భారత్ చేస్తున్న పోరాటానికి అంగోలా మద్దతు పలికింది. అందుకు ఆదేశానికి కృతజ్ఞతలు చెపుతున్నట్లు మోడీ చెప్పారు. ఉగ్రవాదులు వారికి మద్దతు ఇచ్చేవారిపైనా కఠినమైననిర్ణయాత్మక చర్యలు తీసుకోవడానికి మేం కట్టుబడి ఉన్నామని మోడీ పునరుద్ఘాటించారు. ఇటీవలే బీహార్‌లో కూడా మోడీ పహల్గాం దాడిప్రస్తావిస్తూ తీవ్రస్థాయిలో హెచ్చరికలు చేసారు. ఉగ్రదాడి వెనక ఉన్నవారు, కుట్రలోభాగమైన వారికి ఊహకందని రీతిలో శిక్ష విధిస్తామని అన్నారు. ప్రతి ఉగ్రవాదిని గుర్తించి ట్రాక్‌చేసి శిక్షిస్తామని యావత్‌భారతీయులకు హామీ ఇస్తున్నట్లు చెప్పారు. గతనెల 22న జమ్ము కాశ్మీర్‌లోని అనంతనాగ్‌జిల్లా పహల్గాంవ్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బైసరన్‌లో ముష్కరులు మారణహోమానికి పాల్పడిన సంగతి తెలిసిందే. సైనికదుస్తుల్లో వచ్చినవారు పర్యాటకులను చుట్టుముట్టి అతిసమీపంనుంచి కాల్పులుజరిపారు. ఈ ఘటనలో 25 మంది పర్యాటకులు ఒక కాశ్మీరీ యువకుడు ప్రాణాలు కోల్పోయారు.

### పాక్ దిగుమతులకు భారత్ ఝలక్

పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌ను ఆర్థికంగా దెబ్బకొచ్చే చర్యలను భారత్ మరింత ముమ్మరం చేసింది. ఇప్పటికే

>>2



## ప్రారంభమైన గ్రూప్-1 పరీక్షలు

**విజయవాడ, మే 3,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా గ్రూప్-1(2023) ప్రధాన పరీక్షలు ప్రారంభమయ్యాయి. విశాఖ, విజయవాడ, తిరుపతి, అనంతపురంలోని 13 పరీక్షాకేంద్రాల్లో మొత్తం 4,496మంది అభ్యర్థులు పరీక్ష రాస్తున్నారు. ఈ నెల 9 వరకు ప్రధాన పరీక్షలు జరుగుతాయి. పరీక్షా కేంద్రాలను ఏపీపీఎస్సీ ఛైర్మన్ అనూరాధ, కార్యదర్శి రాజాబాబు తనిఖీ చేశారు. ట్యాబ్ ద్వారా అభ్యర్థులకు ప్రశ్నాపత్రాలు అందచేస్తున్నట్లు ఏపీపీఎస్సీ కార్యదర్శి రాజాబాబు తెలిపారు. 87 శాతం మంది అభ్యర్థులు హాల్ టిక్కెట్లు డౌన్‌లోను చేసుకున్నారని చెప్పారు. విశాఖలో 1190, విజయవాడలో 1801, తిరుపతిలో 911, అనంతపురంలో 594 మంది చొప్పున అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. రోజూ ఉదయం 10 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఇవి ఉంటాయి. పరీక్ష నిర్వహణ సమయం ముగిసే వరకు అభ్యర్థులను బయటకు పంపించరు. ఉదయం 8.30 నుండి

>>2

# త్వరలో ట్రాన్స్‌మీడియా ఎంటర్‌టైమెంట్ సిటీ

**విజయవాడ,మే3,ప్రభాతవార్తప్రతినిధి:** భారతదేశపు మొట్టమొదటి ట్రాన్స్ మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ సిటీని ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయడానికి ముంబయిలో జరుగుతున్న వేవ్స్ సమ్మిట్2025లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు క్రియేటివ్‌ల్యాండ్ ఆసియా తమ సహకారాన్ని ప్రకటించినట్లు మంత్రి కందుల దుర్గేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మే 1వ తేదీ నుండి 4వ తేదీ వరకు తొలి సారి ఇండియాలో ప్రత్యేకించి ముంబయిలో జరుగుతున్న ప్రతిష్టాత్మక వేవ్స్ (ది వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్ టైన్ మెంట్ సమ్మిట్) సమ్మిట్ 2025 లో ఈ మేరకు ఏపీ ప్రభుత్వం, క్రియేటివ్ ల్యాండ్ ఆసియా మధ్య ఎంవోయూ జరిగిందని తెలిపారు. ఈ ఎంవోయూ ద్వారా ఏపీకి వచ్చే సందర్శకులు లీనమయ్యేలా థీమ్ పార్క్ లు, గేమింగ్ జోన్‌లు, గ్లోబల్ సినిమా కోప్రొడక్షన్ జోన్‌లు ఏర్పాటు కానున్నాయని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. అంతేకాక ఉద్యోగ సృష్టి, నైపుణ్య అభివృద్ధి, పర్యాటకం మరియు డిజిటల్ ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఈ ఎంవోయూ దోహదం చేస్తుందని మంత్రి దుర్గేష్ వివరించారు.

ప్రస్తుతం మంత్రి కందుల దుర్గేష్ వియత్నాంలో ఉండటంతో పర్యాటక శాఖ ఎండీ ఆమ్రపాలి కాట, క్రియేటివ్‌ల్యాండ్ స్టూడియోస్ వ్యవస్థాపకురాలు మరియు క్రియేటర్స్ ఇంక్ లండన్ చైర్మన్ సాజన్ రాజ్ కురుప్, హాలీవుడ్ నుండి గ్లోబల్ అడ్వైజరీ బోర్డు ప్రతినిధులు డేవిడ్ ఉంగర్, సీఈవో ఆర్టిస్ట్స్ ఇంటర్నేషనల్, గ్లోబల్‌గేట్ మేనేజింగ్ డైరెక్టర్ విలియం ఫైఫర్, నికోలస్ గ్రానాటినో చైర్మన్ నోవాక్వార్క్ లు ఈ ఎంవోయూపై సంతకాలు చేశారు. ఇటీవలే క్రియేటివ్ ల్యాండ్ ఆసియా ప్రతినిధులు కొందరు వెలగపూడి సెక్రటేరియట్ లోని మంత్రి పేషీలో ఈ విషయంపై చర్చించారు. మంత్రి సమక్షంలో అవగాహన ఒప్పంద పత్రాలు మార్చు కున్నారు. వేవ్స్ రౌండ్‌టేబుల్ ను సందర్శించిన పలువురు ప్రముఖులు మరియు హాలీవుడ్ నుండి గ్లోబల్ అడ్వైజరీ నుండి కొంతమంది ప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## రాష్ట్రానికి రావడంపై హర్షం వ్యక్తం చేసిన మంత్రి కందుల దుర్గేష్

### పర్యాటక రంగానికి మరింత ప్రోత్సాహం: టూరిజం ఎండి ఆమ్రపాలి

రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ రంగంపై ప్రత్యేక దృష్టి సారించిన మంత్రి కందుల దుర్గేష్ ఇప్పటికే రూ. 300 కోట్ల కేంద్ర నిధులను రాబట్టారు.. పర్యాటక రంగంలో రూ. 1200 కోట్లకు పైగా పెట్టుబడులు రాబట్టి 8 ఎంవోయూలు కుదుర్చుకున్నారు. తద్వారా వేలాది సంఖ్యలో యువతకు ఉపాధి దక్కనుంది. తాజా ఒప్పందంతో మరింత మంది యువతకు ఉపాధి కలిగే అవకాశం ఉంది..

వియత్నాం పర్యటనలో ఉన్న మంత్రి కందుల దుర్గేష్ ఈ అంశంపై మాట్లాడుతూ క్రియేటివ్ ల్యాండ్ ఆసియాతో భాగస్వామ్యం అనేది రాష్ట్రాన్ని చలనచిత్ర, వినోద పర్యాటకం అభివృద్ధికి తాము చేసిన ప్రయత్నాలలో ఒక ఉత్తేజకరమైన మైలురాయిని సూచిస్తుందన్నారు. ఈ అవగాహన ఒప్పందం మోలిక సదుపాయాల ప్రాజెక్టు కంటే మించినదని పేర్కొన్నారు. ప్రతిభ, ఆవిష్కరణ, పర్యాటక అనుకూలమైన పర్యావరణ వ్యవస్థను సృష్టించేందుకు ఇది దోహదపడనుందన్నారు. క్రియేటర్‌ల్యాండ్ ఏర్పాటు చేసే ప్రపంచ స్థాయి ప్రొడక్షన్ హబ్ ద్వారా వినోద ఆర్థిక వ్యవస్థ పెరగడమే గాక, థీమ్ పార్కులు, ప్రేక్షకులు లీనమయ్యేలా జోన్‌లు, ప్రపంచ ఉత్పత్తి కేంద్రాల ద్వారా సందర్శకుల అనుభవాలను కూడా మారుస్తుందన్నారు. ఈ సాంస్కృతిక, ఆర్థిక పరివర్తనకు నాయకత్వం వహిస్తుందన్నందుకు గర్వపడుతున్నా మన్నారు. ఈ సహకారం వైవిధ్యమైన, అధికనాణ్యత ఉత్పత్తికి తమ నిబద్ధతకు మద్దతు ఇస్తుందన్నారు. అత్యాధునిక సాంకేతికత మరియు అసాధారణమైన కంటెంట్‌తో నడిచే ఏవీజీసీ, వీఎఫ్ఎక్స్ సహా మీడియా మరియు వినోద రంగానికి ప్రోత్సాహాన్ని అందిస్తుందన్నారు.. డిజిటల్ వినోదంలో కొత్త ప్రమాణాలను నెలకొల్పడం, పరిశ్రమ మరియు వినియోగదారులతో మరింత అర్థవంతమైన మార్గాల్లో కనెక్ట్ అవ్వడం లక్ష్యంగా ఈ ఎంవోయూ కుదుర్చుకున్నట్లు మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. వివరాలు పరిశీలిస్తే క్రియేటర్‌ల్యాండ్ 56 ఏళ్లల్లో రూ. 8000, 10,000 కోట్ల మధ్య పెట్టుబడులను ఆకర్షిస్తుందని అంచనా వేయబడింది. ఇది ఏఐ ఆధారిత రియల్ టైమ్ రెండరింగ్ మరియు వాల్యూమెట్రిక్ క్యాప్చర్ టెక్నాలజీ

>>2



## వంశీ బెయిల్ పిటీషన్ కొట్టివేసిన హైకోర్టు

**విజయవాడ,మే 3,ప్రభాతవార్త ప్రతినిధి:** వైకాంగ్రెస్ పార్టీనేత వల్లభనేని వంశీకి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. గన్నవరం టిడిపి కార్యాలయంపై దాడి, ధ్వంసం, కంప్యూటర్ ఆపరేటర్ సత్యవర్ధన్‌ను కులం పేరుతో దూషించిన కేసులో బెయిలు కోసం వంశీ దాఖలు చేసిన పిటీషన్‌ను హైకోర్టు కొట్టేసింది. ఫిర్యాదుదారుడైన సత్యవర్ధన్‌ను అపహరించిన కేసులో వంశీ పాత్రపై ప్రాథమిక ఆధారాలున్నాయని స్పష్టం చేసింది. హైకోర్టున్యాయమూర్తి జస్టిస్ టి.మల్లిఖార్జున రావు తీర్పు ఇచ్చింది. ఈ అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించే ఆలోచన

>>2



## మూడు రోజుల్లో వర్షాలు

**విజయవాడ,మే3,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల్లో వాతావరణ అనిశ్చితితో పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురవొచ్చని వాతావరణ విభాగం పేర్కొంది. పిడుగులతో పాటు గంటకు 40 నుంచి 50 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని అంచనా వేసింది. ఇవాళ శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి వానలు పడొచ్చని చెప్పింది. మరోవైపు శుక్రవారం నాడు వైఎస్సార్ జిల్లా కమలాపురంలో 42, నంద్యాల జిల్లా గుల్లదుర్తిలో 41.7, తిరుపతి జిల్లా వెంకటగిరిలో 41.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు శుక్రవారం పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని పలుచోట్ల శుక్రవారం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. తెల్లవారుజామున 3 నుంచి 5 గంటల వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతోపాటు బలమైన గాలులు వీయడంతో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకూలాయి. పల్నాడు జిల్లా బెల్లంకొండలోని పలు వీధుల్లో చెట్లు కూలి కరెంట్

>>2



## రెండో రోజు కస్టడీకి రాజ్ కెసిరెడ్డి

**విజయవాడ, మే 3,ప్రభాతవార్త ప్రతినిధి:** వైకాంగ్రెస్ పార్టీ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో నాటి ప్రభుత్వ పెద్దల తరపున అన్నీ తానై వ్యవహరించిన ప్రధాన నిందితుడు(ఎ1) రాజ్ కెసిరెడ్డిని సిట్ అధికారులు రెండో రోజు కస్టడీకి తీసుకున్నారు. వైద్యపరీక్షల నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయనను వారం రోజుల పాటు సిట్ కస్టడీకివ్వడంతో తొలి రోజైన శుక్రవారం 7 గంటల పాటు విచారించారు. ఉదయం 10గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు ప్రశ్నించారు. దర్యాప్తులో తేలిన అంశాల ఆధారం

>>2

# లడ్డూలకు జ్యూట్ బ్యాగ్‌ల భారం

## అధిక ధరలకు సంచులు కొనలేక భక్తుల అవస్థలు

### కొండపై ప్లాస్టిక్ రహిత కవర్లు నో స్టాక్




**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** భక్తుల రద్దీకి అనుగుణంగా తిరుమలలో సౌకర్యాలు మెరుగు పడుతున్నా, శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం తరువాత పవిత్రమైన లడ్డూలను భక్తులు సులభంగా తీసుకెళ్ళేందుకు అవసరమైన సంచులు అందుబాటులో లేకపోతున్నాయి. టిటిడి లడ్డూలకు కేవలం ఒక్క జనపనారతో తయారైన సంచులను మాత్రమే భక్తులకు అందుబాటులో ఉంచింది. ఈ సంచుల ధరలు అమాంతం సామాన్యభక్తులకు భారంగా మారింది. నాలుగురకాల ధరలతో లడ్డూలు పట్టేలా వివిధ సైజుల్లో బ్యాగ్‌లు విక్రయి స్తున్నారు. అయితే గత వారంరోజులుగా తిరు మలలో 10 లడ్డూలు సరిపడే, 15లడ్డూలు తీసు కెళ్ళే జనపనార సంచులు స్టాక్ లేకపోయాయి. దీంతో సామాన్యభక్తులు రెండు లడ్డూలకు కూడా 5లడ్డూలు పట్టే బ్యాగ్‌ను 28రూపాయలకు కొనుగోలుచేయాల్సి వస్తోంది. 10లడ్డూలు బ్యాగ్ 33 రూపాయలు, 15 లడ్డూలు పట్టే బ్యాగ్ 40 రూపాయలు, 25లడ్డూలు పట్టే బ్యాగ్ 55 రూపాయలు ధరగా నిర్ణయించి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం వారంరోజులుగా 10,15లడ్డూలు పట్టే బ్యాగ్‌లు నోస్టాక్ పేరుతో 10లడ్డూలకు కూడా 55రూపాయలు విలువైన బ్యాగ్‌లను భక్తులు తప్పనిసరిగా కొనుగోలుచేయడం భారంగా మారింది. అసలే వేసవిసెలవులు, తిరుమలకు వస్తున్న భక్తుల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. రోజుకు 70వేలమంది భక్తులు శ్రీవారిని దర్శించుకుంటున్నారు. ఒక్కో భక్తుడు 5లడ్డూలనుండి 10లడ్డూల వరకు కొనుగోలుచేసి తమవెంట తీసుకెళుతున్నారు. ఇప్పుడు బ్యాగ్‌లు భారంగా మారడంతో సామాన్యభక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్లాస్టిక్ రహిత కవర్లు నోస్టాక్:** నాలుగు

>>2

4-5pg2exHMNWJQE.qxd:4-5pg2exHMNWJQE.qxd 01/01/01 9:58 AM Page 1





శనివారం న్యూఢిల్లీలోని గాంధీ సమాధివద్ద నివాళి అర్పిస్తున్న అంగోలా అధ్యక్షుడు జువా లోరెన్సో దంపతులు

# మానవాళిని పీడిస్తున్న ఉగ్రవాదం

>> అన్ని రకాల దౌత్య సంబంధాలు తెంచుకుంటోన్న కేంద్ర ప్రభుత్వం తాజాగా మరో గట్టి షాకిచ్చింది. ఆ దేశం నుంచి వచ్చే దిగుమతులపై నిషేధం విధించింది. ఈ మేరకు కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొంది. పాకిస్థాన్ నుంచి మన దేశానికి రవాణా అయ్యే అన్ని ఉత్పత్తులకు ఈ నిషేధం వర్తిస్తుందని స్పష్టం చేసింది. పాకిస్థాన్‌లో ఉత్పత్తి అయ్యే లేదా ఆ దేశం నుంచి భారత్‌కు వచ్చే అన్నిరకాలా వస్తువుల ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులపై నిషేధం విధిస్తున్నాం. అనుమతులు ఉన్న ఉత్పత్తులైనా, స్వేచ్ఛాయుత దిగుమతులైనా పాక్ నుంచి ఎలాంటి వస్తువులను అనుమతి ఉండదు. ఈ నిషేధం తక్షణమే అమల్లోకి వస్తుంది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఈ ఆంక్షలు కొనసాగుతాయి. ఈ నిషేధం నుంచి ఏవైనా మినహాయింపులు కావాలంటే భారత ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరి. దేశ భద్రత, ప్రజా విధాన ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామని కేంద్ర వాణిజ్య వెల్లడించింది. అయితే భారత్‌పాక్ మధ్య వాణిజ్యానికి ఉన్న ఏకైక రవాణా మార్గం అటారీ వాఘా సరిహద్దు. ఇప్పటికే దానిని భారత్ మూసివేసింది. 2019లో పుల్వామా దాడి తర్వాత నుంచి పాక్ నుంచి చాలావరకు దిగుమతులు తగ్గించుకుంది. పాక్ ఉత్పత్తులపై 200శాతం సుంకాన్ని భారత్ విధిస్తోంది. ఇక అప్పటి నుంచి కొన్ని రకాల ఫార్మా ఉత్పత్తులు, పండ్లు, నూనెగింజల వంటి వాటిని మాత్రమే దిగుమతి చేసుకుంటోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత్ నుంచి పాక్‌కు 447.65 మిలియన్ డాలర్ల విలువైన వస్తువులు ఎగుమతి అయ్యాయి. కానీ పాక్ నుంచి కేవలం 0.42 మిలియన్ డాలర్ల ఉత్పత్తులను మాత్రమే భారత్‌కు దిగుమతి అయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా భారత్ జరుపుతున్న వాణిజ్యంలో ఇది కేవలం 0.1శాతం మాత్రమే. అయితే పాక్‌లోని కొన్ని పరిశ్రమలు భారత్‌కు చేసే ఎగుమతులపైనే ఆర్థికంగా ఆధారపడుతున్నాయి. ఆర్గానిక్ కెమికల్స్, ప్లాస్టిక్స్, విలువైన లోహ సమ్మేళనాలు, మినరల్ ఫ్యుయల్స్, నూనె ఉత్పత్తులు, కొన్ని రకాల పిండి పదార్థాలు, బంక, ఎంజైమ్స్, వర్ణ ద్రవ్యాలు, మసాలా దినుసులు వంటివి భారత్ దిగుమతి చేసుకునే వస్తువుల్లో ఉన్నాయి. ఇప్పుడు భారత్ వాటిపై నిషేధం విధించగా పాక్‌లో ఆయా రంగాల పరిశ్రమలు కుదేలయ్యే అవకాశం ఉంది. దిగుమతులు, దిగుమతులపై ఆంక్షలు విధించిన గంటల్లో భారత్ ఆ దేశ మెయిల్స్, పార్శిళ్లపై కూడా నిషేధం విధించింది. పొరుగు దేశానికి మెయిల్, పార్శిళ్ల సేవలను భారత్ నిలిపివేసింది. వాయు, రోడ్డు మార్గాల ద్వారా జరిగే మెయిల్, పార్శిళ్ల సేవలను నిలిపివేసినట్లు ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర కమ్యూనికేషన్ పరిధిలోని తపాలా శాఖ ఈ ఉత్తర్వులను జారీ చేసింది భారత్ పాకిస్థాన్‌లమధ్య ఉన్న ఏకైక రవాణా మార్గం అట్టారి వాఘా సరిహద్దు. ఇప్పటికే మూసివేసారు. 2019లో కూడా పుల్వామా దాడితర్వాతనుంచి దాయాదినుంచి మనం చాలావరకూ దిగుమతులు తగ్గించాం. పాక్ ఉత్పత్తులపై కేంద్రం 200శాతం సుంకం విధించింది. కొన్ని రకాల ఫార్మా ఉత్పత్తులు పండ్లు, నూనెగింజలు వంటివాటిని మాత్రమే దాయాదినుంచి దిగుమతి చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. దిగుమతులు స్వల్పమే అయినా పాక్‌లోని కొన్ని పరిశ్రమలు భారత్‌కు చేసే ఎగుమతుల పైనే ఆర్థికంగా ఆధారపడుతున్నాయి. ఆర్గానిక్ కెమికల్స్, ప్లాస్టిక్స్, విలువైన లోహాలు, ఖనిజ ఇంధనాలు, నూనె ఉత్పత్తులు కొన్ని రకాల పిండిపదార్థాలు, బంక, ఎంజైమ్స్, వర్ణద్ర వ్యాలు, మసాలా దినుసులు వంటివి దిగుమతిచేసుకుంటోంది. ఇపుడు భారత్ వాటిపై నిషేధం విధించడంతోపాక్‌లో అన్నిరంగాల పరిశ్రమలు కుదేలవుతాయి. అలాగే పాకిస్తాన్‌తో సముద్రరవాణా మార్గాలను భారత్ మూసివేసింది. ఆదేశ జెండాతో ఉన్న ఓడలు భారత పోర్టుల్లోకి రాకుండా కేంద్రం నిషేధం విదించింది. మర్చంట్ షిప్పింగ్ చట్టం, 1958లోని 411 సెక్షన్ పరిధిలో ఈనిర్ణయం ప్రకటించింది. ఈ ఆంక్షలు తక్షణమే అమలులోకి వస్తాయని వెల్లడించింది. అటు భారత ఓడలు కూడా పాక్ పోర్టుల్లోకి వెళ్లకూడదని ఆదేశించింది. ఇప్పటికే పాక్ విమానాలకు మనగగనతలాన్ని మూసివేసిన సంగతి తెలిసిందే.

# వంశీ బెయిల్ పిటీషన్ కొట్టిన వేసిన హైకోర్టు

>> లో ఉన్నట్లు వంశీ న్యాయవాది తానికొండ చిరంజీవి ఈ రోజు తెలిపారు. వైకాంగ్రెస్‌పార్టీ నేత అప్పటి ఎంఎల్‌ఏ వంశీ అనుచరులు 2023 ఫిబ్రవరి20న గన్నవరం టిడిపి కార్యాలయంపై దాడి చేసి పలువురిని గాయపర్చి విధ్వంసం సృష్టించారు. పార్టీ కార్యాలయంలో విధుల్లో ఉన్న కంప్యూటర్ ఆపరేటర్ సత్యవర్ధన్‌ను కులం పేరుతో దుర్భాషలాడారు. పార్టీ కార్యాలయాన్ని అక్కడ ఉన్న వాహనాలను తగులబెట్టారు. ఈ ఘటనపై సత్యవర్ధనర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గన్నవరం పోలీసులు పలువురిపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండులో ఉన్న వంశ్శ...విజయవాడ కోర్టులో వేసిన రెగ్యులర్ బెయిలు పిటీషన్‌ను న్యాయస్థానం కొట్టేసింది. దీంతో హైకోర్టులో బెయిలు పిటీషన్‌ను దాఖలు చేశారు. ఇటీవల ఇరువైపు వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వు చేసిన న్యాయమూర్తి నిర్ణయం ప్రకటించారు. రికార్డులను పరిశీలిస్తూ సత్యవర్ధన్‌ను వంశీ, ఆయన అనుచరులు భయపెట్టి బ లవంతంగా కోర్టుకు తీసుకెళ్ళి కేసును ఉపసంహరించుకునేలా వాంగ్మూలాన్ని నమోదు చేసినట్లు స్పష్టమవుతోంది. వంశీపై ఆరోపణలకు బలం చేకూరేలా దర్యాప్తు సంస్థ ప్రాథమిక ఆధారాలను సేకరించింది. మరోవైపు దిగువ కోర్టు బెయిలు పిటీషన్‌ను కొట్టివేస్తూ, సాక్షులు ఇచ్చిన వాంగ్మూలాలను పరిశీలిస్తూ సత్యవర్ధన్‌ను అపహరించిన వ్యవహారంలో వంశీ పాత్ర ఉన్నట్లు ప్రాథమికంగా నిరూపణ అయిందని పేర్కొంది. సహ నిందితుల వాంగ్మూలాలు పోలీసు వాదనలకు బలం చేకూరుస్తున్నాయి. దర్యాప్తు కీలక దశలో ఉంది. అభియోగపత్రం దాఖలు చేయబోతున్నారు. ఈ దశలో వంశీకి బెయిలిస్తే దర్యాప్తుపై ప్రతికూల ప్రభావం పడుతుంది. మళ్ళీ ఇదే తరహా నేరానికి పాల్పడే అవకాశం లేకపోలేదు. వంశీకి బెయిలిస్తే సాక్షులను ప్రభావితం చేయడం, సాక్ష్యాలను తారుమారు చేస్తారనే పోలీసుల వాదన సమర్థనీయంగా ఉంది. ఈ అంశాలను పరిగణలోకి తీసుకొని బెయిలు పిటీషన్ కొట్టేస్తున్నాం. పరిస్థితుల్లో మార్పు చోటుచేసుకుంటే విజయవాడ సెషన్సు కోర్టును వంశ్శ ఆశ్రయించవచ్చు అని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. మరో వైపు ఇదే కేసులో నిందితులుగా ఉన్న కైలా ఆదిలక్ష్మి, శివకుమార్, నీలం ప్రవీణ్‌కుమార్, రూతమ్మ, మహ్మద్ మౌలానా, జానీలకు షరతులతో కూడిన బెయిలును హైకోర్టు మంజూరు చేసింది.



# తొమ్మిదో రోజూ సరిహద్దుల్లో పాక్ కాల్పులు

**శ్రీనగర్, మే 3:** పహల్గాం ఉగ్రదాడితో భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న వేళ సరిహద్దు వెంబడి మరోసారి కాల్పుల కలకలం కొనసాగుతోంది. పాకిస్థాన్ సైన్యం వరుసగా తొమ్మిదో రోజు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి కవ్వింపులకు దిగింది. నియంత్రణ రేఖ వెంబడి మూడు సరిహద్దు జిల్లాల్లో పలు సెక్టార్లలో భారత సైన్యం పైకి కాల్పులు జరిపింది. దీనిని భారత్ సైన్యం సమర్థవంతంగా తిప్పికొట్టినట్లు సైనిక వర్గాలు తెలిపాయి. మే2 అర్ధరాత్రి జమ్ముకశ్మీర్‌లోని మూడు సరిహద్దు జిల్లాల్లో పలు సెక్టార్లలో పాకిస్థాన్ కాల్పులు జరిపింది. కుప్వారా, ఉరి, అఖ్నూర్ ఎదురుగా ఉన్న పాకిస్థాన్ ఆర్మీ పోస్టుల నుంచి కాల్పులు జరిపినట్లు సైనిక వర్గాలు పేర్కొన్నాయి. వీటికి భారత్ ఆర్మీ దళాలు వేగంగా స్పందించాయని ఓ అధికారి పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఏప్రిల్ 24 అర్ధరాత్రి నుంచి వరుసగా ప్రతిరోజూ పాక్ సైన్యం భారత దళాలపై ఎల్‌ఓసీ వెంబడి కాల్పులు జరుపుతున్నాయి. దీటుగా భారత్ ఆర్మీ బదులిస్తోంది. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి తర్వాత భారత్, పాక్ మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. ఈ క్రమంలోనే పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేయడం, పాక్ పౌరులు భారత్‌ను విడిచి వెళ్లాలని గడువు విధించడం వంటి చేసింది. ఈ చర్యలతో పాకిస్థాన్ అక్కసు వెళ్లగక్కింది. సిమ్లా ఒప్పందంతోపాటు మిగిలిన ద్వైపాక్షిక ఒప్పందాలను పక్కనబెడుతున్నట్లు ప్రకటించింది. తమ గగనతలంలో భారత్‌కు చెందిన విమానాలకు అనుమతిని నిలిపేసింది. దీనిపై భారత్ కూడా దీటుగా స్పందించింది. పాక్ విమానయాన సంస్థలకు మన గగనతలాన్ని తాజాగా మూసివేసింది.

# అభివృద్ధిని అడ్డుకోలేరు

>> నలిగిపోయిందన్నారు. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ ఆక్సిజన్ అందించారని కొనియాడారు. మరికొన్ని రోజులు సహ కారం అందిస్తే బలమైన ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి వికేంద్రీకరణ ఎన్డీయే విధానం కాబట్టే 2014 నుంచి కేంద్ర విద్యా సంస్థలు ఉత్తరాంధ్ర, కోస్తా, సీమ జిల్లాల్లో ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. తెలంగాణకు హైదరాబద్, కర్నాటకకు బెంగళూరు, తమిళనాడుకు చెన్నై రాజధానుల ద్వారా 70 శాతం ఆదాయం వస్తోందని తెలిపారు. మనకు కూడా మంచి నగరం ఉంటే రాష్ట్రానికి సమృద్ధిగా ఆదాయం సమకూరుతుందని అందుకే అమరావతిని నిర్మిస్తున్నట్లు సీఎం వివరించారు రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కూడా చేపడతామని ముఖ్యమంత్రి వివరించారు. విశాఖపట్నం ఆర్థిక రాజధానిగా, తిరుపతిని ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. అనకాపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ దిగ్గజ కంపెనీలు లక్ష కోట్లతో, ఎరైన్‌కో రామాయపట్నంలో పెట్టుబడులు పెడుతున్నాయని అన్నారు. రాయలసీమను డిఫెన్స్, ఎలక్ట్రానిక్, ఆటోమొబైల్స్, డ్రోన్, శాటిలైట్ లాంఛింగ్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో అభివృద్ధి చేస్తామని చంద్రబాబు పేర్కొన్నారు. విధ్వంస పాలన ముగిసి 2024 ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వచ్చింది. ప్రజలు ఏకపక్షంగా ఇచ్చిన తీర్పుతో అమరావతి మళ్లీ ఊపిరి పోసుకుంది. ప్రజల ఆశీస్సులతో నాలుగోసారి సీఎం అయ్యాను. కానీ ఆర్థికపరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. వెంటిలేటర్‌పై ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను ఎలా బయటకు తీసుకురావాలన్న ఆలోచనలో ఉన్నప్పుడు కేంద్రం, వ్యక్తిగతంగా మోదీ ముందుకొచ్చి ఆపన్నహస్తం అందించారు. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని అక్కడి నుంచి బయటకు తీసుకొచ్చారు. కేంద్రం సహకారంతో 10 నెలల్లో అమరావతిని గాడినపెట్టాం. ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రాన్ని విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తున్నాం. ఈ రోజు వర్షం వస్తుందని అనుకున్నాం. మోదీ రావడంతో వర్షం కూడా వెనక్కి తగ్గింది. తన 25 ఏళ్ల రాజకీయ జీవితంలో వాతావరణం అనుకూలించక ఏ ఒక్క కార్యక్రమం కూడా రద్దు అయిన దాఖలా లేదని మోదీ చెప్పారు. మంచి సంకల్పం ఉంటే ప్రకృతి కూడా సహకరిస్తుందనడానికి ఇదే నిదర్శనం. ప్రపంచస్థాయి సంస్థల ఏర్పాటుతో అమరావతి హెల్త్, ఎడ్యుకేషన్ హబ్‌గా ఉండబోతోంది. రాజధానిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతాం. ప్రతి పౌరుడూ ˇనా రాజధాని అమరావత్తి అని గర్వంగా చెప్పుకొనేలా నిర్మిస్తాం. రాజధానిలో 30 శాతం పచ్చదనం ఉండేలా ప్రణాళికలు రూపొందించాం. నవ నగరాలు.. భూగర్భంలోనే విద్యుత్ ఇతరత్రా పైపులు వెళ్లేలా డిజైన్ చేశాం. ఔటర్ రింగ్ రోడ్డు, ఇన్నర్ రింగ్ రోడ్డు.. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేస్తున్నాం. అన్ని ప్రధాన నగరాలను అమరావతికి అనుసంధానం చేస్తాం. 5లక్షల మంది విద్యార్థులు అమరావతిలో చదువుకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రధాని మోదీ ఇదే కోరారు. రాజధానిలో మంచివిద్యాసంస్థలను ఏర్పాటుచేసి భావితరాలను తీర్చిదిద్దండని సూచన చేశారు. దాన్ని ఆచరణలోపెడుతున్నాం. ఇప్పటికే చాలావిద్యాసంస్థలు వచ్చాయి. త్వరలో బిట్స్‌పిలానీ, ఎక్స్‌ఎల్ఆర్‌ఐ బిజినెస్ స్కూల్, గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్, రతన్‌టాటా ఇన్నొవేషన్ హబ్ ఏర్పాటు చేస్తున్నాం. జపాన్ మియావాకీని ఆదర్శంగాతీసుకుని రాజధానిని పచ్చదనంతో ఆహ్లాదంగా తీర్చిదిద్దుతాం.

## అమరావతికి ఉజ్వల భవిష్యత్తు: ప్రధాని మోడీ

>> లోని వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన ప్రజలకు, రాజధాని రైతులకు, కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించిన ప్రభుత్వ యంత్రాంగానికి, అధికారులకు, మంత్రులకు, ప్రజాప్రతినిధులకు, కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్ళిన మీడియా, సోషల్ మీడియా వారికి కృతజ్ఞతాపూర్వక నమస్కారాలు తెలియచేస్తున్నానన్నారు. కాగా, ప్రజల సహకారంతో, కేంద్రం మద్దతుతో, పక్కా ప్రణాళికతో అందరికీ అవకాశాలు సృష్టించేలా, రాష్ట్రానికి చోదక శక్తిగా నిలిచేలా ఫ్యూచర్ సిటీగా రాజధాని అమరావతిని నిర్మిస్తాం అని హామీనిచ్చారు. అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి సాధించి మాకు అండగా ఉన్న ప్రజల నమ్మకాన్ని నిలబెడతామని తెలుపుతూ ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియచేస్తున్నాని చంద్రబాబు వెల్లడించారు. మరో వైపు రాజధాని అమరావతి నిర్మాణ పనులను ఏపి ప్రభుత్వం వేగవంతం చేస్తుంది. ప్రధాని మోడీ చేతుల మీదుగా పునఃప్రారంభ కార్యక్రమం పూర్తి కావడంతో పనులు వేగవంతం చేసిది. ఐకానిక్ భవనాల డిజైన్లు ఖరారు చేసేందుకు చర్చలు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే డిజైన్లు రూపొందిస్తున్న సంస్థలతో మంత్రి నారాయణ మాట్లాడుతున్నారు. సీఆర్డీయే కార్యాలయంలో నార్మన్ పోస్టర్, హాఫీజ్ కాంట్రాక్టర్స్, ఎల్ అండ్ టీ సంస్థల ప్రతినిధులతో మంత్రి సమావేశమయ్యారు. ఐదు ఐకానిక్ టవర్లు, అసెంబ్లీ, హైకోర్టు భవనాల తుది డిజైన్లపై కసరత్తు చేస్తున్నారు. ఆయా భవనాల డిజైన్లు మంత్రి, అధికారులకు ఆర్కిటెక్చర్ సంస్థల ప్రతినిధులు వివరిస్తున్నారు.

## త్వరలో ట్రాన్స్‌మీడియా ఎంటర్‌టైమెంట్ సిటీ

>> లు, ఇమ్మర్సివ్ థీమ్ పార్కులు, గేమింగ్ జోన్‌లు, ఎస్పోర్ట్స్ అరీనాలు, గ్లోబల్ సినిమా కో ప్రొడక్షన్ జోన్‌లు, వీఎఫ్ఎక్స్, ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్, గేమింగ్ మరియు ఇమ్మర్సివ్ స్టోరీ టెల్లింగ్‌లో యువతకు నైపుణ్యం కల్పించడానికి క్రియేటర్ ల్యాండ్ అకాడమీ ద్వారా ఆధారితమైన వర్చువల్ స్టూడియో కాంప్లెక్స్‌ను రూపొందించడానికి ఉపయోగపడుతుంది. అంతేగాక ఆంధ్రప్రదేశ్ సహా దేశంలోని మిగిలిన ప్రాంతాల నుండి సృజనాత్మక మరియు సాంకేతిక డొమైన్‌లలో నైపుణ్యం, ఉపాధి అవకాశాలకు మార్గం కానుంది. అంతేగాక ఏఐ, ఆర్ అండ్ డీ, వీఎఫ్ఎక్స్, గేమింగ్ , వినోదం, టెక్, పర్యాటక రంగాలలో 1,50,000కు పైగా కొత్త ఉద్యోగాలను కల్పించేందుకు అవకాశం ఉంది. భారతదేశాన్ని తమ నిర్మాణ కేంద్రంగా మార్చుకునేందుకు ప్రపంచవ్యాప్తంగా ఈ తరహా 20కి పైగా స్టూడియోలు నిర్మించేందుకు క్రియేటివ్ ల్యాండ్ చర్చలు జరుపుతోంది.

పర్యాటక శాఖ ఎండీ ఆమ్రపాలి కాట మాట్లాడుతూ క్రియేటర్ ల్యాండ్ ప్రాజెక్ట్ ఆవిష్కరణలతో పర్యాటక రంగాన్ని మరింత ప్రోత్సహిస్తున్నామన్నారు. తద్వారా రాష్ట్ర భవిష్యత్ కు పాటుపడుతున్నామన్నారు. వినోద మౌలిక సదుపాయాలు, ప్రతిభ నైపుణ్యాలు, పర్యాటకం కలిసి జీవనోపాధిని సృష్టించడానికి, స్థానిక ఆర్థిక వ్యవస్థను పెంచడానికి , ప్రపంచ సృజనాత్మక పటంలో ఆంధ్రప్రదేశ్ ప్రొఫైల్‌ను పెంచడానికి ఇది ఒక సమగ్ర దృక్పథాన్ని అందిస్తుందని తెలిపారు. భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న మౌలిక సదుపాయాలు సమ్మిళిత వృద్ధిని ఎలా నడిపిస్తాయో చెప్పడానికి ఇది ఒక బ్లూప్రింట్‌గా తాము భావిస్తున్నామని ఆమె వివరించారు.

క్రియేటివ్‌ల్యాండ్ ఆసియా వ్యవస్థాపకుడు, ఛైర్మన్ సాజన్ రాజ్ కురుప్ మాట్లాడుతూ క్రియేటర్ ల్యాండ్ అనేది ఒక గమ్యస్థానం మాత్రమే కాదు, ఇది ఒక సృజనాత్మక ఉద్యమంగా అభివర్ణించారు. ఆంధ్రప్రదేశ్ యొక్క దార్శనిక నాయకత్వంతో చేతులు కలపడం ద్వారా తాము వినోదం, విద్య మరియు ఆవిష్కరణల భవిష్యత్తును నిర్మిస్తున్నామన్నారు. సందర్శకులు లీనమయ్యే అనుభవాల నుండి ఏఐ నేతృత్వంలోని కథ చెప్పడం వరకు, క్రియేటర్‌ల్యాండ్ సాంకేతికతను సంస్కృతితో, ప్రపంచ ప్రతిభను భారతీయ ఊహతో మిళితం చేస్తుందన్నారు. భారతదేశాన్ని వినోద మౌలిక సదుపాయాలు మరియు ఐపీ సృష్టి యొక్క ప్రపంచ పటంలో ఉంచే దిశగా ఇది మా సమిష్టి అడుగన్నారు. ప్రపంచ కంటెంట్ పవర్‌హౌస్‌గా మారేదిశగా భారతదేశం ప్రయాణంలో ఈ సహకారం ఒక మైలు రాయిగా పేర్కొన్నారు. సాంకేతికత, సృజనాత్మకత, మౌలిక సదుపాయాలను సమగ్రపరచడం ద్వారా వినోద మౌలిక సదుపాయాలలో ప్రపంచ నాయకుడి స్థానంలో భారతదేశాన్ని నిలిపేందుకు ఇది ఒక అడుగు అన్నారు. భారతదేశాన్ని డిజిటల్ సృజనాత్మకత, ఉపాధి మరియు సాంస్కృతిక దౌత్యానికి కేంద్రంగా మార్చాలనేతమ ఆలోచనకు ఆంధ్రప్రదేశ్ నాయకత్వం దోహదపడటం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

# లడ్డూలకు జ్యూట్ బ్యాగ్‌ల భారం

>> నెలల క్రిందట తిరుమలలో భక్తుల నుండి వచ్చిన అభిప్రాయాలు, ఫిర్యాదులతో జనపనార బ్యాగులు ధరలు అమాంతం అధికంగా ఉండటంతో మళ్ళీ భక్తులు ప్లాస్టిక్ రహిత సంచులు కోసం విజ్ఞప్తిచేశారు. ఈ ప్లాస్టిక్ రహిత సంచులు తీసుకెళ్ళేందుకు సులభంగా తక్కువ ధర ఉండటంతో అందరూ వాటిపై సుముఖంగానే ఉన్నారు. సామాన్యభక్తులకు కూడా అందుబాటు లో ఉండేలా ఈ ఒక్కోసంచి ధర 5రూపాయలుగా నిర్ణయించి విక్రయించారు. ఇప్పటికే లడ్డూలకోసం టిటిడి పలు రకాలుగా ప్రయోగాలను చేసింది. అయితే ఏవీ కూడా భక్తుల నుండి తగిన స్పందన లేకపోయింది. గతంలో లడ్డూప్రసాదాలకు జనపనార సంచులు 10రూపాయలు, 25రూపాయలవి విక్రయించేవారు. అయితే ఇవేవీ లడ్డూలకు అంత సంతృప్తికరంగా లేదనే అసంతృప్తి భక్తులు వ్యక్తంచేశారు. దీంతో మళ్ళీ టిటిడి ప్లాస్టిక్ రహిత కవర్లను వినియోగించేలా చర్యలు తీసుకుంది. పర్యావరణ హితంకోసం ప్రత్యేకంగా టిటిడి ఈ ప్లాస్టిక్ రహిత కవర్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ కవర్లు లడ్డూవితరణశాలలోని కౌంటర్లలో 5రూపాయలకే విక్రయించేవారు. గత నాలుగేళ్ళ క్రిందటే ప్లాస్టిక్ సంచుల నిషేధంలో లడ్డూలకు టిటిడి వినియోగించిన కవర్లను పూర్తిస్థాయిలో ఆపేశారు. అంతేగాక ఆ స్థానంలో కాగితపు సంచులను 5,10 లడ్డూలు పట్టేలా అందుబాటులో తీసుకువచ్చారు. ఈ సంచులు లడ్డూలు బరువు ఎక్కువ కావడంతో చిరిగిపోయి ,నీళ్ళతో తడిస్తే నాని లడ్డూలను తీసుకెళ్ళేందుకు భక్తులకు కష్టంగా మారింది. దీంతో వీటి సరఫరాను మూ డేళ్ళ క్రిందటే నిలిపివేసిన టిటిడి ,జనపనారతో తయారైన కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని జ్యూట్ సంచులను లడ్డూ వితరణశాలలో భక్తులకు విక్రˇయించారు. వీటి ధరలు అమాంతం 5లడ్డూ లసంచి 28 రూపాయలు, 10లడ్డూల సంచి 33రూపాయలు, 15లడ్డూలు పట్టే సంచి 40రూపాయలు, 25 లడ్డూలు పట్టే సంచి ఏకంగా 55రూపాయలు ధరగా ఉంది. దీంతో సామాన్యభక్తులు 5లడ్డూలకు అంత ధరవెచ్చించి కోనలేకపోతున్నారు. భక్తులు లడ్డూలు తీసుకెళ్ళేందుకు తంటాలు పడుతున్నా ప్రస్తుత టిటిడి అధికారులు ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ పోటు విభాగం అధికారులు ప్లాస్టిక్ రహిత కవర్లను అందుబాటులోకి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు.

## రెండో రోజు కస్టడీకి రాజ్ కెసిరెడ్డి

>> గా వివరాలు రాబట్టారు. చాలా ప్రశ్నలకు ఆయన తప్పించుకునే రీతిలో సమాధానా లిచ్చినా, తమ వద్దనున్న ఆధారాలు, కాల్‌డేటా రికార్డులు, సాక్షుల వాంగ్మూలాలు చూపించి ప్రశ్నించారు. అయితే తొలి రోజు విచారణకు రాజ్ కెసిరెడ్డి పూర్తి స్థాయిలో సహకరించనట్లు సమాచారం. ఇవాల్టి నుండి ఎ8గా ఉన్న చాణక్యను సిట్ అధికారులు ప్రశ్నించనున్నారు.



# పహల్గాంవ్ దాడిపై కేంద్రానికి ఎన్ఐఎ నివేదిక

**న్యూఢిల్లీ, మే 3:** జమ్ముకశ్మీర్‌లో ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడిపై జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ తన ప్రాథమిక నివేదికను కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు సమర్పించింది. దక్షిణ కశ్మీర్‌లోని అత్యంత సుందరమైన పర్యాటక ప్రదేశాల్లో ఒకటైన పహల్గాంను చూడడానికి వచ్చిన పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు దాడులు చేశారు. దీని వెనుక ఉన్నది పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా అని భారత్ భావిస్తోంది. దీనికి పాకిస్థాన్ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ ఐఎస్ఐ పాక్ సైన్యం నుంచి పూర్తి మద్దతు ఉన్నట్లు ఎన్ఐఏ అధికారులు తెలిపారు. ఎన్ ఐఏ డైరెక్టర్ జనరల్ సదానంద్ ప్రత్యక్ష పర్యవేక్షణలో పహల్గాం ఉగ్రదాడి నివేదిక రూపొందించారు. దాదాపు 150 మంది సాక్షులు చెప్పిన సాక్ష్యాలు, దాడి జరిగిన రీతిని వివరించే త్రీడీ రీక్రియేషన్, ఘటనా స్థలంలో దొరికిన కాట్రిడ్జెస్, బాలిస్టిక్ విశ్లేషణలు సహా పలు ఆధారాలతో ఈ నివేదిక రూపొందించినట్లు, దీనిని అతిత్వరలో కేంద్ర హోంమంత్రిత్వ శాఖను సమర్పించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇది సరిహద్దు అవతల నుంచి సమన్వయంతో, పక్కా ప్రణాళికతో, చాలా జాగ్రత్తగా చేసిన ఉగ్రదాడి. ఉగ్రవాదులు బేతాబ్ లోయలో ముందుగానే ఆయుధాలను మోహరించారు. ఆ ప్రాంతంలోని ఓవర్ గ్రౌండ్ వర్కర్స్ ఉగ్రవాదులకు ఆశ్రయం ఇచ్చారు. వారికి నిఘా సమాచారాన్ని కూడా అందించారని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ సీనియర్ అధికారి తెలిపారు. పహల్గాం దాడులకు పాల్పడిన ఉగ్రవాదులు పాక్ ఆక్రమిత కశ్మీర్ పీఓకేలో ఉన్న హ్యాండ్లర్స్‌తో సంప్రదింపులు కొనసాగించారు. అంతేకాదు ఇప్పటికీ వాళ్లు దక్షిణ కశ్మీర్‌లోని కొన్ని ప్రాంతాల్లో చురుగ్గా ఉన్నట్లు తెలుస్తోంది. ఉగ్రవాదులకు సహకరిస్తున్న జాబితాను ఎన్ఐఏ రూపొంచింది. వారి నెట్‌వర్క్‌ను విచ్ఛిన్నం చేయడమే లక్ష్యంగా చట్టపరమైన, పరిపాలనా చర్యలు తీసుకోవడానికి సిద్ధమవుతోంది. ఎన్ఐఏ డైరెక్టర్ జనరల్ ఈ వారం స్వయంగా బైసరన్‌కు వెళ్లారు. దర్యాప్తు పరోగతి గురించి స్వయంగా పర్యవేక్షించారు. ఎన్ఏఐ బృందాలు ఫోరెన్సిక్ నిపుణుల సహాయంతో మరిన్ని సాక్ష్యాల కోసం ప్రయత్నిస్తోంది. అలాగే మరింత మంది సాక్ష్యాలను సేకరించేందుకు ప్రయత్నిస్తోంది. ఉగ్రదాడి జరిగిన విధానాన్ని , ఆ సంఘటనల క్రమాన్ని తెలుసుకునేందుకు ఎన్ఐఏ ప్రయత్నిస్తోంది. ఇందుకోసం ఉగ్రదాడి నుంచి బతికి బయటపడిన వ్యక్తుల వాగ్మూలాలను సేకరించడానికి అదనపు బృందాలను పంపించింది. అలాగే స్థానికులు, కీలక ప్రత్యక్ష సాక్షులను, ఫొటోగ్రాఫర్‌లను కూడా ఎన్ఐఏ ప్రశ్నిస్తోంది. పహల్గాం ఉగ్రదాడులకు పాల్పడినట్లు భావిస్తున్న ముగ్గురు అనుమానితుల స్కెచ్‌లను అధికారులు విడుదల చేశారు. వారిలో ఇద్దరు పాకిస్థానీయుల కాగా, ఒకరు భారత్‌లోని అనంత్‌నాగ్ జిల్లాకు చెందినవాడు. తల్హా భాయ్ అలీ భాయ్, హాషీమ్ మూసా పాక్‌కు చెందినవారు కాగా, ఆదిల్ హుస్సేన్ థోకర్ స్థానిక ఉగ్రవాది. ఈ ముగ్గురికి లష్కరే తోయిబాతో అనుబంధం ఉంది. ఈ ఉగ్రదాడికి సంబంధించి ప్రశ్నించేందుకు కశ్మీర్ లోయలో దాదాపు 2000 మందికి పైగా వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. అంతేకాదు ఈ ఉగ్రవాదుల ఆచూకీ తెలిపిన వారికి రూ.20 లక్షల రివార్డ్‌ను పోలీసులు ప్రకటించారు.



# ఆస్ట్రేలియాలో సార్వత్రిక ఎన్నికలు

## స్విమ్‌సూట్ ఆఫర్‌తో పోటెత్తిన ఓటర్లు

**సిడ్నీ, మే 3:** ఆస్ట్రేలియాలో శనివారం సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. ఆదేశ ప్రజలను ద్రవ్యోల్బణం, ఇళ్లకొరత, వడ్డీరేట్లలో పెరుగుదల వంటి సమస్యలు వేధిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ వార్‌తో అవి తీవ్రం అయ్యాయి. ఈ తరుణంలో అక్కడిప్రజలు ఓటింగ్‌లోపాల్గొన్నారు. ప్రస్తుతం కౌంటింగ్ జరుగుతోంది. ప్రస్తుత ప్రధాని లేబర్‌పార్టీ నేత ఆంథోని అల్బనీస్‌వైపే మొగ్గుచూపిస్తోంది. అయితే ఎన్నికల వేళ స్విమ్‌సూట్స్, సాసేజ్‌ట్రండ్ అవుతున్నాయి. ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు వచ్చిన పల వురు స్విమ్‌సూట్స్ ధరించిన దృశ్యాలు నెట్‌లో హల్‌చల్‌చేసాయి. ఓటింగ్‌రోజున పాటించాల్సిన డ్రెస్‌కోడ్‌పై అక్కడ ఎలాంటి నిబంధనలు లేవు. గతంలో ఒడ్జీ స్మగ్లర్స్ అనే సంస్థ ఇచ్చిన ఆఫరే స్విమ్‌సూట్స్ ధరించడానికి కారణమైంది. అండర్‌వేర్‌లో ఓటేస్తూ ఫోటోదిగి సోషల్‌మీడియాలో షేర్‌చేస్తే తమ బ్రాండెడ్ స్విమ్‌వేర్‌ను ఉచితంగా ఇస్తామని గడచిన ఎన్నికల్లో ఆ సంస్థ ప్రకటించింది. ఈ ఆఫర్‌కోసం అనేకమంది రంగురంగుల అండర్‌వేర్‌లలో పోలింగ్‌కేంద్రాలకు వెళ్లి ఓటేసి ఆఫోటోలను హ్యాష్‌ట్యాగ్ స్మగ్లర్స్ డిసైడ్ అన్న ట్యాగ్‌తో పోస్టుచేసారు. ఈసారి కూడా పలువురు ఫాలో అయ్యారు. ఇక అక్కడ ఎన్నికల రోజు పోలింగ్ జరిగే ప్రాంతాల్లో ఓటర్లకు సాసేజ్ ఇస్తారు. దానిని డెమొక్రసీ సాసేజ్‌గా పిలుస్తారు. గ్రిల్‌చేసిన సాసేజ్‌ను ఒకబ్రెడ్‌ముక్కలో చుట్టి ఆనియన్స్, కెచప్‌తో గార్నిష్‌చేస్తారు. ఆస్ట్రేలియాతోపాటు విదేశాల్లో ఈ పోలింగ్‌లో పాల్గొనేవారికి వాటిని సర్వ్‌చేస్తారు. ఆదేశ ఎంబసీలతోపాటు అంటార్కిటి కాలోని రీసెర్చ్ స్టేషన్‌లోకూడా అందిసానతరు. ఈ ప్రక్రియ కోసం ప్రత్యేక వెబ్‌సైట్‌ను నిర్వహిస్తున్నారు. దేశంలోని పర్యాటకులు విదేశీ విద్యార్థులు ఎన్నికల రోజుల్లో సాసేజ్‌లను కొం టుంటారు. అది ఆస్ట్రేలియా సంస్కృతిలో గొప్ప అంశం అని భావిస్తున్నట్లు ఒక వెబ్‌సైట్ యాజ మాన్యం ప్రకటించింది. ఆదేశ దిగువసభకు 151స్థానాలుంటే ఓటర్ల సంఖ్య 18 మిలియన్లు, సెంటర్‌లెఫ్ట్ లేబర్‌పార్టీకి చెందిన అల్బనీస్ 2022నుంచి అధికారంలో ఉన్నారు. ప్రతిపక్షకూటమి నుంచి పీటర్‌డటన్ బరిలో నిలిచారు.

## ప్రారంభమైన గ్రూప్-1 పరీక్షలు

>> 9.30 గంటల్లోగా నిర్దేశించిన పరీక్షా కేంద్రా ల్లోకి అభ్యర్థులు వెళ్ళాలి. ఆలస్యమైతే సహేతుక కారణాలు చూపితే 9.45 వరకు అనుమతిస్తారు. ఆ తర్వాత వస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరు. గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాల్సి ఉంది.

## మూడు రోజుల్లో వర్షాలు

>> తీగలపై పడటంతో స్తంభాలు నేలకొరిగాయి. బెల్లంకొండ మండల వ్యాప్తంగా కరెంట్ సరఫరా నిలిచింది. రాజుపాలెం మండలంలోని పిడుగురాళ్ల సత్తెన పల్లి మధ్య ప్రధాన రహదారిపై చెట్లు విరిగి పడ్డాయి. సుమారు 3 గంటల పాటు రాకపోకలు నిలిచాయి. మాచాయపాలెం, కొత్తపాలెం మార్గాల్లోనూ చెట్లు విరిగి పడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొన్నిచోట్ల ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది.

## వారం - వర్జ్యం

తేది : 04-05-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, శుక్ల పక్షం
సప్తమి ఉ.7.20
పుష్యమి మ.12.58
వర్జ్యం రా.2.22- తె.4.02
దు.సా.4.42-5.33
శుభసమయం : ఉ.6.40-7.20
రాహుకాలం - సా.4.30-6.00

## వారఫలం

**మేషం:** ఇంటా బయటా కొద్దిపాటి సమస్యలు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు. వాహనసౌఖ్యం.

**వృషభం:** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. బంధువుల తాకిడి పెరుగుతుంది. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం.

**మిథునం:** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**కర్కాటకం :** ఉద్యోగాలు సామాన్యంగా ఉంటాయి. ఆర్థిక పరిస్థితులు అనుకూలిస్తాయి. వ్యవహారాలలో విజయం సాధిస్తారు.

**సింహం:** చిన్ననాటి మిత్రులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు. పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

**కన్య :** ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు.

**తుల :** ఉద్యోగాలలో ప్రోత్సాహకరంగా ఉంటుంది. సన్నిహితుల నుండి శుభఆహ్వానాలు అందుతాయి.

**వృశ్చికం:** పనులలో విజయం సాధిస్తారు. విందు, వినోదాలు, శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు. వస్తుసేకరణ.

**ధనుస్సు:** వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో హోదాలు, పదోన్నతులు పొందుతారు.

**మకరం:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆకస్మిక ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

**కుంభం:** కొన్ని పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు. గృహనిర్మాణ ఆలోచనలు కలిసి రావు.

**మీనం:** కుటుంబ బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. ఉద్యోగాలలో స్థానమార్పులు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

VJA Pg3exHMNWJQERVSPL.qxd:04-05Pg3exHMNWJQERVSPL.qxd 01/01/01 10:44 AM Page 1



## అమరావతి అభివృద్ధి చెందడం తథ్యం: బిజెపి ఎమ్మెల్యేలు

**విజయవాడ మే3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఐదేళ్ల వైకాపా పాలనలో అప్పుల కుప్పగా మారిన రాష్ట్రాన్ని తిరిగి స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుందని భాజపా ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఆదినారాయణ రెడ్డి స్పష్టం చేశారు. మరో ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజుతో కలిసి ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడారు. అమరావతి పునః ప్రారంభ వేడుక విజయవంతం కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఏపీని అన్ని విధాల ఆదుకుంటామని రాష్ట్ర ప్రజలకు భరోసా ఇచ్చిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో అమరావతి అభివృద్ధి చెందడం తథ్యమని విష్ణుకుమార్ రాజు తెలిపారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తూనే అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు.

## అమరావతి పునర్నిర్మాణానికి నాంది పలకడం శుభపరిణామం: మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**విజయవాడ,మే3 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రధాని మోదీ పర్యటన విజయవంతం చేసిన ప్రజలకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు. అమరావతి పునర్నిర్మాణానికి నాంది పలకడం శుభపరిణామం అన్నారు. రాష్ట్ర విభజనతో రాజధాని విషయంలో వెనకబడి ఉన్నామని చెప్పారు. గత వైకాపా పాలకులు రాజధానిని నిర్వీర్యం చేశారని విమర్శించారు. అమరావతి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించామని రాజధానితో పాటు ప్రతి జిల్లా అభివృద్ధి కోసం పనిచేస్తున్నామని వివరించారు. సీఎం చంద్రబాబు అభివృద్ధి సంక్షేమాన్ని రెండు కళ్లలా చూస్తున్నారు. రాష్ట్రంలో 11 ఎంఎస్ఎంఈ పార్కులు ప్రారంభించినట్లు చెప్పారు. మరో 39 పార్కుల ఏర్పాటుకు నిధులు సిద్ధం చేసినట్లు తెలిపారు. యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించడమే కూటమి లక్ష్యమన్నారు. అమరావతి పునర్నిర్మాణం తెలుగుజాతికి ఆత్మవిశ్వాసాన్ని అందించిందని తెదేపా నేత ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. రాజధానికి అండగా ఉంటామన్న ప్రధాని వ్యాఖ్యలపై ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయని పేర్కొన్నారు. అమరావతిలో ఇకపై రాష్ట్రానికి వచ్చే పెట్టుబడుల హోరు వినిపిస్తుందని తెలిపారు. వచ్చే మూడేళ్లలో ప్రయోజనాలు ప్రజలకు దక్కుతాయని వివరించారు. రైతుల ఆనందబాష్పాల సాక్షిగా సభ విజయవంతమైందని పేర్కొన్నారు. జగన్ తన అహంకారం, దురుద్దేశంతో అమరావతిని విధ్వంసం చేశారని విమర్శించారు.



## జగన్ అమరావతిని అభివృద్ధి చేద్దామంటే కోర్టులకెళ్లి అడ్డుకున్నారు : అంబటి

### - గత ఐదేళ్ల చంద్రబాబు పాలనలో అమరావతి భ్రమరావతి అయింది

**విజయవాడ.మే3,ప్రభాతవార్తప్రతినిధి:**అమరావతి పునః ప్రారంభ సభలో సిఎం చంద్రబాబు,మంత్రి లోకేష్ అసత్యాలు చెప్పారని మాజీ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. అమరావతి ఒక అంతులేని కథ. అమరావతి నిర్మించడంలో చంద్రబాబు అట్టర్ ఫ్లాప్ అయ్యారని మండిపడ్డారు.అమరావతి కోసం గత చంద్రబాబు ప్రభుత్వంలో 41 వేల కోట్లకు పైగా టెండర్లు పిల్చి 5500 కోట్లు ఖర్చు చేశారు. గత ఐదు సంవత్సరాల చంద్రబాబు పాలనలో అమరావతి భ్రమరావతి అయింది...అందుకే చంద్రబాబును చిత్తుచిత్తుగా ఓడించారు అని ఆయన తెలిపారు. 10 సంవత్సరాలు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా విభజన చట్టంలో అవకాశం కల్పించారు. చంద్రబాబును అక్కడ తంతే ఇక్కడికి వచ్చి పడ్డాడు. లక్ష కోట్లతో అద్భుతమైన నగరాన్ని నిర్మించడానికి మన రాష్ట్రంలో ఆర్థిక వనరులు ఉన్నాయా



అని ప్రశ్నించారు. చంద్రబాబు అమరావతి పేరుతో అందరిని ముంచేశారని అంబటి రాంబాబు అన్నారు.ఇక భూములు ఇచ్చిన రైతులకు చంద్రబాబు అభివృద్ధి చేసిన ప్లాట్లు కూడ ఇవ్వలేకపోయారు అన్నారు. అమరావతి విధ్వంసం చేసిన వ్యక్తి చంద్రబాబు.మేము అన్ని వాస్తవాలు చెబుతున్నాం.జగన్ అమరావతిని అభివృద్ధి చేద్దామంటే కోర్టులకు వెళ్ళి అడ్డుకునేన్నారు. చంద్రబాబు అమరావతి సెల్ఫ్ సస్టైనబుల్ నగరం అని చెప్తున్నారు...సెల్ఫ్ సస్టైనబుల్ నగరానికి 52 వేల కోట్లు ఎందుకు అప్పు చేశారు. జగన్ అప్పు చేస్తే రాష్ట్రం శ్రీలంక అయిపోతుందని తప్పుడు ప్రచారం ఏశారు. గత చంద్రబాబు ప్రభుత్వంలో అమరావతిలో శాసనసభకు రూ.2271 కోట్లు టెండరు పిలిస్తే ఇప్పుడు దాని అంచనాలు పెంచారు. ఇప్పుడు శాసనసభ నిర్మాణానికి రూ.4689 కోట్లు అంచనాలు పెంచి టెండర్లు పెంచుతున్నారు. అమరావతి పేరుతో అప్పులు తెచ్చి చంద్రబాబు దోచుకుంటున్నారు. ఒక కిలోమీటర్ రోడ్డు నిర్మాణానికి 50 కోట్లు ఖర్చు చేస్తున్నారు.వర్షం పడితే అమరావతి పరిస్థితి ఏంటో అందరికీ తెలుసని ఆయన వ్యాఖ్యానించారు.

## వ్యవసాయ భూములు, స్థిరాస్తులు, లీజులు, లైసెన్స్‌లు నియామకాలు 2003 సవరణలతో జిఓ 139 విడుదల

**విజయవాడ,మే3,ప్రభాతవార్తప్రతినిధి:** దేవాదాయ శాఖకు చెందిన వ్యవసాయ భూములు, స్థిరాస్తులు, లీజులు, లైసెన్స్‌లు నియామకాలు 2003కు సవరణలు చేస్తూ ప్రభుత్వం జిఓ ఎంఎస్ నెంబరు 139ని విడుదల చేసింది.

20 ఏళ్ల ఏ సంస్థ, సేవా ట్రస్టులు ఆయా ఆలయాలకు సేవలందిస్తున్నట్లు గుర్తిస్తే ఆయా సంస్థలకు భూములు వేలం పాట ద్వారా కాకుండా ప్రభుత్వం నేరుగా లీజుకు ఇచ్చే అవకాశం ఈ సవరణ ద్వారా కలుగుతుంది. ఇప్పటి వరకు మూడేళ్ల పాటు దేవాదాయశాఖ తమ ఆస్తులను లీజుకు ఇచ్చే అవకాశం ఉండేది. ప్రభుత్వం ప్రస్తుతం తీసుకొచ్చిన సవరణ ద్వారా 20 ఏళ్ల సేవ పేరుతో ఆయా ఆస్తులను వేలం పాట ద్వారా కాకుండా, నేరుగా లీజుకు ఇవ్వనుంది.

## మాజీ మంత్రిపెద్దిరెడ్డి ఇంటివద్ద హైటెన్షన్

### - బుగ్గమఠం భూముల సర్వేలో నెలకొన్న ఉద్రిక్తత

**తిరుపతిరూరల్, మే03 ప్రభాతవార్త:** బుగ్గమఠం భూముల సర్వేలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇంటి వద్ద హై టెన్షన్ నెలకుంది. అధికారులు, పెద్దిరెడ్డి అనుచరుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకోవడంతో భారీగా పోలీసులు మోహరించారు. బుగ్గమఠం భూముల హద్దులు చూపించాలని బుగ్గ మఠం కమీషనర్ తిరుపతి ఆర్డీఓ, అర్బన్ తహశీల్దార్స్‌కు కోరగా, బుగ్గమఠం భూమిని సర్వే చేసినట్లు డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే చిట్టిబాబు తెలిపారు. బుగ్గమఠానికి చెందిన సర్వేనెంబర్ 314/1బి, 315/1, 261/2, 314/3ఎ, 314/2లలో 14.49 ఎకరాలు భూమి ఉన్నాయని తెలిపారు. అందులో సర్వేనెంబర్ 261/1,261/2 వున్న 3.8 ఎకరాల భూమి ఆక్రమణకు గురైనట్లు అధికారులు గుర్తించినట్లు తెలిపారు. బుగ్గ మఠానికి చెందిన రికార్డు సరిగా లేనందున అధికారులు సర్వే అధికారులు కూడా ఏమి చేయలేని దుస్థితి నెలకుంది. ఈనెల 24న నలుగురికి నోటీసులు జారీ చేసామని అధికారులు తెలపగా, నిన్న సాయంత్రం ఇచ్చారని అక్కడ స్థానికులు తెలిపారు. బుగ్గ మఠం భూములను ఎక్కడా ఆక్రమించలేదని పెద్దిరెడ్డి వర్గీయులు తెలిపారు. ఐఓఎస్ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే కృపాకర్, బుగ్గమఠం అసిస్టెంట్ కమీషనర్ వెంకటేశ్వర్లు, మఠం అధికారులు బాలాజీ, ఎండోమెంట్ సర్వేయర్ సురేష్, సతీష్, మండల సర్వేయర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## రాజధానికి గ్రాంట్‌ఏది? -ప్రత్యేక హోదా ఊసేలేదు

### - ప్రధాని మోదీ ప్రసంగంపై సిపిఐ నారాయణ విమర్శలు

**తిరుపతి,మే 3ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి పున:నిర్మాణానికి ,పలు ప్రాజెక్టుల ప్రారంభానికి విచ్చేసిన ప్రధాని నరేంద్రమోదీ ఊకదంపుడు ఉపన్యాసాలతో సరిపెట్టుకున్నారని, రాజధానికి గ్రాంట్,ప్రత్యేక హోదా ఊసేలేదని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. అమరావతి పర్యటనకు విచ్చేసిన మోదీ రాష్ట్రప్రయోజనాలు, అభివృద్ధి,స్టీల్‌ప్లాంట్ తదితర అంశాలపై ఎలాంటి ప్రకటన చేయలేదన్నారు. పదేళ్ళక్రిందట వేసిన శంకుస్థాపన రాయి గురించి కూడా గుర్తుచేసుకోలేకపోయారని మండిపడ్డారు. శనివారం తిరుపతిలోని సిపిఐ కార్యాలయంలో కె.నారాయణ మీడియాతో మాట్లాడారు. పదేళ్ళనాడు అమరావతి రాజధాని ప్రారంభమై ఉంటే నేడు బ్రహ్మాండంగా ఉండేదని, అప్పుడు సిఎం చంద్రబాబునాయుడు సహకరించక,ఆ తరువాత జగన్మోహన్‌రెడ్డికి సూచంచకపోయాడని ఎద్దేవాచేశారు. కనీసం రాజధాని పున:ప్రారంభానికి మలిసారి వచ్చిన సందర్భంలో స్పష్టమైన గ్రాంట్ ప్రకటించలేదని, కేవలం ఉపన్యాసం ఇచ్చిపోవడానికే వచ్చాడని ఆయన వ్యంగ్యంగా వ ు ట్లా డా రు. రాష్ట్ర ప్రయోజనాలు, కావలసిన అభివృద్ధి, నిధులను, ప్రత్యేక హోదా అంశాన్ని లెవనెత్తి తీసుకోవాల్సిన బాధ్యత సిఎం చంద్రబాబు,డిప్యూటీ సిఎం పవన్‌కు ఉందన్నారు.భిక్షం కాదని ప్రత్యేక హోదా సాధించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రప్రయోజనాలతో సంబంధం లేకుంఆడ ప్రదాని పర్యటన కేవలం షోచేసి వెళ్ళాడని, పాలకులు ప్రయోజనాలు అడిగి తీసుకోలేకపోయారని నారాయణ అన్నారు. రాష్ట్రంలో అవినీతి ఏరులై పారుతోందని, కేవలం ప్రభుత్వంలో పాలకులు మారారే తప్ప అవినీతి, విదానాలులో మార్పురాలేదని మండిపడ్డారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఎక్కడవిఅక్కడే ఉన్నాయన్నారు. అటవీశాఖ నిద్రావస్థలో ఉందన్నారు. ఏనుగులబారినుండి జిల్లారైతులను కాపాడి, ఏనుగులదాడిలో ప్రాణాలు కోల్పోయిన, పంటనష్టంరైతుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. ఈ మీడియా సమావేశంలో సిపిఐ నాయకులు రామానాయుడు, పి.మురళి, చిన్నంపెంచలయ్య పాల్గొన్నారు.




## భవిష్యత్తులో ఎఐ, ఐటీ, కంప్యూటింగ్‌లకు కేరాఫ్ గా అమరావతి

### - సమాచార పౌరసంబంధాల మంత్రి కొలుసు పార్థసారధి

**విజయవాడ,మే3,ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతి పునః ప్రారంభ సభ చాలా గొప్పగా విజయవంతం అయ్యిందని అందుకు రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ సంతోషించారని సమాచార పౌరసంబంధాలు, గృహ నిర్మాణ శాఖ ల మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. బందరు రోడ్డులో గల మంత్రి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరావతిని దేవతల రాజధాని అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారన్నారు. దేవతలు సంచరించే చోట రాక్షసులు కూడా ఉండటం సహజమన్నారు. 5 కోట్ల మంది తెలుగువారు మద్దతు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు ఉందని మంత్రి తెలిపారు. అమరావతిని భవిష్యత్తులో ఏఐ, ఐటీ, క్వంటం కంప్యూటింగ్ లకు కేంద్రంగా వర్ధిల్లే ముఖ్యమంత్రి చేస్తారన్నారు. రూ. 58,000 కోట్ల అభివృద్ధి పనులకు నిన్న ప్రధాన మంత్రి వేదిక నుంచి ప్రారంభించారన్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు తమ అనుభవంతో గాడిలో పెట్టగలరని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం పేదల పక్షపాత ప్రభుత్వమన్నారు.గత ప్రభుత్వం ఐదేళ్లపాటు రాజధాని ప్రజలను నానా రకాలు గా ఇబ్బంది పెట్టి, అమరావతి ప్రజలను భయపెట్టారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ను చూసి స్ఫూర్తి పొందానని స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీ అనటం ముఖ్యమంత్రి గొప్ప పనితనానికి నిదర్శనమన్నారు. దేశాన్ని గాడిలో పెట్టిన ఏకైక ప్రధాని మోదీ అని అన్నారు. పహల్గామ్ ఉగ్రమూకల దాడి విషయంలో ముఖ్యమంత్రి ప్రధాన మంత్రికి వెన్నుదన్నుగా నిలిచారన్నారు. అమరావతిని భ్రమరావతి అని గత పాలకులు విమర్శలు చేశారన్నారు. అమరావతి పునః ప్రారంభానికి ఆహ్వానించినా గత పాలకులు రాలేదన్నారు. గత పాలకులు అమరావతి ప్రాధాన్యతను అవసరాన్ని ఇప్పటికైనా గుర్తించాలన్నారు. అమరావతి పునః. ప్రారంభ పనులు చాలా గొప్పగా మొదలయ్యాయన్నారు. అమరావతి పై విషం చిమ్మిన గత పాలకులు, స్వార్థపరులు ఇప్పటికైనా పశ్చాత్తాపం వ్యక్తం చేయాలన్నారు. అలా చేస్తే తెలుగు ప్రజలు క్షమించక పోయినా దేవుడు అయినా వారిని క్షమిస్తాడేమోనన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తితోపాటు, పోలవరం బనకచర్ల నదుల అనుసంధాన ప్రాజెక్టు కూడా సాధ్యమేనని ముఖ్యమంత్రి నిరూపించారన్నారు. దీనివల్ల రాష్ట్రంలో ఉన్న ప్రతి ఎకరాకు నీళ్లు అందిస్తారన్నారు. యువతకు 20 లక్షల ఉపాధి కల్పించటమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అమరావతి పునః ప్రారంభ సభకు వచ్చేందుకు వాహనాలు సరిపోక వేలాదిమంది ప్రజలు గ్రామాల్లో ఉండిపోయారన్నారు. సభలో మోడీ చంద్రబాబు పనితీరుపై చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర అభివృద్ధి పై ఆయనకు ఉన్న కమిట్ మెంట్ ను తెలియజేస్తుందన్నారు. అమరావతి శక్తిని సాక్ష్యాత్తు ప్రధాని నరేంద్ర మోడీ గుర్తించి కీర్తించారన్నారు. అమరావతి సభ సమయంలో అగ్ని ప్రమాదం వెనుక ఎవరైనా ఉంటే దానిపై పోలీసుల విచారణలో బయటపడుతుందన్నారు. ఇప్పటి వరకు అమరావతి రాజధాని పై ఉన్న అనుమానాలు పటాపంచలు అయిపోయాయని దీన్ని రాష్ట్ర ప్రజలతోపాటు అందరూ గుర్తించారన్నారు. అమరావతి అంటే గత ప్రభుత్వానికి కడుపు మంట అని ఎద్దేవ చేశారు. అమరావతికి చట్ట బద్దత కల్పించే అంశంపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

## స్వర్ణ వాసవి ఆవిష్కరించిన మంత్రి భరత్ ప్రతిరోజు గోమాతను పూజిస్తానన్న మంత్రి

**హిందూపురం మే 3 ప్రభాతవార్త** దక్షిణ భారతదేశంలో తొలిసారిగా శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణం నందు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రెండున్నర కేజీల స్వర్ణ వాసవి మాత విగ్రహాన్ని రూపొందించగా రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్ శనివారం ఆవిష్కరించారు. బెంగళూరు నుంచి ఆయన ఇక్కడికి ఉదయం 11:30 గంటల సమయంలో చిన్న మార్కెట్ సర్కిల్ కు చేరుకోగా పూర్ణకుంభ స్వాగతం లభించింది. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జేపీకే రాము, కార్యదర్శి కేపీ శ్రీకాంత్, కోశాధికారి రవీంద్రుడు ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి మంత్రి నివాళులర్పించారు. తదుపరి శ్రీ కనకా పరమేశ్వరి ఆలయం వద్దకు చేరుకోగానే ఎమ్మెల్యే కార్యదర్శి డాక్టర్ సురేంద్ర, మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ పుష్పగుచ్ఛం అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆలయంలో ఏర్పాటు చేసిన నూతన స్వర్ణ వాసవి మాత విగ్రహాన్ని లాంఛనంగా మంత్రి ఆవిష్కరించి ప్రత్యేక పూజలు మంగళహారతి నిర్వహించారు.

## ప్రధాని సభలో పోర్ మెన్ షో తప్ప ఏముంది - సిపి జాతీయ కార్యదర్శి నారాయణ

**విజయవాడ,మే3,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి పర్యటనకు విచ్చేసిన ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఊకదంపుడు ఉపన్యాసాలతో సరిపెట్టుకున్నారని, ఆత్మస్తుతి పరనిందలా సాగిందని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కంకణాలనారాయణ ఆరోపించారు.సామాజిక మాధ్యమం ఎఫ్‌బీ మేసేజర్‌లో ఆయన తన అభిప్రాయాన్ని వెల్లడించారు అమరావతి పర్యటనకు విచ్చేసిన నరేంద్ర మోడీ ఉపన్యాసంతో మభ్యపెట్టి మారేడుకాయ చేసేలా వ్యవహరించారని, రాష్ట్ర ప్రయోజనాలు, అభివృద్ధి, స్టీల్ ప్లాంట్ తదితర అంశాలపై ఎలాంటి ప్రకటనా చేయలేదన్నారు. ఆఖరికి పదేళ్ల కిందట వేసిన శంకుస్థాపన రాయి గురించి కూడా గుర్తు చేసుకోలేకపోయారని తెలిపారు. కనీసం రాజధాని శంకుస్థాపనకు మలిసారి వచ్చిన సందర్భంలో స్పష్టమైన గ్రాంట్ ప్రకటించలేదని, కేవలం ఉపన్యాసం ఇచ్చిపోవడానికి మాత్రమే వచ్చారని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాలు, అభివృద్ధి, నిధులు, ప్రత్యేక హోదా అంశాన్ని లేవనెత్తలేదన్నారు.

# తిరుమల సమాచారం

## తిరుమలలో ఈదురు గాలులు పాపవినాశనంలో కూలిన చెట్లు

**తిరుమల,మే 3ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో శనివారం సాయంత్రం ఒక్కసారిగా బలమైన ఈదురుగాలులు వీచాయి. వాతావరణంలో మార్పుతో ఆకాశం మేఘావృతమైనా చిరుజల్లులు కూడా కురవయ్యాయి. అయితే సాయంత్రం బలమైన ఈదురుగాలులు



వీయడంతో పాపవినాశనంలో చెట్లు కూకటివ్రేళ్ళతో నేలకొరిగాయి. అక్కడే ఉన్న దుకాణాలు, భక్తులకు ఎలాంటి ప్రమాదం లేదు. దీంతో సమాచారం అందుకున్న టిటిడి అటవీశాఖ సిబ్బంది అక్కడకు చేరుకుని చెట్లను తొలగించారు. ఇప్పటికే తిరుమలలో కూడా ఉష్ణోగ్రత వివరీతంగా ఉంది. 41డిగ్రీలు నమోదుకావడంతో ఎండ వేడికి భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టిటిడి అధికారులు ఆలయం పరిసరాల్లో, తిరుమలలో భక్తులసంచారం ఉన్నచోట్ల చలువపందిళ్ళు వేసి కాస్త ఉపశమనం కల్పిస్తున్నారు. ఆలయం మాఢవీధుల్లో కూల్‌పెయింట్, నీళ్లట్యాంకర్లతో చల్లడం చేస్తుండటంతో భక్తులకు కాస్త ఉపశమనంగా మారింది.

## వెంకన్న ఆశీస్సులతో అందరికీ శుభాలు కలగాలి

**తిరుమల,మే 3ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సు లతో ప్రజలందరికీ మంచిజరగాలని స్వామి వారిని ప్రార్థించినట్లు పలువురు ప్రముఖులు తెలిపారు. శనివారం ఉదయం రాష్ట్రహైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర రావు కుటుంబంతో, సినీగాయని ఉష,రాష్ట్ర పరిశ్రమలు వాణిజ్యశాఖ కార్యదర్శి యువరాజ్ విఐపి బ్రేక్‌లో వేర్వేరుగా శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వేదపండితులు వేదాశీర్వ చనం చేశారు. టిటిడి అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## వారాంతం, వేసవి సెలవుల్లో భారీగా భక్తులు

**తిరుమల,మే 3 ప్రభాతవార్తప్రతినిధి:** వేసవిసెలవులకు తోడు వారాంతపుకావడం,శని ఆదివారాలు సెలవు రావడంతో ఏడుకొండల వెంకన్న దర్శనానికి భక్తులు భారీగా చేరుతున్నారు. శనివారం ఉదయానికి అనూహ్యంగా టోకెన్‌లేని సర్వదర్శనం కోసం భక్తులు దేశం నలుమూలల నుంచి తరలివస్తున్నారు. శనివారం మధ్యాహ్నానికి వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లలోని 32 కంపార్టుమెంట్లు నిండిపోయి భక్తులు వెలుపల క్యూలైన్లలో బారులుతీరారు. స్వామివారి సర్వదర్శనానికి శనివారం మధ్యాహ్నానికి 20గంటలు సమయం పడుతుండగా ప్రత్యేక ప్రవేశ దర్శనానికి ఆరుగంటలపైగానే భక్తులు నిరీక్షిస్తున్నారు. శనివారం సాయంత్రం వరకు 46వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. సాధారణంగా శని,ఆదివారాలు భక్తులు భారీగా తిరుమలకు వస్తారు. తిరుమలేశునికి ఎంతో ముఖ్యమైన శనివారంరోజు స్వామివారిని దర్శించుకుంటే రెట్టింపు ఆశీస్సులు లభిస్తాయనేది భక్తుల ప్రగాఢ విశ్వాసం. శ్రీవారి దర్శనానంతరం ఆలయం వెలుపలకు వచ్చిన భక్తులు లడ్డూలకోసం వితరణశాలలో క్యూలైన్లలో బారులు తీరారు. ఉదయం వేళ సర్వదర్శనం భక్తులు దర్శనానికి వస్తుండటంతో లడ్డూకౌంటర్లు కిటకిట లాడుతున్నాయి.


**SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయ ప్రాంగణం, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం

**అమ్మకము కొరకు ముందస్తు ప్రకటన**

**SARFAESI చట్టం 2002 యొక్క సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 లోని రూల్ 8 (6) ప్రకారం జారీ చేయడమైనది.**

టు,
**ఋణగ్రహీత చిరునామా: శ్రీ సన్నాల శేషగిరి రావు,** తండ్రి : నాగమునీంద్ర రావు, డి.నెం.15-8-1, పాత 13వ వార్డు, ప్రస్తుతం 19వ వార్డు, భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా. **వేరొక చిరునామా: శ్రీ సన్నాల శేషగిరి రావు,** తండ్రి : నాగమునీంద్ర రావు, డి.నెం. 1/270-10, మఠం వీధి, బంగ్లా హై స్కూల్ ప్రక్కన, పెడన, కృష్ణాజిల్లా - 521366.

**సర్ / మేడమ్**

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 లోని సెక్షన్ 13(12) దీనితో చదువుకోలసిన సదరు రూల్స్‌లోని రూల్ 3 ప్రకారం ఋణగ్రహీతలకు **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** యొక్క అధీకృత అధికారి **తేది.08-06-2022న** జారీచేసిన డిమాండ్ నోటీసులో తెలిపిన విధంగా **తేది.08-06-2022** నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ.40,82,764/-** (అక్షరాల నలభై లక్షల ఎనభై రెండు వేల ఏడు వందల అరవై నాలుగు రూపాయలు మాత్రమే) + **తేది.09.06.2022** నుండి కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ, వ్యయాలు, ఛార్జీలు మరియు ఇతర ఖర్చులు వసూలు నిమిత్తం పైన తెలిపినట్లు 60 రోజులలోగా చెల్లించవలసినదిగా తెలియజేయడమైనది.

మీరు మొత్తం ఋణాలను తిరిగి చెల్లించడంలో విఫలమైనందున సదరు ఆస్తులను సెక్షన్ 13(4) దీనితో సదరు రూల్స్‌లోని రూలు 8(1) ప్రకారం అధీకృత అధికారి సదరు తనఖా ఆస్తిని **తేది.07.12.2022న** స్వాధీనం చేసుకున్నారు. సదరు స్వాధీనత నోటీసును **తేది. 13-12-2022న (సాక్షి : భీమవరం డివిజన్ (పశ్చిమగోదావరి)(తెలుగు)** మరియు **ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ : తాడేపల్లిగూడెం ఎడిషన్ (ఇంగ్లీష్))** దినపత్రికలలో రూలు 8(2) ప్రకారము ప్రచురించడమైనది.

తనఖా ఉంచిన దిగువ తెలిపిన ఆస్తులపై గల **తేది.08-06-2022న** డిమాండ్ నోటీసులో పేర్కొన్న బకాయి మొత్తమును ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా చెల్లించవలెను. లేని యెడల సదరు ఆస్తులు విక్రయించుటకు బహిరంగ వేలం కొరకు టెండర్లు / కొటేషన్లు సాధారణ ప్రజానీకం వద్ద నుండి ఆహ్వానించబడును.

**స్థిరాస్తి వివరములు**

**రిజిష్టర్డు సేల్ డీడ్ నెం.7814/2021, తేది.12.10.2021 ప్రకారం శ్రీ సన్నాల శేషగిరి రావు గారు తనఖా పెట్టిన స్థిరాస్తి : ఐటమ్-1:** పశ్చిమగోదావరి జిల్లా, గుణుపూడి ఎస్ఆర్ఓ పరిధిలో, భీమవరం మండలం, భీమవరం మున్సిపల్ పరిధిలో, గుణుపూడి గ్రామం వద్ద ఆర్.ఎస్.నెం.317/13 లోని ఎ.1.56 సెంట్లు లోని పడమర వైపు ఎ.0.20 సెంట్లు మొత్తంలో 426 చ॥గ॥లలోని పడమర వైపు 116 చ॥గ॥లు, దీని మధ్యలో 108.78 చ॥గ॥లు విస్తీర్ణం గల స్థలం అందు డి.నెం.15-8-1తో గల ఆర్‌సిసి స్లాబ్ రూఫ్ నివాస భవనం యావత్తు ఆస్తి. **హద్దులు: తూర్పు:** దిగువ తెలిపిన ఐటమ్ నెం.2, **పడమర** : మున్సిపల్ రోడ్డు, **దక్షిణం:** షేక్ అబ్దుల్ అజీజ్ గారికి అమ్మిన భవనం భాగం, **ఉత్తరం** : షేక్ ఇస్మాయిల్ గారికి అమ్మిన స్థలం కొంతమేర మరియు షేక్ అసిఫ్ బాషా గారికి అమ్మిన స్థలం కొంతమేర.

**ఐటమ్-2 (దారి):** పశ్చిమగోదావరి జిల్లా, గుణుపూడి ఎస్ఆర్ఓ పరిధిలో, భీమవరం మండలం, భీమవరం మున్సిపల్ పరిధిలో, గుణుపూడి గ్రామం వద్ద 21.66 చ॥గ॥ల మొత్తంలో 7.22 చ॥గ॥ల 1/3వ వంతు అనిర్దేశ్యపు వాటా. **హద్దులు: తూర్పు:** షెడ్యూలు ఆస్తి లోని ప్రహరీ గోడ ఆ తరువాత సుల్తానల్ అరెఫిన్ మరియు ఇతరుల స్థలం - 78'.00", **పడమర** : షేక్ హనీఫ్, షేక్ అబ్దుల్ అజీజ్ మరియు షేక్ అసిఫ్ బాషా గార్లకు అమ్మిన భవనం భాగం కొంతమేర మరియు ఐటమ్ నెం.1 కొంతమేర మరియు అమ్మిన స్థలం, **దక్షిణం** : మసీదు షెడ్ గోడ మరియు సుంకు సాయి పవన్ కుమార్ గారి స్థలం - 2'.06", **ఉత్తరం** : మున్సిపల్ రోడ్డు - 2'.06".

**ఐటమ్‌లు 1 మరియు 2ల మొత్తం విస్తీర్ణం : 116 చ॥గ॥లు.,**

తేది: 03-08-2024 సం/- అధీకృత అధికారి,
ప్రదేశం: విశాఖపట్నం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా



**దక్షిణ మధ్య రైల్వే**

Follow us on @SCRailwayindia
మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in
పై ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను చూడవచ్చును.

**ఇ-టెండర్ ప్రకటన నం.: 16-2025 తేది: 29.04.2025** PUB/0500

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ ఇంజనీర్ / సమన్వయం / గుంతకల్ వారు క్రింది పనులకు ఇ-టెండర్‌లు కోరుతున్నారు.

**ముగింపు తేదీ & సమయం: 27.05.2025 మ.15.00 గం. వద్ద**

**క్ర.సం.: 1. టెండర్ నం.:** Engg-GTL-South-1841. **పని యొక్క వివరణ:** యర్రగుంట్ల-నంద్యాల సెక్షన్ (SSE/P.Way/JMDG) ఫార్మేషన్‌ను పటిష్టపరచుట/సెస్ మరమ్మతులు-165410Cum. **ప్రకటిత విలువ రూ.లలో:** 5,03,09,405.00, **బయానా రూ.లలో:** 4,01,600.00

**క్ర.సం.: 2. టెండర్ నం.:** Engg-GTL-South-1842. **పని యొక్క వివరణ:** రేణిగుంట-గూటీ & గూడూరు-రేణిగుంట సెక్షన్: గూడూరు-రేణిగుంట (UP) - TFTR - 1.2 కిమీ (సెంట్రల్ డ్రైన్). రేణిగుంట-గుంతకల్ (UP & DN) TFTR - 13.235 కిమీ (ఫార్మేషన్ పటిష్టపరచుట మరియు సెంట్రల్ డ్రైన్) **ప్రకటిత విలువ రూ.లలో:** 8,78,05,081.17, **బయానా రూ.లలో:** 5,89,000.00.

**క్ర.సం.: 3. టెండర్ నం.:** Engg-GTL-Bridges-1843. **పని యొక్క వివరణ:** గుంతకల్ డివిజన్: గుంతకల్ డివిజన్‌లో BRI / South & BRI / రేణిగుంట పరిధిలో బేరింగ్స్ తనిఖీకి PSC గిర్డర్‌లు మరియు ROBలపై ఊయల అమరిక ఏర్పాటు. **ప్రకటిత విలువ రూ.లలో:** 4,55,31,345.70, **బయానా రూ.లలో:** 3,77,700.00.

ఏ సవరణ అయినా ఆన్‌లైన్ మాత్రమే జారీ చేయబడును.

**డివిజనల్ రైల్వే మేనేజర్/ వర్క్స్ / గుంతకల్**

**ఇ-టెండర్ ప్రకటన నం.: S&T/06/2025, తేది: 02.05.2025** PUB/0501

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ సిగ్నల్ మరియు టెలికమ్యూనికేషన్ ఇంజనీర్ (నిర్వహణ) దక్షిణ మధ్య రైల్వే, గుంతకల్ వారు క్రింది పనికి **26.05.2025న 15.00 గం.** వరకు ఇ-టెండర్‌లు (బహిరంగం) కోరుతున్నారు.

**టెండర్ నం.:** 01-SNT-06-2025. **పని యొక్క వివరణ: (సిగ్నల్ మరియు టెలికాం పని):** ఇంటర్ లాక్డ్ LC గేట్స్ (24 నం.లు) (ట్రాఫిక్-14, మిడ్ సెక్షన్-10) వద్ద EOLBతో MOLBలు యొక్క రీప్లేస్‌మెంట్‌తో కనెక్షన్‌లో సిగ్నలింగ్ ఏర్పాట్లు. **పని యొక్క ప్రకటిత టెండర్ విలువ: (రూ.):** 3,39,54,321.00, **బయానా (రూ.):** 3,19,800.00, **పూర్తి చేయు కాలం:** 12 నెలలు.

**టెండర్ నం.:** 02-SNT-06-2025. **పని యొక్క వివరణ: (సిగ్నల్ మరియు టెలికాం పని): 1)** YA-NDL, GTL-BAY, DMM-PAK, RU-GDR సెక్షన్‌లలో కమ్యూనికేషన్ యొక్క విశ్వాసం పెంపుదల కొరకు లోపభూయిష్టమైన క్వాడ్ కేబుల్ యొక్క రీప్లేస్‌మెంట్. **2)** గుంతకల్ డివిజన్‌లో కేబుల్ దోషాలను సరి చేయుటం మరియు కేబుల్ యొక్క రీకండిషనింగ్. **పని యొక్క ప్రకటిత టెండర్ విలువ (రూ.):** 4,03,05,854.00, **బయానా (రూ.):** 3,51,500.00, **పూర్తి చేయు కాలం:** 12 నెలలు.

ఆఫర్ యొక్క చెల్లుబాటు, తెరచిన తేదీ నుండి 60 రోజులు ఉండాలి. పై టెండర్ ప్రకటనకు సవరణ అవసరమైతే, ఆన్‌లైన్ ద్వారా మాత్రమే జారీ చేయబడుతుంది. తదుపరి టెండర్ నిబంధనలు/ వివరాలు మరియు టెండర్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ కొరకు దయచేసి వెబ్‌సైట్ www.ireps.gov.in వీక్షించండి.

**సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్, నిర్వహణ, గుంతకల్**

**ఇ-టెండర్ ప్రకటన** PUB/0502

**ఇ-టెండర్ ప్రకటన నం.GNT/SG/36/327, తేది: 01.05.2025.** దిగువ సంతకందారు క్రింద పేర్కొనబడిన పనులకు **26.05.2025 యొక్క 12.00 గం.** వరకు ఇ-టెండర్‌లు ఆహ్వానిస్తున్నారు.
**ఇ-టెండర్ ప్రకటన నం.GNT/SG/36/328, తేది: 01.05.2025.** దిగువ సంతకందారు క్రింద పేర్కొనబడిన పనులకు **26.05.2025 యొక్క 16.00 గం.** వరకు ఇ-టెండర్‌లు ఆహ్వానిస్తున్నారు.

**ID. No. : 327. పని యొక్క పేరు:** సిగ్నలింగ్ మరియు టెలికాం ఏర్పాట్లు వీటికి సంబంధించి **1)** గుంటూరు స్టేషన్ వద్ద అన్ని PFల పైన COPల యొక్క విస్తరణ **2)** గుంటూరు స్టేషన్ వద్ద సబ్-వే యొక్క ఫ్లోరింగ్ & డాడోకు అభివృద్ధి. **3)** గుంటూరు స్టేషన్ వద్ద కొత్త PF నం.8పై COP యొక్క ఏర్పాటు. **4)** గుంటూరు స్టేషన్ వద్ద PF నం.1 & 4 యొక్క కోపింగ్స్, ఫ్లోరింగ్‌కు అభివృద్ధి. **5)** గుంటూరు స్టేషన్ (పడమటి వైపు) వద్ద సర్క్యులేటింగ్ ఏరియాలో అలంకృతమైన ప్రహరీగోడ & పార్కింగ్ సౌకర్యాల ఏర్పాటు. **6)** గుంటూరు స్టేషన్ భవనం (పడమటి వైపు)పై ప్రిపెయిడ్ లాంజ్ మరియు డార్మిటరీ యొక్క ఏర్పాటు. **7)** గుంటూరు డివిజన్‌లో 1.744 Km. పొడవుకు కిమీ 38.236-39.980 నుండి GNT-NDKD సెక్షన్‌లో TRR(P). **8)** గుంటూరు డివిజన్‌లో 1.541 కిమీ మొత్తం పొడవుకు కిమీ 41.463-41.827 నుండి మరియు కిమీ 23.045-24.222 నుండి GNT-NDKD సెక్షన్‌లో TRR(P). **9)** గుంటూరు డివిజన్‌లో 0.990 కిమీ పొడవుకు NDL యొక్క Rd. నం.4లో TRR(P). **ప్రకటిత టెండర్ విలువ (రూ.):** 75,87,351.28, **బయానా/బిడ్ సెక్యూరిటీ (రూ.):** 1,51,800/-, **టెండర్ డాక్యుమెంట్ ధర (రూ.):** నిల్.

**ID. No. : 328. పని యొక్క పేరు:** సిగ్నలింగ్ మరియు టెలికాం ఏర్పాట్లు వీటికి సంబంధించి **1)** గుంటూరు డివిజన్‌లో ABSS (క్రింద, GNT, NRT మరియు MRK స్టేషన్‌ల వద్ద 12.0 m వెడల్పు గ్యాంగ్‌వేతో కొత్త FOB యొక్క ప్రతిపాదన నిర్మాణం. **2)** గుంటూరు డివిజన్‌లో ABSS (క్రింద MRGA, NLDA, PGRL మరియు NDL స్టేషన్‌ల వద్ద 12.0 m వెడల్పు గ్యాంగ్‌వేతో కొత్త FOB యొక్క ప్రతిపాదిత నిర్మాణం. **3)** GNT డివిజన్‌లో వేమూరు (VMU) స్టేషన్ వద్ద గూడ్స్ షెడ్‌కు సౌకర్యాల అభివృద్ధి. **ప్రకటిత టెండర్ విలువ (రూ.):** 1,47,81,786.20, **బయానా/బిడ్ సెక్యూరిటీ (రూ.):** 2,23,900/-, **టెండర్ డాక్యుమెంట్ ధర (రూ.):** నిల్.

1. ఇ-బిడ్స్ ఆన్‌లైన్ దాఖలుకు చివరి తేదీలు: 26.05.2025 12.00 గం. వరకు మరియు 26.05.2025 16.00 గం. వరకు. సవివర సమాచారానికి మా వెబ్‌సైట్ www.ireps.gov.in వద్ద లాగాన్ అవ్వండి. 2. ఏదైనా తదుపరి కమ్యూనికేషన్/సవరణ www.ireps.gov.in ఇ-పోర్టల్ ద్వారా మాత్రమే తెలుపబడును.

**సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్/గుంటూరు**
A0624

**తదుపరి టెండరు నిబంధనలు/వివరములు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్‌కు, దయచేసి వెబ్‌సైట్లు https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వద్ద చూడవచ్చును.**

భారత పార్లమెంట్ జాతీయ ఆనకట్టల భద్రతా ప్రాధికార సంస్థను (ఎన్‌డిఎస్‌ఎ)ను రాజ్యాంగంలోని 246 ప్రకరణ ప్రకారం ఏడో షెడ్యూల్‌లోని ఉమ్మడి జాబితాలోని ఎంట్రీ 56,97లను ఉపయోగించి 2021లో రూపొందించారు. ఎన్‌డిఎస్‌ఎ ఒక కేంద్ర నియంత్రణ సంస్థగా ఉంటుంది. డ్యామ్‌భద్రత, ప్రమాణాలు అమలు చేయిస్తుంది. డ్యామ్ భద్రతకు మార్గదర్శకాలు రాష్ట్రాలమధ్య భద్రతావివాదాలు పరిష్కరిస్తుంది. డ్యామ్‌ల ప్రమాదాలు నివారణకు ప్రమాదాల మూల్యాంకనం చేయడం భద్రత చర్యలపై సలహాలుఇస్తుంది. లోక్‌సభలో 2ఆగస్టు 2019, రాజ్యసభలో 8 డిసెంబరు 2021లో ఆమోదం తెలుపగానే భారత రాష్ట్రపతి 13డిసెంబరు 2021లో గెజిట్ ప్రకటించారు. ఎన్‌డిఎస్‌ఎ 8డిసెంబరు 2021లో అమలులోకి రాగా భారత జలశక్తి మంత్రిత్వశాఖ 18ఫిబ్రవరి 2022లో ఎన్‌డిఎస్‌ఎ సంస్థకు అస్తిత్వంకల్పించింది. జాతీయ డ్యామ్ సేఫ్టీచట్టం ఉద్దేశ్యం డ్యామ్‌లవైఫల్యం వల్ల కలిగే విపత్తులను నివారించేందుకు, డ్యామ్‌లను సమర్థవంతంగా పర్యవేక్షించడం, తనిఖీచేయడం నిర్వహించడం, రక్షణచర్యలు తీసుకోవడం ద్వారా మానవ జీవనం, ఆస్తి, పర్యావరణం రక్షించే శక్తివంతమైన ఒక ప్రాధికార సంస్థను స్థాపించడమే ఈ చట్టం వెనుక ఉన్న ప్రాధన్యత ఉద్దేశ్యం. ఎన్‌డిఎస్‌ఎ చట్టం ప్రకారం 17 ఫిబ్రవరి 2022లోనే డ్యామ్ భద్రతకు సంబంధించిన విధి విధానాలను మార్గదర్శకాలను డ్యామ్‌ల ప్రమాణాలు ఆచరించదగినవి రూపొందించారు. కాళేశ్వరంకోసం ఎన్‌డిఎస్‌ఎ వేసినకమిటీలో చంద్రశేఖర్ అయ్యర్‌తోపాటు అమితాబ్‌మీనా, బిమన్నా, యుఎస్ విద్యార్థి, రాహుల్ కమార్‌సింగ్, ఆర్‌జిపాటిల్, ఎస్‌కెశర్మ ఆర్ చిత్ర సభ్యులుగా ఉన్నారు. కాళేశ్వరం నిపుణులు సూచించిన ఏ పని తెలంగాణ నీటిపారుదలశాఖ చేపట్టక పోగా ప్రాజెక్టుస్థలాల్లో గ్రౌటింగ్ చేసి వాస్తవాలు వెల్లడికాకుండా తాత్కాలికంగా క్షేత్రస్థాయిలో భూభౌతిక పరిస్థితి అధ్యయనం చేయకుండా అడ్డంకులు సృష్టించారు.

# అధ్యయనం శూన్యం..ఆరాటం ఘనం

**భాగ్యనగర్ భాస్కర్ కుమార్**

సాగరమున్నా తీరనిది నీ దాహమురా..... కోకిలగానం కాకిపాడితే ద్రోహమురా" ఆచార్య ఆత్రేయ అన్నట్లు గోదావరి, కృష్ణా వాటి ఉపనదుల జలరాశుల పరవళ్లు తొక్కే తెలంగాణ గడ్డపై ఉన్న ప్రజలకు గొంతు తడుపుకోని పరిస్థితి దాపురించింది.. కాంట్రాక్టు సొమ్ముల కోసం లోపభూయిష్ఠ నిర్మాణాలు చేపట్టిన నీటిపారుదల శాఖ ఇంజినీర్లు ఎసిబి కేసుల్లో ఇరుక్కొనే సంకట పరిస్థితి నెలకొంది. పిసిఘోష్ నివేదిక వెలువడితే కాళేశ్వరం ఇఎన్‌సి హరీరామ్ బాటలో ఐఎఎస్‌లు, ఇంజనీర్లు కటకటాల వెనుకకుపోయే ప్రమాదం కూడా ఉంది. కాళేశ్వరం లిఫ్ట్‌ఇరిగేషన్ పథకం వైఫల్యంపై జాతీయ ఆనకట్టల ప్రాధికారసంస్థ తుదినివేదిక ఇచ్చిన తరువాత వాస్తవాలు మరుగునపడేందుకు తెలంగాణ వ్యాప్తంగా జరుగుతున్న వాదోపవాదాలతో రాజకీయలు వేడెక్కినాయి. తెలంగాణ నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాళేశ్వరం కూలిన పాపం ముమ్మాటికి బిఆర్‌ఎస్‌దే అని నిందించారు. రోడ్లు భవనాలుశాఖ మంత్రి కొమటిరెడ్డి వెంకటరెడ్డి ఒకడుగు ముందుకు వేసి "బుద్ది ఉన్నోడు మళ్ళీ కాళేశ్వరం మరమ్మతు కోరడు" అంటూ ఖరాఖండిగా ఆ ప్రాజెక్టు తెల్లఏనుగు అని సంకేతం ప్రజలకు ఇచ్చారు. బిఆర్‌ఎస్ నాయకుడు కాళేశ్వరం నిర్మాణ సమయంలో నీటిపారుదలశాఖ మంత్రిగా వ్యవహరించినా హరీష్‌రావు తుమ్మడిహట్టి వద్ద ప్రాజెక్టు కట్టుకోవడానికి ఒప్పందంలేదు, డిపిఆర్‌లేదు, కానీ టెండర్లు పిలిచింద్రు ఎక్కడో పోయి చేవెళ్ళ కాడ తవ్వుతరు, మెదక్ జిల్లా సిద్ధిపేట వద్ద తవ్విండ్రుఅసలు తుమ్మడిహట్టి వద్ద ఒక్క తట్టెడు మట్టి ఎత్తిపోయలేదుకాంగ్రెస్ తప్పుచేసింది అంటూ కాంగ్రెస్‌ను నిందిస్తారు. మీరు చేసిన తప్పును సవరించడానికి మేం కాళేశ్వరంతో ప్రయత్నం చేశాం. తుమ్మడిహట్టి వద్ద వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 17డిసెంబర్ 2008 లో ప్రాణహిత చేవెళ్లకు శంకుస్థాపన చేశారు. 2007లోనే అంతకు ముందే టెండర్లు పిలిచారు కూడా, నాలుగేళ్లలో ప్రాణహిత చేవెళ్ల పూర్తి చేస్తామని ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ ప్రకటించారు. కానీ ఏడేళ్ల అధికారంలో ఉన్నా మహారాష్ట్రలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నా కనీసం రెండు ప్రభుత్వాలు కలిసి అంతరాష్ట్ర ఒప్పందం చేసుకోలేదు. 2012 నాటికి ఆనాటినప్రభుత్వం తుమ్మడిహట్టి ప్రాజెక్టు నిర్మించక పోగా సర్వేఅండ్ మోబిలైజేషన్ అడ్వాన్స్‌ల పేరుతో రూ. 1426 కోట్లు పనిచేయకుండానే అడ్వాన్సులు కాంట్రాక్టరుకు నిధులు ముట్టజెప్పారు. ఆ నాలుగు ఏళ్లలో భూసేకరణ వంటి పనికోసం రూ.160కోట్లు వ్యయం చేశారు. ఆ దోపిడిలో నేటి నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆనాటి నీటి




పారుదలశాఖ మంత్రి సుదర్శన్‌రెడ్డిలు కూడా బాధ్యులే అంటూ హరీష్‌రావు ఆరోపిస్తూ రంగంలోకి దిగారు. తుమ్మడిహట్టిలో 160 టిఎంసిల నీరులభ్యత కాదని సిడబ్ల్యుసి ఇచ్చిన నివేదిక ఆధారంగానే కాళేశ్వరం ప్రతిపాదించామని ఇది కేంద్ర ప్రభుత్వ సంస్థ వ్యాప్కోస్ సూచించిన స్థలమే అంటూ హరీష్‌రావు వాదిస్తున్నారు. తుమ్మడిహట్టి వద్ద కడితే కాంగ్రెస్‌కు పేరు ప్రతిష్టలు వస్తాయని కేవలం కీర్తి కండూతి, కాంట్రాక్టర్ల నుంచి డబ్బులు దండుకోవడానికి బిఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టు సైట్ మార్చినట్లు కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నుంచి మొదలు బూత్‌లెవల్ కాంగ్రెస్ కార్యకర్తలు విమర్శిస్తున్నారు. కాళేశ్వరం నిర్మాణ లోపాలను ఎన్‌డిఎస్, విజిలెన్స్ నివేదికలు తప్పుపట్టాయి. ఎల్‌అండ్ టి సంస్థ మేడిగడ్డ లోపాలను పునరుద్దరణ చేయాలని కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్‌ప్రాజెక్టు నిర్మాణంలో భారీగానే అక్రమాలు జరిగాయని విజిలెన్స్ విచారణకు నివేదికలో పేర్కొంది. ఇటీవల ఎన్‌డిఎస్ ఇచ్చిన తుది నివేదిక కూడా "భారీ ప్రాజెక్టుల నిర్మాణాలకు థర్డ్‌పార్టీతో ఆడిట్ చేయించాలన్న నిబంధన ఉండగా అది అమలుకాలేదు. నీటిపారుదలశాఖ, నిర్మాణసంస్థ మినహా మరోపక్షంతో మదింపు చేయించి ఉంటేలోపాలను ఆదిలోనే పసిగట్టే వీలుండేది. నిర్మాణ సామగ్రి పరిమాణం.. నాణ్యత ప్రమాణాల మేరకు వినియోగిస్తున్నారా.. అవి మన్నుతాయా లేదా అనే పరీక్షలను థర్డ్ పార్టీతో చేయించలేదు. క్వాలిటీ కంట్రోల్ విభాగం చీఫ్ ఇంజినీర్ నేతృత్వంలో ఈప్రక్రియ జరగాల్సి ఉండగా అమలు చేయలేదు. నిర్మాణ ప్రారంభం నుంచి చివరివరకు ఎలైన్మెంట్, కోరింగ్ చేసే సమయంలో లోపాలున్నాయా అని క్వాలిటీ కంట్రోల్ ఇంజినీర్లు పర్యవేక్షించాల్సి ఉంది. కానీ, పని ప్రాంతాలను పరిశీలించకుండానే ధ్రువీకరించినట్లు అవగతమవుతోంది" అంటూ నివేదించింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల మూడు బ్యారేజీలు పెను ప్రమాదంలో ఉన్నాయని జాతీయ ఆనకట్టల భద్రతా ప్రాధికార సంస్థ స్పష్టం చేసింది. ఇక ఆ బ్యారేజీలు యథాతథంగా నిరుపయోగమే అన్నరీతిలో నివేదికలోని అంశాలున్నాయి. ఈ బ్యారేజీలకు జరిగిన విస్తృత, పెను నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని...సమగ్ర పునర్‌నిర్మాణం, రీడిజైన్ చేయాలని పేర్కొంది. నిర్మాణ లోపాలు, డిజైన్ లోపాలు, నాణ్యత తనిఖీ లేకపోవడం, నీటి ఒత్తిడి ఎంత అన్నదానిపై తప్పుడు అంచనాలు. అన్నీకలిసి సీకెంట్ పైల్స్ కూలిపోవడం, బ్యారేజ్ ఎగువ, దిగువల్లో రంధ్రాలు పడ్డాయనితేల్చింది. మూడు బ్యారేజీలకు విస్తృత, పెను నష్టం జరిగిందని పేర్కొంది. ఈ నష్టం ఇక్కడితోనే ఆగదని, నీటి ఒత్తిడి ఎక్కువైతే మొత్తం పూర్తి బ్యారేజీలకే ప్రమాదమని పేర్కొంది. మూడు బ్యారేజీల్లోని ప్రతి ఒక్కటి ఈ ప్రమాదపుటంచులో ఉంటాయని తెలిపింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు దెబ్బతిన్న నేపథ్యంలో ఏం చేయాలన్న దానిపై ఎన్‌డీఎస్‌ఎ నివేదిక ఇవ్వాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం గతంలో కోరిన సంగతి తెలిసిందే. పలు పరీక్షలు చేసిన అనంతరం, దాదాపు 14 నెలల అధ్యయనం తర్వాత ఎన్‌డీఎస్‌ఎ తన నివేదికను గురువారం రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి పంపించింది. నివేదికలో అనేక కీలక సిఫార్సులు చేసింది. సమగ్ర పునర్ నిర్మాణ డిజైన్ చేయాలని, జియో ఫిజికల్ పరీక్షలు, జియో టెక్నికల్ పరీక్షలు చేసి, ఆధునిక హైడ్రాలిక్ నమూనాలు(నీటి ప్రవాహ ఒత్తిడికి సంబంధించిన నమూనాలు)ను ఉపయోగించి ఈ పునర్ నిర్మాణ రీడిజైన్ చేయాలని చెప్పింది. కాళేశ్వరం ప్రాజెక్టుస్థిరత్వం, స్థితిస్థాపకతను నిర్ధారించేందుకు... అన్ని విభాగాల మధ్య సహకారం చాలా కీలకమని స్పష్టం చేసింది. నిర్మాణ సమయంలో నాణ్యతను తనిఖీ చేసే మంచి వ్యవస్థ లేదని, ప్రత్యేకించి కటాఫ్ గోడలు నీటి ఒత్తిడిని తట్టుకునేలా నిర్మించలేదని తెలిపింది. ర్యాఫ్ట్‌కు, కటాఫ్ వాల్స్‌కు నేరుగా సంబంధం ఉందని చెప్పింది. బ్యారేజీలు దెబ్బతినడానికి ఈ రెండూ ప్రధాన కారణాలని తెలిపింది. బ్యారేజీపై అదే ఒత్తిడి పడితే మొత్తం బ్యారేజీ అంతా ప్రమాదంలో పడుతుందని వెల్లడించింది. మిగతా రెండు బ్యారేజీల పరిస్థితి కూడా అదే విధంగా ఉన్నట్లు తెలిపింది. "బ్యారేజీల నిర్మాణం చేయడానికి నిర్మాణ ప్రదేశాల్లో భూసా రం తెలుసుకోవడానికి తగిన పరీక్షలు చేయాలి. అయితే అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను ఒకచోట ప్రతిపాదించి, మరో చోటికి మార్చారు. ఈక్రమంలో భూభౌతిక, భూసాంకేతిక పరీక్షలు చేయకుండానే నిర్మాణం చేపట్టారు. ప్రాజెక్టుల డీపీఆర్‌కు అనుమతి రాకముందే నిర్మాణం చేపట్టారు" అని నివేదిక ఆక్షేపించింది. "జాతీయ ఆనకట్టల భద్రత చట్టం2021 ప్రకారం వానాకాలానికి ముందు, తర్వాత బ్యారేజీలు ఏ విధంగా ఉన్నాయనే దాన్ని పరిశీలించాలి. 2022 వరదల కన్నా ముందు, తర్వాత బ్యారేజీలు ఏ విధంగా ఉన్నాయనే దాన్ని పరిశీలించలేదు. నిబంధనల ప్రకారం ఈ రిపోర్టులు తయారుచేసే బాధ్యత డ్యామ్ ఓనర్‌దే(మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల చీఫ్ ఇంజనీర్). అయితే డ్యామ్ సేఫ్టీ చట్టం ప్రకారం బ్యారేజీలను పరిశీలించనే లేదు. మూడు బ్యారేజీల్లోనూ హైడ్రో మెకానికల్ లోపాలున్నాయి" అని నివేదిక గుర్తు చేసింది. ●

# స్వర్గమా .. నరకమా?

**ఎ.వి.వి ప్రసాద్**

జమ్ము కాశ్మీర్

నిన్నటిదాకా భూతల స్వర్గమే.. ఇప్పుడదే నరక కూపమైపోయింది. పహల్గాం ఊచకోత ఘటనతో మొత్తం జమ్ముకాశ్మీర్ అంతా గత పన్నెండు రోజులుగా వణికిపోతూనే ఉంది. సరిహద్దు ప్రాంతాల్లోని ప్రజలైతే ప్రాణాలు అరచేత పట్టుకుని దిక్కుతోచిన వైపు పరుగులు తీస్తున్నారు. కాశ్మీరీయులకు ఉగ్రదాడులు కొత్త కాకపోవచ్చు కానీ.. ఏప్రిల్ 22న జరిగిన ఘటన మాత్రం అత్యంత భయానకమైనదే. కాశ్మీర్ అందాలను చూసి పరవశించేవారందరు మళ్లీ ఇదేం ఘోరం అంటూ విస్తుపోతున్నారు. ఎందుకంటే.. అప్పుడప్పుడు చిన్నచిన్న దాడులు మినహా జమ్ము కాశ్మీర్లో కొంతకాలం నుంచి పరిస్థితులు ప్రశాంతంగానే ఉంటున్నాయి. ముఖ్యంగా 370 అధికరణం రద్దు, కొద్ది నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాజకీయ, సామాజిక పరిస్థితుల్లో చాలా మార్పు వచ్చింది. పహల్గాంలోని సుందరమైన లోయల్లో విహరించడానికి నిత్యం వందలు, వేలమందిపర్యాటకులు వస్తూంటారు. అటువంటి ఆహ్లాదకరమైన వాతావరణంలో 26 మందిని బలిగొంటూ చిందిన రక్తం చూసిప్రపంచమే నివ్వెరపోయింది. ప్రజా ప్రభుత్వం పగ్గాలు చేపట్టడంతో తమకు ఇక ఎలాంటి ప్రమాదం రాబోదనే అంతా భావించారు. ముఖ్యంగా సరిహద్దు గ్రామాల ప్రజలు కూడా నిశ్చింతగా కాలం గడుపుతున్నారు. కాశ్మీర్లో అభివృద్ధి కార్యక్రమాలు కూడా ఊపందుకున్నాయి. దేశ, విదేశాల నుంచి వచ్చేపర్యాటకుల వరద కూడా పెరిగింది. రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరించాలనే డిమాండ్ మినహా రాజకీయ పార్టీలకు కూడా ఆందోళనలు చేసే అవకాశం తగ్గిపోయింది. అమర్నాథ్‌యాత్రకు అంతా సిద్ధమవుతున్న తరుణంలో సానుకూల వాతావరణాన్ని భగ్నం చేస్తూ ఉగ్రవాదులు ఏ 'లక్ష్యం'తో ఈ దాడి జరిపారన్నదే అందరి ప్రశ్నగా వినిపిస్తోంది. గతంలో కంటే అధికంగా ఉద్రిక్తతలు పెరిగిపోవడం అందరినీ మరింతగా భయకంపితులను చేస్తోంది. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులే ఈ దుశ్చర్యకు పాల్పడ్డారన్న విషయం నిర్ధారణకావడంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింతగా పెరిగిపోయాయి. పర్యవసానంగా భారత్ ప్రభుత్వం పాక్‌తో గల సింధు జలాల పంపిణీ ఒప్పందాన్ని సస్పెండ్ చేసిన తర్వాత ఉభయ దేశాల మధ్య పరిస్థితి మరింత ఉద్రిక్తమైంది. సరిహద్దు ప్రాంతాలనుంచే గాక మొత్తం రాష్ట్రమంతా ప్రజలు భీతావహులై మూటాముల్లె సర్దుకుని ఇతరరాష్ట్రాలకు తరలిపోతుండడంతో ప్రభుత్వానికి ఇదో కొత్త సమస్యగా మారింది. నేడో, రేపో పాక్‌తో యుద్ధం తప్పదనే అనుమానం అందరిలో బలపడడంతో అది ప్రజలలో అభద్రతా వాతావరణాన్ని పెంచుతోంది.



పహల్గాం దాడి


నియంత్రణ రేఖ వెంబడి ప్రతిరోజు కాల్పులు జరుగుతూండడంతో అక్కడి గ్రామాలన్నీ దాదాపు ఖాళీ అయినట్లు సమాచారం. దాడి జరిపిన ఉగ్రవాదులు ఇంకా కాశ్మీర్ లోనే ఉన్నారని అధికారులు ప్రకటించడం, వారి కోసం జరుపుతున్న అన్వేషణలో సాధారణ ప్రజలు అనేకరకాలుగా వేధింపులకు గురి కావడంతో 'అశాంతి' అధికమైవారు ఇతరప్రాంతాలకు తరలిపోవడానికి దారితీస్తోంది. తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో కాశ్మీర్‌లోని 48 పర్యాటక ప్రదేశాలను మూసివేయడంతో కొన్ని వేలకుటుంబాలు ఉపాధిని సైతం కోల్పోయాయి. దానితో వారు కూడా ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నారు. పరిస్థితి మెరుగుపడిన తర్వాత ఆ పర్యాటక కేంద్రాలను పునఃప్రారంభించినా ఆ రంగం కోలుకోవడానికి చాలాకాలమే పట్టవచ్చు. కాశ్మీర్ ప్రభుత్వానికి పర్యాటక పరిశ్రమ ద్వారానే అధిక ఆదాయం లభిస్తూంటుంది. ఇప్పుడు ఈ పరిశ్రమ సంక్షోభంలో పడడంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కూడా కుదేలయ్యే ప్రమాదం ఉంది. ప్రస్తుతానికైతే భారత్ పాక్ మధ్య ఉద్రిక్తతలు గరిష్ట స్థాయికి చేరుకున్నాయనే చెప్పాలి. దేశంలోని పాక్ జాతీయులను వెనక్కి పంపే చర్యలు కూడా సాగుతున్నాయి. పాక్ కూడా అటువంటి చర్యలే తీసుకొంటోంది. కానీ అటారీ వాఘా సరిహద్దు వద్ద నెలకొన్న ప్రతిష్టంభన చూస్తే పాక్ ఎంత అమానుషంగా వ్యవహరిస్తున్నదో అర్థమవుతుంది. పాకిస్థానీల వీసాల రద్దు నిర్ణయం తర్వాత భారత్ నుంచి దాదాపు వెయ్యి మంది పాక్ దేశస్థులు వెళ్లిపోయారు. ఈప్రక్రియ జరుగుతుండగా గత గురువారం పాక్ హఠాత్తుగా తమ కౌంటర్లను మూసివేసి 'నో ఎంట్రీ' బోర్డులు పెట్టడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. గత నాలుగు రోజులుగా అక్కడ ఆ ప్రతిష్టంభన కొనసాగుతూనే ఉంది. పాక్‌కు చెందిన అన్ని రకాల విమానాలకు గగన తలాన్ని మూసివేస్తూ భారత్ నిర్ణయించడంతో పర్యాటకులకు దిక్కుతోచని పరిస్థితి ఎదురవుతోంది. అలాగే పాక్ కూడా భారత్ విమానాలకు తమ గగనతలాన్ని మూసివేసింది. దీనితో పాక్‌నుంచి దక్షిణాసియా, ఆగ్నేయాసియా దేశాలకు వెళ్లే విమానాలు చైనా లేదా శ్రీలంక మీదుగా చుట్టు తిరిగి వెళ్తాండడంతో అది మరో కొత్త సమస్యగా మారింది. పాక్ సైనికులు భారత్ భూభాగంలోకి కాల్పులు జరపడం ఎక్కువ కావడంతో వాటిని నియంత్రించడానికి ఏ చర్యలు తీసుకొంటున్నారనేది అర్థంకాకుండా ఉంది. ఆ కాల్పుల వల్ల ఎంతో ప్రాణనష్టం జరుగుతున్నా ఇప్పుడు దానిని పట్టించుకొనే వారే కనిపించడం లేదు. ఉభయదేశాల నుంచి వరుసగా వినిపిస్తున్న ప్రతీకార ప్రకటనలు మినహా ఉద్రిక్తతలు తగ్గించే చర్యలే లేవు. ఇది మరింత విచారకరమైనఅంశం. ఉగ్రవాదులను పట్టుకొనే క్రమంలో సాధారణ ప్రజల ఇబ్బందులను పట్టించుకొనక పోవడం కూడా విచారించవలసిన విషయమే. కాశ్మీర్ లోనే మాటువేసి ఉన్న ఉగ్రవాదులను పదిరోజులు దాటినా కనుగొనలేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. వారిని ఏరివేసే కార్యక్రమాన్ని తొలుత ముమ్మరం చేయాలి. శాంతి భద్రతల పునరుద్ధరణే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడి వ్యూహంతో కదలాలి. ప్రజల ప్రాణాలను ప్రభుత్వాలు కాపాడగలిగినప్పుడే కాశ్మీర్ మళ్లీ స్వర్గ ధామమవుతుంది. ●

# భయంగుప్పెట్లో 'లష్కరే చీఫ్'!

**గన్ని మోహన్**

పాకిస్థాన్

ఉగ్రదాడులతో భారత్‌కునిత్యం కంట్లో నలుసుగా మారిన లష్కరే తాయిబా చీఫ్ హఫీజ్ సయీద్‌కు భయం అంటే ఇప్పుడు తెలిసొచ్చింది. హఫీజ్‌ను అరెస్టు చేసామని, ప్రస్తుతం జైలులో ఉన్నాడని పాకిస్థాన్‌ప్రభుత్వం వెనకేసుకు వస్తున్నా అతడు ఉంటున్న ఇంటినే సబ్‌జైలుగా మార్చేసి, పాకిస్థాన్ ఆర్మీ భద్రతను పెంచింది. నిత్యం భారత్‌పై అక్కసు వెళ్లగక్కే హఫీజ్ కనుసన్నల్లోనే పహల్గాంవ్ ఉగ్రదాడి జరిగిందని దేశ అత్యున్నత దర్యాప్తు సంస్థఎన్‌ఐఎ స్పష్టంచేసిన నేపథ్యంలో పాకిస్థాన్‌కు ఎటుచూసినా వెన్నులో వణుకుపుడుతోంది. సాయం కోసం గల్ఫ్, అరబ్ దేశాలను అర్థిస్తోంది. ఆర్థికంగా కూడా ఏకాకినిచేసే కార్యాచరణలో భారత్ నిమగ్నం కావడం, ఇప్పటికే గగనతలం మూసివేత, సరిహద్దులు మూసివేత, అత్యత కీలకమైన సింధూజలాలను నిలిపివేయడం వంటివాటితో పాకిస్థాన్‌కు కష్టం, నష్టం అంటే ఏమిటో తెలియజెప్పింది. ఇదే క్రమంలో పాకిస్థాన్‌లోనే స్థిరనివాసం ఏర్పరుచుకున్న లష్కరే తాయిబా చీఫ్ హఫీజ్ సయీద్‌కు పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారీఎత్తున బందోబస్తు ఏర్పాటుచేసింది. కిలోమీటరు దూరంలో హైరిజల్యూషన్ కెమెరాలు ఏర్పాటు చేసింది. ఐఎస్‌ఐ చీఫ్ పర్యవేక్షణలో హఫీజ్‌కు భద్రత కొనసాగుతోంది. ఎస్‌ఎస్‌జి కమాండోలు, పాకిస్థాన్ రేంజర్స్ వంటి సాయుధ బందోబస్తు మధ్య హఫీజ్ పాకిస్థాన్‌లోనే ఉంటున్నాడు. ముంబయి దాడుల సూత్రధారి అయిన లష్కరే చీఫ్‌ను ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి నిషేధిత ఉగ్రవాదుల జాబితాలో చేర్చిన సంగతి తెలిసిందే. అటు అమెరికా కూడా మోస్ట్ వాంటెడ్ అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది. బ్రిటన్ ఇతర యూరోపియన్ దేశాలు కూడా అదేక్రమంలో హఫీజ్‌ను నిషేధిత జాబితాలో చేర్చి మోస్ట్ వాంటెడ్‌గా పేర్కొన్నాయి. ఉగ్రవాదులు, ఉగ్రవాద స్థావరాలకు ఆశ్రయం కల్పిస్తున్న పాకిస్థాన్ ఎట్టకేలకు తాము తప్పుచేసామని ఉగ్రవాదులతో సంబంధాలున్న మాట నిజమేనంటూ అటు రక్షణమంత్రి, ఇటు విదేశాంగ మంత్రులు సైతం అంగీకరించిన క్రమంలోహఫీజ్‌ను అప్పగించే క్రమంలో మాత్రం ససేమిరా అంటున్నాయి. మేమే విచారణచేసి చర్యలు తీసుకుంటామని చెపుతూ వచ్చిన పాక్ అతడి ఇంటినే జైలుగా మార్చి అదే జైలు అని ప్రపంచాన్ని నమ్మిస్తోంది. ఈక్రమంలో హఫీజ్ పేరుకు జమాత్ ఉద్‌దవా అనే సంస్థను స్థాపించి సామాజిక సేవాసంస్థగా కార్యకలాపాలు సాగిస్తూ వాటి ముసుగులోనే ఉగ్రవాదాన్ని రెచ్చగొడుతున్నట్లు భారత నిఘా సంస్థలుసైతం పసిగట్టిన సంగతి తెలిసిందే. ఫలాహ్ ఎ ఇన్సానియత్ ఫౌండేషన్, అల్‌మదీనా, ఐసర్ ఫౌండేషన్ వంటివి ప్రపంచ ఆంక్షల నుంచి తప్పించుకోడానికి హఫీజ్‌కు ముసుగుగా ఉపయోగపడుతున్నాయి.



హాఫీజ్ సయీద్


లష్కరే రాజకీయ సంస్థ మిల్లీ ముస్లింలీగ్‌ని అమెరికా ఇప్పటికే నిషేధించింది. అయినా కూడా పాక్ రాజకీయాలను ప్రభావితంచేసే సంస్థగా మిల్లీ ముస్లిం లీగ్ పనిచేస్తోంది. ఇక లష్కరేకు ఆర్థికంగా వెన్నుదన్నుగా జమాత్ ఇ ఇస్లామి హవాలా నెట్‌వర్క్ పనిచేస్తోంది. భారత్‌తోపాటు దక్షిణాసియాలో రహస్య మార్గాలద్వారా నిధులను బదలీచేస్తుంది. ఉగ్రవాదులకు లాజిస్టిక్, ఆయుధాల సేకరణ, స్లీపర్‌సెల్స్‌కి డబ్బులు ఇచ్చే ఆర్థిక లావాదేవీలు భారీ ఎత్తున సాగిస్తోంది. వీటన్నింటినీ కూడా భారత్ నిఘా సంస్థలు సత్వరమే గుర్తించాయి. లష్కరే తాయిబా లాగే జైష్‌మహ్మద్‌కు కూడా ఇలాంటి నెట్‌వర్క్ ఉన్నట్లు భారత నిఘా ఏజెన్సీలు పసిగట్టాయి. ఇక హఫీజ్‌కు భారీభద్రతను కల్పించిందంటే పహల్గాంవ్ దాడి సూత్రధారి అని నిర్ధారణ అయింది. అందువల్లనే ఏ నిమిషంలో అయినాసరే హఫీజ్ ప్రాణాలకు ముప్పు ఉంటుందన్న సందేహాలు పాక్‌ను చుట్టుముడుతున్నాయి. అందువల్లనే ఆతడి రక్షణ బాధ్యతను కూడా షెహబాజ్‌షరీఫ్ సర్కారు చేపట్టింది. కిలో మీటరు దూరం వరకూ ఆతని ఇంటిమీదుగా ఎలాంటి రాకపోకలు సాగించేందుకు వీలులేని పటిష్టమైన భద్రతా వలయాన్ని సృష్టించింది. హఫీజ్ ఇంటి పరిసరాల్లో డ్రోన్ల కదలికలుకూడా నిషేధించారు. లష్కరే అనుబంధంగా పనిచేస్తున్నది రెసిస్టెన్స్ ఫ్రంట్ ఈపహల్గాంవ్ ఉగ్రదాడి చేసిందని తేల్చిన ఎన్‌ఐఎ ఇపుడు హఫీజ్, ఈ అనుబంధసంస్థ కార్యకలాపాలపైనే ఫోకస్ పెంచింది. ఏ నిమిషంలో ఏరూపంలో భారత్ తమపైకి వస్తుందో అన్న భయంలో అల్లాడుతున్న పాకిస్థాన్‌కు ఇప్పుడు తమ దేశంలో ఆశ్రయం పొందుతున్న కీలక ఉగ్రనెట్‌వర్క్‌ల చీఫ్‌లను కూడా రక్షించుకోవడం ప్రధాన బాధ్యతగా మారింది. అయితే ఇప్పటివరకూ కాశ్మీర్ భూభాగమే ప్రధాన అజెండాగా కొనసాగించిన ఈ లష్కరే చీఫ్ ఎంతోమంది ముష్కరులను తయారుచేసి భారత్‌పైకి వదిలాడు. జమ్ము కాశ్మీర్‌లోనే నిరుద్యోగ యువతను ఆకర్షించి వారిని సుశిక్షితులైన లష్కరే కమాండర్లుగా మార్చేస్తున్నట్లు కూడా దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. దీనికితోడు పాకిస్థాన్ ఐఎస్‌ఐ, ఆర్మీలు కూడా చొరబాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తుండటం వల్లనే భారత్‌లోకి చొరబడి భీభత్సం సృష్టిస్తున్నారు. పార్లమెంటుపై దాడి, ముంబయి ఉగ్రదాడులు వంటి వాటితో ప్రపంచానికి తెలిసిన హఫీజ్‌కు భారీ భద్రతను ఏర్పాటు చేయడం ద్వారా ఆ చీఫ్‌కు భయం అంటే ఏమిటో తెలిసొచ్చేలా చేసింది భారత్. అనుక్షణం భయం గుప్పిట్లో బతుకుతున్న ఈ లష్కరేచీఫ్‌ను కాపాడుకోవడం పాకిస్థాన్‌కు కూడా రానున్నకాలంలో శిరోభారం అవుతుందనే చెప్పాలి. ఉగ్రవాద నిర్మూలనలో భారత్‌కు సహకరించాలని అమెరికా కూడా పదేపదే చెపుతూ వస్తోంది. ఈక్రమంలో పాక్‌కు ఇప్పుడు చైనా, రష్యా, గల్ఫ్‌దేశాల సాయం అనివార్యం అవుతోంది. అలాగే తూర్పున ఉన్న బంగ్లాదేశ్‌తో చెట్టాపట్టాల్ వేసుకుని తిరుగుతున్న సంగతి తెలిసిందే. ఇవన్నీ ఒక ఎత్తయితే తన ఛాందసవాద ఉగ్రవాదంతో నిత్యం భారత్‌కు కంట్లో నలుసుగా మారిన హఫీజ్‌కు పహల్గాంవ్ ఉగ్రదాడితో ప్రాణభయం వెంటాడుతోందన్నది మాత్రం నగ్నసత్యం. ●

# హక్కులను ఉల్లంఘిస్తున్న ట్రంప్ నియంతృత్వ ధోరణులు



**డా॥ కత్తి పద్మారావు**

అమెరికా సామ్రాజ్యవాదం ప్రపంచాన్ని వణికిస్తుంది. ట్రంపు పరిపాలనా వ్యవస్థలో అమెరికాలో కూడా తిరుగుబాటు ప్రారంభమైంది. తిరుగుబాటును అణచడానికి డొనాల్డ్ ట్రంపు నియంతగా వ్యవహరిస్తున్నారు. ట్రంపు నియంతృత్వానికి అమెరికాలో కూడా తిరుగుబాట్లు ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా అమెరికా నియంత సామ్రాజ్యవాది ఇతర దేశాలపై అతిగా పన్నులు విధించి దగ్గర దగ్గర విదేశీ వస్తు బహిష్కరణకు పాల్పడుతూ చైనాపై తీవ్రమైన పన్నులు విధిస్తూ భారతదేశ మేధో సంపన్నతను అడ్డుకుంటున్న డొనాల్డ్ ట్రంప్ విధానాలు ప్రపంచంలో మళ్లీ హిట్లర్ను గుర్తు చేస్తున్నాయి. నిజానికి ఇటీవల జరిగిన సంఘటన మానవ హక్కులపై ట్రంపుచేస్తున్న దాడిగా అభివర్ణిస్తున్నాయి. మానవ హక్కులను, పౌర హక్కులను ట్రంప్ తన నియంతృత్వ ధోరణిలో ఉక్కుపాదం మోపుతున్నాడు. పాలస్తీనాకు మద్దతుగా అమెరికాలో ప్రదర్శననిర్వహించిన కొలంబియా విశ్వవిద్యాలయ విద్యార్థి మహమూద్ ఖలీలను అధికారులు నిర్బంధించారు. పశ్చిమాసియాలో శరణార్థుల తోడ్పాటు కోసం ఏర్పాటైన ఐరాస సహాయ పునరావాస కార్యకలాపాల సంస్థ (యూఎస్‌ఆర్డబ్ల్యూఏ)తో తన అనుబంధాన్ని దాచి ఉంచారనే కారణంతో అతనిపై ఈ చర్య తీసుకున్నారు. యూఎస్‌ఆర్ డబ్ల్యూఏ సిబ్బంది కొందరు హమాస్ కోసం పని చేస్తున్నారంటూ ఇజ్రాయెల్ ఆ సంస్థను నిషేధించింది. రంజనీ శ్రీనివాసన్ న్యూయార్క్‌లోని కొలంబియా విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థిని. పాలస్తీనా అనుకూల ప్రదర్శనల్లో పాల్గొన్నారనే నెపంతో ఆమె విద్యార్థి వీసాను రద్దు చేశారు. దీంతో విశ్వవిద్యాలయం ఆమె అడ్మిషన్‌ను ఉపసంహరించింది. రంజనీని వెనక్కిపంపారు. అమెరికాలో నివసించడానికి, చదువుకోడానికి వీసా పొందడం ఒక గొప్ప గౌరవమని... హింసకు, టెర్రరిజానికి అనుకూలంగా వాదించేవారు ఆ గౌరవంపొందే అర్హత కోల్పోతారని అమెరికా హోమ్ల్యాండ్ సెక్యూరిటీ విభాగానికి చెందిన ఒక అధికారి వ్యాఖ్యానించారు. మరో ప్రక్క ట్రంప్ భారతదేశం మీద చైనా మీద విపరీతమైన ద్వేషాన్ని ప్రకటిస్తున్నాడు. నిజానికి ఇండియా అమెరికాల వాణిజ్య భాగస్వామ్యం ఈనాటిది కాదు. అది దశాబ్దాలుగా జరుగుతుంది. ఒకనాడు అమెరికా స్వేచ్ఛకు, స్వాతంత్ర్యానికి, సౌభ్రాతృత్వానికి ఆదర్శంగా నిలిచింది. నిజానికి రెండు దేశాల మధ్య 202324లో సుమారు 119.7 బిలియన్ డాలర్ల వాణిజ్యం జరిగింది. ఈ కాలంలో అమెరికాకు ఇండియా 77.5 బిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులు చేసింది. ప్రపంచ దేశాలన్నింటికీ భారత్ చేస్తున్న ఎగుమతుల్లో ఇది 17.7శాతం. అమెరికా నుంచి భారత్‌కు వచ్చిన దిగుమతుల విలువ 42.1బిలియన్ డాలర్లు. ఇది భారత్‌కు వచ్చిన మొత్తందిగుమతుల్లో 6,2శాతం, భారత్‌కు అమెరికా నుంచి వస్తున్న దిగుమతుల కంటే మనదేశం అగ్రరాజ్యానికి చేస్తున్న ఎగుమతులే అధికం. దీనివల్ల అమెరికాతోఇండియా వాణిజ్య మిగులు సాధిస్తోంది. అమెరికా దిగుమతుల్లో 17శాతం చైనా నుంచి, 13శాతం కెనడా నుంచి, 14శాతం మెక్సికో నుంచి మూడు శాతం భారత్ నుండి వస్తున్నాయి. అమెరికాకు బాగా ఎగుమతి అవుతున్న ఆరు ఉత్పత్తుల్లో చైనాదే పైచేయి. భారత్ ఎగుమతుల వాటా తక్కువే. ఇండియా ప్రధానంగా ఇంజినీరింగ్ వస్తువులు, బంగారు ఆభరణాలు, రత్నాలు, ఔషధాలు, పెట్రోలియం ఉత్పత్తులను అమెరికాకు ఎగుమతి చేస్తోంది. ట్రంప్ విధించిన సుంకాలు రెండంకెల స్థాయిలో ఉన్నరత్నాలు, ఆభరణాలు, ఖనిజాలు, ఇంధనాలు, ఔషధాలు, ఇనుము, ఉక్కు, అణు రియాక్టర్లు, సేంద్రియ రసాయనాల ఎగుమతులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అలాగే నాలుగంకెల స్థాయిలోఉన్న వజ్రాలు, ఔషధాలు, పెట్రోలియం ఇంధనాలు, ఆభరణాలు, వాహన విడిభాగాలు, సముద్ర ఆహారం, మొబైల్ ఫోన్లు, వ్యవసాయ రసాయనాలు, జౌళి, ఏరోస్పేస్ పరికరాల ఎగుమతులు కూడా ఒక మోస్తరుగా సవాళ్లను ఎదుర్కొనే అవకాశం ఉంది. అమెరికాలో ట్రంప్‌కు వ్యతిరేకంగా



దేశవ్యాప్తంగా మానవ హక్కుల కోసం అంతర్గతంగాను, బహిర్గతంగాను జరుగుతున్న అణచివేతల మీదయువకులు, విద్యార్థులు మేధావులు ఆలోచనాపరులు, ప్రొఫెసర్లు వీళ్ళు అంతా కూడా ట్రంప్ పరిపాలనలోని ఆరాచకాలకు వ్యతిరేకంగా తీవ్రమైన పోరాటాలు చేస్తున్నట్లు వాషింగ్టన్ పత్రికలు తెలుపుతున్నాయి. తాజాగా అమెరికాలో రాజులు లేరు అన్న నినాదంతో ర్యాలీలు చేపట్టారు. బ్యానర్లు, ప్లకార్డులతో వేలాది మంది వీధుల్లోకి వచ్చారు. ట్రంప్ విధానాలతో ప్రజాస్వామ్యానికి ముప్పు అంటూ నినదించారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా సాగుతున్న ట్రంప్ పాలనతో ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫెడరల్ ప్రభుత్వంలో ఎలన్ మస్క్ పాత్రకు కొన్ని చోట్ల ఆందోళనలు నిర్వహించారు. కాగా, పౌర హక్కుల కార్మిక సంఘాలు, ఎల్జీబీటీక్యూ సంస్థలు, న్యాయవాద సంఘాలు, వృద్ధులు, ఎన్నికల సంస్కరణల సంఘ ఆధ్వర్యంలో 50 రాష్ట్రాల్లో హ్యాండ్సాఫ్ ఆందోళనల కొనసాగింపుగా తాజా నిరసనలు జరిగాయి. అమెరికా విధానాలు అమెరికాలోని మానవ హక్కులకే గాక అమెరికా రాజ్యాంగ సూత్రాలకే విఘాతం కలిగిస్తున్నాయనేది మనకు అర్థం అవుతుంది. నిజానికి ట్రంప్ హార్వర్డ్, కొలంబియా విశ్వవిద్యాలయాలపై నియంతృత్వ ఆంక్షలు విధించటమేగాక నిధులు కూడా ఆపే ప్రయత్నాన్ని ప్రపంచమంతా దుయ్యబడుతుంది. జాన్డ్యూయి వంటి మేధావి ఆవిర్భవించినటువంటి కొలంబియా విశ్వవిద్యాలయం డా॥ బి.ఆర్. అంబేద్కర్ వంటి భారతీయ మేధావులెందరో అధ్యయనం చేసిన కొలంబియా విశ్వవిద్యాలయం మీదే ఆంక్షలు విధించటాన్ని ప్రపంచ మేధావులు తప్పు పడుతున్నారు. ప్రపంచం మొత్తంగా జాన్ డ్యూయి ప్రజాస్వామ్య విధానాలను అనుసరిస్తున్న ఈ సందర్భంలో అమెరికాలోనే విద్యపై, జ్ఞానంపై దాడి జరగటం బాధాకరమైన విషయం. ఈ సందర్భంగా అమెరికా మేధావులు, పూర్వమంత్రులు ట్రంప్ విధానాలను దుయ్యబడుతున్నారు. గత సంవత్సరం అక్టోబర్ 7వ తేదీన ఇజ్రాయెలికి వ్యతిరేకంగా ఆందోళనలు ప్రారంభమైన తర్వాత కేంద్రంగా ఈ యూనివర్శిటీ పనిచేస్తోంది. ఈ యూనివర్శిటీకి గల 400 మిలియన్ డాలర్ల నిధులను ప్రభుత్వం స్తంభింపజేసింది. ఖలీ కొలింబియాలో చట్టపరంగానేనివసిస్తున్నాడు. అతడు ఇమ్మిగ్రేషన్ అధికారుల అదుపులో ఉన్నాడు. ఈ యూనివర్శిటీలో ఆందోళనలను నిర్వహించినందుకు అతడిని స్వదేశం పంపేందుకు ప్రభుత్వం రంగాన్ని సిద్ధం చేసింది. కొలంబియాలో నిరసన తెలిపేవారు ముఖాలకు ముసుగు వేసుకోరాదనీ, వారు తమ ముఖాలు కనిపించేట్టు ఉండాలనీ, అడిగినప్పుడు గుర్తింపు కార్డులను చూపాలని బీబీసీ పేర్కొంది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగానే తాము గత విద్యా సంవత్సరంలో ఎటువంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నామనీ, స్టాఫ్ సభ్యులు, విద్యార్థులు సురక్షితంగా ఉన్నారని తమ యూనివర్శిటీ ఆవరణ అంతా ప్రశాంతంగా ఉందని తాత్కాలిక అధ్యక్షుడు కట్టినా ఆర్మ్ స్ట్రాంగ్ ఈమెయిల్లో తెలియజేశారు. ఉన్నత విద్యా సంస్థల నిర్వహణలో ప్రభుత్వం జోక్యం చేసుకోవడం సముచితం కాదని ఆయన అన్నారు. ట్రంప్ ప్రభుత్వం ప్రిన్స్‌టన్ యూనివర్శిటీలో 210 మిలియన్ డాలర్ల రిసెర్చ్ గ్రాంట్లను నిలిపివేసినట్టు యాహూ. కామ్ వెల్లడించింది. ఇలాంటి బెదిరింపులు ఇతర యూనివర్శిటీలకు కూడా వస్తున్నాయి. భూతాపంపై పరిశోధనకు సంబంధించి నాలుగు మిలియన్ డాలర్ల నిధులను ప్రభుత్వం నిలిపివేసింది. ఈ యూనివర్శిటీ గత ఏడాది (2024లో) 455 మిలియన్ డాలర్ల నిధులను ప్రభుత్వం నుంచి స్వీకరించింది. అయితే, ట్రంప్ డిమాండ్లకు తాము తలొగ్గబోమని ఈస్గూబర్‌స్పష్టం చేశారు. ట్రంప్ ప్రభుత్వం తీరుతెన్నులు 1950వ దశకం తర్వాత దేశంలో యూనివర్శిటీల స్వేచ్ఛా నిర్వహణకు ముప్పుగా తయారయ్యాయని ఆయన అట్లాంటిక్‌లో రాసిన వ్యాసంలో పేర్కొన్నారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీ కూడా హార్వార్డ్ యూనివర్శిటికి మద్దతుగా నిలిచింది. ప్రపంచ దేశాలు అన్ని ట్రంప్ ఆదేశాలు ఏవిధంగా తమకు హాని చేస్తాయో అని భయపడుతున్నారు. ఈసందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా మానవ హక్కులపోరాటం సమైక్యంగా సముజ్వలంగా ప్రపంచ మానవాళి అంతా కలిసి చేయవలసిన చారిత్రక సందర్భం వచ్చింది. ప్రపంచం ఇటువంటి నియంతలను ఎంతోమందిని ఎదుర్కొని ముందుకువెళ్ళింది. ప్రపంచ చరిత్రను మార్చ గల్గినవారు ప్రపంచ మానవులే. ●

# అమరావతి వార్త

## మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే చదలవాడ



**నరసరావుపేట, మే 3 ప్రభాతవార్త :** శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు మానవత్వం చాటుకున్నారు. శనివారం పట్టణంలో పర్యటిస్తుం డగా ఫ్లైఓవర్ బ్రిడ్జిపై రోడ్డు ప్రమాదాన్ని గమనించారు. తన కారును, కాన్వాయ్‌ను ఆపి క్షతగాత్రుడిని పరామర్శించారు. ప్రాథమిక చికిత్స చేసి వెంటనే హాస్పటల్‌కు సమాచారం అందించారు. తన వాహనంలోనే దెబ్బలు తగిలిన వ్యక్తిని ఎక్కించు కొని హాస్పటల్‌కు తరలించారు. స్వయంగా వైద్యునిగా ఉన్న ఎమ్మెల్యే డాక్టర్ అరవింద్‌బాబు ప్రాథమిక చికిత్స నిర్వహించారు. శాసనసభ్యునిగా ఎంతో బిజీగా ఉండే ఆయన రోడ్డు ప్రమాదంపై స్పందించి క్షతగాత్రుడిని కాపాడిన తీరు పట్ల పలువురు ఎమ్మెల్యే అరవింద్‌బాబుకు అభినందనలు తెలిపారు.

## పడవను సీజ్ చేసిన అధికారులు

**అమరావతి, మే 3 ప్రభాతవార్త :** మండలంలోని గింజుపల్లి గ్రామంలో పడవ పాట పాడుకొని డబ్బులు కట్టకుండా తిప్పుతున్న పడవని శనివారం విజిలెన్స్ సి.ఐ. పాలేరు శివాజీ, విజిలెన్స్ ఎమ్మార్వో లక్ష్మిమాధవిలు మండల పంచాయితీ, రెవిన్యూ అధికారులు సమక్షంలో సీజ్ చేశారు. ఏప్రిల్ 2వతేదీన గుంటూరులోని జెడ్పీలో గింజుపల్లి టూ వేదాద్రి వరకు పడవ పాట నిర్వహించగా అచ్చంపేట గ్రామానికి చెందిన రాయిడి శ్రీనివాసరావు రూ.14 లక్షలకు పాడుకొని రూ.1,32,000లు కట్టారు. ఇంకా రూ.12 లక్షల 68 వేలు కట్టి పడవ తిప్పాలి. అయినప్పటికీ రాయిడి శ్రీనివాసరావు డబ్బులు కట్టకుండా పడవ తిప్పుతుండగా అధికారులు సీజ్ చేశారు.



# నేడు నీట్ పరీక్ష

## ఒక్క నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

**గుంటూరు విద్య,మే 3,ప్రభాతవార్త :** దేశవ్యాప_ంగా నిర్వహించ బడుతున్న నీట్ యూజి 2025 (నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్) పరీక్ష 2025 మే 4వ తేది,ఆదివారం మధ్యాహ్నం 2.00నుండి 5.00వరకు జరగనుంది.ఈ పరీక్షను ప్రశాంతంగా పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు గుంటూరు జిల్లా యంత్రాంగం అన్ని




నీట్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఆర్ఓ,డిఈఓ,తదితరులు

ఏర్పాట్లు పూర్తి చేసింది.గుంటూరు జిల్లాలో మొత్తం 4250మంది అభ్యర్థులు ఈ పరీక్షను 16పరీక్షా కేంద్రాల్లో నిర్వహిసు_న్నట్లు, ప్రతి కేంద్రానికి జాతీయ పరీక్షా సంస్థ తరపున ఒక పరిశీలకుడు నియమించబడ్డారు. అదనంగా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి పరీకా కేంద్రానికి ఒక ఎమ్మార్వో స్థాయి అధికారిని నియమించి ప్రశాంతంగా పరీక్ష నిర్వహించేందుకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు.2025మే 3వ తేదిన కేంద్రీయ విద్యాలయం,గుంటూరులో పరీక్ష కేంద్రాల సూపరింటెండెంట్లు మరియు పరిశీలకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి డిఈవో సి.వి.రేణుక అధ్యక్షత వహించగా డాక _ర్ ఎస్.విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ కెవి గుంటూరు మరియు నగర కోఆర్డినేటర్ సమావేశాన్ని నడిపించారు.అబ్దుల్ ఖుద్దూస్,ఎంఈవో గుంటూరు మరియు ఎస్.ఆనంద్, వాడ్‌మాస్టరు కె.వి గుంటూరు, ఉపనగర కోఆర్డినేటర్లుగా విధులు నిర్వహిస్తూ,పరీక్షా కేంద్రాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లను, మార్గదర్శకాలను వివరించారు.పరీక్షా కేంద్రాల చుట్టూ శాంతిభద్రతలకై సిఆర్‌పిసి సెక్షన్ 144 అమల్లో ఉంటుందని,ప్రతీ కేంద్రంలో పోలీస్ సిబ్బంది నియమించబడతారు. అభ్యర్థులు తప్పనిసరిగా ఉదయం 11నుండి మధ్యాహ్నం 1.30గంటల మధ్య తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలకు హాజరుకావలి.1.30తర్వాత ఎలాంటి అభ్యర్థికి ప్రవేశం అనుమతించబడదు.

**అభ్యర్థుల కోసం ముఖ్య సూచనలు :** నీట్ అడ్మిట్‌కార్డు,రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు మరియు ఒక పోస్టుకార్డు సైజ్‌ఫోటో తీసుకురావాలి,ప్రభుత్వ ఆధారిత ఫోటో గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలి.సా _ర్ట్ వాచీలు,ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు,క్యాలిక్యూలేటర్లు,పుస్తకాలు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబడవు.కలెక్టర్ నాగలక్ష్మి,పరీక్ష నిర్వాహణ ఏర్పాట్లను సమీక్షించి,అన్ని అధికారులకు మరియు సంబంధిత వారికి సులభంగా ఒత్తిడిలేని వాతావరణంలో పరీక్ష నిర్వహణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ఎస్‌కె ఖాజావలి,సి.వి.రేణుక,ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల,చౌత్రాను సందర్శించి పరీక్ష ఏర్పాట్లను పరిశీలించారు.

## విస్తరణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి : నగర కమిషనర్

**గుంటూరు కార్పొరేషన్,మే3,ప్రభాతవార్త :** ఈ నెల 7వ తేదీన గుంటూరు నగరానికి ప్రతిష్టాత్మకమైన శంకర్ విలాస్ ఆర్‌ఓబి నిర్మాణ పనుల శంకుస్థాపన జరుగుతుందని, విస్తరణ



పెండింగ్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్ పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం కమిషనర్ నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ఆర్ బి అధికారులతో కలిసి శంకర్ విలాస్ ఆర్‌ఓబి రోడ్ విస్తరణ పనులను ఏసి కాలేజి నుండి అరండల్ పేట పోలీస్ స్టేషన్ వరకు పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ తొలుత ఆర్‌ఓబి నిర్మాణ డిజైన్ ని పరిశీలించి, ఇప్పటి వరకు జరిగిన విస్తరణ పనులు, మార్కింగ్ అంశాలను పట్టణ ప్రణాళిక, ఆర్ బి అధికారులను అడిగి తెలుసుకొని మాట్లాడుతూ, ఈ నెల 7వ తేదీన కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎంఎల్సీలు, ఎంఎల్ఏలు, ప్రజా ప్రతినిధులు శంకర్ విలాస్ ఆర్‌ఓబి నిర్మాణ పనుల శంఖుస్థాపన చేస్తారన్నారు. ఆర్‌ఓబి ప్రభావిత భవనాల్లో అంగీకారం తెలిపిన వారి భవనాలను తొలగిం చడం, ఆక్రమణలను లేకుండా చర్యలు తీసు కోవాలని పట్టణ ప్రణాలిక అధికారులను ఆదేశించారు. అంగీకారం తెలిపిన వారి భవనాలకు నష్ట పరిహారం అందించడానికి ఇంజినీరింగ్ అధికారులు అంచనాలు సిద్ధం చేయాలన్నారు. శంఖుస్థాపన జరిగే ప్రదేశాన్ని నిర్ణయం జరిగిన అనంతరం శిలాఫలకం ఏర్పాట్లను ఆర్ బి అధికారుల సమన్వయంతో చేయాలన్నారు. పర్యటనలో ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, సిటి ప్లానర రాంబాబు, డిసిపి సూరజ్ కుమార్, ఆర్ బి డిఈఈ చిన్నయ్య, ఏఈఈ సంజీవ కుమార్, ఏసిపిలు, పట్టణ ప్రణాలిక, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్ష కేంద్రం వద్ద భద్రత చర్యలు

### -పల్నాడు జిల్లా ఎస్పీ



**నరసరావుపేట క్రైం, మే 3 ప్రభాతవార్త :** మండలంలోని కాకాని గ్రామం వద్ద ఉన్న జెఎన్టీయు ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించే నీట్ పరీక్షకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసామని జిల్లా ఎస్పీ కె శ్రీనివాసరావు శనివారం తెలిపారు. పరీక్షకు హాజరై విద్యార్థులకు సంబంధించి వాహనాల ట్రాఫిక్ సమస్యలు లేకుండా, సకాలంలో కేంద్రానికి చేరుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇవ్వటం జరిగిందన్నారు. పరీక్ష కేంద్రాల చుట్టుపక్కాల ఉండే జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్‌లు పరీక్షలు ముగిసే వరకు మూసి వేయాలని సూచించారు. పరీక్ష కేంద్రాంలోకి వెళ్లే అభ్యర్దులు ప్రతి ఒక్కరిని క్షుణంగా తనిఖీ చేసి అనుమతించాలన్నారు. సెల్‌ఫోన్‌లు, స్మార్ట్‌వాచ్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అవసరమైతే డ్రోన్‌కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశాలు ఇచ్చారు.

## వాసవి కన్యకాపరమేశ్వరి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు



**తిరువూరు, మే 3, ప్రభాతవార్త :** తిరువూరులో నూతనంగా శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం నిర్మాణం చేయడం జరిగినది. ఆ క్రమంలో శనివారం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట చేసి ఈ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో పలు పూజాధి హోమ క్రతువులు నిర్వహించారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తజనులకు అన్నప్రసాద వితరణ గావించారు.

### ప్రభుత్వ సమగ్ర వైద్యశాలకు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో

## రూ.1.60 కోట్ల విలువైన వెంటిలేటర్లు అందజేత

**గుంటూరు తూర్పు, మే 3 ప్రభాతవార్త :** గుంటూరు గవర్నమెంట్ హాస్పటల్ ఆవరణలో శనివారం జరిగిన జిజిహెచ్ లోగో ఆవిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్, దాతలు భాష్యం రామకృష్ణతో కలిసి కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంటిలేటర్లు, స్టెప్



డౌన్ ఐసీయూ సహకారం, ఏసీలు అందించిన దాతలకు కేంద్రమంత్రి పెమ్మసాని అభినందనలు తెలిపారు. అలాగే ఆసుపత్రిలో సర్వీస్ బ్లాక్ నిర్మాణాన్ని రామచంద్ర ప్రభు బాధ్యత తీసుకోవడం, లిఫ్టులకు మరమ్మత్తులు చేయించి అందుబాటులోకి తీసుకురావడం, ఐ క్లినిక్ సెంటర్లు ఏర్పాటు చేయడం దాతలకు మాపై ఉన్న నమ్మకమే కారణం అన్నారు. రూ.2 కోట్ల విలువైన 4 నియో నేటల్ వెంటిలేటర్లు, 6 మొబైల్ వెంటిలేటర్లు, బెడ్స్, ఏసీలు ఏర్పాటు చేసిన దాతలకు గుంటూరు ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి అవసరతలని గుర్తించి ముందుకు వచ్చిన దాతలకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర మంత్రి సహకారంతో ఎంతో మంది దాతలు ముందుకురావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఏ సమస్యలు ఉన్నా ముఖ్యమంత్రికి, ఆరోగ్యశాఖామంత్రికి, ప్రిన్సిపాల్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్ళి కార్పోరేట్ స్థాయిలో వైద్యం అందించడానికి కృషి చేస్తామన్నారు. మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు చేస్తున్న సేవలు, భాష్యం సంస్థలు, న్యాట్‌కో సంస్థలు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. హాస్పటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఎస్.వి.రమణ మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధి చేస్తూ నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్ళడానికి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్, ఆరోగ్యశాఖామంత్రి, కలెక్టర్ కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్



సొసైటీ ఏపి స్టేట్ కమిటీ సభ్యులు, దాతలు భాష్యం సంస్థల అధినేత భాష్యం రామకృష్ణ, భారత్ ఫార్మా అండ్ మెడికల్ ఆక్సిజన్ కంపెనీ ప్రతినిధులు, జిఎంసి పూర్వ విద్యార్థులు, ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ దేగల ప్రభాకర్, హాస్పటల్ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృతి,సంప్రదాయాలు భావితరానికి తెలియజేయాలి

### -ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్

**పొన్నూరు, మే 3,ప్రభాతవార్త:** తెలుగువారి సంస్కృతి-సంప్రదాయాలను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్ అన్నారు. చేబ్రోలు మండలం, వడ్లమూడి, క్వారీ శ్రీ బాలకోటేశ్వరస్వామి ప్రాంగణంలో ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి మెమోరియల్ ఆధ్వర్యంలో జరుగుతున్న వృషభారాజముల పోటీలను ఆయన



ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ ధూళిపాళ్ళ కుటుంబం రైతులకు ప్రయోజనం చేకూరేవిధంగా వ్యవహరిస్తుండడం, ఈ ప్రాంత ప్రజలను చైతన్య పరుస్తూ, వారి సమస్యలను పరిష్కరిస్తుండడం వల్లే ఈ ప్రాంత ప్రజలు ధూళిపాళ్ళ కుటుంబంపై మమకారం పెంచుకున్నారని తెలుస్తుందన్నారు. పాడిపరిశ్రమను అభివృద్ధి చేసేందుకు నాటి స్వర్గీయ మాజీ మంత్రి ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి కృషి చేస్తే, నేడు ఆయన తనయుడు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ వీరయ్య చౌదరి ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. నేడు సమాజంలో అడుగంటి పోతున్న పశు సంపదను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. యాంత్రిక జీవితంలో ఇలాంటి పోటీలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. ఇక్కడ జరుగుతున్న వృషభరాజముల పోటీలు ఐపిల్ మ్యాచ్‌ను తలపించే విధంగా ఉన్నాయన్నారు. ఎడ్ల పోటీలు ఇంత పెద్ద స్థాయిలో జరుగుతాయని నేను కలలో కూడా ఊహించలేదన్నారు. మన భాషని, యాసని, పండుగని, కట్టుని, బొట్టుని భావి తరాలకు తెలియజెప్పడం, అందుకు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ చేస్తున్న కార్యక్రమాలను ఎంతగానో ఆదర్శంగానూ, స్ఫూర్తిగాను నిలిచాయన్నారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందడం అంటే సామాన్యమైన విషయం కాదన్నారు. తాను కూడా మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచానన్నారు. ఆరుసార్లు గెలిచిన ధూళిపాళ్ళను ఆదర్శంగా తీసుకున్నాన్నారు. ఆయన చేసే కార్యక్రమాలను తాను కూడా కాపీ కొడుతున్నానని చెప్పారు. అమరావతి పున: ప్రారంభ పనుల్లో పాల్గొనడం మంచి ఫీల్‌ను ఇచ్చిందన్నారు. అదేరీతిలో వృషభరాజముల పోటీలు కూడా తనకు ఫీల్‌ని ఇచ్చిందన్నారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ మాట్లాడుతూ తాను తన తండ్రి వీరయ్య చౌదరి ఆశయాలను ముందుకు తీసుకెళ్ళడం, ప్రజలకు ఏ విధంగా సేవ చేసి వారి మన్ననలను పొందాలో తన తండ్రి వీరయ్య చౌదరి వద్ద నుంచి నేర్చుకున్నానన్నారు. నా తండ్రే నాకు ఆదర్శం, హీరో అని చెప్పారు. సంగం డెయిరీని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి, దాని ద్వారా ఎంతో మంది రైతులకు ఆర్థిక స్వావలంభన చేకూరుస్తున్నామన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాలు తనకు ఎంతో సంతృప్తిని ఇస్తున్నాయన్నారు. అధికారం ఉన్నా, లేకున్నా ప్రజలకు సేవ చేయడమే తనకు తెలిసిన విషయమన్నారు. తనను నమ్మిన ప్రజల తరపున వారికి మద్దగా ఉండడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నానన్నారు. అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతులను, నగదు పారితోషికాలు, మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల నుంచి వచ్చి రైతులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారుల నిర్మాణ పనులు వేగంగా జరిగేలా అధికారులు పర్యవేక్షించాలి : బాపట్లజిల్లా కలెక్టరు

**బాపట్ల,మే3,ప్రభాతవార్త:** వాడరేవునకిరేకళ్ళు, బెంగళూరుకడపవిజయవాడ జాతీయ రహదారుల నిర్మాణ పనులు వేగంగా జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారుల నిర్మాణ పనులపై రెవెన్యూ అధికారులతో శనివారం స్థానిక కలెక్టర్ ఛాంబర్ లో పరిష్కరించాలన్నారు. పంగులూరు మండలంలో ప్రజల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని తక్షణమే సమస్యను పరిష్కరించాలన్నారు. అద్దంకిలో ఆక్రమణలు తొలగించి రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ కారణాల చేత నష్టపరిహారం నగదు చెల్లింపులు నిలిచిపోయిన వారికి తక్షణమే



ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారుల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలన్నారు. వాడరేవునకిరికల్లు జాతీయ రహదారి 167ఏ నిర్మాణంలో కారంచేడు, పర్చూరు, వేటపాలెం, చీరాల మండలాలలో భూ సేకరణ సమస్యలు పరిష్కరించాలన్నారు. రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన వారందరికీ న్యాయబద్ధంగా నగదు చెల్లింపులు జరగాలన్నారు. చీరాల మండలంలోని ప్రభుత్వ పోరంబోకు భూమిలో నివాసముంటున్న 63 గృహాల నిర్మాణాలను తక్షణమే తొలగించాలన్నారు. చట్టబద్ధంగా వారికి రావలసిన పరిహారం అందించాలన్నారు. బెంగళూరుకడపవిజయవాడ జాతీయ రహదారి 544 జి నిర్మాణానికి ఆటంకంగా ఉన్న భూ సమస్యలు తక్షణమే అందించాలన్నారు. రహదారుల నిర్మాణంలో జాప్యం ఉండరాదని ఆదేశించారు. ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని అధికారులకు మార్గ నిర్దేశం చేశారు. రెవిన్యూ సమస్యలన్నీ మూడు రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. 16వ నంబర్ జాతీయ రహదారి నిర్మాణాలో భాగంగా పిచ్చుకల గుడిపాడు వద్ద సర్వీస్ రోడ్డు నిర్మాణం కొరకు అర్థ హెక్టార్ భూసేకరణ త్వరగా చేపట్టాలన్నారు. సమీపంలో ఉన్న మరో భూమి సమస్య తక్షణమే పరిష్కరించాలన్నారు.ఈ సమావేశంలో ఎస్ డి సి లవన్న, బాపట్ల, చేరాల ఆర్డీవోలు గ్లోరియా, చంద్రశేఖర్, కలెక్టరేట్ విభాగం పర్యవేక్షకులు సంధ్యారాణి, సమీపంలోని మండల తహసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి ఎద్దడి లేకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్ : విజయవాడ కమిషనర్



**విజయవాడ కార్పొరేషన్,మే 3,ప్రభాతవార్త:** నగర ప్రజలకు వేసవి కాలంలో త్రాగునీటి ఎద్దడి లేకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్-2025లో భాగంగా పలు కార్యక్రమాలను చేపట్టామని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. శనివారం ఆయన ఇంజనీరింగ్ సిబ్బందితో టెలికాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మర్ యాక్షన్ ప్లాన్-2025లో భాగంగా రూ.11.85 కోట్లు కేటాయించారని తెలిపారు. నగరం లోని అన్ని హ్యాండ్ బోర్లు రిపేరు చేసి, ఫ్లషింగ్ చేయించి పూర్తిగా పనిచేసేలా మార్పులు చేపట్టారని,నీటి ఎద్దడి,అధిక డిమాండ్ ఉన్నవ ప్రాంతాల్లో అదనంగా హ్యాండ్ బోర్లు,పవర్ బోర్లు ఏర్పాటు చేశారని,నీటి సరఫరాలకు ఉపయోగించే అన్ని మోటార్లను రిపేర్లు చేసి పనిచేసే స్థితికి తీసుకువచ్చారని నీటి సరఫరా నిల్చిపోయే పరిస్థితుల్లో తక్షణం మోటార్లను మార్చేందుకు స్టాండ్ బైగా అదనపు మోటార్లు, పంపులు కొనుగోలు చేశామన్నారు. నీటి పైపులైన్‌లు,వాల్వుల్లో ఏఊవైనా నష్టం/విచ్ఛిన్నం ఓటు చేసుకున్నపుడు వెంటనే మరమ్మత్తులు చేపట్టేందుకు అవసరమైన పైప్,వాల్వ్ స్పేర్ మెటీరియల్‌ను నిల్వలో ఉంచారని,హెడ్ వాటర్ వర్క్స్,బూస్టర్‌లకు జనరేటర్ల సరఫరా కోసం టెండర్లు ఖరారు చేసి,ఏజెన్సీని ఎంపిక చేశారని,విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు వెంటనే ఉపయోగించుకునేందుకు జనరేటర్లు సిద్ధంగా ఉంచారని, మోటార్లకు సంబంధించిన అన్ని ప్యానెల్ బోర్డులు సర్వీసింగ్ చేయబడి,అవసరమైతే స్పేర్‌పార్ట్స్ స్టాక్‌లో ఉంచామని,తద్వారా నీటి సరఫరాలో అంతరా యం జరుగకుండా ఉంటుందన్నారు.ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడానికి టెండర్లు ఖరారు చేశామని, డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో అవసరానికి అనుగుణంగా నీటి సరఫరా చేస్తున్నామని, మరమ్మత్తుల్లో ఉన్న కంట్రోల్ వాల్వులను కొత్త వాల్వులతో భర్తీ చేశారని, ఇవి ప్రధానంగా ఇఎల్ఎస్ఆర్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌లో అమలు చేస్తామని పేర్కొన్నారు.నీటిలో నాణ్యతను కాపాడేందుకు అన్ని ప్రాంతాల్లో ముఖ్యంగా ఈఎల్ఎస్ఆర్‌లు,జిఎల్ఎస్ఆర్‌లు,బూస్టర్ స్టేషన్ల వద్ద ప్రజలకు త్రాగునీటిని అందించేందుకు నగరంలో మొత్తం 81 చలివేంద్రాలు ఏర్పాటు చేసామన్నారు.

## చిన్నారులకు శుద్ధజలం

**పథకం అమలుకు సర్వం సిద్ధం**

**కారంపూడి, మే3 ప్రభాతవార్త:** పరిశుభ్రమైన నీటిని తాగడం ప్రతిఒక్కరి ప్రాథమిక హక్కు. చాలా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు బాలింతలకు పరిశుభ్రమైన నీరు అందడం లేదు. దీని ద్వారా కుళాయిలు, గృహావసరాలకు వినియోగించే వాటితోనే సరిపెట్టుకుంటు న్నారు. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీ చిన్నారుల ఆరోగ్యంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. కొన్నింటికి శుద్ధ జల పరికరాలు అందిస్తోంది. ఈ శుద్ధజలం పథకానికి కేంద్రం సక్షం పథకం అని పేరు పెట్టింది. అంగన్‌వాడీ కేంద్రంలో నీటి శుద్ధి యంత్రానికి సొంత భవనం, నీటి సౌకర్యం, మరుగుదొడ్లు, విశాలమైన ప్రాంతం, విద్యుత్తు సరఫరా, ఇంకుడు గుంత ఉన్న అంగన్‌వాడీను సక్షం పథకానికి శ్రీకారం



చుట్టనున్నారు. కారంపూడి మండల వ్యాప్తంగా 47 అంగన్‌వాడీ కేంద్రాలు, 1 మినీ కేంద్రం ఉన్నాయి. దీనిలో భాగంగా మండలంలో 12 అంగన్‌వాడీ కేంద్రాలు సొంత భవనాలు కలిగి ఉన్నాయి. మిగతావి అద్దె భవనాల్లో ఉన్నాయి. అందులో భాగంగా మండల పరిధిలో 3 కేంద్రాలను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన కేంద్రల్లో కిచెన్ గార్డెన్, క్రీడా పరికరాలు, ఆకుకూరల సాగు, వాన నీటి సంరక్షణ వంటి మరిన్ని సౌకర్యాలు కల్పించాలని నిర్ణయించారు. ఒక్కొక్క పరికరం విలువ రూ.7,350 ఉంది. వీటిని ప్రాజెక్టు పరిధిలోని ఐసీడీఎస్ అధికారులు అంగన్‌వాడీలకు పంపించారు. సాంకేతిక నిపుణులతో వాటిని కేంద్రాల్లో అమరుస్తారు. మండలంలో మూడు కేంద్రాలు ఎంపిక చేయాలని అధికారులకు ప్రతిపాదనలు పంపారు. అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పరిశుభ్రమైన నీరు అందించడమే సక్షం పథకం ప్రధాన లక్ష్యం.

# ఘనంగా శ్రీ బగలాముఖి అమ్మవారి వార్షిక తిరునాళ్ల మహోత్సవం

**పిట్టలవానిపాలెం,మే03,ప్రభాతవార్త:** శోభాయమానముగా జరిగిన ప్రాచీన ఆభరణముల యాత్ర చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగలాముఖి అమ్మవారి దేవస్థానంలో గత నాలుగు రోజులుగా



జరుగుతున్న వార్షిక తిరుణాల మహోత్సవంలో భాగంగా 2001 వ సంవత్సరంలో ముఖ మండప త్రవ్వకాలలో బయలుపడిన ప్రాచీన సువర్ణ ఆభరణములను చందోలు స్టేట్ బ్యాంకు నుండి శోభాయాత్రగా బయలుదేరి ఆలయమునకు చేరి వివిధ అధికారుల సమక్షంలో ఆభరణములు లెక్కించి వాటిని ఆలయ పూజారులకు అలంకారం చేయమని అప్పజెప్పగా వాటిని అమ్మవారికి బంగారు ఆభరణాలతో విశేష అలంకారం జరిపారు తొలి పూజా కార్యక్రమం జరిపి భక్తులకు స్వర్ణ ప్రకాశ రూపంలో వెలుగొందుతున్న శ్రీ బగలాముఖి అమ్మవారి దివ్యదర్శన ఏర్పాటును అందించారు. తొలుతగా శోభాయాత్ర కార్యక్రమమునకు బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ, అడిషనల్ ఎస్పీ టి పి విఠలేశ్వర్, డిస్టిక్ రెవెన్యూ అధికారి గంగాధర గౌడ్, నామన శివ నారాయణ, వడ్డానం మార్కండేయులు దేవదాయ శాఖ నుండి అసిస్టెంట్ కమిషనర్ ఎం భాగ్యలక్ష్మీ పిట్టలవానిపాలెం ఎమ్మార్వో వెంకటేశ్వరరావు, చందోలు పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎం శివకుమార్, పంచాయతీ కార్యదర్శి బండ్లమూడి సుజాత, రెవెన్యూ అధికారి అరుణ ప్రసన్న సాక్షులుగా భవనం బసిరెడ్డి, దోమ నాగేశ్వరరెడ్డి,ఆలపాటి రమణారావు,కేతరాజు పట్టాభి రామారావు,మద్దికర ధన గోవిందరెడ్డి,బ్యాంకులో సంతకములు చేసి మేనేజర్ ద్వారా బాక్స్ స్వీకరించి అమ్మవారి రథములో ఉంచి భక్తుల కోలాహల ధ్వనుల మధ్య పోలీసు బందోబస్తు మధ్య ఆలయమునకు తీసుకురావడం జరిగింది. బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు తలపాక ధరించి బంగారు ఆభరణముల పెట్టెను ధరించి అమ్మవారి ఆలయంలో భక్తి పూర్వకంగా సమర్పణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి ఆలయానికి వచ్చు భక్తుల సౌకర్యార్థం భూమి అవసరమని దానికి సంబంధించి దాతల సహకారంతో భూదాన కార్యక్రమ ఉద్యమాన్ని భక్తుల సహకారముతో చేపడతామని చెప్పగా అప్పటికప్పుడు తేర్లపాటి శ్రీనివాసరావు రెండు లక్షలు, సనక రాఘవ వంశీ రెండు లక్షలు,దేశ పాల సింగ్ నెల్లూరు లక్ష రూపాయలు, శివప్రసాద్ లక్ష రూపాయలు, కొనకాల బుల్లి బాబు లక్ష రూపాయలు విరాళం ప్రకటించారు. వీరందరికీ కూడా దేవస్థానం తరఫున ఆలయ కార్య నిర్వహణ అధికారి జి నరసింహమూర్తి ధన్యవాదాలు తెలియజేశారు.

# ప్రతిభావంతులను పోత్సహించడం అభినందనీయం : మేయర్

**గుంటూరుతూర్పు,మే3,ప్రభాతవార్త:** ప్రతిభావంతులైన విద్యార్థులను సత్య సెక్యూరిటీ, ఇన్వెస్టిగేషన్ సంస్థ ప్రోత్సహించడం అభినందనీయమని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. సత్య సెక్యూరిటీస్ లో పని చేస్తున్న ఉద్యోగుల పిల్లల్లో ఇంటర్, పదో తరగతుల్లో ప్రతిభ చూపించిన 20 మంది విద్యార్థులకు శనివారం గుంటూరు బృందావన్ గార్డెన్స్ సంస్థ కార్యాలయం లో పొగాకు బోర్డు మాజీ ఈడి అద్దంకి శ్రీధర్ బాబు ఐ.ఎ.యస్ తో కలిసి ఉపకార వేతనాలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, విద్యార్థులు బాల్యం నుంచే సేవ, స్నేహ భావాలను పెంచుకోవాలన్నారు. తల్లి తండ్రులను గౌరవించి సమాజానికి ఉపయోగపడే విధంగా ఎదగాలన్నారు. విద్యార్థులు



మారుతున్న కాలానికనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకొంటూ విధ్యనభ్యశించాలన్నారు. సత్య సెక్యూరిటీ, ఇన్వెస్టిగేషన్ సంస్థ వారి సంస్థలో పని చేస్తున్న ఉద్యోగుల పిల్లలకు ప్రోత్సహించడం అభినందనీయమని, ఈ విధంగా విద్యార్థులను ప్రోత్సహించడం వలన విద్యార్థులలో ఆత్మావిశ్వాసం పెంపొందు తుందన్నారు. అలాగే విద్యార్థులు బాగా చదువుకొని భవిష్యత్ లో ఉన్నత స్తానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. శ్రీధర్ బాబు మాట్లాడుతూ, విద్యార్థులు బాల్యంలోనే తమ లక్ష్యాలను నిర్దేశించు కోవాలన్నారు. దానికి అనుగుణంగా ప్రణాళికలను రూపొందించుకుని ఉన్నత స్థాయి చేరుకోవాలని సూచించారు. జాతీయ,అంతర్జాతీయమార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ ప్రతిభను పెంచుకోవాలన్నా రు.ఈ కార్యక్రమంలో సంస్థ ఎండి కాళహస్తి సత్యనారాయణ, జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి, ఎరిస్ కంపెనీ జిల్లా అధినేత రత్తయ్య, విశ్రాంత లెక్చరర్ జివి రాయుడు, సత్య సెక్యూరిటీస్ మేనేజర్ సత్య సాయి, ఎగ్జిక్యూటివ్ లిడియా, విశ్రాంత డిఎస్పీలు సుబ్బారెడ్డి, భగీరథ బాబు, కెవి నారాయణ, కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, మాజీ కార్పొరేటర్ ముత్తినేని రాజేష్, రామినేని సుబ్బారావు, సంస్థ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కులగణనపై రాజకీయాలు తగవు : కేసన శంకరరావు

**మంగళగిరి మే 3, ప్రభాతవార్త:** "ఈసారి జరిపే జనాభా లెక్కల తో పాటు దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన చేపడతామంటూ" కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని రాజకీయాలు చేయడం సరికాదని,ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు రాజకీయ పార్టీలకు హితవు పలికారు. స్థానిక మంగళగిరిలోని రాష్ట్ర కార్యాలయంలో శనివారం మోడీకి కృతజ్ఞతాభినందనలు



తెలిపేందుకు మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,దేశ జనాభాలో సగం మందికి పైగా ఉన్న వెనుకబడిన తరగతులకు చెందిన ఓబీసీలకు కులగణన చేయడం వల్ల ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఆధిపత్యకుల పెత్తందారీ వర్గాలచే నిరంతరం అణచివేతపీడనదోపిడీలకు గురవుతున్న జాతులుగా ఉన్నారన్నారు. ఆనాటి బ్రిటిష్ ఇండియా భారతీయ కుల సమాజంపై స్పష్టమైన అవగాహనతోనే వరుసగా పదేళ్ల కు ఒకసారి జరిగే జనగణనతో పాటే,1931 వరకు కుల గణన కూడా జరిపించారన్నారు.కానీ నాటి నుండి నేటి వరకు భారత పాలకులు మాత్రం జనాభా లెక్కల తో పాటు వివిధ కులాల జనాభా లెక్కలు తీయించలేకపోవడం దురదృష్టకరమన్నారు.కుల గణనకై అనేక దశాబ్దాలుగా బీసీ సంఘాలతో పాటువివిధ కుల సంఘాలుప్రజా సంఘాలు రాజకీయ పార్టీలు గల్లీ నుండి ఢిల్లీ వరకు ఉద్యమిస్తూనే ఉన్నారన్నారు. ఎట్టకేలకు ఈనాటికి ఒక ఓబీసీ అయిన, దేశ ప్రధానిగా ఉన్న నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర మంత్రిమండలి,ఈసారి జరిపే జనగణనతో పాటే జాతీయస్థాయిలో సమగ్రంగా కులగణన కూడా చేయాలని, ఒక చారిత్రాత్మక విధాన నిర్ణయం తీసుకోవడాన్ని ఓబీసీ సమాజం హర్షిస్తుందన్నారు. అందుకు కేంద్ర ఎన్డీఏ ప్రభుత్వానికి,ప్రధాని నరేంద్ర మోడీకి రాష్ట్ర కార్యవర్గం తరుపున కృతజ్ఞతాభినందనలు తెలియజేస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా ఓబీసీలు ఎంతో సంతోషంగా సంబరాలు జరుపుకుంటున్న వేళ,బీహార్ ఎన్నికలలో విజయం కోసమే ఈ నిర్ణయం అంటూ ప్రతిపక్షాలు కొన్ని విమర్శించడం సమర్ధనీయం కాదన్నారు. దేశంలోని సగం మందికి పైగా ఉన్న ఓబీసీలకు మంచి పని చేసే సమయంలో కేంద్రంపై ఎవరైనా ఇలాంటి అవాకులు చవాకులు పేలడం అసందర్భమవుతుందన్నారు. శాస్త్రీయ పద్ధతిలో సమగ్రంగా కులగణన జరపాలని తాము కోరుకుంటున్నామన్నారు.అయితే జనాభా లెక్కలకు కేటాయించిన రూ 575 కోట్లు ఎట్టి పరిస్థితులలోనూ సరిపోవని, ఇప్పుడు అదనంగా కులగణన చేయాల్సి ఉన్నందున, బడ్జెట్లో అదనపు కేటాయింపులు జరపాలన్నారు. సుప్రీంకోర్టు విధించిన 50 శాతం పరిమితిని తొలగించి,రాజ్యాంగ సవరణలు చేసి, రిజర్వేషన్ల శాతం పరిమితిని పెంచుకునేలా, ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు వర్తించేలా, పార్లమెంటు చట్టాలు చేయాలని శంకరరావు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఇంకా ఈ మీడియా సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు శివరాం బాబాజీ, ఉద్యోగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎంబీసీ మూర్తి, జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, ఉపాధ్యక్షులు జంజనం వరప్రసాద్,రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కల్లూరి హనుమంతరావు, ఆల శివాజీ, అడపా శ్రీనివాస్, ఉడత శ్రీనివాసరావు,చంద్రశేఖర్, యుగంధర్, దానాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణానదిలో దారితప్పిన జాలరి కుటుంబాన్ని రక్షించిన పోలీసులు

**వెల్దుర్తి,మే3,ప్రభాతవార్త :** వెల్దుర్తి మండలం నల్లమల అడవి ప్రాంతంలో కృష్ణానదిలో చేపల వేటకు వెళ్లి దారితప్పి రెండురోజులుగా తినటానికి తిండి లేక ఇబ్బందులు పడుతున్న జాలరి దంపతులను వెల్దుర్తి పోలీసులు సురక్షి త ప్రాంతానికి తరలించి రక్షించిన సంఘటన శనివారం జరిగింది. వివరాల్లోకితే పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం చెందిన కొడమంచిలి శ్రీను అతని భార్య ధనలక్ష్మి లు చేపలు పట్టే పని కోసం కాంట్రాక్టర్ ద్వారా వెల్దుర్తి మండలం జెండాపెంట గ్రామం మర్రిచెట్టుముండే ప్రాంతం కు ఏప్రిల్ 19న వచ్చారు. చేపల వేట కొరకు మే రెండో తేదీ ఉదయం 7 గంటలకు కృష్ణా నదిలోకి వెళ్లి దారి తప్పి కొత్తపుల్లారెడ్డి గూడెం అటవీ ప్రాంతంలో ఉండిపోయారు.




తమతో తెచ్చుకున్న ఆహారం అయిపోవడంతో రాత్రంతా ఆహారం మంచినీరు లేకుండా అలాగే అడవి ప్రాంతంలో చిక్కుకుపోయారు. మూడు నెలల గర్భవతిగా ఉన్న భార్య ధనలక్ష్మి తో శ్రీను అటవీ ప్రాంతంలో రాళ్లగుట్టలెక్కుతూ ఎంతో ఇబ్బందిపడ్డారు. కాంట్రాక్టు ఫోన్ చేస్తే ఎటువంటి స్పందన లేదు. చివరికి భార్య ధనలక్ష్మి తెలివిగా ఆలోచన రావటంతో భర్తని 100 కి ఫోన్ చేసి పోలీసులకి సమాచారం ఇవ్వమన్నది. భార్య చెప్పినట్లు శ్రీను 100 కి ఫోన్ చేసి పోలీసులకి సమాచారం ఇవ్వగా మాచర్ల రూరల్ సీఐ షేక్ నఫీజ్ భాష ఆదేశాల మేరకు వెల్దుర్తి ఎస్ఐ షేక్ సమంధర వలి వెంటనే స్పందించి తన సిబ్బందితో జాలరి దంపతుల ఉన్న ప్రాంతాన్ని ఫోన్ సిగ్నల్ ద్వారా గుర్తించి వారిని అక్కడి నుంచి సురక్షిత ప్రాంతానికి తీసుకొని వచ్చారు. సమాచారం ఇచ్చిన వెంటనే స్పందించి తమ ప్రాణాలను కాపాడి రక్షిత ప్రాంతాన్ని తీసుకొచ్చి తమని కాపాడటమే కాకుండా ఆహారం మంచినీళ్లు ఇచ్చి స్వగ్రామం వెళ్లడానికి ఆర్థిక సాయం చేసిన వెల్దుర్తి పోలీసు సిబ్బందికి జాలర్ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. ఆపద సమయంలో 100 కి ఫోన్ చేసి పోలీసులకి సమాచారం ఇవ్వమని చెప్పిన శ్రీను భార్య ధనలక్ష్మిని మాచర్ల రూరల్ సీఐ షేక్ నఫీజ్ భాష వెల్దుర్తి ఎస్ఐఅభినందించారు

# ఘనంగా సీతారాముల ఆలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలు

**కర్లపాలెం,మే03,ప్రభాతవార్త:** కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెం గౌడపాలెంలోని సీతారాముల ఆలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఆలయ అర్చకులు వెంకట అప్పలాచార్యులు, బండాత్మకూరు రమాకాంత్ శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి సుప్రభాతం,



పంచామృత స్నపన, విశేష హారతులు, శాంతి కల్యాణం, మంత్రపుష్పం పూజలు నిర్వహించారు. శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ సీతారాములను దర్శించుకొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏమినేని శంకర్, సురేష్ , మాడా శ్రీనివాసరావు, మునిపల్లె చిన్న, నక్కల వెంకటస్వామి, షేక్ బాజి , సూరినేని మురళీకృష్ణ, నరాల పున్నయ్య, వీర బ్రహ్మయ్య, మాడా బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల క్రమశిక్షణతో ఎదగాలి

## -నేషనల్ అవార్డు గ్రహీత జవహర్ రాణి

**పెదనందిపాడు మే 3,(ప్రభాతవార్త) :** పిల్లలు క్రమశిక్షణ తో ఎదగాలని నేషనల్ మరియు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు గ్రహీత మక్కెన జవహర్ రాణి అన్నారు.గత కొన్ని రోజులుగా పెదనందిపాడు తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పిల్లలకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జవహర్



రాణి.మాట్లాడుతూ. చిన్నారులు విద్యార్థులు చిన్నతనం నుండే మంచి అలవాట్లు ,క్రమశిక్షణ అలవరచుకుంటే జీవితంలో పట్టుదలతో ఎదగవచ్చని తెలిపారు.నేటి బాలలే రేపటి భావి భారతపౌరులని కృషి, పట్టుదల ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి దోహదపడతాయని చెప్పారు. ఈ శిక్షణా శిబిరం లో పిల్లలకు బొమ్మలు, పేపరుకటింగ్స్ నేర్పడం సంతోషదాయకంగా ఉందని అన్నారు. విజ్ఞాన కేంద్రం కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు మాట్లాడుతూ విజ్ఞాన కేంద్రం లో పిల్లల వేసవి శిక్షణా శిబిరం నిర్వహించడాన్ని పిల్లల తల్లి దండ్రులు హర్షిస్తున్నారని తెలిపారు.సెల్ ఫోన్ కు, ఎండలకు దూరంగా కొంత సమయమైనా గడిపేందుకు ఈ వేసవి శిక్షణ తరగతులు ఉపయోగపడినట్లు వారి తల్లిదండ్రులు తెలిపారు అన్నారు. ఈ శిక్షణ కాలంలో ఆటలు,లెక్కలు, బొమ్మల తో పాటు అనేక విషయాలు చెప్పడం జరిగిందన్నారు.పిల్లలలో అల్లరి తనం ఎక్కువగా ఉందని, చిన్నారులు పాఠశాలల్లో ఉపాధ్యాయులు బోధించే విషయాలు శ్రద్ధగా విని నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ శిక్షణలో మొత్తం 57 మంది పాల్గొనడం జరిగిందన్నారు. చివరి రోజున విద్యార్థులకు చిన్నారులకు స్వీట్స్ పంచిపెట్టడం జరిగింది.

# కుల గణనపై మోడీ ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

**బాపట్ల,మే03,ప్రభాతవార్త:** కుల గణనపై మోడీ ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాన్ని స్వాగతిస్తూ మరియు కాంగ్రెస్ కపటత్వం బహిర్గతం అయిందని బాపట్ల బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షులు కొక్కిలిగడ్డ శ్రీనివాసరాజు అన్నారు. ఈ సందర్భంగ ఆయన




మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా నుండి గర్వించదగ్గ నాయకులుగా రాబోయే జాతీయ జనాభా లెక్కల్లో కుల గణనను చేర్చాలనే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గం తీసుకున్న మైలురాయి నిర్ణయాన్ని ఓబీసీ మోర్చా హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నదన్నారు.ఈ సాహసోపేతమైన మరియు పారదర్శకమైన చర్య సామాజిక న్యాయం, సమాచార విధాన రూపకల్పన మరియు భారతదేశ సామాజిక వ్యవస్థను బలోపేతం చేయడం వైపు ఒక ముఖ్యమైన అడుగును సూచిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో కొమ్మనబోయి మణి యాదవ్ నియోజకవర్గ కన్వీనర్, పేర్రెడ్డి బాపట్ల రూరల్ మండల అధ్యక్షులు, కొత్రా వెంకటరామకృష్ణ ,జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ అంగకుదురు టీ నటరాజన్ తదితరులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా గ్రామ పంచాయతి అధికారిగా ఎస్వి నాగేశ్వర నాయక్

**నరసరావుపేట, మే 3 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా గ్రామ పంచాయతి అధికారిగా ఎస్వి నాగేశ్వర నాయక్ శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. వారు 2018 గ్రూప్-1 అధికారి. ఇక్కడ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎమ్.వి భాస్కర్‌రెడి బదలీ అయ్యారు.విజయవాడకు చెందిన నాయక్ తూర్పు గోదావరి ,కృష్ణా జిల్లాలో డీపీవోగా విధులు నిర్వహించారు. ఉద్యోగ బాధ్యతలు స్వీకరించినఅనంతరం నాయక్ జిల్లా కలెక్టర్ పి అరుణ్‌బాబును మర్యాద పూర్వకంగా కలిసారు.



# సురేష్ బాబుకు సతీవియోగం

**పెదనందిపాడు మే 3.(ప్రభాతవార్త):** పెదనందిపాడు సాయి మందిర్ నిర్వాహక కమిటీ ఉపాధ్యక్షులు. శ్రీ బాలా త్రిపుర సుందరి సోమేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి కమిటీ స్పిరిట్యువల్ సొసైటీ సెక్రెటరీ తడవర్తి సురేష్ బాబు భార్య వెంకట లావణ్య (48) శుక్రవారం రాత్రి ఆగస్మిక మృతి చెందారు. శనివారం వారి పార్థివ దేహాన్ని. పారిశ్రామికవేత్తలు దాసరి శేషగిరిరావు . అరవపల్లి కృష్ణ. ముద్దన రాఘవయ్య. సకలా వీరభద్రయ్య. మాజీ ఎంపీపీ స్పిరిట్ వల్ సొసైటీ





అధ్యక్షురాలు ముద్దన నగరాజకుమారి. సాయి మందిర్ నిర్వహణ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు. దాసరి లక్ష్మీ శివప్రసాద్. అరవపల్లి రామ సుబ్బారావు. సాయి మందిర్ ప్రధాన అర్చకులు గౌతం పాండే. సకలా రమేష్ బాబు. తదితర ప్రముఖులు సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# కే-రిడ్జ్ స్కూల్ విద్యార్థులకు స్కాలర్‌షిప్ బహుమతులు

**నరసరావుపేట, మే 3 ప్రభాతవార్త :** కే-రిడ్జ్ స్కూల్ విద్యార్థులు స్కాలర్‌షిప్ టెస్ట్‌లో విజేతాలుగా నిలిచి బహుమతులు అందుకున్నారు.వివరాలను శనివారం పాఠశాల ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం,




కర్నూల్ జిల్లాల వ్యాప్తంగా 4,5,6,7,8 తరగతుల మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించటం జరిగిందన్నారు. విజేతాలైన విద్యార్థులకు ప్రముఖ పోలీగ్లాట్ బహు బషా కోవిదుడు, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు వెంకట్ పూలబాల బహుమతులు అందించారని తెలిపారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులుసమక్షంలో ప్రథమ, ద్వితీయ బహుమతుల ప్రధానోత్సవం నిర్వహించటం సంతోషంగా ఉందని ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు.పాఠశాల ప్రిన్సిపాల్ బర్నబాస్ ప్రథమ విజేతకు రూ.10,000, ద్వితీయ విజేతకు రూ.5000 నగదు అందించారు.

# పేద బ్రహ్మణ మహిళలకు చీరలు పంపిణీ

**గుంటూరు విద్య,మే 3,ప్రభాతవార్త :** బిజేపి రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ జన్మదినోత్సవం సందర్భంగా బిజేపి రాష్ట్ర పబ్లిసిటి అండ్ లిటరేచర్ ప్రముఖ్ పాలపాటి రవికుమార్,బిజేపి రాష్ట్ర మీడియా సెల్ కోకన్వీనర్ వెలగలేటి గంగాధర్‌లు,బ్రాడిపేట కార్యాలయంలో పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.ముందుగా నరేంద్రమోడీ "స్వచ్చతా హి సేవా హై" లో భాగంగా స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించి కేక్ కట్‌చేసి పారిశుద్ధ్య కార్మికులకు,పేద బ్రాహ్మణ మహిళలకు చీరలు పంపిణీ అనంతరం పేదలకు భోజన వితరణ చేశారు.ఈ సందర్భంగా పాలపాటి రవికుమార్ మాట్లాడుతూ వల్లూరు జయప్రకాష్ నారాయణ ప్రజల మద్యకు వెళ్ళి ప్రజల కష్టసుఖాలు తెలుసుకొని ప్రధాని నరేంద్ర మోదీ వారికోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వారికి తెలియజేసి ఏ విధంగా వాటిని తీసుకోవాలో చెప్పి వారి జీవితాల్లో వెలుగు నింపిన ప్రజా నాయకుడని రాష్ట్రస్థాయిలో జయప్రకాష్ బిజేపి కి సేవలందిస్తు పార్టీని ముందుకు నడిపించడగల అత్యుత్తమ నాయకుడిని వారికి భగవంతుడు ఆయురారోగ్యాలను ఇచ్చి భవిష్యత్తులోఉన్నత శిఖరాలను అందుకోవాలని పార్టీ కార్యకర్తలుగా కోరుకుంటున్నామని తెలిపారు.జిల్లా బిజేపి అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ వల్లూరు జయప్రకాష్ అత్యుత్తమ నాయకుడని వారి సహకారంతో జిల్లాలో పార్టీని అన్ని మండలాల్లో బలోపేతం చేస్తూ ముందుకు వెళ్తున్నామని వారి జన్మదినాన్ని పురస్కరించుకొని పేదలకు బట్టలు,అన్నదానం చేయడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈదర శ్రీనివాసరెడ్డి, పల్నాడు జిల్లా ఇన్‌చార్జీ కొక్కెర శ్రీనివాస్ యాదవ్,జిల్లా ప్రధాన కార్యదర్శులు చరక కుమార్ గౌడ్,వైవి సుబ్బారావు,ఈమని మాధవరెడ్డి,నాగమల్లేశ్వరీ యాదవ్, ఏలూరి లక్ష్మీ ,విమలాదేవి,డాక్టర్ స్రవంతి,హేమంత్ సోలంకి,బజరంగ్ రామకృష్ణ,ఉడతా పవన్,తాడువాయి రామకృష్ణ,తానుచింతల అనిల్,కంతేటి బ్రహ్మయ్య, అనిల్‌బెహరా, లంకా రవి,సాయి, మంజునాథ,జితేంద్ర గుప్తా,దేసు సత్యనారాయణ,నాగేశ్వరరావు, శ్రీనివాస్,రమణ నాయుడు,బాడిశ ఆదినారాయణ,తదితర నాయకులు,కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# నాట్య కళా వారసత్వ సంపదను రాబోయే తరాలకు అందించాలి

**గుంటూరు కల్చరల్,మే 3,ప్రభాతవార్త :** డిజిటల్ యుగంలో నాట్యకళను సజీవంగా కొనసాగించడానికి ప్రభుత్వాలు,రాజకీయ వ్యవస్థలు,స్వచ్ఛంద సంస్థలు చొరవ చూపాలని అంతర్జాతీయ నృత్య దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులు,గాయకులు విజ్ఞప్తిచేశారు.స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో అంతర్జాతీయ నృత్య దినోత్సవ కార్యక్రమం సందర్భంగా నాట్యకళను యువతలో ప్రోత్సహించాలి అంటూ కార్యక్రమం జరిగింది.కార్యక్రమంలో ప్రముఖ నాటక రచయిత దర్శకుడు కావూరి సత్యనారాయణ మాట్లాడుతూ నాట్యం ఓ విశ్వభాష అని ప్రపంచ ప్రజలను ఏకం చేయగల శక్తివంతమైన సాధనమన్నారు.సంగీత విద్వాంసులు మల్లేశ్వరరావు మాట్లాడుతూ నాట్య కళా ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకొని ప్రతిఏటా ఏప్రిల్ నెలలో విశ్వవ్యాప్తంగా అంతర్జాతీయ నాట్య దినోత్సవాన్ని యునెస్కో,ఇంటర్నేషనల్ థియేటర్ ఇన్‌స్టిట్యూట్‌లు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయన్నారు.నాట్యకళ పట్ల సమాజంలో చిన్నచూపును రూపుమాపి నాట్యకళా వారసత్వ సంపదను రాబోయే తరానికి అందించే ప్రయత్నాలు జరగాలన్నారు.కార్యక్రమంలో గాయని యార్లగడ్డ లక్ష్మీ నాట్యరంగ ప్రముఖులు,శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# మునిసిపల్ కార్మికుల ఆందోళనకు ప్రజా సంఘాల మద్దతు

నరసరావుపేట, మే 3 ప్రభాతవార్త : మున్సిపల్ కార్మికుల ఆందోళనకు ప్రజా సంఘాల నాయకులు శనివారం తమ సంపూర్ణ మద్దతుప్రకటించారు. సమ్మె శిబిరాన్ని



సందర్శించి నాయకులు నల్లపాటి రామారావు, మౌలాలి, రామకృష్ణ,షేక్ మస్తాన్‌వలి, బాదుగున్నల శ్రీను మాట్లాడారు. గత 45 రోజులుగా సమ్మె నిర్వహిస్తుంటే అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవటం దారుణంగా ఉందన్నారు. కార్మికులపై కక్ష్య సాధింపు చర్యలు మానుకోవాలన్నారు. వారి న్యాయమైన సమస్యల పట్ల ప్రభుత్వం, అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు కనీసం మాట్లాడక పోవటం అన్యాయంగా ఉందన్నారు. వారి డిమాండ్ల సాధన కొరకు ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు, మున్సిపల్ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

# పరిటాల వారి పాలెంలో దొంగల హల్‌చల్

## -గ్రామస్తులు ప్రహర. దొంగలు పరార్

**పెదనందిపాడు మే 3 (ప్రభాతవార్త):** మండలంలోని పరిటాల వారి పాలెం లో గత 15 రోజుల నుండి ఆ గ్రామ ప్రముఖులు రాత్రిపూటవంతులు వారీగా ప్రహర (కాపలా)కాస్తున్నారు. అంతకు ముందు కొన్ని రోజులుగా దొంగలు గ్రామంలో తిరుగుతున్న సమాచారం తెలుసుకున్న గ్రామప్రముఖులు జంపని వేణు. గోరంట్ల బ్రహ్మయ్య. జాగర్లమూడివెంకట కోటేశ్వర రావు పొదిలి నరసింహారావు నాగ రాజు శేషగిరి. మిన్న



గంటి రాంబాబు చిమినేని నరేష్ బాబు జంపని వెంకటరామయ్యలు యువకుల సహకారంతో రాత్రులందు వంతులు వారీగా గ్రామంలో ప్రహర కాయడంతో గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొంది. ఇతర గ్రామాలకు ఈ చర్య స్ఫూర్తి దాయకంగా ఉన్నది అని పలువురు పెద్దలు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# హిందూ ఫార్మసీ కళాశాల్లో అవగాహన సదస్సు

**గుంటూరు విద్య,మే 3,ప్రభాతవార్త :** స్థానిక అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాల్లో "రెస్యూమ్ రైటింగ్ మరియు ఇంటర్యూస్ స్కిల్స్"అనే అంశంపై అవగాహన సదస్సు జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం తెలిపారు.సదస్సుకు ముఖ్య అతిధిగా విచ్చేసిన కె.సి. మహేంద్ర లిమిటెడ్ ఫ్రీలాన్స్ సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ నిడమర్తి శ్రీసాయి గణేష్ కుమార్ మాట్లాడుతూ రెస్యూమ్‌ని తయారు చేయువిధానం,యాక్షన్‌వెర్బ్ ను వాడేవిధానం మరియు క్రిటికల్ థింకింగ్ మరియు ఇంటర్యూలో విజయం సాధించే విధానం




గురించి క్లుప్తంగా వివరించారు.సదస్సులో కళాశాల చైరమ్మన్ జూపూడి రంగరాజు,సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు,వైస్‌ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.సీతారామయ్య, డాక్టర్ ప్రత్యూష,కమ్యూనికేషన్ స్కిల్స్ విభాగాధిపతి డాక్టర్ కె.విజయభాస్కర్ తదితర అధ్యాపకులు,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# నిష్కలంక దేశభక్తుడు పుచ్చలపల్లి సుందరయ్య

గుంటూరు కల్చరల్,మే 3,ప్రభాతవార్త : ప్రజాక్షేమమే పరమావధిగా ఉద్యమమే ఊపిరిగా ప్రజాసేవకు అంకితమై ఆడంబరాలకు ఆర్భాటాలకు దూరంగా ఉంటూ సుమారు 6దశాబ్దాలకు పైగా రాజకీయ జీవితం గడిపిన నిష్కలంక దేశభక్తుడు పుచ్చలపల్లి సుందరయ్య అని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో ఉత్తమోత్తమ కమ్యూనిస్టు పుచ్చలపలి సుందరయ్య అని జయంతి కార్యక్రమంలో నివాళులర్పించారు.కార్యక్రమంలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ నిజాయితీతో నిరాడంబరతతో ప్రజాజీవితంలో నూతన ఒరవడిని సృష్టించి కమ్యూనిస్టు గాంధీగా పేరొందిన సుందరయ్య సమసమాజ స్థాపనకు,శ్రామికలోక కళ్యాణానికి అంకితభావంతో కృషిచేశారన్నారు.విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య మాట్లాడుతూ సంపన్నుల కుటుంబంలోపుట్టినా పిత్రార్జితం అంతా ప్రజా ఉద్యమాల కోసం వెచ్చించిన నిస్వార్ధ జీవి సుందరయ్య అని అన్నారు.కార్యక్రమంలో జీవన సంధ్య అధ్యక్షులు సిహెచ్ కృష్ణారావు,సంస్థ సభ్యులు,ఆర్.వెంకటరత్నం, భావన్నారాయణ తదితరులు నివాళులర్పించారు.

# ఓరియంటల్ హై స్కూల్‌లో ఉచిత కరాటే తరగతులు

**నరసరావుపేట, మే 3 ప్రభాతవార్త :** పట్టణంలోని బరంపేట ఓరియంటల్ పాఠశాలలో ఉచితంగా కరాటే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ నరసరావుపేట సభ్యులు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ఉచిత కరాటే క్యాంపు మే 5వ తేది నుండి ప్రారంభమవుతుందన్నారు. జూన్ 5వ తేది వరకు తరగతులు ఉంటాయని ప్రతినిధులు తెలిపారు. జూడో సీనియర్ కోచ్ శివరాత్రి శిరీష శిక్షణ అందిస్తారని పేర్కొన్నారు. మొదటి 75మందికి మాత్రమే అవకాశం కల్పించటం జరుగుతుందని, పేర్ల నమోదు కొరకు 8897020595 నెంబర్‌ను సంప్రదించాలని రోటరాక్ట్ క్లబ్ ప్రతి నిధులు కోరారు.

# ఓటర్ల జాబితాల్లో అవకతవకల కట్టడికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి

**గుంటూరు కల్చరల్,మే 3,ప్రభాతవార్త :** ఒక్క ఓటు తేడాతో ఎన్నికల్లో జయాపజయాలు నిర్ణయమయ్యే మనదేశంలో ఓటర్ల జాబితాల్లో అవకతవకల కట్టడికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు ఉండి తీరాలని అవగాహన సంస్థ విజ్ఞప్తిచేస్తుంది.ఈ మధ్య మృతుల వివరాలను ఎప్పటికప్పుడు తీసుకుంటూ మరణించిన వారిపేర్లను ఓటర్ల జాబితాల్లోంచి వేగంగా తొలగించేందుకు ఎన్నికల కమీషన్ సిద్ధపడటాన్ని అవగాహన సంస్థ స్వాగతిస్తుంది.డిజిటల్ ఉపకరణాల దన్నుతో ఓటర్ల లిస్టులను సంస్కరించటంలో ఈసీ క్రియాశీలకంగా వ్యవహరించాలని అవగాహన సంస్థ విజ్ఞప్తిచేస్తుంది.

# టాటా కన్సల్టెన్సీతో ఐబిఎం భాగస్వామ్యం

**విజయవాడ, మే 3, ప్రభాతవార్త :** ప్రస్తుత రాష్ట్ర రాజధాని నగరం అమరావతిలో నిర్మింపబడుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్వాంటం వ్యాలీ టెక్‌పార్క్‌లో భాగంగా భారతదేవ క్వాంటం కంప్యూటింగ్ పరిశ్రమను మరింత అభివృద్ధి చేయ డానికి ఐబిఎం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌తో భాగస్వామ్య కుదుర్చుకున్నాయి. ఈ కార్యక్రమంతో భారతదేశ క్వాంటం పర్యావరణ వ్యవస్థ అభివృద్ధిని వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఐబిఎం, టిసిఎస్ భావిస్తున్నాయి.

# మహిళలు స్వయం ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలి

**-గ్రామీణ మహిళలకు కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని పిలుపు -ఎస్ఆర్ఎం ద్వారా రూ.72 లక్షల విలువైన యంత్రాల పంపిణీ**





**మంగళగిరి, మే3, ప్రభాతవార్త :** గ్రామీణ మహిళలు వినూత్నంగా ఆలోచనలతో ముందుకు సాగుతూ విద్య, వ్యాపార రంగాల్లో పురోగతి సాధించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి సమాచార శాఖ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సూచించారు. కష్టాలతో కుంగిపోకుండా మనోధైర్యంతో స్వయం ఆర్థిక స్వావలంబన పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ లో ఆరు మండలాలకు చెందిన గ్రామీణ మహిళలకు మంత్రి వివిధ రకాల ఉత్పత్తుల తయారీకి ఉపయోగించే యంత్రాలను పంపిణీ చేశారు. యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ అధ్యక్షతన జరిగిన పంపిణీ కార్యక్రమంలో మంత్రి పెమ్మసాని ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ కింద పరిగణించే సేవా కార్యక్రమాల్లో భాగంగా ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ గ్రామీణ మహిళా ఆర్థికాభివృద్ధికి తన వంతు సహకారం అందించడం ప్రశంసనీయమన్నారు. పేదరికంతో నలిగిపోయే మహిళలు ఆత్మస్థైర్యంతో నూతన వ్యాపారాలను ప్రారంభించాలని, ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలను పొంది ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఉన్నతమైన కలలు కంటూ విజయసోపానాలను అధిరోహించాలని మహిళలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఎంటర్‌ప్రెన్యూర్ అండ్ ఇన్నోవేషన్ డైరెక్టర్ డాక్టర్ సిద్ధార్థ త్రిపాఠి ఆదితీ ప్రోగ్రాం వివరాలను వెల్లడించారు. గుంటూరు జిల్లాలోని మంగళగిరి తాడేపల్లి, తాడికొండ, తుళ్లూరు మండలాలకు చెందిన 100 అంకుర సంస్థలు రూ.72 లక్షల విలువైన యంత్ర పరికరాలను పంపిణీ చేస్తున్నామన్నారు. అనంతరం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ మనోజ్ అరోరా, ప్రొ వైస్ ఛాన్సలర్ డాక్టర్ సతీష్ కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్ కుమార్లు కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. సభా కార్యక్రమానికి ముందు మంత్రి పెమ్మసాని మహిళలకు ఏర్పాటు చేసిన వివిధ రకాల ఉత్పత్తుల స్టా ళ్లను పరిశీలించి వారిని అభినందించారు. స్వయంగా రుచి చూసి ఉత్పత్తుల మార్కెటింగ్‌ను పెంచేందుకు సహకారం అందిస్తామన్నారు.

## అమరావతి పునర్నిర్మాణ మహోన్నత ఘట్టంలో పాల్గొనడం నా అదృష్టం : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,మే3,ప్రభాతవార్త:** ఆంధ్రుల కలల సౌధ నిర్మాణం నిజమయ్యేవేళ, జయహో అమరావతి నినాదాలు మార్మోగేవేళ, రాజధానికి భూమలిచ్చిన రైతుల ఆనందానికి అవధులులేని



సమయాన, ప్రధాని మోదీ ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రులు, ప్రముఖ పెద్దలు, ప్రజా ప్రతినిధుల సమక్షంలో కన్నుల పండుగగా జరిగిన అమరావతి పునఃప్రారంభ మహోన్నత ఘట్టంలో పాల్గొనడం తన అదృష్టమని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర విభజనానంతరం రాష్ట్రానికి పెద్ద దిక్కుగా మారిన చంద్రబాబు 2014లో ముఖ్యమంత్రిగాబాధ్యతలు చేపట్టిన వెంటనే రాజధాని నిర్మాణానికి నడుం బిగించారని గుర్తుచేశారు. ఆనాడు ఆయన ఇచ్చిన పిలుపుతో వేలాది రైతులు లక్షల ఎకరాల భూములిచ్చి రాష్ట్ర పురోభివృద్ధికి వెలకట్టలేని చేయూతనందించారని ప్రత్తిపాటి తెలిపారు. ఆనాడు రాజధాని నిర్మాణ ఆవశ్యకతను వారికి వివరిస్తూ భూసేకరణలో భాగస్వామిని అయ్యానని అన్నారు. తరువాత మంత్రిగా అమరావతి నిర్మాణ పనులను పర్యవేక్షిస్తూ రాష్ట్ర ప్రజల ఆశలకు ప్రత్యక్ష సాక్షిగా నిలిచానన్నారు. గత పాలకుల విధ్వంసం,వినాశకర ఆలోచనలతో నిలిచిపోయిన నవనగర నిర్మాణం, మరలా చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వ నిర్ణేతృత్వంలో పునఃప్రారంభం కావడం ఆ దేవుని అనుగ్రహంగానే భావిస్తున్నానని, ఆ మహోన్నత ఘట్టంలో సహచర సభ్యులతో కలిసి ఆనందాన్ని పంచుకున్నానని ప్రత్తిపాటి తెలిపారు.

## పాటిమీద అంకమ్మ తల్లి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి



**చిలకలూరిపేట,మే3,ప్రభాతవార్త:** పట్టణంలోని వీరారెడ్ పాటిమీద వేంచేసియున్న శ్రీ అంకమ్మతల్లి పోతురాజు స్వామి దేవస్థానం 24వ తిరునాళ్లను పురస్కరించుకొని జరుగుతున్న కార్యక్రమానికి ప్రత్తిపాటి ఆలయకమిటీ ఆహ్వానం మేరకు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వార్ల తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి అమ్మవారి తిరునాళ్లను ఘనంగా నిర్వహిస్తున్న ఆలయకమిటీ సభ్యులను అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## కేతినేని ప్రమీల చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి



**చిలకలూరిపేటరూరల్,మే3,ప్రభాతవార్త:** మండలంలోని ఈపూరివారిపాలెం గ్రామానికి చెందిన కేతినేని ప్రమీల ఇటీవల మరణించారు. కాగా ఆమె పెదకర్మ శనివారం ఈపూరివారిపాలెంలోని ఆమె స్వగృహంలో జరుగుతుండగా విషయం తెలుసుకున్న మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు కార్యక్రమంలో పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు షేక్ కరిముల్లా, జవ్వాజి మదన్‌మోహన్, పఠాన్ సమద్‌ఖాన్, ధూళిపాళ్ల పద్మ, కేతినేని శ్రీహరి, నాగభైరు ఆంజనేయులు, ఈవూరి బ్రహ్మానందం, నాగభైరు సాంబశివరావు, ధూళిపాళ్ల శ్రీనివాసరావు, నాగభైరు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పత్రిక స్వేచ్ఛా దినోత్సవం

**- జర్నలిస్టులను సత్కరించిన నరేంద్ర సువర్ణకుమారి ఫౌండేషన్ సభ్యులు**

**యడ్లపాడు,మే3,ప్రభాతవార్త:** ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవం పురస్కరించుకొని మండలం లోని తిమ్మాపురం గ్రామానికి చెందిన నరేంద్ర





సువర్ణకుమారి ఫౌండేషన్ సభ్యులు పలువురు సీనియర్ జర్నలిస్టులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు సువర్ణకుమారి మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలను సమర్ధంగా ప్రజల్లోకి తీసుకెళుతూ ప్రభుత్వానికి, ప్రజలకు వారిధిగా పాత్రికేయులు వ్యవహరిస్తున్నారని, వారిని ఈ సందర్భంగా సత్కరించుకోవడం సంతోషకరమని అమె అన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో జర్నలిస్ట్ మిత్రులు మాట్లాడుతూ 1993 మే3వతేదిన ఐక్యరాజ్యసమితి పత్రికా స్వేచ్ఛా దినోత్సవాన్ని ప్రకటించిందని గుర్తుచేసుకున్నారు. ప్రాంతీయ పత్రికా స్వేచ్చ సూచిలో భారతదేశం 161వ స్దానానికి పడిపోవడం విచారకరమని అన్నారు. జర్నలిస్ట్‌లు ఐక్యతతోనే స్వేచ్చను సాధించుకొగలమని తెలిపారు. తదుపరి కార్యక్రమంలో పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి,జాతీయ జెండాలను పట్టుకొని భారత్‌మాతాకు జై,ఉగ్రవాదం నశించాలి,ఉగ్రవాద ఉన్మాదులను వదలకండి అంటూ ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని కోరుతూ తహసిల్దార్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మానుకొండ రామరావు, వైవి రమేష్‌బాబు, వైబి శ్రీనివాసరావు, షేక్ హసన్‌వలి, పావులూరి బ్రహ్మానందం, వంకాయలపాటి శ్రీధర్, పోపూరి వెంకట్రావు, పోపూరి నాగచౌదరి, సుందర్‌బాబు తదితర జర్నలిస్ట్‌లు పాల్గొన్నారు.

## రాజధాని పునర్నిర్మాణ కార్యక్రమం విజయవంతం



**విజయపురిసౌత్, మే 3 ప్రభాతవార్త:** అమరావతి రాజధాని పునర్నిర్మిణ మహోత్సవానికి మాచర్ల మండలం విజయపురిసౌత్, చింతలతండ, కొప్పునూరు నుంచి తెలుగుదేశం, జనసేన నాయకులు, కార్యకర్తలు, మహిళలు భారీగా తరలివెళ్లి విజయవంతం చేసినట్లు విజయపురిసౌత్ కూటమి నాయకులు అన్నారు. శుక్రవారం జరిగిన రాజధాని అమరావతి పునర్నిర్మాణ సభకు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమం విజయవంతమైందన్నారు. ఈ కార్యక్రమంలో విజయపురిసౌత్ తెదేపా అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, సత్తిబాబు, ఆడెపు కోటయ్య, డా॥బసివిరెడ్డి, కట్టా రాజు, రాంచంద్, నాగయ్య, చరణ్, పండు, హాతీరామ్, యాకోబు తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్ధుల భవిష్యత్తుకు బంగారు బాట బాలబాట

**రెంటచింతల, మే 3 ప్రభాతవార్త:** విద్యతోనే సమాజంలో గౌరవ జీవితం లభిస్తుందని, పేద విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసే



బాలబాటతో విద్యాబుద్ధులు నేర్చి ఉన్నతి సాధించాలని కార్డ్స్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ తాళ్లూరి అమరనాథ్ అన్నారు. శనివారం కార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో రెంటచింతలలోని సుగాలి కాలనీలో ఏర్పాటు చేసిన బాలబాట కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రెంటచింతల బాలబాట ఏసీఓ వి.రవి మాట్లాడుతూ ఇంటింటికి ప్రచారం ద్వారా 5 సంవత్సరాలకంటే ఎక్కువ వయసున్న బడి ఈడు పిల్లలను గుర్తించి సమీప ప్రాథమిక పాఠశాలలో చేర్పించే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో అడ్మిషన్, ప్రమోషన్ కార్యకలాపాలతో పాటు ప్రభుత్వ పాఠశాలలు, విద్యపై పిల్లల్లో ఆసక్తిని పెంపొందించే సంసిద్ధత కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్య ప్రాముఖ్యతని గుర్తించి తల్లిదండ్రులు వారి పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో సుగాలి కాలనీ బాలబాట డీఓ కేతావత్ ధనలక్ష్మి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రధాని మోడీ రాజధానికి ఏమి ఇవ్వలేదు : ఈదర గోపిచంద్

**నరసరావుపేట టౌన్, మే 3 ప్రభాతవార్త :** రాష్ట్ర రాజధాని అమరావతికి ప్రధాని నరేంద్ర మోడీ ఏమి ఇవ్వలేదని ఈదర గోపిచంద్ అన్నారు. ఆయన ఎందుకు వచ్చారో..ఎందుకు వెళ్ళారో రాష్ట్ర ప్రజలకు అర్థం కాలేదన్నారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌లు ఒకరినొకరు పొగుడుకోవడం మినహాయించి ఆ కార్యక్రమాన్ని ఎందుకు నిర్వహించారో తెలియలేదన్నారు. కనీసం రాజధానికి, వెనుకబడిన ప్రాంతాలకు నిధులివ్వండి, ఏపికి ప్రత్యేక హోదా ఇవ్వాలి, పోలవరం ఎత్తు పూర్తి స్థాయిలో నిర్మించేందుకు సహకరించండి, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపండి అని నోరు తెరిచి అడిగే పరిస్థితి లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. సూపర్ సిక్స్‌ను కనీసం ప్రస్తావించకపోవడం ఎన్ని కోట్ల నిధులు అందుకు కావాలో తెలియకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రూ.500 కోట్లు ఖర్చు పెట్టి నిర్వహించిన బహిరంగ సభ మోడీని పొగిడేందుకు ఇవ్వడం మినహాయించి ఏమి లేదని ఈదర గోపిచంద్ అన్నారు.

## రైతు బజార్ వద్ద ఛాయ్‌హౌస్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,మే3,ప్రభాతవార్త:** పట్టణంలోని నరసరావుపేట సెంటర్‌లో రైతు బజార్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఛాయ్‌హౌస్‌ను మాజీమంత్రి,స్దానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు శనివారం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు షేక్ కరిముల్లా, పఠాన్ సమద్‌ఖాన్, మురకొండ మల్లిబాబు, ముల్లా కరిముల్లా, అజార్, రసూల్, రవూఫ్ తదితరులు పాల్గొన్నారు

## పట్టణంలో చోరీ

**నరసరావుపేట క్రైం, మే 3 ప్రభాతవార్త :** పట్టణంలోని ప్రకాష్‌నగర్‌లో నివసిస్తున్న బల్లికురవ విజాక్ వెంకట శివరామకృష్ణారావు ఇంట్లో శనివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. బాధితులు పట్టణ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శివరామకృష్ణారావు దంపతులు మూడు రోజుల క్రితం ఊరికి వెళ్లారు. వారు శుక్రవారం సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చారు. తలుపులకు వేసిన తాళం, బీరువా తలుపులు పగులకొట్టి ఉన్నాయి. రూ.లక్ష నగదు, సుమారు పది సెవర్ల బంగారం చోరీకి గురైనట్లు బాధితులు తమ ఫిర్యాదులో తెలిపారు. సి.ఐ. విజయ్‌చరణ్ చోరీని అన్ని కోణాలలో విచారిస్తున్నామని తెలిపారు.

**ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను ఉపయోగించుకోండి : సి.ఐ. విజయ్‌చరణ్**

వేసవిలో చోరీలు ఎక్కువగా జరుగుతాయని, వీటిని అరికట్టేందుకు ప్రజలు పోలీసులకు సహకారం అందించాలని సి.ఐ. ఎం.వి.చరణ్ తెలిపారు. ఊళ్లకు వెళ్ళే సమయంలో సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలన్నారు. ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను అమర్చి గృహ యజమానులు వచ్చే వరకు పోలీస్‌శాఖ నిఘా నిర్వహిస్తుందన్నారు. విలువైన వరకు బ్యాంక్ ఆభరణాలను బ్యాంక్ లాకర్‌లో భద్రపరచుకోవాలని సి.ఐ. విజయ్‌చరణ్ సూచించారు.

## కార్మిక చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు



**నరసరావుపేట క్రైం, మే 3 ప్రభాతవార్త :** మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అసంఘటిత రంగ కార్మిక సంక్షేమ పథకాలపైఅవగాహన కార్యక్రమాన్ని స్దానిక ఆర్టీసీ గ్యారేజ్ ఆవరణలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి సలోమి హాజరయ్యారు. అసంఘటిత రంగ కార్మికులకు చట్ట ప్రకారం ఉన్న హక్కులు తెలియజేశారు. ఉచిత న్యాయ సహాయం పొందే విధి విధానాలను వివరించారు. అదే విధంగా ఉద్యోగుల వివాదాలు, పరిష్కారాలపై సూచనలు చేశారు. పట్టణ ఎస్.ఐ. వంశీకృష్ణ, సహాయ కార్మికశాఖ కమిషనర్ విష్ణు, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## పౌరాణిక కళారంగంలో "అర్ధ శత" పురస్కారాల గ్రహీత "బెజగం"



**సత్తెనపల్లి, మే 3 ప్రభాతవార్త :** పట్టణంలోని వడ్డవల్లి శ్రీ రాధాకృష్ణ మందిరంలో పట్టణ కళాకారుల సమక్షంలో ప్రముఖ వర్ధమాన పౌరాణిక కళాకారుడు బెజగం రవికుమార్ పౌరాణిక కళారంగంలో విభిన్న పౌరాణిక పాత్రలు పోషించి రాష్ట్రస్థాయిలో ప్రేక్షకులను రంజింపజేశారు. రెండు రాష్ట్రాల స్థాయిలో వివిధ కళా సంస్థల, కళావేదికల నుండి పురస్కారాలను, జాతీయ పురస్కారాలను మొత్తం 50 పురస్కారాలు గ్రహించిన సందర్భంగా పట్టణంలోని కళాకారులందరూ బెజగం రవికుమార్‌కి అభినందనలు తెలిపారు. మిత్రులు, సహ కళాకారులు, శ్రేయోభిలాషులు ఈ కార్యక్రమంలో రవికుమార్‌కి దుశ్శాలు కప్పి సన్మానించారు. రవికుమార్‌ను సన్మానించిన వారిలో ప్రముఖ న్యాయవాది కళా భీష్ముడు పిన్నమనేని పాములయ్య, ప్రముఖ ఉపాధ్యాయ కోటగిరి పోతులూరయ్య, చంద్రకుమారి, రచేయిత్రి సరికొండ రమాదేవి శ్రీధర్, ప్రముఖులు పోతులూరయ్య రవికుమార్‌కి సన్మాన పత్రం చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో కాటుమల నాగేశ్వరరావు, దావీదు, మిత్రులు, కళాకారులు అంజలి, కోటేశ్వరరావు, ఎలిశెట్టి ప్రసాద్, మాతంగి సాంబశివరావు, కోటేశ్వరరావు, గిరీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దిబ్బయ్య కుటుంబాన్ని పరామర్శించిన డాక్టర్ గజ్జల



**సత్తెనపల్లి, మే 3 ప్రభాతవార్త :** మండలంలోని పెదమక్కెన గ్రామానికి చెందిన కూరపాటి దిబ్బయ్య ప్రమాదానికి గురై ఇటీవల మృతిచెందారు. సమాచారం తెలుసు కున్న వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి శనివారం వారి స్వగృహానికివెళ్ళి దిబ్బయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన దిబ్బయ్య మృతిపట్ల సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలాగే బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. డాక్టర్ గజ్జల వెంట పలువురు వైకాపా నాయకులు ఉన్నారు.

## సత్తెనపల్లి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను సందర్శించిన డిప్యూటీ కమిషనర్

**సత్తెనపల్లి, మే 3 ప్రభాతవార్త :** సత్తెనపల్లి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను శనివారం డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసులు సందర్శిం



చారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. బెల్ట్‌షాపులు, ఎన్‌డిపిఎల్, గంజాయి వంటి నేరాల నియంత్రణకు సంబంధించి తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా అంశాలకు సంబంధించి కేసుల వివరాలను తెలుసుకొని సూచనలు చేశారు. మద్యం షాపులను, బార్‌లను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలన్నారు. నిబంధనలు పాటించేలా చూడాలన్నారు. నిత్యం నిఘా ఉంచాలని డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సి.ఐ. పి.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పూల్ ప్లాజా లో స్కేటింగ్ కోర్టు ప్రారంభం



**సత్తెనపల్లి, మే 3 ప్రభాతవార్త :** పట్టణంలోని పిఎంరెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో ఆర్.కె.స్కేటింగ్ కోర్టును శనివారం డిఎన్‌ఆర్ ఫౌండేషన్ అధినేత దరువూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్ధులకు ఆటవిడుపుగా ఉంటుందని, ఆరోగ్యమే మహాభాగ్యమని గుర్తు చేశారు. సుదూర ప్రాంతాలకు వ్యయ ప్రయాసలకోర్చి నేర్చుకోనేవారని ఇలాంటి ఆటలు నేరు ్చకుంటారని పట్టణంలో స్కేటింగ్, స్విమ్మింగ్ కోర్టులు అందుబాటులోకి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ అవకాశాన్ని స్థానిక యువత, విద్యార్ధులు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్కేటింగ్ ఇన్‌చార్జి ఖాజా, పూల్ ప్లాజా నిర్వాహకులు చంద్రశేఖర్, విజయ్, చందు, వివిధ పాఠశాలల విద్యార్ధులు పాల్గొన్నారు.

## గోపాళం కుసుమాంబ చిత్రపటానికి నివాళులు అర్పించిన మర్రి రాజశేఖర్



చిలకలూరిపేట,మే3,ప్రభాతవార్త: మండలంలోని బొప్పూడి గ్రామానికి చెందిన గోపాళం నాగేశ్వరరావు సతీమణి కుసుమాంబ ఇటీవల కాలంలో స్వర్గస్తులైనారు. కాగా శనివారం ఆమె పెద్దకర్మ సందర్భంగా శాసనమండలి సభ్యుడు మర్రి రాజశేఖర్ ఆ కార్యక్రమంలో పాల్గొని ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గోపాళం నాగేశ్వరరావు,గుంటు సుబ్బారావు, పూసల యోగేశ్వరరావు, గోపాళం భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రాజధాని నిర్మాణంతో చిగురించనున్న పల్నాడు ప్రజల ఆశలు : ఎమ్మెల్యే



**మాచర్ల, మే 3 ప్రభాతవార్త:** ఏపీ కలల రాజధాని పునర్నిర్మాణ పనులు శుక్రవారం అమరావతిలో ప్రధాని చేతుల మీదుగా దిగ్విజయంగా ప్రారంభమైన వేళ.. వెనుకబడ్డ ఎగువ పల్నాడు ప్రాంత ప్రజల ఆశలు చిగురించ బోతున్నాయని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. దాదాపు రూ.50 వేల కోట్లతో ప్రారంభమయ్యే రాజధాని పనులతో ఎగువ పల్నాడు కూడా సామాజిక, ఆర్థిక, పారిశ్రామిక రంగాల్లో పురోగతి సాధించబోతుందని తెలిపారు. మౌలిక రంగాలు, కనీస అవసరాలకు పెద్దఎత్తున నిధులు కేటాయించేందుకు కూటమి ప్రభుత్వం నేతృత్వంలో సీఎం చంద్రబాబునాయుడు మొగ్గు చూపుతున్నారని తద్వారా పల్నాడు ప్రాంతం కూడా పారిశ్రామికంగా ప్రగతి సాధించనుందని స్పష్టం చేశారు. ఏపీ అభివృద్ధికి ప్రధాని మోదీ కట్టుబడి ఉన్నారని అమరావతి సాక్షిగా హామీ ఇచ్చారని, త్వరలో మాచర్ల నియోజకవర్గంలో రోడ్లు, తాగు, సాగునీటి ప్రాజెక్టు నిర్మాణాలు పరుగులు పెడతాయని పేర్కొన్నారు. అయిదేళ్లుగా పాడుపడ్డ ప్రాంతంగా ఉన్న అమరావతి దినదిన ప్రవర్ధమానంగా నూతన హంగులతో, కొత్త సొబగులతో దేశానికే మకుటాయమాన రాజధానిగా చంద్రబాబు తీర్చిదిద్దుతారని జోస్యం చెప్పారు. రాజధాని పునర్నిర్మాణాలకు కేంద్రం పూర్తిగా సహకరిస్తోందని మోదీ చెప్పడం, ఏపీ అభివృద్ధి పట్ల ఆయనకున్న దక్షత స్పష్టంగా కనిపిస్తోందని ఆయన వెల్లడించారు. ఇంతటి విపత్కర పరిస్థితుల్లో రాజధాని పనుల ప్రారంభోత్సవానికి విచ్చేసి.. ఏపీ అభివృద్ధికి అన్ని విధాలుగా వెన్నుదన్నుగా నిలబడతానని ప్రధాని హామీ ఇవ్వడం పట్ల ఎమ్మెల్యే జూలకంటి హర్షం వ్యక్తం చేశారు.

## నాటుసారా నిర్మూలనే ధ్యేయం: డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్



**మాచర్ల, మే 3 ప్రభాతవార్త:** నాటుసారా నిర్మూలనే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం నవోదయం 2.0 అని గుంటూరు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ డా॥ కె.శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన డీపీఈఓ మణికంఠతో కలిసి మాచర్ల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయ అధికారులతో ముచ్చటించారు. రికార్డులను పరిశీలించారు. నవోదయం 2.0 లో భాగంగా వీలైనంత త్వరగా నాటుసారా రహిత గ్రామలుగా చేయాలని ఆదేశించారు. గ్రామస్థాయి, మండలస్థాయి కమిటీల ద్వారా గ్రామాలన్నీ సారా రహిత గ్రామాలుగా ప్రకటించాన్నారు. దుర్గి, మాచర్ల, వెల్దుర్తి మండలాలు సారా రహిత మండలాలుగా చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఎన్.వి.రమణ, ఎస్సై, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన

**-అసిస్టెంట్ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి**

**పొన్నూరు, మే 3,ప్రభాతవార్త:** పట్టణంలో వేంచేసియున్న సాక్షి శ్రీ భావనారాయణస్వామి దేవాలయం ప్రాంగణంలో పురాన కాలక్షేప భవనానికి ఆదివారం ఉదయం 7గంటలకు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ చేతుల మీదుగా శంఖుస్థాపన జరుగుతుందని అసిస్టెంట్ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. సీజిఎఫ్ నిధులు, దేవాలయం భాగస్వామ్యం నిధులు రూ.45లక్షలతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు, స్వర్ణపురి పట్టణ ప్రముఖులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## 11న మాతృ దినోత్సవం సందర్భంగా శారీ వాక్,త్రీ కె రన్"



**మంగళగిరి, మే 3, ప్రభాతవార్త :** మాతృ దినోత్సవం సందర్భంగా శారీ వాక్ ,త్రీ కె రన్".. మే 11 సాయంత్రం 6 గంటలకు మన మంగళగిరి లోనీ ఎన్ఆర్ఐ హాస్పిటల్ కూడలి వద్ద గౌతమ బుద్ధ రోడ్డులో నిర్వహించే కార్యక్రమంలో "శారీ వాక్" "త్రీ కె రన్" లో పాల్గొని హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేద్దామనీ "వీ వైబ్" సంస్థ అధినేత రాఘ వీణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో మొదటగా "శారీ వాక్" నిర్వహించి అందరికీ మెడల్స్ అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం "త్రీ కె రన్" ఉంటుందనీ ఆమె తెలియచేశారు.భారతీయ సంస్కృతిని కాపాడే మంగళగిరి నేతన్న కోసం:మంగళగిరిలో నిర్వహించే 3కె రన్, శారీ వాక్ కార్యక్రమం తో పాటు మంగళగిరి నేతన్న చేతుల మీదుగా తయారైన

## తెదేపా సీనియర్ నాయకుడు మద్ది శివశంకర గుప్తా భౌతిక కాయానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,మే3,ప్రభాతవార్త:** పట్టణానికి చెందిన టిడిపీ సీనియర్ నాయకుడు, ఆర్యవైశ్య ప్రముఖుడు మద్ది శివశంకర గుప్తా మరణించారు. విషయం తెలుసుకున్న మాజీమంత్రి, స్దానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు మద్ది శివశంకరగుప్తా భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో రాచుమల్లు సూర్యారావు, షేక్ కరిముల్లా, పఠాన్ సమద్‌ఖాన్ తదితర టిడిపి నాయకులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొని నివాళులు అర్పించారు.

## ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచిత దంత వైద్య శిబిరం

**చిలకలూరిపేట,మే3,ప్రభాతవార్త:** ఇన్నర్‌వీల్ క్లబ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో పట్టణంలోని



అసిస్ట్ సంస్ద నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో ఉన్న వృద్దులకు ఉచితంగా దంత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజని మాట్లాడుతూ పట్టణానికి చెందిన ప్రముఖ దంత వైద్యులు మురకొండ రాజశేఖర్ ఆధ్వర్యంలో అసిస్ట్ అధినేత జాష్టి రంగారావు సమక్షంలో వృద్దులకు ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించి మందులు అందచేసినట్లు తెలిపారు. వృద్దులకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం సమస్య తీవ్రంగా ఉన్నవారికి విష్ణు డెంటల్ ఆసుపత్రికి తీసుకువస్తే తగిన వైద్య సేవలు అందిస్తానని డాక్టర్ రాజశేఖర్ సూచించినట్లు ఆమె అన్నారు. అనంతరం వృద్దులకు, వైద్య సిబ్బందికి మామిడిపండ్లు, టూత్ పేస్టులు పంపిణీ చేసినట్లు సరోజని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ పూర్వపు అధ్యక్షురాలు తియ్యగూర రమాదేవి, క్లబ్ సభ్యులు, అసిస్ట్ సంస్దకు చెందిన సభ్యులు పాల్గొన్నారు.

## అభినవ జ్యోతిబాపూలే నరేంద్ర మోదీ

**విజయవాడ, మే 3, ప్రభాతవార్త :** 94 సంవత్సరాల సుదీర్ఘ కాలం తర్వాత దేశంలో కులగణన చేపట్టిన ప్రదానమంత్రి నరేంద్రమోడీ అభినవ జ్యోతిబాపూలే అని బిజెపి బిసి నేత మూల వెంకటరావు అన్నారు. విశాఖ నుండి వచ్చిన బిసి మోర్చా జాతీయ అధ్యక్షుడు కె లక్ష్మణ్ ను ఆయన ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ జనగణన వంటి సాహసోపేత నిర్ణయం తీసుకున్న మోడీని శ్లాఘించారు. ఆర్థిక సమానత్వం సాధించి అన్ని వర్గాలకు న్యాయం అందించడమే మోడీ ప్రభుత్వ లక్ష్యం అన్నారు.

# వర్సిటీలో క్యాంపస్ డ్రైవ్

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,మే 3,ప్రభాతవార్త :** వర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాల్లో శనివారం క్యాంపస్ డ్రైవ్ జరిగింది.ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కాలేజీ ఈ డ్రైవ్ నిర్వహించారు.ఈ డ్రైవ్‌లో ఎంటెక్,ఎమ్మెస్సీ (ఫిజిక్స్,కెమిస్ట్రీ,స్టాటిస్టిక్స్,మ్యాథ్స్ ఎంబిఏ,బిటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థిని విద్యార్థులు హాజరయ్యారు.ఎంపికైన అభ్యర్థులకు క్విస్ ఇంజనీరింగ్ కళాశాల మరియు



క్యూ.ఐ.ఎస్.స్కూల్స్‌లో ఉద్యోగాల్లో నియామకం జరుగుతాయని హెచ్ఆర్ సతీష్‌కుమార్ తెలిపారు.అభ్యర్థులకు స్కూల్ టీచర్లుగాను,కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు గాను,నియామకం జరుగుతుందని ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎం.డి.తౌసిఫ్ అహ్మద్ తెలిపారు. కార్యక్రమంలో క్విస్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ నుండి ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వి.హనుమంతరావు,స్కూల్ ప్లానింగ్ డీన్ శ్రీనివాసరావు,స్టూడెంట్ డీన్ డాక్టర్ ఏ.వాసుబాబు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.సిద్దయ్య,అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.గోపికృష్ణ,డాక్టర్ డి.చంద్రమౌళి పాల్గొన్నారు.

## కీర్తిశేషులు పబ్బరాజు వెంకటేశ్వరరావు చిరస్మరణీయులు : జనచైతన్య వేదిక

**గుంటూరుతూర్పు,మే3,ప్రభాతవార్త:** కీర్తిశేషులు పబ్బరాజు వెంకటేశ్వరరావు 1996లో శ్రీ షిరిడి సాయి దీనజన సేవా సమితి గుంటూరులో స్థాపించి వందలాది పేద, అంధ విద్యార్థులకు భోజన, వసతి తోపాటు విద్యను అందించిన



మహనీయులు అని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి పేర్కొన్నారు. ఈనెల 3వ తేదీన కీర్తిశేషులు పబ్బరాజు వెంకటేశ్వరరావు 4వ వర్ధంతి గుంటూరులోని శ్రీ షిరిడి సాయి దీనజన సేవాసమితి అంధుల, వికలాంగుల,అనాధల శిక్షణాలయంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులువెలగపూడి పాండురంగారావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ మానవ సేవే మాధవ సేవ అని గుర్తించి కీర్తిశేషులు పబ్బరాజు వెంకటేశ్వరరావు 1996లో శ్రీ షిరిడి సాయి దీన జన సేవా సమితిని స్థాపించి గత 29 సంవత్సరాలుగా అంధులైన వందలాది విద్యార్థులకు ఉచితంగా భోజన వసతితో పాటు విద్యను అందించి చిరస్మరణీయులైనారు అని తెలిపారు. బ్రెయిలీ లిపితోపాటు ఆడియో క్యాసెట్స్ ద్వారా 10వ తరగతితో పాటు ఉచితంగా విద్యను కంప్యూటర్ శిక్షణ పోటీ పరీక్షలకు తర్ఫీదు ఇవ్వడం లాంటి కార్యక్రమాలకు అంధ విద్యార్థులకు సేవలు అందించిన మహనీయులు కీర్తిశేషులు పబ్బరాజు వెంకటేశ్వరరావు అని కొనియాడారు. పోటీ పరీక్షల శిక్షణ ద్వారా 43 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు లభించాయని గుర్తు చేశారు. అంధునిగా ఉంటూ తన ప్రతిభతో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీనియర్ ఆఫీసర్ గా పనిచేస్తున్న తను బుద్ధి కోటిరెడ్డి ప్రసంగిస్తూ పట్టుదల, క్రమశిక్షణ, నిబద్ధతతో కృషి చేస్తే అంధత్వం అభివృద్ధికి అడ్డుకాదన్నారు. అంధులైనప్పటికీ అనితర కృషితో హెడ్ మాస్టర్ గా అభివృద్ధి చెందిన నల్లపు రామకృష్ణారెడ్డి ప్రసంగిస్తూ బ్రెయిలీ లిపి తో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని విద్యతోపాటు అన్ని రంగాలలో అంధులు సైతం అత్యున్నత స్థాయికి ఎదిగిన వారు ఎందరో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ షిరిడి సాయి దీనజన సేవాసమితి కార్యదర్శి పి.ఎస్. మూర్తి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణుభట్ల జయ, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నేత ఎన్. తిరుపతయ్య తదితరులు ప్రసంగించారు. తొలుత కీర్తిశేషులు పబ్బరాజు వెంకటేశ్వరరావు చిత్రపటానికి వక్తలు, అతిథులు, పూల మాలలు వేసి పుష్పాంజలి ఘటించి, నివాళులు అర్పించారు.

## సామాన్య ప్రజల కొనుగోలు శక్తిని పెంచాలి

**గుంటూరు కల్చరల్, మే 3,ప్రభాతవార్త :** వ్యవసాయ రంగాన్ని ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా ప్రజల కొనుగోలు శక్తిని పెంచాలని తద్వారా పారిశ్రామిక ఆర్థిక రంగాలను మెరుగు పర్చాలని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన చర్చా



కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు విజ్ఞప్తిచేశారు. సంస్థకార్యాలయంలో "పారిశ్రామిక ఉత్పత్తిలో తగ్గుదల-ఆర్థిక మాంద్యం"అన్న అంశంపై చర్చ జరిగింది. చర్చలో ఆర్థికశా శాఖోపన్యాసకులు చేగిరెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ గత నాలుగేళ్లలో ఎన్నడూలేని విధంగా ఈ ఏడాది పారిశ్రామిక ఉత్పత్తిలో తగ్గుదల నమోదు కావడం భారత ఆర్థిక వ్యవస్థకు ఒక ప్రమాద ఘటికగా భావించాలన్నారు. సామాన్య ప్రజల కొనుగోలు శక్తి నానాటికీ తగ్గుతున్న పర్యావసానమే ఇదన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ అత్యంతగా పురోగమిస్తుందని ఢంకా భజాయిస్తున్న కేంద్ర సర్కార్ పనితీరుకు ఇది అక్షరాల ప్రతికూల నిదర్శన మన్నారు. విద్యావేత్త ఇ.చంద్రయ్య మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి గురించి కబుర్లతో కాలక్షేపం చేయకుండా క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవాలను అనుగుణంగా వ్యవహరించాలన్నారు. చర్చలో విశేషకులు ఆర్.పి.సింగరయ్య,కొండా శివరామిరెడ్డి,తదితరులు ప్రసంగించారు.

## శ్రవణానందంగా గాత్రకచేరి

**గుంటూరు కల్చరల్, మే 3,ప్రభాతవార్త :** స్థానిక లక్ష్మీపురంలోని శ్రీత్యాగరాజ స్వామి కళావేదికపై గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో శనివారం జరిగిన కర్ణాటక సంగీత కచేరి ప్రేక్షకులను ఆకట్టుకుంది. తొలుత పి.ఎల్.జయంతి, డాక్టర్ పి.చంద్రశేఖర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక



కళాకారులు శ్రీత్యాగరాజ విరచిత పంచరత్న కీర్తనలను గోష్ఠిగానం నిర్వహించారు. ప్రముఖ సంగీత విద్వాంసురాలు బి.ప్రపూర్ణ మధు గాత్రధారణలో పలువురు వాగ్గేయకారుల కీర్తనలను శ్రావ్యంగా ఆలాపించారు. వయొలిన్ పై ఏ.కామాక్షి,పి.ఎల్. జయంతి, మృదంగంపై కుందుర్తి అరవింద్,హెచ్.సూర్య వాయిద్య సహకారం అందించారు. కార్యక్రమాలను సంస్థ ప్రధాన కార్యదర్శి ఎం.వై.శేషసాయి పర్యవేక్షించారు.

## క్రైస్తవులకు పాస్టర్ ప్రవీణ్ పేరిట రక్షణ చట్టం ప్రభుత్వం తీసుకురావాలి

### -దీక్షలు విరమించిన క్రైస్తవ నాయకులు

**గుంటూరు విద్య, మే 3,ప్రభాతవార్త :** క్రైస్తవ ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 23నుండి కలెక్టరేట్ ఎదుట అన్ని చర్చి భాగస్వామ్యంతో పాస్టర్ ప్రవీణ్ హత్య విషయంలో హైకోర్టు జడ్జి పర్యవేక్షణలో దర్యాప్తు జరపాలని,పాస్టర్లు,చర్చిల రక్షణ కోసం ప్రవీణ్ పేరిట రక్షణ చట్టం ఏర్పాటుచేయాలని



తదితర డిమాండ్లతో జిల్లా కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు.నగరంలో నాలుగు మూలల నాలుగు క్రైస్తవ సమాధి తోటలకు స్థలం కేటాయించాలని అన్నిమతాల మధ్యన సామరస్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఒక పథకాన్ని రూపొందించాలని డిమాండ్‌చేస్తూ రిలే నిరాహార ప్రార్థన దీక్షలను ప్రారంభించారు.ఈ వ్యవహారంలో రాష్ట్రప్రభుత్వం కూడా స్పందించి రెండు లేఖలను ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులకు పంపడం జరిగింది.కలెక్టర్ నాగలక్ష్మి కూడా తాను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాయడం జరిగిందన్నారు. దరిమెల 10రోజులపాటు దీక్షలు ఉధృతంగా జరిగిన సందర్భంలో కలెక్టర్ తనప్రతినిధిగా పశ్చిమ తహశీల్దార్‌ని మే నెల 3వ తేది సాయంత్రం 4.30గంటలకు పంపగా నాయకులందరూ తమకు సంబంధించిన డిమాండ్ పత్రాన్ని క్రైస్తవ లోకం అనుభవిస్తున్న బాధల్ని ఏకరువు పెట్టారు. తాను ఒక నివేదికను తయారుచేసి కలెక్టర్ కి అలాగే తద్వారా కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపే వ్యవహారంలో సహకరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. క్రైస్తవుల సమాధి తోటలు గుంటూరు నగరానికి సంబంధించిన సమస్యలు ఒక నెలలో సలుకు కూడా తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా యూపిఎఫ్ నాయకులు రాంబాబు,మెసెజ్ ప్రార్థనా మందిరం మధు జాన్సన్‌రాజు పాస్టర్, ఇమ్మానియేల్ మినిస్ట్రీస్ కాపరి ఎన్.ఇమ్మానుయేల్,డాక్టర్‌దివాకర్ బాబు, మహిమా మినిస్ట్రీస్ పాస్టర్ బుక్యా జార్జి, గుంటూరు జిల్లా పాస్టర్ల సంఘం అధ్యక్షులు ఆరుమళ్ళ మార్క్స్,జకిన్ ప్రార్థనా మందిరం అధ్యక్షులు పాస్టర్ సురేష్,క్రైస్తవ హక్కుల పరిరక్షణ కమిటీ నాయకులు కంచర్ల డేవిడ్,బడుగు రత్నకుమార్,ఐడియా నాయకులు పల్లెకొండ రవి,కొలిగిపూడి రాంబాబు,జాతీయ దళిత క్రైస్తవ వాచ్ రాష్ట్ర నాయకురాలు గద్దె రత్నశ్రీ క్రైస్తవ యువజన నాయకులు బూదాల డేనియల్ లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా దీక్షలను ఉద్దేశించి సామాజికవేత్త డాక్టర్ గోళ్ళమూడి మాట్లాడుతూ, ప్రభుత్వం తక్షణమే హైకోర్టు జడ్జి పర్యవేక్షణలో సిబిఐ దర్యాప్తు జరిపించి పాస్టర్ ప్రవీణ్ విషయంలో నిజాలు వెలికి చేయాలని హంతకులను శిక్షించాలని, పాస్టర్లు, చర్చిలు, క్రైస్తవుల రక్షణకోసం పాస్టర్ ప్రవీణ్ పేరిట రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# కృష్ణాజలాలు వెంటనే సరఫరా చేయాలి

### - ఎన్‌హెచ్-30 విస్తరణ పనులు వెంటనే పూర్తిచేయాలి - కామ్రేడ్ దోనేపూడి శంకర్ డిమాండ్

**ఎ కొండూరు, మే3, ప్రభాతవార్త :** ఎ కొండూరు మండలం గొల్లమండల గ్రామంలో సిపిఐ పార్టీ సీనియర్ నాయకుడు కామ్రేడ్ దాడి ఆదినారాయణ అధ్యక్షతన మండల కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ




సమావేశంలో సిపిఐ పార్టీ ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి ఎస్ సుబ్బారావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తూము కృష్ణయ్య, కౌలు రైతుల సంఘం ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల డేవిడ్ ఎ కొండూరు మండల కార్యదర్శి ఎం వెంకటేశ్వరరావు పాల్గొని ఈ సమావేశంలో వ్యక్తలు ప్రసంగించారు. ముఖ్యంగా కామ్రేడ్ దోనేపూడి శంకర్ మాట్లాడుతూ తిరువూరు నియోజకవర్గంలో తిరువూరు, ఎ కొండూరు, గంపలగూడెం, విసన్నపేట మండలాల్లో ముఖ్యంగా ఎ కొండూరు గిరిజన లంబాడా తండాల ప్రభావిత గ్రామాల్లోని కిడ్నీ బాధితుల కోసం కృష్ణాజలాలు సరఫరా కోసం మొదటి సారిగా బాధితుల తరపున పోరాటాలు చేసి ఎ కొండూరు నుండి విజయవాడ కలెక్టరేట్ వరకు కిడ్నీ బాధితులతో పాదయాత్ర చేసి అప్పటి కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందచేసి ద్వారా సిఎం చంద్రబాబును డిమాండ్ చేసి కృష్ణాజలాల పైప్‌లైన్ పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేసి సిఎం చంద్రబాబు వద్ద సాధించిన ఘనత సిపిఐ పార్టీదేనని కామ్రేడ్ దోనేపూడి శంకర్ పేర్కొన్నారు. అలాగే ఇబ్రహీంపట్నం మైలవరం తిరువూరు జగదల్‌పూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు గత 10 సంవత్సరాలుగా నిలిచిపోవడంతో ప్రయాణీకులు ప్రజలు ఎన్నో అవస్థలు పడుతున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్‌హెచ్-30 ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఈ జాతీయ రహదారి విస్తరణ ప్రమాదకర మలుపు పనులను వెంటనే తిరిగి ప్రారంబించి, జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుని రహదారి విస్తరణ పనులు వెంటనే పూర్తి చేసి ప్రయాణం సులభతరం చేయాలని లేనిపక్షంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జాతీయరహదారి దిగ్బంధనం చేసి పోరాటం నిర్వహిస్తామని కామ్రేడ్ దోనేపూడి శంకర్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఎన్‌హెచ్-30 ఉన్నతాధికారులను హెచ్చరించారు.

## మాన్యం ఇళ్ల స్థలాలకు రిజిష్ట్రేషన్ కల్పించాలి

### ప్రజలచే సిపిఎం సంతకాల సేకరణ

**తిరువూరు, మే 3, ప్రభాతవార్త :** తిరువూరు పట్టణంలో నిషేదంలో ఉన్న మాన్యం ఇళ్ల స్తలాలకు భూములకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని సిపిఎం నాయకులు కార్యకర్తలు ప్రజలచేత సంతకాల సేకరణ చేపట్టారు. అశోక్‌నగర్ శాంతినగర్ సుగాలి కాలనీ ప్రాంతాల్లో గతంలో రిజిస్ట్రేషన్ కలిగిన



మాన్యం భూములపై ప్రభుత్వం విధించిన నిషేధంతో రిజిష్ట్రేషన్ అవకాశంలేని ఇళ్లకు వెళ్లి సంతకాలు సేకరించారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి మేకల నాగేంద్ర ప్రసాద్, నాయకులు బి వెంకటేశ్వరరావు, ఎ రవి, పంతంగి శ్రీనివాసరావు, కాగితం రాము, కార్యకర్తలు తుపాకుల కృష్ణ, యలగందుల ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మోడీ విధానాలతో ఆహార భద్రతకు ముంచుకొస్తున్న ప్రమాదం

### -ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి

**ఎ కొండూరు, మే 3, ప్రభాతవార్త :** భారతదేశ ప్రధాని మోడీ అమెరికా ఒత్తిడికి పూర్తిగా లొంగిపోవడం వల్ల భారతదేశంలో ఆహార భద్రతకు పెనుప్రమాదం రాబోతుందని



ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ ఆరోపించారు. మండలంలోని రేపూడిలో మాట్లాడుతూ మన వ్యవసాయంలో అత్యంత ముఖ్యమైన ఆహార ధాన్యాల ఉత్పత్తిపై కంపెనీల కన్నుపడిందని 33 కోట్ల మెట్రిక్ టన్నుల ఉత్పత్తిని విధ్వంసం చేసి విదేశాలకు ఎగుమతి ఆధారిత పంటలకు అమెరికా ఒత్తిడికి ప్రధాని మోడీ ప్రభుత్వం పూర్తిగా లొంగిపోయి రైతులపై భారాలు మోపి తీవ్రంగా ఇబ్బందులకు గురి చేస్తుందని, బలవంతంగా రైతులను వ్యాపార పంటల వైపు మళ్ళించడమే వ్యవసాయ చట్టాల ఉద్దేశ్యమని కోట కళ్యాణ్ విమర్శించారు. గత రెండు బడ్జెట్ల కేటాయింపుల్లో లక్షకోట్లు నిధులు వ్యవసాయానికి తగ్గించారని మోడీ విధానాలను కళ్యాణ్ తీవ్ర స్థాయిలో దుయ్యబట్టారు. ఈ ఆహార భద్రత వల్ల 10కోట్ల కుటుంబాలు ఆహారభద్రత కొరతతో ఇబ్బందులు పడుతుంటే మోడీ ప్రభుత్వం కంపెనీ వ్యవసాయానికి ఆరాటపడుతుందని, సన్నచిన్నకారు రైతులు వ్యవసాయ కార్మికులు గ్రామీణ పట్టణ పేదలు ఉపాధిలేక వలసల బారిన పడుతున్నారు. ఉపాధి హామీ రూ.2.5లక్షల కోట్ల నిధులు ఇవ్వాల్సి ఉండగా రూ.86వేల కోట్ల నిధులతో మోడీ ప్రభుత్వం సరిపుచ్చుకుందని విమర్శించారు. దేశవ్యాప్తంగా మే 20న జరిగే గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కూలీలు, గ్రామీణ శ్రామికులు సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కళ్యాణ్ పిలుపునిచ్చారు.కార్యక్రమంలో వ్య.సా.కా. మండల కార్యదర్శి ఆనందరావు, ఉపాధి హామీ మేట్లు జ్యోతి, ఆర్.జ్యోతి, వెంకటేశ్వరమ్మ, వెంకటరత్నం, నారాయణ, మేట్స్ కూలీలు పాల్గొన్నారు.

## సమ్మర్‌క్యాంప్ పెయింటింగ్స్‌లో 3సంవత్సరాల బాలుని ప్రతిభ

**ఎ కొండూరు, మే 3, ప్రభాతవార్త :** ఎ కొండూరు మండలం కంభంపాడు గ్రామంలో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్ఆర్ఆర్ క్రియేషన్స్ చైర్మన్ ఎన్ రూపారేణుక, ఫౌండర్ ఎం రేవతి బలరామ్ ఆధ్వర్యంలో వేసవిలో 30రోజులపాటు నిర్వహిస్తున్న ఉచిత సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న 3ఏళ్ల బాలుడు ఒరుగంటి రేయాన్ష్ పెయింటింగ్స్‌లో ప్రతిభ కనబరిచాడు. ఆర్ఆర్ఆర్ క్రియేషన్స్ చైర్మన్ ఫౌండర్ అక్కడ స్వయం ఉపాధి పొందుతున్న మహిళలను ఇంకా ఇతర పిల్లలను అబ్బుర పరుస్తున్నాడు. ఈ చిన్నారి రేయాన్ష్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గతంలో సాధించిన సంగతి మన 'వార్త' పాఠకులకు విధితమే ఈ 3ఏళ్ల చిన్నారి రేయాన్ష్ పెయింటింగ్స్ వేయడం పట్ల చిన్నారికి తర్ఫీదు ఇచ్చిన చైర్మన్ రూపారేణుక ఫౌండర్ రేవతి బలరామ్‌ను కంభంపాడు పట్టణ ప్రజలు ప్రశంసించారు.

## ఉన్నత విద్యతోనే బంగారు భవిష్యత్తు

### -వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసీ ధర్మచరణ్

**గుంటూరు విద్య,మే 3,ప్రభాతవార్త :** ప్రతి విద్యార్థి తాను అభ్యసించే విద్యపై అశ్రద్ధ వహించకూడదని ఉన్నత విద్య ద్వారానే విద్యార్థుల జీవితాలు బంగారు బాటలో నడుస్తాయని వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసీ ధర్మచరణ్ అన్నారు.స్థానిక అరండల్‌పేట 11/3లోని వేద సీడ్స్‌లో గుడివాడలో నివసిస్తున్న భూపేష్, పురుషోత్తం ప్రసాద్ అనే విద్యార్థికి ఇంటర్ సెకండీయర్ పూర్తి చేసుకొని తదుపరి సిఏ ఫౌండేషన్



కోచింగ్ కొరకు తమ వంతు రూ.30వేల ఆర్థికసాయం తులసీ ధర్మచరణ్ చేతుల మీదుగా అందించారు.ఈ సందర్భంగా ధర్మచరణ్ మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డుకాకూడదన్నారు.దేశ సేవలో ఎంతోమంది గొప్ప వ్యక్తులు ఉన్నారని వారందర్నీ ఆదర్శంగా తీసుకోవాలన్నారు.ప్రతి ఒక్కరూ తమస్థాయికి తగ్గట్లు పేద విద్యార్థులను ఆదరించాలని పిలుపునిచ్చారు.భవిష్యత్తులో ప్రతి ఒక్కరూ ఉన్నత స్థానానికి చేరుకొని పేద విద్యార్థులకు సాయం అందించాలన్నారు.

## మంగళగిరి ప్రెస్ క్లబ్‌లో ఘనంగా ప్రపంచ పత్రిక స్వేచ్ఛ దినోత్సవం

**మంగళగిరి,మే3,ప్రభాతవార్త:** జర్నలిస్టులు నైతిక విలువలను పాటిస్తేనే జర్నలిజం బ్రతుకుతుందని మంగళగిరి ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బందెల దయాకర్ అన్నారు. ప్రపంచ పత్రిక స్వేచ్ఛ దినోత్సవాన్ని పురస్కరించుకొని, మంగళగిరి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ప్రెస్ క్లబ్ నందు గెట్ టు గెదర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీనియర్ జర్నలిస్ట్ ఈపూరి రాజారత్నం ఇటీవల కదలిరండి కలం వీరులై కలసి రండి.. ప్రజాస్వామ్య వాదులై కదలి రండి అనే గీతాన్ని. రచించారు. ఈ గీతాన్ని ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ద్వారా గానం చేయించారు. ఈ గీతాన్ని ప్రెస్ క్లబ్ అసోసియేషన్ జర్నలిస్టుల సమక్షంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బందెల దయాకర్ మాట్లాడుతూ, జర్నలిస్టుగా తన జీవితంలో ఎన్నో అనుభవాలు ఎదుర్కొన్నానని అన్నారు. పలు సందర్భాల్లో నిద్రలేని రాత్రులు గడిపినట్లు తెలిపారు. జర్నలిస్టులందరికీ ప్రపంచ పత్రిక స్వేచ్ఛ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.సీనియర్ జర్నలిస్ట్, రచయిత ఈపూరి రాజారత్నం మాట్లాడుతూ. తాను రెండు పుస్తకాలను రచించానని మొదటి పుస్తకం జర్నలిజం జర్నలిస్టులు పరిశోధనాత్మక కథనాలు పేరిట 2023లో విడుదల చేసినట్లు చెప్పారు. జర్నలిజం బేసిక్స్ అనే పుస్తకాన్ని 2024 నవంబర్ 16న జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా సచివాలయంలో హౌసింగ్ అండ్ సమాచార పౌర సంబంధాల శాఖ మినిస్టర్ కొలుసు పార్థసారథి చేతులమీదుగా ఆవిష్కరించినట్లు చెప్పారు. ప్రెస్ క్లబ్ సహాయ కార్యదర్శి సీనియర్ జర్నలిస్ట్ నాయుడు నాగరాజు మాట్లాడుతూ, ప్రజాస్వామ్యానికి మూల స్తంభం మీడియా అని అన్నారు. జర్నలిజం పవిత్రమైన వృత్తి అని తెలిపారు.జర్నలిజం బేసిక్స్ పుస్తకాన్ని ప్రెస్ క్లబ్ లైబ్రరీకి ప్రధాన కార్యదర్శి దయాకర్ ద్వారా రాజా రత్నం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కోశాధికారి బత్తుల సాంబశివరావు (సాంబ), ఉపాధ్యక్షులు షేక్ సుభాని, కార్యదర్శులు మెడకాయల మస్తాన్ రావు, ఎం సిరిబాబు, సహాయ కార్యదర్శి చదలవాడ సాయిచంద్, జర్నలిస్ట్ ఎల్ టి వి అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

## వీధికుక్కల కుటుంబ నియంత్రణకు ప్రణాళికాబద్ధమైన చర్యలు

**గుంటూరు కార్పొరేషన్,మే3,ప్రభాతవార్త :** గుంటూరు నగరంలో వీధికుక్కల కుటుంబ నియంత్రణకు ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటున్నామని, నిర్దేశిత ప్రమాణాలు పాటిస్తూ రోజువారీ లక్ష్యానికి అనుగుణంగా ఏబిసి చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ వెంకటేశ్వరరావు, సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఏటుకూరు రోడ్ లోని జీఎంసి ఏబిసి సెంటర్ ని కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ తొలుత ఏబిసి ఆపరేషన్ థియేటర్లు, మెడిసిన్స్ స్టోర్, సర్జరీ అనంతరం కుక్కలను ఉంచే గదులు, వాటికి ఇస్తున్న ఆహారాన్ని నేరుగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సెంటర్ లో నిర్దేశిత ప్రమాణాలతోనే ఏబిసి జరగాలన్నారు. గత నెల 23న పునః ప్రారంభించిన ఏబిసి సెంటర్ లో ప్రస్తుతం ప్రతి రోజు 25 కుక్కలకు ఏబిసి, యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్ జరుగుతుందని, సంఖ్యని పెంచడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సెంటర్, పరిసరాలను పరిశుభ్రంగా




ఉంచడం, కుక్కలకు తగిన ఆహారం సమయానికి అందించడంలో సిబ్బంది భాధ్యతగా ఉండాలన్నారు. ఏబిసి సెంటర్ ని వారంలో 2 లేదా 3 ఆకస్మిక తనిఖీలు చేస్తామని, సిబ్బంది నిరక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. నగర ప్రజలు కూడా వీధి కుక్కల వలన ఏమైన సమస్యలు ఎదురైతే నగరపాలక సంస్థ కాల్ సెంటర్ 08632345103 కి కాల్ చేయవచ్చని తెలిపారు.

## అమరావతి కార్యక్రమాలకు పిలుపులేదని న్యాయవాదుల అలక!

**గుంటూరు లీగల్,మే 3,ప్రభాతవార్త :** అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమాలకు తమకు పిలుపు లేదని న్యాయవాదులు అలకబూనారు.రాజ్యాంగంలో తొలి మూల స్తంభమైన న్యాయవ్యవస్థకు అవమానం జరిగిందని గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు యంగలశెట్టి శివసూర్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు.అమరావతి ప్రాంతంలోని హైకోర్టుతోపాటు అటు ఇటు ఉన్న కృష్ణా,గుంటూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులును విస్మరించడం తగదన్నారు.కార్యక్రమం విజయవంతంగా జరిగినందుకు అభినందనలు తెలియజేస్తూ,ఇటువంటి బృహత్తర కార్యక్రమంలో తమ పాత్ర లేకుండా,న్యాయవాదులను,బార్ అసోసియేషన్ లను విస్మరించడం బాధ కలిగిందన్నారు.పునర్నిర్మాణ పనులకు,తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు.పిలుపు అంశంతోపాటు,న్యాయవాదుల సమస్యలు,ఇళ్ళ స్థలాలు మంజూరు వంటి అంశాలపై మాట్లాడేందుకు కలెక్టర్‌ను,ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ను కలుస్తామని శివ సూర్యనారాయణ పేర్కొన్నారు.

## అమరావతి సభ అజరామరం

**అమరావతి, మే 3 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్‌కు నిన్న చరిత్రలో మరిచిపోలేని రోజు, రాజధాని అమరావతిలో జరిగిన నిర్మాణ పనుల పున: ప్రారంభ కార్యక్రమ బహిరంగ సభలో అఖిలభారత పంచాయితీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు, అమరావతి కమిటీ ఛైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జాస్తి వీరాంజనేయులు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దార్శనిక నాయకత్వంలో రూ.58,000 కోట్ల విలువైన ప్రాజెక్ట్‌ల ప్రారంభోత్సవం, శంఖుస్థాపనతో రాష్ట్ర చరిత్రలో ఒక నూతన అధ్యాయం ప్రారంభ మైంది. అమరావతిని ప్రపంచ స్థాయి రాజధా నిగా మార్చే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిన్న కార్యక్రమాన్ని ఏ ఇబ్బందులు ఏ ఆటంకాలు లేకుండా పూర్తి చేశారు. అమరావతి, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి అండగా ఉంటామనే భరోసాను ప్రధాని మోదీ సభలో తెలపడం ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఒక జోష్ నింపిందని అఖిల భారత పంచాయతీ పరిషత్ ఉపాధ్యక్షులు జాస్తి వీరాంజనేయులు తెలిపారు.

## కొనసాగుతున్న వేసవి శిక్షణా తరగతులు

**అమరావతి, మే 3 ప్రభాతవార్త :** అమరావతి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి. లైబ్రరీయన్ వెంకాయమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులకు శనివారం మెడిటేషన్, యోగా, స్టోరీ టెల్లింగ్, బుక్ రివ్యూ, జనరల్ ఎవేర్‌నెస్ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకాయమ్మ మాట్లాడుతూ వేసవి శిక్షణా తరగతులను




విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్సీ కార్పొరేషన్ స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తు చేసుకోండి : కమిషనర్

**మాచర్ల, మే3, ప్రభాతవార్త:** ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మాచర్ల మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను మాచర్ల పురపాలక సంఘ పరిధిలో ఎస్సీ లబ్ధిదారులు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లబ్ధిపొందేందుకు వివిధ పథకాలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. గత అయిదేళ్లుగా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎలాంటి లబ్ధిపొందని వారు, దారిద్ర్య రేఖకు దిగువనున్న అభ్యర్థులు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 29 మంది లబ్ధిదారులకు వివిధ యూనిట్ల కింద రూ.64.81 లక్షలు మంజూరయ్యాయన్నారు. రూ.44.20 లక్షలు సబ్సిడీ ఉంటుందన్నారు. కారు, నాలుగు చక్రాల ఆటో, ఆటోలు, గూడ్స్ ట్రక్, ప్లంబింగ్, ఫ్లవర్స్, మొబైల్ రిపేర్, మొబైల్ కార్ వాష్, జ్యూట్ బ్యాగు, జనరిక్, ఎల్ఈడీ, వాటర్ రీ ఫిల్లింగ్, సోప్, బేకరీ, సెరీ కల్చర్, కాయర్, బ్యూటీ పార్లమర్, వర్మీకంపోస్టు, వాటర్ రీసైక్లింగ్, టూరిజం, ఆర్ఓ వాటర్ ప్లాంట్, ఆయుర్వేదిక్ వంటి యూనిట్లకు ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**పిడుగురాళ్ళ,మే3,ప్రభాతవార్త:** పట్టణంలోని వికాస్ పబ్లిక్ పాఠశాలలో 200405 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం ఘనంగా జరిగింది. 20 ఏళ్ల తర్వాత కలుసుకున్న విద్యార్థులు తమ చిన్నానాటి జ్ఞాపకాలను, వారి మధురానుభూతులను పంచుకున్నారు. నాడు గురువులు నేర్పిన క్రమశిక్షణ, చదువుతో ఈరోజు వివిధ రంగాల్లో ఉన్నత స్థాయిలలో ఉన్నామన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వికాస్ పబ్లిక్ స్కూల్



డైరెక్టర్ మూల్పూరి వెంకటారామయ్య మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. తమ వద్ద విద్యాబుద్ధులు నేర్చుకున్న విద్యార్థులు ఇవాళ వివిధ రంగాల్లో స్థిరపడి ఉండటం సంతోషకరమన్నారు. అనంతరం విద్యార్థులు గురువులను ఘనంగా సన్మానించారు.

## చిన్నారుల మనోవికాసం కొరకు 30రోజుల ఉచిత సమ్మర్ క్యాంపులు

**ఎ కొండూరు, మే 3, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలం కంభంపాడు గ్రామంలో (త్రిబుల్ఆర్)




ఆర్ఆర్ఆర్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వేసవిలో చిన్నారుల మనోవికాసం కొరకు 30 రోజుల పాటు ఉచిత సమ్మర్ క్యాంప్‌లను అట్టహాసంగా వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఆర్ఆర్ క్రియేషన్స్ చైర్మన్ ఎన్ రూపారేణుక ఎంఎస్సీ,ఎమ్ఈడి మాట్లాడుతూ 2 సంవత్సరాల క్రితం ఆర్ఆర్ఆర్ క్రియేషన్స్ హ్యాండ్ మేడ్ విత్ లవ్ అనే లోగోతో ఇన్‌స్టా ఫేస్‌బుక్ యూట్యూబ్‌ల ద్వారా దేవ విదేశాల్లో ఉత్పత్తులు ఎగుమతి చేస్తున్నట్లు తెలిపారు. కంభంపాడు పట్టణంలో మహిళలకు ఉపాధి కల్పన కొరకు అలాగే వివాహాలు ఎంగేజ్ మెంట్లకు వినియోగించే ప్లేట్లను వినూత్న రీతిలో అలంకరించి వాటిని సరఫరా చేసు్తన్నట్లు చైర్మన్ రూపారేణుక తెలిపారు. ఈ కార్యక్రమంలో 20మంది మహిళలు స్వయం ఉపాధి పొందుతున్నారని రూపా రేణుక తెలిపారు ఇంకా పిల్లల ఆశక్తిని అనుసరించి పెయింటింగ్స్ ఆటలు నిర్వహిస్తున్నట్లు అలాగే స్థానిక కుమ్మరి బజార్‌లో మట్టి కుండలు తయారు చేసే విధానాన్ని పిల్లలకు ప్రోడక్ట్ వర్క్‌గా మట్టి కుండలు తయారు చేస్తారనే అంశంపై అవగాహన కొరకు కుమ్మరి బజార్ సందర్శించినట్లు రూపారేణుక తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఆర్ఆర్ఆర్ క్రియేషన్ ఫౌండర్ ఎం రేవతి బలరామ్ పాల్గొన్నారు.

## సాంసంగ్ గెలాక్సీ స్మార్ట్‌ఫోన్లపై డీల్స్

విజయవాడ, మే 3, ప్రభాతవార్త : పరిమిత కాల ఆఫర్లలో భాగంగా ఎంపిక చేసిన గెలాక్సీ ఎ, ఎం, ఎఫ్ సిరీస్ స్మార్ట్‌ఫోన్లపై అద్భుత తగ్గింపు ఇస్తున్నామని సాంసంగ్ ఇండియా ప్రతినిధులు ప్రకటించారు. 5జి ఫోన్లు అయిన గెలాక్సీ ఎ 55, గెలాక్సీ ఎ 35 , గెలాక్సీ ఎం 16, గెలాక్సీ ఎఫ్ 16, గెలాక్సీ ఎం 06, గెలాక్సీ ఎఫ్ 06ల ధరల్లో గొప్ప తగ్గింపులో ఇస్తున్నామన్నారు.

4-5Pg5.qxd:4-5Pg5.qxd 01/01/01 8:33 AM Page 1







## ప్రపంచ పెద్దావిడగా ఇంగ్లండ్ మహిళ

**లండన్, మే 3:** ప్రపంచంలోనే అత్యధిక వయసు కలిగిన వ్యక్తిగా ఇంగ్లండ్‌కు చెందిన ఏథెల్ కేటర్‌హామ్(115) నిలిచారు. 116 ఏళ్ల జీవించిన సిస్టర్ ఇనా కనబారో లుకాస్ ఇటీవల కన్నుమూయడంతో ఇపుడు ఏథెల్‌కు ఈఘనత దక్కింది. ఆమె 1909 ఆగస్టు 21న జన్మించారు. ప్రస్తుతం ఆమె కేంబెర్లీలోని విలాసవంతమైన హాల్‌మార్క్ లేక్‌వ్యూ నర్సింగ్‌హోమ్‌లో నివసిస్తున్నారు. ఎవరితోనూ వాదనలకు దిగకుండా ప్రశాంతంగా గడపడమే తన సుదీర్ఘజీవిత రహస్యమని ఏథెల్ చెప్పారు. 18 ఏళ్ల వయసులో ఆమె భారత్‌కు వచ్చి ఒక బ్రిటిష్ కుటుంబంలో మూడేళ్లపాటు పిల్లల సంరక్షకురాలిగా కూడా పనిచేసారు.

# శిర్గాంవ్ ఆలయంలో తొక్కిసలాట

## ఆరుగురు మృతి, 50 మందికి గాయాలు

**పనాజి, మే 3:** గోవాలో తీవ్ర విషాదం జరిగింది. శిర్గావ్‌లోని ఓ ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మృతి చెందారు. మరో 50 మందికి పైగా భక్తులు త్రీవంగా గాయపడ్డారు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన గోవా సీఎం ప్రమోద్ సావంత్ తొక్కిసలాటలో గాయపడిన వారిని పరామర్శించారు. ఈ ప్రమాదంపై రాష్ట్రపతి, ప్రధానమంత్రి స్పందించారు. శిర్గావ్‌లోని శ్రీ లైరాయ్ ఆలయంలో శుక్రవారం నుంచి వార్షిక జాతర ప్రారంభమైంది. దీంతో లైరాయ్ అమ్మవారిని దర్శించుకునేందుకు గోవా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఆ ఆలయంలో అనాదిగా వస్తున్న నిప్పులపై నడిచే ఆచారం ఉంది. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో వేలాది మంది పాల్గొన్నారు. ఆ సమయంలో ఒక్కసారిగా రద్దీ కావడం వల్ల భక్తులు ఒకరినొకరు తోసుకోవడంతో తొక్కిసలాట జరిగింది. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు నార్త్ గోవా పోలీసులు వెల్లడించారు. సమాచారం తెలుసుకున్న ఎమర్జెన్సీ సర్వీసెస్ సిబ్బంది, పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపు తెచ్చేందుకు ప్రయత్నించారు. సహాయక



చర్యలు చేపట్టి క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. జాతర దృష్ట్యా వచ్చే రద్దీని నియంత్రించేందుకు ఆలయ నిర్వాహకులు ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని పోలీసులు అనుమానిస్తున్నారు. తొక్కిసలాట ఘటనపై రాష్ట్రపతి దౌప్రది ముర్మ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన వారు తర్వగా కోలుకోవాలని ఆశిస్తున్నట్లు ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. ఈ ఘటనపై గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆస్పత్రికి తొక్కిసలాటలో గాయపడిన వారిని పరామర్శించారు. అంతేకాకుండా ఘటనాస్థలాన్ని కూడా పరిశీలించారు. అయితే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తనకు ఫోన్ చేసిన తొక్కిసలాట ప్రమాదంపై ఆరా తీసినట్లు పేర్కొన్నారు. అన్ని విధాలా అండగా ఉంటామని కేంద్రం భరోసా ఇచ్చినట్లు తెలిపారు.



# డ్రాగన్ రహస్యాలు చెప్పండి

## జిన్‌పింగ్ అసంతృప్తులకు యుఎస్‌ఎ ఆఫర్

**వాషింగ్టన్, మే 3:** చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ పాలనలో అణచివేతను ఎదుర్కొంటున్న అక్కడి ప్రభుత్వ ఉద్యోగులను ఉద్దేశిస్తూ అమెరికా నిఘా సంస్థ సిఐఎ సంచలన ప్రకటన చేసింది. 'రండి.. మాతో కలిసి పనిచేయండి' అంటూ మాండరిన్ భాషలో రిక్రూట్‌మెంట్ విడియోలను విడుదల చేసింది. సైనిక పరంగా, వ్యూహాత్మకంగా చైనా తమకు అతిపెద్ద విరోధిగా భావిస్తున్న అగ్రరాజ్యం బీజింగ్ చేపడుతున్న గూఢచర్య ఆపరేషన్లకు ప్రతిచర్యగా ఈ నియామకాలు చేపట్టినట్లు తెలుస్తోంది. చైనా అధికారుల నుంచి రహస్యాలు సేకరించేందుకే ఈ విడియోలని సిఐఎ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్ చెప్పడం గమనార్హం. 'నిఘా వ్యవస్థలో మానవ వనరులను పెంచుకోవడంతో పాటు చైనాపై మరింత దృష్టి పెట్టేందుకు ఈ చర్యలు చేపట్టాం. ఆర్థికంగా, సైనికపరంగా, సాంకేతికతంగా ప్రపంచంపై ఏకఛత్రాధిపత్యం చెలాయించాలని చైనా భావిస్తోంది. ఆ దేశం నుంచి మాకు గూఢచర్యం ముప్పు పొంచి ఉంది. దాన్ని పరిష్కరించుకునేందుకే ఈ విడియోలు విడుదల చేశాం. చైనా అధికారుల నుంచి రహస్యాలు సేకరించడమే వాటి లక్ష్యం' అని రాట్‌క్లిఫ్ వెల్లడించారు. అమెరికా సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (సిఐఎ) యూట్యూబ్, 'ఎక్స్' ఖాతాల్లో ఈ రెండు విడియోలను విడుదల చేయగా గంటల వ్యవధిలోనే 50 లక్షలకు పైగా వ్యూస్ వచ్చాయి.

రెండు నిమిషాలకుపైగా నిడివి ఉన్న ఈ విడియోల్లో అధ్యక్షుడు జిన్‌పింగ్ కమ్యూనిస్టు పార్టీలో అవినీతి వ్యతిరేక ఉద్యమం పేరుతో రాజేసిన నిప్పును ఉదహరిస్తూ సినిమాటిక్ సన్నివేశాలను జోడించారు. నిజాయితీగా పనిచేస్తున్న ఓ పార్టీ నాయకుడు అధికార ఒత్తిళ్లకు తలొగ్గాల్సిన పరిస్థితిలో ఉంటాడు. దాన్ని అంగీకరించలేక, భయంతో బతకలేక సిఐఎను ఆశ్రయిస్తున్నట్లుగా ఆ విడియోలో ఉంది.

'నా జీవితాన్ని, నా భవిష్యత్తును నా కంట్రోల్‌లో ఉంచుకోవాలంటే సిఐఎలో చేరాలి' అనే క్యాప్షన్‌తో అమెరికా సంస్థ ఈ విడియోలను విడుదల చేసింది. చైనా అధికారులకు మరింత చేరువవ్వాలనే ఉద్దేశంతో మాండరిన్ భాషలో రూపొందించింది. ప్రస్తుతం ఈ విడియోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. వీటిపై చైనా ఇంకా స్పందించలేదు.

# రామ్ దర్బార్‌లో దేవతామూర్తుల విగ్రహాలు

**అయోధ్య, మే 3:** అయోధ్య రామాలయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రామాలయం మొదటి అంతస్తులోని రామ దర్బార్‌లో దేవతా విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ముహూర్తం ఖరారైంది. పవిత్రమైన గంగా దసరా రోజున జూన్ 5న దేవతామూర్తులను ప్రతిష్ఠించనున్నారు. తర్వాతి రోజు (జూన్ 6) నుంచి రామయ్య దర్శనం కోసం భక్తులను అనుమతించనున్నారు. జూన్ 3 నుంచి అయోధ్య రామ మందిరంలో మూడు రోజులపాటు మతపరమైన కార్యక్రమాలు జరుగుతాయి. అన్ని విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ వేడుకలు జూన్ 5తో ముగుస్తాయి. ఆ తర్వాత రామ భక్తులకు దర్శనం లభిస్తుంది. రామదర్బార్‌లో రామయ్య, సీత, లక్ష్మణుడు, ఇతర దేవుళ్ల దర్శనం కోసం శ్రీరామజన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్టు కీలక నిర్ణయం తీసుకుంది. ముందుకుగా వచ్చేవారి కోసం 750 పాస్‌లను జారీ చేయాలని నిర్ణయించింది. దేవాలయ



ప్రాంగణంలో సమావేశమైన ఆలయ కమిటీ ఈ మేరకు వెల్లడించింది. రామాలయ నిర్మిస్తున్న ఎల్ అండ్ టీ, టాటా ఇంజినీర్లతో కలిసి ఆలయ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా నిర్మాణ పనులను పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న పనుల పురోగతిపై ఆందోళన వ్యక్తం చేశారు.

ఆలయ సముదాయంలో నిర్మిస్తున్న ఏడు దేవాలయాల పనులు మే నెల చివరినాటికి పూర్తవ్వాలని ఆదేశించారు. ఇప్పటికే రామాలయ సముదాయంలోని రెండు దేవాల యాల్లో మినహా అన్నింట్లోనూ ఉత్సవమూ ర్తులను ప్రతిష్ఠించారని నృపేంద్ర మిశ్రా తెలి పారు. మే 23న రామ దర్బార్ గర్భగుడిలో విగ్రహాలు ప్రతిష్ఠిస్తామని వెల్లడించారు. మే 30కంటే ముందే లక్ష్మణుడి విగ్రహాన్ని శేషావతార్ ఆలయంలో ప్రతిష్ఠ చేస్తామని పేర్కొన్నారు. అన్ని దేవాలయాలలో విగ్రహాలను ప్రతిష్టించిన తర్వాత పూజలు స్పష్టం చేశారు. జూన్ 3, 5 వరకు అయోధ్య రామాలయంలో మతపరమైన కార్యక్రమాలు జరుగుతాయి. ఆ తర్వాత భక్తుల దర్శనానికి ఏర్పాట్లు చేస్తాం. మొదటి అంతస్తులో భక్తుల బరువు, రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయాన్ని నిర్మించాం. మొదటి అంతస్తులోకి భక్తుల ప్రవేశం ఆధారంగా సీబీఆర్ఐ రూర్కీ మూడు నెలల పాటు అధ్యయనం నిర్వహిస్తుంది. ఆలయంలోని రాళ్లు ఏమైనా దెబ్బతిన్నాయా లేదా అని పరిశీలిస్తుంది. అందుకు ఆలయంలో 10 సెన్సార్లు ఏర్పాటు చేశామని నృపేంద్ర మిశ్రా తెలిపారు.


# పర్వతాల్లో సరదా హైకింగ్..



## కాళ్ల కింద రూ. 2.87కోట్ల నిధి

**ప్రాగ్వే, మే 3:** ప్రకృతిని ఆస్వాదిద్దామని హైకింగ్‌కు వెళ్లిన ఇద్దరు వ్యక్తులకు అనూహ్యంగా కోట్లాది రూపాయల సంపద దొరికింది. చెక్ రిపబ్లిక్‌లోని ఈశాన్య పర్వతాల్లో ఈ సంఘటన వెలుగుచూసింది. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం చెక్ రిపబ్లిక్‌లోని పోడ్కర్కోనోసి పర్వతాల్లో ఇటీవల ఇద్దరు పర్యాటకులు హైకింగ్‌కు వెళ్లారు. అలా వారు ముందుకు వెళ్తుండగా ఆ ప్రాంతంలో 598 బంగారు నాణేలు, ఆభరణాలు, పొగాకు సంచులు కనిపించాయి. అంత మొత్తాన్ని అక్కడ చూసిన పర్యాటకులు ఆశ్చర్యపోయారు. ప్రస్తుతం ఈ సంపద అంతా ఈస్ట్ బొహెమియన్ మ్యూజియంలో ఉంది. ఇది జరిగింది ఫిబ్రవరి నెలలో అయినా తాజాగా మ్యూజియం ఆ విషయాన్ని ఇప్పుడు వెల్లడించింది. స్వాధీనం చేసుకున్న నాణేలు 1808 కాలం నాటివిగా గుర్తించినట్లు తెలిపింది. ఫ్రాన్స్, బెల్జియం, ఒట్టోమాన్ సామ్రాజ్య కాలం నాటి ఆ నాణేలు 1921 తర్వాత ఎవరైనా దాచిపెట్టి ఉంటారని అధికారులు భావిస్తున్నారు. వంద సంవత్సరాల క్రితమే వాటిని భూమిలో దాచిపెట్టినట్లు అంచనా వేస్తున్నారు. 'హైకర్స్ ఆ సంపదను చూపించినప్పుడు నేను ఎంతో ఆశ్చర్యపోయా. వీటిని ఇంకా విశ్లేషించాల్సి ఉంది. అయితే ఆ విలువైన లోహాల ప్రారంభ విలువే రూ. 2.87కోట్లు (340,000 డాలర్లు) గా ఉండొచ్చు. భూమిలో విలువైన వస్తువులను నిధుల రూపంలో నిల్వ చేయడం ప్రీహిస్టారిక్ సమయంలో ఒక ఆచారంగా ఉండేది. అనిశ్చిత పరిస్థితులు నెలకొన్న సమయంలో దానిని భూమిలో దాచి, తర్వాత వచ్చి దానిని తీసుకుందామనుకునే ఉద్దేశమే ఈ నిధి వెనక కారణం కావొచ్చు'అని మ్యూజియం ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. రెండో ప్రపంచయుద్ధ సమయంలో నాజీలు ఈనిధిని దాచి ఉండొచ్చన్న వాదనా ప్రచారంలో ఉంది. అయితే చెక్ రిపబ్లిక్ చట్టాల ప్రకారం ఆ నిధిలో పదిశాతం హైకర్స్‌కు దక్కొచ్చని ఉందని మీడియా కథనం పేర్కొంది.

# ఖండాంతర క్షిపణిని పరీక్షించిన పాక్



**న్యూఢిల్లీ, మే 3:** సర్ఫేస్ టు సర్ఫేస్ అబ్దలి బాలిస్టిక్ క్షిపణిని పాకిస్థాన్ పరీక్షించింది. శనివారం ఆ పరీక్ష జరిగింది. సుమారు 450 కిలోమీటర్ల దూరం ఆ క్షిపణి ప్రయాణించగలదు. పెహల్గామ్ ఉగ్రదాడి ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్థాన్ ఆర్మీ సైనిక విన్యాసాలు చేపడుతున్నది. దానిలో భాగంగా క్షిపణి పరీక్ష జరిగినట్లు తెలుస్తోంది. అబ్దలి వెపన్ సిస్టమ్‌ను పాకిస్థాన్ టెస్ట్ చేసింది. ఇండస్ విన్యాసాల్లో భాగంగా ఆ వెపన్ వ్యవస్థను పరీక్షించినట్లు ఇస్లామాబాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నది. యుద్ధ సన్నద్ధతలో భాగంగా ఆ క్షిపణి పరీక్షించినట్లు ఐఎస్పీఆర్ పేర్కొన్నది. ఆర్మీ స్ట్రాటజీ ఫోర్సెస్ కమాండ్ ఆ పరీక్షను ప్రత్యక్షంగా వీక్షించింది. క్షిపణి పరీక్ష సక్సెస్ కావడంతో ప్రెసిడెంట్ అసిఫ్ అలీ జర్దారి, ప్రధాని షెహబాజ్ షరీఫ్‌లు శుభాకాంక్షలు తెలి పారు. ఇండస్ కసరత్తుల్లో భాగంగానే ప్రయోగించామని పాక్ చెపుతోంది. సైనికుల కార్యాచరణ, సంసిద్ధతను నిర్ధారించడం, క్షిపణుల అధునాతన నావిగేషన్ వ్యవస్థ సహా కీలకమైన సాంకేతిక పరిమితులను ధృవీకరించడమే లక్ష్యంగా ఈప్రయోగంచేసినట్లు ప్రకటించింది. గతనెల 24,25 తేదీల్లో కరాచీ తీరం వెంబడి ఎకనామిక్ ఎక్స్‌క్లూజివ్‌జోన్‌లో భూతలం నుంచి గగనతలంపైకి క్షిపణి ప్రయోగాలు నిర్వహించేందుకు పాక్ నోటిఫికేషన్ విడుదలచేసింది. తర్వాత గతనెల 26,27 తేదీల్లో మరోసారి మళ్లీప్రకటనచేసింది. తాజాగా గతనెల 30, మే 2 మధ్య మరోసారి పరీక్షలుచేపడుతున్నట్లు ప్రకటించింది. అయితే పాక్ తరచూ ఇలాంటి ప్రకటనలు చేస్తూ భారత్‌ను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే గడచిన తొమ్మిది రోజులుగా వాస్తవాధీనరేఖ వెంబడి పాక్ సైన్యం వరుసగా కాల్పులు జరుపుతోంది. ఉగ్ర దాడి తర్వాత భారత్ తమపై ప్రతీకార దాడిచేసే అవకాశం ఉందని పాక్ మంత్రులు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. ఈ క్రమంలో అక్కడి ప్రభుత్వం సరిహద్దుల్లో భారీ సైన్యాన్ని మోహరిస్తున్నది.



## పెళ్లికాబోతున్న యువతిపై యాసిడ్ దాడి

**ఆజమ్‌ఘర్, మే 3:** ఉత్తరప్రదేశ్‌లో దారుణం జరిగింది. 25 ఏళ్ల యువతిపై ఓ వ్యక్తి యాసిడ్‌తో దాడి చేశాడు. ఆ దాడిలో ఆమె ముఖం, భుజం, మెడ, శరీర పైభాగం తీవ్రంగా కాలాయి. వివరాల్లోకి వెళ్తే ఈ ఘటన యూపీలోని మో జిల్లాలో జరిగింది. రీమాకు ఇటీవలే పెళ్లి ఫిక్సైంది. ఆ పెళ్లి కోసం ఆమె ఏర్పాట్లు చేసుకుంటోంది. ఖర్చుల కోసం బ్యాంక్‌కు వెళ్లి డబ్బులు తీసుకువస్తున్న సమయంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆమెను అడ్డగించారు. దాంట్లో ఓ వ్యక్తి యాసిడ్ తీసి ఆమెపై చల్లాడు. నువ్వు నాకు దక్కకుంటే, ఇంకెవ్వరికీ దక్కవద్దు అంటూ వార్నింగ్ ఇచ్చాడు. నిందితుడిని రామ్ జనమ్ సింగ్ పటే ల్‌గా గుర్తించారు. అతను రిమాతో కొన్నాళ్లు రిలేషన్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే మరో వ్యక్తితో పెళ్లి కుదుర్చుకోవడాన్ని అతను వ్యతిరేకించాడు. మే 27వ తేదీన రీమా పెళ్లి జరగాల్సి ఉన్నది. యాసిడ్ దాడితో తీవ్ర గాయాలైన ఆమెను ప్రస్తుతం ఆస్పత్రిలో చేర్పించారు. ఆజమ్‌ఘర్‌లోని గ్లోబల్ ఆస్పత్రిలో ఆమెకు చికిత్స చేస్తున్నారు. నిందితుడు పటేల్‌తో పాటు మరో బైకర్‌ను అరెస్టు చేశారు. దాడికి వాడిన బైక్‌ను కూడా సీజ్ చేశారు. నిందితుడు తాను కేవలం రీమా వెనుక భాగంలో యాసిడ్ చల్లాలనుకున్నట్లు చెప్పాడు. ఒకవేళ ఆమె పెళ్లి ఆగిపోతే అప్పుడు ఆమెను పెళ్లి చేసుకోవచ్చు అన్న ఉద్దేశాన్ని అతను వ్యక్తం చేశాడు.



## సిఐఎలో భారీగా ఉద్యోగాలకు కత్తెర

**వాషింగ్టన్, మే 3:** అమెరికాలో ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్యను తగ్గించడమే లక్ష్యంగా పెట్టుకున్న ట్రంప్ యంత్రాంగం భారీ ఎత్తున ఉద్యోగాల్లో కోత విధిస్తున్న విషయం తెలిసిందే. ఈ ఉద్యోగాల తొలగింపు ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. ఇందులో భాగంగా అమెరికా ప్రభుత్వం తాజాగా సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీలో సంస్కరణలకు సిద్ధమైంది. ఏజెన్సీలోని 1200 మంది ఉద్యోగులను తొలగించడానికి కసరత్తు జరుగుతున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. ఇదే పంథాలో మరికొన్ని ఏజెన్సీలలోనూ వేలాది ఉద్యోగుల తొలగింపులు ఉంటాయని వెల్లడించాయి. అయితే ఈ నివేదికలపై సిఐఎ ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో స్పందించాల్సి ఉంది.


సిఐఎలోని ప్రణాళికాబద్ధమైన కోతల గురించి అమెరికా ప్రభుత్వం చట్టసభ సభ్యులకు తెలియజేసినట్లు సమాచారం. ఏజెన్సీలో ఇకపై నియామకాల తగ్గింపునకు నిర్ణయాలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఏజెన్సీలో కొత్త శక్తిని నింపడానికి మరింత మెరుగ్గా మార్చడానికి చేపట్టిన సమగ్ర వ్యూహంలో భాగంగా కొన్ని మార్పులు చేస్తున్నట్లు సిఐఎ ప్రతినిధి రాట్‌క్లిఫ్ తెలిపారు. తన నేతృత్వంలో సిఐఎ వ్యక్తిగత పక్షపాతాలు లేకుండా నిష్పాక్షికంగా పని చేస్తోందన్నారు. ఎంత కష్టమైనప్పటికీ తాము ప్రపంచంలో ఎవరూ వెళ్లలేని ప్రదేశాలు వెళ్లి ప్రతి మూలలోని నిఘా సమాచారాన్ని సేకరిస్తామన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల కోతల్లో భాగంగా ట్రంప్ యంత్రాంగం అక్కడి ప్రభుత్వ విభాగాలపై కొరడా ఝుళిపిస్తోంది. ఇందులో భాగంగా ఆరోగ్య శాఖలో 10వేల ఉద్యోగాలు, రెవెన్యూ సర్వీసులో 20 వేల ఉద్యోగాలు, 24వేల సైనిక ఉద్యోగాలు తొలగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్మిక శక్తిని 82 వేల నుంచి 62 వేలకు తగ్గించుకోనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఉద్యోగాల తొలగింపునకు ట్రంప్ సర్కారు బైఅవుట్‌ను అస్త్రంగా చేసుకుంది. ఈ మేరకు ఒక ఈమెయిల్ 20 లక్షల మంది ఉద్యోగులకు పంపారు. స్వచ్ఛందంగా ఉద్యోగాలను వదులుకొంటే ఎనిమిది నెలల జీతం ఇస్తారని అందులో పేర్కొన్నారు.

ఉద్యోగాలు మానేద్దామని అనుకొని ఆగిపోయిన వారు దీనిని ఎంచుకోవచ్చు. దీని ద్వారా ఇప్పటివరకు దాదాపు 40వేల మంది ఉద్యోగాల నుంచి తప్పుకున్నట్లు తెలుస్తోంది. దేశంలో అనవసర ఖర్చులు తగ్గించడమే లక్ష్యం గా ట్రంప్ డోజ్ విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఉద్యోగాల కోత విషయంలో మస్క్ నేతృత్వంలోని డోజ్ విభాగం కీలక పాత్ర పోషించింది. ఈ ఉద్యోగాల తొలగింపు వల్ల అమెరికాకు వేల బిలియన్ డాలర్లు ఖర్చు మిగులుతుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు.

# దేశంలో పలు రాష్ట్రాల్లో పిడుగుల వానలు

**న్యూఢిల్లీ, మే 3:** దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో పిడుగుల తో కూడిన వర్షం పడే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం ఇండియన్ మెటియరోలాజికల్ డిపార్టుమెంట్ హెచ్చరించింది. ప్రభావిత ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తప్పనిసరిగా అవసరమైన ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించింది. రాజస్థాన్, మధ్యప్రదేశ్,విదర్భ, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, బీహార్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో పిడుగులతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని తెలిపింది. తూర్పు రాజస్థాన్ మొదలు పశ్చిమ మధ్యప్రదేశ్, తూర్పు మధ్యప్రదేశ్, విదర్భ, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, బీహార్ మీదుగా గంగా పరివాహక పశ్చిమబెంగాల్ వరకు పిడుగుల వాన పడే ప్రమాదం ఉందని ఐఎండీ పేర్కొంది. పైన పేర్కొన్న అన్ని ప్రాంతాల్లో వడగండ్ల వాన కూడా పడే అవకాశం ఉందని తెలిపింది. అదేవిధంగా అసోం, కర్ణాటక, ఉత్తరాఖండ్‌లోని వేర్వేరు ప్రాంతాల్లో జల్లులు కురుస్తాయని వెల్లడించింది. ఆయా ప్రాంతాల్లో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని తెలిపింది.



## కూలి కుటుంబాన్ని చిదిమేసిన భారీ వర్షం



**న్యూఢిల్లీ:** ఆకస్మికంగా కురిసిన భారీ వర్షం ఒక వ్యక్తి జీవితాన్ని అతలాకుతలం చేసింది. చెట్టు కూలి అతడి ఇంటిపై పడింది. దీంతో కుటుంబంలోని వారంతా మరణించారు. భార్యా పిల్లలు చనిపోయారు. పేద కూలీ అయిన అతడు మాత్రమే బతికిబయటపడ్డాడు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ విషాద సంఘటన జరిగింది. శుక్రవారం ఢిల్లీలో కుండపోతగా వర్షం కురిసింది. నజాఫ్‌గఢ్‌లోని ఖర్ఖరి నహర్ గ్రామంలో నివసిస్తున్న 30ఏళ్ల పేద కూలీ అజయ్ ఇంటిపై వేప చెట్టు కూలింది. ఆ ఇంట్లో నిద్రిస్తున్న అతడి భార్య 28 ఏళ్ల జ్యోతి, ముగ్గురు పిల్లలైన ఏడేళ్ల ఆర్యన్, ఐదేళ్ల రిషబ్, ఏడు నెలల ప్రియాంష్ మరణించారు. గాయపడిన అజయ్ ఆసుపత్రిలో చికిత్స పొంది డిశ్చార్జ్ అయ్యాడు. అకాల వర్షం వల్ల కుటుంబంలోని వారందరినీ కోల్పోయిన అతడు ఒంటరిగా మిగిలాడు. కాగా, ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ జిల్లాకు చెందిన అజయ్ పేద వ్యవసాయ కూలీ. ఢిల్లీలోని ఖర్ఖరి నహర్ గ్రామంలోని శిథిలావస్థకు చేరిన చిన్న ఇంట్లో ఐదేళ్లుగా ఒంటరిగా నివసిస్తున్నాడు. పొలంలో పనులు చేసి జీవిస్తున్నాడు. కష్టపడిన డబ్బును సొంతూరిలో ఉంటున్న భార్యకు పంపేవాడు.

మరోవైపు అజయ్ ఇటీవల ఉత్తరప్రదేశ్‌లోని సొంత గ్రామానికి వెళ్లాడు. భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి ఢిల్లీలోని గ్రామంలో నివసిస్తున్న ఇంటికి తిరిగి వచ్చాడు. ముగ్గురు కొడుకులకు మంచి భవిష్యత్తు ఇవ్వాలన్న ఉద్దేశంతో వారిని స్కూల్‌లో చేర్పించాడు.ఆర్థికంగా నిలదొక్కుకున్న తర్వాత మంచి ఇంట్లోకి మారాలని భావించాడు. కాగా, శుక్రవారం తెల్లవారుజామున కురిసిన భారీవర్షానికి పాతఇంటిపై చెట్టు పడింది. ఆ ఇల్లు కూలడంతో అందులో నిద్రిస్తున్న అజయ్ భార్య, ముగ్గురు పిల్లలు మరణించారు. గాయాలతో బయటపడిన అతడు మాత్రమే ప్రాణాలు దక్కించుకున్నాడు. మరో వైపు కుటుంబ సభ్యులందరినీ అజయ్ కోల్పోవడం చూసి ఇరుగుపొరుగు వారు చలించి పోయారు. వర్షం అతడి కుటుంబానికి తీవ్ర నష్టం కలిగించిందని వాపోయారు. పొలంలో కష్టపడి పని చేసే పేద కూలీ, ఇతరులకు సహాయం చేసే అతడికి విధి ఇంత దారుణం చేస్తుందని ఎవరూ ఊహించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.కుటుంబ సభ్యులతోపాటు సర్వం కోల్పోయిన అజయ్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు అభ్యర్థించారు.

## ఒక్కరూపాయి, కొబ్బరికాయతో వివాహం

**సహరాన్‌పూర్(యుపి),మే 3:** వరకట్నం కోసం వేధింపులు జరుగుతున్న ఈ కాలంలోనూ ఓ యువకుడు పెద్ద మనసును చాటుకున్నాడు. పెళ్లి సందర్భంగా అత్తామామలు ఇచ్చిన రూ.31 లక్షల వరకట్నాన్ని వాళ్లకే తిరిగి ఇచ్చేసి తోటి యువతకు ఆదర్శంగా నిలిచాడు. వరుడి సూచన మేరకు కేవలం ఒక రూపాయి నాణెం, ఒక కొబ్బరికాయతో మొత్తం వివాహ క్రతువును పూర్తి చేశారు. ఈ ఘటన హరియాణాలోని కురుక్షేత్రలో ఏప్రిల్ 30న జరిగింది. ఉత్తర్ ప్రదేశ్‌లోని సహరాన్‌పూర్ జిల్లా భాబ్సి రాయ్ పూర్ గ్రామానికి చెందిన శ్రీపాల్ రాణా కుమారుడు వికాస్ రాణా యువ న్యాయవాది. అభ్యుదయ భావాలు కలిగిన వ్యక్తి. ఆయన తండ్రి శ్రీపాల్ రాణా బీఎస్పీ టికెట్‌పై యూపీలోని కైరానా లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేశారు. అయితే, శ్రీపాల్ రాణా కుమారుడు వికాస్ రాణాకు హరియాణాలోని లుఖీ గ్రామానికి చెందిన అగ్రికా తన్వర్‌తో పెళ్లి సంబంధం కుదిరింది. వివాహ ముహూర్తం ప్రకారం ఏప్రిల్ 30న వికాస్ రాణా కుటుంబం ఊరేగింపుగా హరియాణాలోని కురుక్షేత్రకు వెళ్లారు. ఆ నగరంలోని ఒక హోటల్‌లో అట్టహాసంగా వివాహ వేడుకకు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా తిలకం వేడుక జరుగుతున్న సమయంలో వధువు తల్లిదండ్రులు, పెళ్లికొడుకు వికాస్ రాణాకు వరకట్నంగా రూ.31లక్షల నగదును ఇచ్చారు. అయితే వరుడు వికాస్, వరకట్నం తీసుకోకుండా పెద్ద మనసును చాటుకున్నాడు. వరకట్నం తీసుకోవడం, ఇవ్వడం సామాజిక దురాచారం అని చెబుతూ, ఆ డబ్బు తీసుకోవడానికి నిరాకరించాడు. ఆ డబ్బును పెళ్లి కూతురి తల్లిదండ్రులకు తిరిగి ఇచ్చేశాడు. తమకు వధువే ఒక కట్నం అని వికాస్ రాణా అన్నారు. దీంతో వికాస్ రాణా, అగ్రికా తన్వర్‌ల పెళ్లి వేడుకను కేవలం ఒక కొబ్బరికాయ, ఒక రూపాయి నాణెంతో జరిపించారు. కట్నం తీసుకోకపోవడం ద్వారా వికాస్ రాణా సభ్య సమాజానికి, ఈతరం యువతకు గొప్ప సందేశాన్ని ఇచ్చారు. నా కొడుకు వికాస్ రాణా కర్ణాటక హైకోర్టులో న్యాయవాది. కోడలు అగ్రికా తన్వర్ పోస్ట్ గ్రాడ్యు యేట్. అభ్యుదయ భావంతో నా కుమారుడు వరకట్నం తీసుకోలేదని శ్రీపాల్ రాణా చెప్పారు. ఇలాంటి ఘటనలు వరకట్నం కోరుకునే యువతకు చెంపదెబ్బ లాంటివని అంటున్నారు.



## సింధుజలాల మళ్లింపు నిర్మాణాలను పేల్చేస్తాం



### పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ ప్రేలాపనలు

**ఇస్లామాబాద్, మే 3:** పహల్గాంవ్‌లో పర్యాటకులపై ఉగ్రదాడితో భారత్ పాకిస్థాన్‌ల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఆ దాడి తర్వాత పాక్ నడ్డివిరిచేలా కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంది. అందులో సింధుజలాల ఒప్పందం అమలు నిలిపివేత కూడా ఒకటి. దీని గురించి మాట్లాడుతూ తాజాగా పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ ప్రేలాపనలు చేసారు. సింధుజలాలను మళ్లించేందుకు భారత్ ఏ నిర్మాణం చేపట్టినా ధ్వంసం చేస్తామంటూ ప్రేలాపనలు చేసారు. పహల్గాంవ్‌లోని బైసారన్ లోయలో గతనెల 22న పర్యాటకులపై ఉగ్రవాదులు పాశవిక దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇలా ఇరుదేశాలమధ్య వైషమ్యాలు తారస్థాయికిచేరిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అయితే ఇందుకు ప్రతిగా నదీజలాల ఒప్పందాన్ని పక్కనపెట్టడం ఇదేప్రథమం. పాకిస్థాన్ ఆర్థికవ్యవస్థపై ఈ నిర్ణయం తీవ్ర ప్రభావంచూపిస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

ఈ ఒప్పందం నిలిపివేత పాక్ నేతలు పలుమార్లు భారత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసారు. పాక్ మాజీ విదేశాంగమంత్రి పిపిపి చీఫ్ భిలాలవల్ భుట్టో జర్దారీ నోరు పారేసుకున్నారు. సింధునదిలో నీరు పారకపోతే రక్తం పారుతుందంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసారు. సింధూనది తమదేనని ఆ నాగరికతకు నిజమైన సంరక్షకులం తామేనంటూ పలు అసందర్భపు వ్యాఖ్యలు చేసారు.

## నేటితో ముగియనున్న ఎప్ సెట్ పరీక్షలు

### శనివారం పరీక్షలకు 93.8 శాతం హాజరు

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ఎప్(ఈఏపి) సెట్-2025 పరీక్షలు నేటి(ఆదివారం)తో ముగియనున్నాయి. ఏప్రిల్ 29, 30 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు జరగగా.. మే 2 నుంచి ఇంజనీరింగ్ పరీక్షలు జరుగుతున్నాయి. నేటితో ఇంజనీరింగ్ పరీక్షలు కూడా ముగియనున్నాయి. రెండోరోజు పరీక్షల ప్రశాంతంగా జరిగాయని ఎప్ సెట్- 2025 కన్వీనర్ ప్రొఫెసర్ డీన్ కుమార్, కో కన్వీనర్, జేఎన్‌టీయూ రెక్టార్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం జరిగిన పరీక్షకు 93.87 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈఏపీ సెట్-2025కి 3,06,796 మంది దరఖాస్తు చేసుకోగా.. అందులో ఇంజనీరింగ్‌కి 2,20,049 దరఖాస్తులు వచ్చాయి. పరీక్షల నిర్వహణ కోసం 124 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలను రెండు సెషన్‌లలో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు .. తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనున్నారు. శనివారం ఇంజనీరింగ్ పరీక్షకి ఉదయం సెషన్‌లో 36,892 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 34,607 మంది హాజరయ్యారు. పరీక్షకు దరఖాస్తు చేసుకున్న వారిలో 93.81 శాతం మంది హాజరయ్యారు. రెండో సెషన్‌లో 36,885 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 34,620 మంది హాజరయ్యారు. రెండో సెషన్‌లో పరీక్షకు దరఖాస్తు చేసుకున్న వారిలో 93.86 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు.




అవార్డు స్వీకరిస్తున్న స్పోర్ట్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఎండి ఐఎఫ్‌ఎస్ అధికారి సోనిబాలదేవి

## తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీకి ఫుట్‌బాల్ ప్రోత్సాహక అవార్డు

**హైదరాబాద్, మే 5, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో ఫుట్‌బాల్ క్రీడను ప్రోత్స హించడంలో విశేషకృషి, సహకారం అందించినందుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణను అఖిలభారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఎఐఎఫ్‌ఎఫ్) ఎఐఎఫ్‌ఎఫ్ వార్షిక అవార్డుల దినోత్సవం సందర్భంగా సత్కరించింది. ఈ మేరకు భువనేశ్వర్‌లో జరిగిన వార్షికోత్సవాల్లో తెలంగాణకు ఈ అవార్డు అందజేయగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వైస్‌చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సోనిబాలాదేవి ఐఎఫ్‌ఎస్ ఈ అవార్డును అందు కున్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎఫ్‌ఎఫ్ అధ్యక్షుడు కల్యాణ్‌చౌబే, ఒడిశా గౌరవ ఉపముఖ్యమంత్రి కనక్‌వర్ధన్ సింగ్‌దేవ్, ఒడియా భాషా సాహి త్యం, సాంస్కృతిక శాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్, ఐఎఎస్, ఒడిశా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎండి సోనిబాలదేవి మాట్లాడుతూ ఇది తెలంగాణ ఫుట్ బాల్‌కు దక్కిన గౌరవమని, రాష్ట్రంలో క్రీడా సంస్కృతిని పెంపొం దించడానికి తెలంగాణ క్రీడాకారులకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. ఎఐఎఫ్‌ఎఫ్‌కు తెలంగాణ ప్రభుత్వం తరఫున ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

## బలహీనవర్గాల అభివృద్ధికి కృషిచేసిన దామోదర సంజీవయ్య

### కాంగ్రెస్ సీనియర్ నాయకుడు విహెచ్

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** బలహీనవర్గాల అభివృద్ధికి కృషిచేసిన నాయకుడు దామోదర సంజీవయ్య అని ఆయన వర్ధంతిని జరుపుకొని ఘనంగా నివాళ్ళు అర్పించాలని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు అన్నారు. గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు చెందిన దామోదర సంజీవయ్య వర్ధంతి మే 7 వ జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా నివాళులు అర్పించాడానికి పార్టీ ముఖ్య నేతలంతా హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.. దామోదర సంజీవయ్య వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహ ఆవిష్కరణ కోసం అదే రోజు వారి గ్రామానికి వెళ్తున్నా అని తెలిపారు. సొంత ఇల్లు లేని ఏకైక ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య అని ఆయన అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా దామోదర సంజీవయ్య అందించిన సేవలు వెలకట్టలేనివని గుర్తుచేసుకొన్నారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పిరియడ్ లో బలహీన వర్గాల కోసం దామోదర సంజీవయ్య ఎనలేని కృషి చేశారు . నెక్లెస్ రోడ్డులో ఉన్న సంజీవయ్య విగ్రహానికి నివాళులు అర్పించడానికి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు, శ్రేణులు భారీగా హాజరుకావాలని కోరినారు.

## రంగనాయకసాగర్‌లో ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థుల మృతి

**చిన్నకోడూరు, మే 3, ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులోని రంగనాయకసాగర్‌లో ఇద్దరు విద్యార్థులు ఈత కొడుతుండగా ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. సిద్దిపేట ఎసిపి మధు అందించిన వివరాల ప్రకారం.. వరంగల్ పట్టణానికి చెందిన యాకుబ్‌బాబా, యజాజిఅలీ రెండు కుటుంబాలు హైదారాబాద్‌కు వెళ్తూ మార్గమధ్యంలో రంగ నాయకసాగర్‌లో ఈత కొడుదామని వెళ్లినట్లు తెలిపారు. 8వ తరగతి చదువుతున్న యజాజి అలీ కుమారుడు అర్బాజ్(15), యాకుబ్‌బాబా కూతురు మెహరాజ్(13) రంగ నాయకసాగర్‌లో సరదా కోసం ఈత కొడు తుండగా నీటిలో గల్లంతై మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణ సంఘ టన స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్ల సహాయంతో వెతికి మెహరాజ్, అర్బా జ్ మృతదేహాలను బయటకు తీశారని తెలిపారు. బాధితులు ఫిర్యాదు మేం కు చిన్నకోడూరు పోలీసు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజలతో పోలీసులు స్నేహంగా మెలగాలి

### ఎస్‌హెచ్‌ఒల భేటీలో డిజిపి జితేందర్ వెల్లడి



డిజిపి కార్యాలయంలో శనివారం కొందరు ఎస్‌హెచ్‌ఒలతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న డిజిపి జితేందర్

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** పోలీసు స్టేషన్లకు వచ్చే ప్రజలతో పోలీసులు స్నేహంగా మెలగాలని, వారి సమస్యలు విని పరిష్కరించేందుకు తమ వంతుగా కృషి చేయాలని డిజిపి జితేందర్ అన్నారు. పోలీసులంటే ప్రజలకు గౌరవం పెరిగేలా చూడాలని ఆయన తెలిపారు. డిజిపి కార్యాలయంలో కొందరు ఎస్‌హెచ్‌ఒలతో శనివారం జరిగిన భేటీలో డిజిపి జితేందర్ మాట్లాడుతూ అమెరికా సహా అనేక దేశాల్లో పోలీసులు ప్రజలను మిత్రులుగా చూసేవిధంగా మసలుకోవాలని కోరారని అన్నారు. భారత్‌లో పోలీసులంటే ఇప్పటికీ భయం వుందనే భావన వుందని, అమెరికా సహా అనేక దేశాల్లో దీనికి విరుద్ధంగా వుండడంతో పాటు అక్కడి పోలీసులను ప్రజలు ఎంతో గౌరవిస్తారని, ఇలాంటి పద్ధతి మన దేశంలో రావాలని ఆయన అన్నారు. న్యాయం కోసం పోలీసు స్టేషన్లకు వచ్చేవారితో పోలీసులు సహృదయంతో మెలగాలని, ఇలా చేయడం వల్ల ప్రజల మనస్సులను గెలుచుకునే అవకాశం వుంటుందని ఆయన తెలిపారు. ఏదో కారణంగా పోలీసులు విధుల్లో పక్షపాత ధోరణితో వ్యవహరిస్తే దాని ప్రభావం మొత్తం పోలీసు శాఖపై పడుతుందని ఆయన అన్నారు. పోలీసులు ఎట్టి పరిస్థితుల్లోనూ పక్షపాత ధోరణికి దూరంగా వుండాలని ఆయన కోరారు. రాష్ట్రంలో జరుగుతున్న మిస్‌వరల్డ్ పోటీలకు బందోబస్తు నిమిత్తం పోలీసులు సన్నద్ధంగా వుండాలని డిజిపి జితేందర్ కోరారు. తమ తమ ప్రాంతాల్లో బందోబస్తును పక్కాగా ఏర్పాటు చేసుకోవాలని, ఎక్కడా తేడా రాకుండా చూడాలని ఆయన కోరారు.

దేశంలోనే ఉత్తమ పోలీసింగ్‌కు రాష్ట్ర పోలీసు శాఖ పెట్టింది పేరుగా ఉందని, దీనిని ఇలాగే కొనసాగేలా చూడాలని, మిస్‌వరల్డ్ పోటీలకు బందోబస్తు సవ్యంగా ఏర్పాటు చేసుకోవాలని ఆయన కోరారు. శాంతిభద్రతల అదనపు డిజిపి మహేష్ భగవత్ మాట్లాడుతూ మిస్‌వరల్డ్ పోటీలకు బందోబస్తును పక్కాగా ఏర్పాటు చేయాలని ఎస్‌హెచ్‌ఒలను కోరారు. ఈ పోటీలకు సమయం దగ్గర పడుతున్నందున పోలీసులు ఇతర విభాగాల అధికారులతో సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని ఆయన సూచించారు. కొందరు ఈ పోటీలను వ్యతిరేకిస్తున్నందున పోటీదారులకు భద్రత కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై వుందని ఆయన అన్నారు. మరో నెల రోజుల్లో వ్యవసాయ పనులు మొదలు కానుండడంతో కల్తీ విత్తనాలు, ఎరువుల బెడద లేకుండా పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఏఐజి రమణ కుమార్, డిఎస్‌పి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ డిఏలు మంజూరు చేయాలి

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి టిఆర్‌టిఎఫ్ విజ్ఞప్తి

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న డీఏలను మంజూరు చేయాలి తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్(టిఆర్‌టిఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు కొత్తగా నియమితులైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావుకి సంఘం నేతలు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పైన సంపూర్ణ అవగాహన కలిగి ఉన్న సీనియర్ ఐఎఎస్ అధికారి రామకృష్ణారావు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టడం పట్ల సంఘం నేతలు శనివారం ఆయనను కలసి శుభాకాంక్షలు తెలిపారు.

సిఎస్‌ని కలిసిన వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 5 డిఏలు పెండింగ్‌లో ఉన్నాయని, రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా మార్చి నెల తర్వాత పరిశీలిస్తామని గతంలోనే హామీ ఇచ్చినందున పెండింగ్ డీఏల విడుదలకు చొరవ తీసుకోవాలని కోరారు. వాటితోపాటుగా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల బిల్లులు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో పెట్టారని, వాటిని వెంటనే మంజూరు చేయాలని కోరారు.

పాత పెన్షన్ పునరుద్ధరణ, కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 2003 డీఎస్సీ వారిని పాత పెన్షన్ పరిధిలోకి తీసుకుని వచ్చేందుకు సత్వరం చర్యలు చేపట్టాలని టిఆర్‌టిఎఫ్ నేతలు సీఎస్‌కి విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయ బదిలీలు ప్రతి సంవత్సరం వేసవిలో నిర్వహించి విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే పూర్తి చేసేలా శాశ్వత బదిలీ కోడ్ రూపకల్పనకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఢిల్లీ పర్యటనతో రేవంత్‌రెడ్డి తెలంగాణకు ఏం సాధించారు?

### 42 సార్లు ఢిల్లీకి చక్కర్లుకొట్టినా నోరు మెదపడం లేదు: మాజీమంత్రి హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 3:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 42 సార్లు ఢిల్లీకి చక్కర్లు కొట్టినా.. తెలంగాణకు సాధించింది ఏంలేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఈ మేరకు శనివారం ఓ పత్రిక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణకు జరిగే నష్టంపై నోరు మెదపకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. మరోవైపు ఉపాధి హామీ కూలీలకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందని.. వారి జీవితాలతో ఆడుకుంటుందని హరీశ్‌రావు మండిపడ్డారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం, మరోవైపు కేంద్ర ప్రభుత్వం రెండు కలిసి ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని హరీష్‌రావు ఆరోపించారు. రాష్ట్రానికి మంజూరైనా నరేగా పనిదినాలను కేంద్ర ప్రభుత్వం సగానికి తగ్గించడం శోచనీయమని అన్నారు. 2024-25లో 12.22 కోట్ల పనిదినాలు మంజూరు చేయగా, ఈ సంవత్సరం కేవలం 6.5 కోట్ల పనిదినాలకే పరిమితం చేసిందని ఆరోపించారు.

కాంగ్రెస్, బీజేపీకి చెరో 8 మంది ఎంపీలు ఉన్నా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే నరేగా పనిదినాలు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 4 నెలల వేతనాలు చెల్లించాలని బిఆర్‌ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు హరీష్‌రావు పేర్కొన్నారు.

## త్వరలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ

### మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటి ఏర్పాటు చేసి అన్ని క్రీడల అభివృద్ధికి జిల్లాల వారిగా ప్రత్యేక అకాడమీలు నెలకొల్పుతామని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. క్రీడల్లో గ్రామీణ ప్రాంత యువత శిక్షణకు ప్రాధాన్యత నిచ్చేలా తనవంతు కృషి చేస్తానని ఆయన అన్నారు. చదువుతో పాటు ప్రతి ఒక్కరు క్రీడల్లో నైపుణ్యం పెంచుకోవాలని ఆయన కోరారు. శనివారం నాడు మంత్రుల నివాసంలో తనను కలిసిన తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన సలహాదారు కోసరాజు లక్ష్మణ్, మీడియా కో-ఆర్డినేటర్ వెంకటరమణారెడ్డిలను అభినందించారు. వారికి నియామక పత్రాలు అందజేసారు. బ్యాడ్మింటన్ క్రీడ మరింత విస్తరిం చేందుకు పాటు పడాలని తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు అయిన శ్రీధర్‌బాబు వారికి దిశానిర్దేశం చేసారు. మంత్రిని కలిసిన వారిలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఈవెంట్స్ అండ్ ప్రోటోకాల్ ప్రతినిధి యువిఎన్‌బాబు తదితరులు ఉన్నారు.

# ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేయాలి

### ఆహార, పౌర సరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి డిఎస్ చౌహాన్



**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** ధాన్యం కొనుగోలు ఏజన్సీలు ట్యాబ్ ఎంట్రీ వేగంగా చేస్తే ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవతంగా ముగుస్తుందని రైతు ఖాతాలోకి ఎమ్మెస్పీ డబ్బులు కూడా చేరుతాయని ఆహార పౌర సరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి డిఎస్ చౌహాన్ తెలిపారు. శనివారం హనుమకొండ జిల్లాలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీచేసి కొనుగోలు వ్యవహారాలను పరిశీలించి కొనుగోలు కేంద్ర నిర్వాహకులకు తగిన సూచనలు కూడా చేశారు. ఉనికిచర్ల, ధర్మసాగర్, తెల్లకులగూడెం ప్రాథమిక కొనుగోలు కేంద్రాల్లో ఆయన మాట్లా డుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అన్ని మౌలిక వసతులు కల్పించాలని టార్పాలిన్ కవర్లు ఉండాలని ప్యాడీ తేమ కొలిచేయంత్రాలు సరిగా పనిచేస్తున్నాయా లేవా చూసుకోవాలని కోరారు. రైతులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా వెంటవెంట జాప్యం లేకుండా కొనుగోలు చేయాలని సూచించారు. ధర్మరసాగర్ ఐకెపి కొనుగోలు కేంద్రంలో కూడా ఆయన తనిఖీ చేశారు. ప్రతి వరి కొనుగోలు కేంద్రానికి వాతావర ణ హెచ్చరికల సమాచరం కూడా అందిస్తున్నామని దీనిని బట్టి ధాన్యం తడవకుండా ఏర్పాట్లు చేసు కోవాలని సూచించారు.

సగటు నాణ్యతా ప్రమా ణాలు కలిగిన సరుకులు తీసుకొని రావాలని ఎలాంటి కోతలు ఉండవని ఆయన రైతులతో మా ట్లాడుతూ తెలిపారు. రైతులు తేమ, తాలు, మట్టిపెళ్లలు లేకుండా చూడాలని సూచించారు.

## జలమండలిపై అభివృద్ధి పనులపై పురపాలక శాఖ సెక్రటరీ ఇలంబర్తి సమీక్ష

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** జలమండలిలో పురోగతిలో ఉన్న ప్రాజెక్టులు, మంచినీటి సరఫరా మురుగునీటి వ్యవస్థ నిర్వహణపై రానున్న మూడు సంవత్సరాలను లక్ష్యంగా చేసుకుని చేపట్టాల్సిన కార్యాచరణపై పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి ఇలంబర్తి సమీక్ష నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో శనివారం జరిగిన ఈ సమీక్షా సమావేశానికి ఎండి అశోక్‌రెడ్డితో పాటు, ఇడి మయాంక్ మిట్టల్, డైరెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎండి అశోక్ రెడ్డి జలమండలిలో పురోగతిలో ఉన్న వివిధ ప్రాజెక్టులు, బోర్డులోని వివిధ విభాగాలు వాటి పనితీరు, నగరానికి నీటి సరఫరా, ఎస్‌టిపిలు, మురుగు శుద్ధి నిర్వహణతో పాటు భవిష్యత్తు ప్రణాళికలు, ప్రాజెక్టుల గురించి వారికి వివరించారు. అలాగే జలమండలిలో చేపట్టిన వివిధ సంస్కరణలు, రెవెన్యూ, ఐటి, ట్యాంకర్ బుకింగ్ డెలివరీ, మెట్రో కస్టమర్ కేర్, స్కాడా సిస్టం, పని చేసే ప్రాంతాల్లో కార్మికుల కోసం జలమండలి చేపట్టే రక్షణ చర్యలతో పాటు ఇప్పటి దాకా చేపట్టిన ప్రాజెక్టులు కృష్ణా, గోదావరి, హడ్కో రిజర్వాయర్లు, ఓఆర్ఆర్ ఫేజ్ 1, 2 ప్రాజెక్టులు, ముగురు శుద్ధి కోసం చేసే ఎస్‌టిపిల ప్రాజెక్టుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా పురపాలకశాఖ సెక్రటరీ ఇలంబర్తి మాట్లాడుతూ రానున్న మూడు నెలలు, సంవత్సరంలో జలమండలి చేపట్టే వివిధ ప్రాజెక్టులు, తాగునీరు, సివరేజ్ నిర్వహణపై కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అదేవిధంగా జలమండలి వేసవి కార్యాచరణపై చర్చించిన సెక్రటరీ నగరంలో టాంకర్ బుకింగ్, డెలివరీల సరళి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్లు సుదర్శన్, శ్రీధర్, ఫైనాన్స్ డైరెక్టర్ పద్మావతి, పర్సనల్ డైరెక్టర్ మహ్మద్ అబ్దుల్ ఖాదర్, సిజిఎంలు తదితరులు పాల్గొన్నారు.

## ఐ సెట్-2025 దరఖాస్తు గడువు 10వ తేదీ వరకు పెంపు

### ఇప్పటి వరకు 51,857 మంది దరఖాస్తు

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఐసెట్-2025కి సంబంధించిన దరఖాస్తు గడువును పొడిగిస్తున్నట్టు సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఆలువాల రవి తెలిపారు. శనివారం(మే 3)తో దరఖాస్తు గడువు ముగియడంతో.. విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు దరఖాస్తు గడువును ఈ నెల 10 వరకు పొడిగించినట్టు కన్వీనర్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను మార్చి 10 నుంచి ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్న విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను మార్చి 6న జారీ చేశారు. ఇప్పటి వరకు 51,857 మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షలను జూన్ 8, 9 తేదిల్లో రెండు సెషన్‌లలో నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు.. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహించనున్నారు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఫీజు రూ. 550 కాగా.. జనరల్ విద్యార్థులకు రూ. 750గా నిర్ణయించారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు

## బంజారాహిల్స్‌లో స్వాధీనం చేసుకున్న 12 ఎకరాల స్థలాన్ని ప్రజలకు ఉపయోగపడే పనులకు వినియోగిస్తాం

### మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** బంజారాహిల్స్ రోడ్ నెం12లోని ఎమ్మెల్యే కాలనీని అనుకుని ఉన్న 12 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ప్రజలకు ఉపయోగపడే పనుల కోసం వినియోగిస్తామని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. షేక్‌పేట మండల పరిధిలోని బంజారాహిల్స్ రోడ్ నెం 12లో కబ్జాదారుల నుంచి కాపాడిన 12 ఎకరాల స్థలాన్ని శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించే వారిపై కఠినంగా వ్యవహరించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఎన్నో ఏళ్లుగా అనేక రకాలైన వివాదాలు సృష్టించి ఎమ్మెల్యే కాలనీ పక్కనున్న ప్రభుత్వ స్థలాలను ఆక్ర మించేందుకు ప్రయత్నాలు జరిగాయని, స్థానిక తహసీల్దార్ అనితారెడ్డితో పాటు జిల్లా యంత్రాంగం సమన్వయంతో స్థలాన్ని కాపాడడంతో పాటు ఫెన్సింగ్ వేయించడం అభినందనీయమన్నారు. ఈ స్థలాన్ని ప్రజలకు ఉపయోగపడేలా వినియోగిస్తామని మంత్రి పేర్కొన్నారు.

# ప్రపంచ మహా సభలకు ప్రజలు తరలి రావాలి!

### - 3 వ ప్రపంచ తెలుగు మహా సభల పోస్టర్ విడుదల చేసిన కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



**విజయవాడ,మే3,ప్రభాతవార్తప్రతినిధి:** 2026 జనవరి 3,4,5 తేదీలలో లో జరగ బోయే 3 వ ప్రపంచ తెలుగు మహా సభలకు తెలుగు ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని, ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆంధ్ర మేవ జయతే! అన్న నినాదం తో నిర్వహిస్తున్న తెలుగు పండుగ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా గుంటూరు , అమరావతి జరుగనుండడం అందరకీ గర్వకారణం అని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా. పెమ్మ సాని చంద్రశేఖర్ అన్నారు. నేను తెలుగు మాధ్యమంలో విద్యాభ్యాసం చేసానని, శ్రీ కృష్ణ దేవరాయలు, తెనాలి రామకృష్ణ, వాగ్గేయకారులు, అన్న ఎన్ .టీ.ఆర్ లాంటి మహానుభావుల స్ఫూర్తి మనమందరమూ కొనసాగించాలని ఆయన అన్నారు. భారతీయ విద్యా భవన్ , గుంటూరు ప్రాంగణం లో 3 వ ప్రపంచ తెలుగు మహా సభల "ప్రచార పత్రిక " ను కేంద్ర మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ విడుదల చేసారు. గొప్ప విద్యా, అధ్యాత్మిక కేంద్ర మైన గుంటూరు శ్రీ సత్య సాయి స్పిరిచువల్ సిటీ ప్రాంగణం 3 వ ప్రపంచ తెలుగు మహా సభలకు వేదిక కావడం మాకు ఎంతో ఆనందం గా వుందని శ్రీ సత్యసాయి విద్యాసంస్థల చైర్మన్, గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు.పరిషత్తు అధ్యక్షులు డా.గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీ నందమూరి తారక రామారావు వేదికపై ఆంధ్ర సాంస్క ృతిక,సాహితీ వైభవాన్ని , తెలుగు భాషా వెలుగులను దశ దిశలా ప్రసరింపజేసేదిశగా సభలు నిర్వహిస్తామని, లక్షలాది మంది యువతీ యువకులు సాంస్క ృతిక ప్రదర్శనలలో పాల్గొని తెలుగు భాష కు నూతన ఉత్తేజంకలుగజేస్తారన్నారు.

# మిస్‌వరల్డ్ పోటీల నేపథ్యంలో ట్రై కమిషనరేట్లలో హైఅలర్ట్

### పోటీల్లో పాల్గొంటున్న వారు పర్యటించే ప్రాంతాల్లో ముందస్తు భద్రత

### చార్మినార్, చౌమహల్లా ప్యాలెస్, యాదగిరిగుట్ట, రామప్ప దేవాలయంసహా ఇతరచోట్ల భారీ బందోబస్తు

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** మిస్ వరల్డ్ పోటీలకు తెలంగాణ ఆతిథ్యం అదిరెలా ఉండాలని సర్కారు భావిస్తుండడంతో ఇందుకు తగినట్లుగా పోలీసు శాఖ భారీగా బందోబస్తు చేబట్టింది. పహల్గాంలో ఉగ్రదాడి తర్వాత దేశంలోని మరోసారి ఉగ్రవాదులు దాడులకు పాల్పడే వీలుందని నిఘా వర్గాలు హెచ్చరించడంతో మిస్ట్ వరల్డ్ పోటీలకు వేదికగా ఉన్న హైదరాబాద్‌లో అసాధారణ భద్రత ఏర్పాటు చేశారు. ఈ నెల 10న మొదలై 20 రోజులపాటు సాగనున్న ఈ పోటీల్లో 120 దేశాలకు చెందిన పోటీదారులు పాల్గొననున్నారు. 116 దేశాల నుంచి సమ్మతం రాగా కొన్ని దేశాలకు చెందిన పోటీదారులు ఇప్పటికే నగరానికి చేరుకున్నారు. ఈ పోటీలు ఎక్కువగా హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పరిధుల్లోనే ఉండనుండడంతో ట్రై కమిషనరేట్ల పోలీసులు అందుకు తగినట్లుగా బందోబస్తు చేబట్టారు. మిస్ వరల్డ్ పోటీదారులు జంటనగరాలతోపాటు శివార్లలోని పలు పర్యాటక ప్రాంతాల్లో పర్యటించనుండడంతో ఆయా ప్రాంతాల్లో ముందస్తు భద్రత చేబట్టారు. పోటీదారులు పాతబస్తీలోని లాడ్‌బజార్, మోతిగల్లీలలో పర్యటించనున్నారు. ఇక్కడ తయారయ్యే గాజులతోపాటు ఇక్కడి ముత్యాలకు దేశ విదేశాల్లో పేరుండడంతో ఈ రెండుచోట్ల పోటీదారులు పర్యటించి ఇక్కడి విశేషాలను తిలకించనున్నారు. దీంతో పాటు ఇదే ప్రాంతంలో గల పురాతన చౌమహల్లా ప్యాలెస్ వరకు పోటీదారులు ఈ నెల 12న హెరిటేజ్ వాక్ చేయనున్నారు. దీంతో ఈ ప్రాంతంలో పోటీదారులు హెరిటేజ్ వాక్‌చేసే సమయంలో పోలీసుల నుంచి గుర్తింపుకార్డులు పొందిన వారు మినహా ఇతరులకు అనుమతి ఉండబోదు. 13నన చౌమహల్లా ప్యాలెస్‌లో పోటీదారుల కోసం ప్రత్యేకంగా సాంస్కృతిక ప్రదర్శన ఏర్పాటు చేస్తుండడంతో ఇందుకోసం కూడా బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతోపాటు పోటీదారులు యాదగిరిగుట్ట, రామోజీ ఫిలిం సిటీ, రామప్ప దేవాలయం, పిల్లలమర్రి తదితర ప్రాంతాల్లోనూ పర్యటించనున్నారు. ఇందుకోసం పర్యాటక శాఖ ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేయగా పోటీదారులను హైదరాబాద్ నుంచి పలు గ్రూపులుగా ఆయా ప్రాంతాలకు తీసుకువెళ్లే బాధ్యతలను పోలీసు శాఖ తీసుకుంది. మిస్ వరల్డ్ పోటీలకు బందోబస్తు ఏర్పాట్లను డిజిపి జితేందర్ స్వయంగా సమీక్షిస్తున్నారు.

బందోబస్తు నోడల్ ఆఫీసర్‌గా గ్రేహౌండ్స్ అదనపు డిజి స్టీపెన్ రవీంద్రను సర్కారు నియమించింది. ఆయా ప్రాంతాల్లోని పోలీసులతో ఆయన సమన్వయం చేసుకుని పోటీదారులకు భద్రతను పర్యవేక్షిస్తారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చే పోటీదారులతోపాటు వారి వెంట వచ్చే ఆయా దేశాలకు చెందిన అతిథులు, అంతర్జాతీయ మీడియా సిబ్బంది విడిదిచేసే స్టార్‌హోటళ్లు, గెస్ట్ హౌస్‌ల వద్ద కూడా భద్రత పటిష్టం చేశారు.

మిస్ వరల్డ్ పోటీలు జరిగే సమయంలో యావత్ ప్రపంచం తెలంగాణవైపు చూసే వీలుండడంతో భద్రతలో ఎక్కడా తేడా రాకుండా పోలీసు శాఖ అన్ని చర్యలు తీసుకుంది. ఇక పాకిస్థాన్ ఉగ్రవాదుల హిట్ లిస్టులో హైదరాబాద్ చాలాకాలం నుంచి ఉండడం తెలిసిందే. మిస్ వరల్డ్ పోటీలకు భంగం కలిగించేందుకు ఉగ్రవాదులు ప్రయత్నించే వీలుందని నిఘా వర్గాలు హెచ్చరించడంతో కేంద్ర నిఘా వర్గాల సహకారంతో రాష్ట్ర పోలీసులు భద్రతను పక్కాగా కొనసాగిస్తున్నారు. మిస్ వరల్డ్ పోటీలకు బందోబస్తు తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ పెరిగేలా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొనడంతో పోలీసులు ఇందుకోసం సర్వశక్తులు ఒడ్డుతున్నారు.

4-5P□g7exHMNWJQE.qxd:4-5P□g7exHMNWJQE.qxd 01/01/01 9:55 AM Page 1





## మంత్రి శ్రీధర్‌బాబుతో కొత్త సిఎస్ రామకృష్ణారావు భేటీ

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణారావు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం సచివాలయంలో మంత్రిని కలిసారు. ఈ సందర్భంగా సిఎస్‌కు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ప్రాథమ్యాలకు అనుగుణంగా పనిచేసేలా రాష్ట్ర యంత్రాంగాన్ని ముందుకు నడిపించాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న హామీలు, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో అర్హులందరికీ చేర్చేలా ముందుకెళ్లాలని సిఎస్‌కు సూచించారు.

### గొర్రెల పంపిణీ స్కాం..

## కాంట్రాక్టర్ ఆస్తుల జప్తునకు కోర్టులో ఎసిబి పిటిషన్

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఏడాదిన్నర క్రితం వెలుగుచూసిన గొర్రెల పంపిణీ స్కాంలో మొదటి నిందితుడుగా వున్న కాంట్రాక్టర్ మొయినుద్దీన్‌కు సంబంధించిన ఆస్తులను జప్తు చేసేందుకు ఎసిబి నిర్ణయించింది. ఇందుకు సంబంధించి త్వరలో ఎసిబి కోర్టులో పిటిషన్ దాఖలు చేయనుంది. ఈ కేసులో ఏడాదిన్నరగా పరారీలో వున్న మొయినుద్దీన్ దుబాయ్‌లో వున్నట్లు ఎసిబి గుర్తించింది. మొయినుద్దీన్‌తో పాటు అతని కుమారుడు ఇక్రముద్దీన్ కూడా పరారీలోనే వున్నాడు. మొయినుద్దీన్ కుటుంబం మొదట కొండాపూర్‌లో వుండగా ఆ తరువాత కోకాపేట్‌కు మరాం మార్చింది. దుబాయ్ నుంచి వచ్చిన మొయినుద్దీన్‌ను ఎసిబి అరెస్టు చేసినట్లు వార్తలు వచ్చినా ఎసిబి అధికారులు వాటిని ధృవీకరించలేదు. తాము ఒక అనుమానితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని, అతను మొయినుద్దీన్ కాదని వారు తెలిపారు. ఈ కేసులో మొయినుద్దీన్‌తో పాటు అతని కుమారుడు ఇక్రముద్దీన్ తమకు వాంటెడ్ నేరగాళ్లని, వారిని పట్టుకునేందు కు చర్యలు తీసుకుంటున్నట్లు ఎసిబి అధికారులు తెలిపారు. మరోవైపు దుబాయ్‌లో వుంటున్న మొయినుద్దీన్ అతని కుమారుడు ఇక్రముద్దీన్‌ల వీసా గడువు ము గియడంతో వారిని భారత్‌కు రప్పించేందుకు ఎసిబి అధికారులు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఇప్పటికే వారిపై ఎల్‌ఓసి జారీ చేయగా కోర్టు నుంచి అరెస్టు వారంట్లు చేయించేందుకు ఎసిబి అధికారులు ప్రయత్నిస్తున్నారు. మొయినుద్దీన్‌కు వంద కోట్ల రూపాయల ఆస్తులు వున్నట్లు ఎసిబి గుర్తించిందని సమాచారం.

## పూర్తి సామర్థ్యంతో థర్మల్ విద్యుత్

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** ప్రస్తుత వేసవి కాలంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరగనున్న దృష్ట్యా దేశంలోని థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు పూర్తి సామర్థ్యంలో పని చేయాలని కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ అన్ని యూనిట్లను ఆదేశించింది. కరెంట్ కొరత లేకుండా ఈ ఏడాది అక్టోబరు 15 వరకూ విద్యుత్ ఉత్పత్తిని పూర్తిగా చేయాలని స్పష్టం చేసింది. ప్రస్తుత వేసవిలో ఏప్రిల్ నుండి జూన్ వరకూ 260 గిగావాట్ల విద్యుత్‌కు పీక్ డిమాండ్ ఏర్పడే వీలుందని అంచనా వేసింది. గత ఏడాది సెప్టెంబరులో పీక్ డిమాండ్ 243 గిగావాట్లుగా రికార్డయింది. ప్రస్తుత వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మించి నమోదు కావడతో ఆ మేరకు కరెంట్ వినియోగంలో భారీగా పెరుగుదల చోటుచేసుకుంటోందని తెలిపింది.



చలో బస్‌భవన్‌లో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

### ఆర్టీసీ కార్మికుల పెండింగ్ సమస్యలపై

## చలో బస్‌భవన్

**హైదరాబాద్ (చిక్కడపల్లి), మే 3, ప్రభాతవార్త:** ఆర్టీసీ కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టిజిఎస్ఆర్‌టిసి, ఎస్‌డబ్ల్యుఎఫ్, ఐఎన్‌టియుసి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం బస్‌భవన్ ఉద్రిక్తతలకు దారితీసింది. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పెద్దసంఖ్యలో బస్‌భవన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా టిజిఎస్ఆర్‌టిసి స్టాఫ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి, వైస్‌చైర్మన్ జి.అబ్రహం, వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ మహమూద్, ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌డి.చంద్రశేఖర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో కార్మికులు పడుతున్న ఇబ్బందుల పైన అధికారులు, సూపర్ వైజర్స్ కార్మికులపై వేధింపులు ఆపాలని,పనిభారాలను తగ్గించాలని, 2021 వేతన సవరణ అమలుకు, ఆర్టీసీలో యూనియన్లను అనుమతించాలని, ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వం లో విలీనం చేయడంతో పాటు రిటైర్ అయిన వారి సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2021 వేతన సవరణ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా మాస్టర్ సేల్ ప్రకటించాలని, ఆర్టీసీలో వెల్ ఫేర్ కమిటీలను రద్దు చేసి యూనియన్లను అనుమతించాలి. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయవలసిన ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలి. అపాయింటెడ్ డేను ప్రకటించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా వేతన సవరణకు సంభందించి అలవెన్సులను ఏరియర్స్ లెక్కలు చేసి ప్రతి కార్మికులకు వివరాలు తెలపాలని, ఏరియర్స్ రిటైర్ మెంట్ సమయంలో కాకుండ సంవత్సరాల కాలపరిమితికి వడ్డీతో సహా చెల్లించే విధంగా బాండ్లు ఇవ్వాలని, నమ్మే కాలంలో అక్రమంగా పెట్టిన పోలీస్ కేసులను వెత్తి వేయాలని, మహాలక్ష్మి ్ౖమ పథకం వలనే కండక్టర్లు వారికి తెలియకుండానే చిన్న చిన్న ఆరోపనలకు ఉద్యోగాలు కోల్పోయిన వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో వెంటనే రిక్రూట్ మెంట్ చేపట్టాలని, కార్మికులపై పనిభారాలు తగ్గించడంతో పాటు అధికారుల వేధింపులు కక్షసాధింపులు అపాలని, ఎం.వి.యాక్ట్ ను అతిక్రమించిన డ్యూటీలను తగ్గించాలని, మహానగరంలో సిగ్నల్స్ విపరీతమైన ట్రాఫిక్ లో 14 గంటల నుండి 16 గంటల డ్యూటీల షెడ్యూల్ చేయడం అసాధ్యం అని, అ డ్యూటీలు చేసినచో అనారోగ్యల పాలౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలలో 16 గంటలు డ్యూటీలు చేస్తూ షెడ్యూల్ ఓటీలో కోత, అసలు మహిళ కండక్టర్లు అత్యవసర పరిస్థితిలో పని చేయడానికి 8 గంటల డ్యూటీలు ఉన్నయా? ప్రశ్నించారు. రన్నింగ్ బస్సులో వెనక డోర్ నుండి దిగి పడిపోయిన కేసుల్లో డ్రైవర్, కండక్టర్ ను సస్పెండ్ చేయడం, ట్రావెలింగ్ కేసులో సస్పెండ్ చేయడం వంటి అంశాలపై ఇబ్బందులు గురిచేయడం మానుకోవాలని డిమాండ్ చేశారు.

# సైబర్ బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయాలి

### ఎన్‌సిఆర్‌పి అధికారుల వెల్లడి

### 79 శాతం కేసుల్లో 1930కి ఫిర్యాదుతోనే సరిపుచ్చుతున్న బాధితులు

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** సైబర్ నేరాలపై పోలీసులు చేబడుతున్న ప్రచార కార్యక్రమాలు ప్రజలను పూర్తిగా మార్చలేక పోతున్నాయి. సైబర్ నేరాలపై పోలీసులు అనేక రకాల ప్రసార మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నా బాధితులు మాత్రం ఈ విషయంలో స్పందించడం లేదని జాతీయ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సిఆర్‌పి) నివేదిక చెబుతోంది. సైబర్ నేరగాళ్ల బారినపడి లక్షల రూపాయల నుంచి కోట్లాది రూపాయలు పోగొట్టుకున్న వారిలో కేవలం 21.16 శాతం బాధితులు మాత్రమే పోలీసు స్టేషన్లకు వెళ్లి ఫిర్యాదు చేస్తున్నారని ఆ నివేదిక వెల్లడించింది. సైబర్ నేరాలకు సంబంధించి బాధితులు వెంటనే 1930కి ఫిర్యాదు చేయడం వరకు చేస్తున్నా ఆ తరువాత దీనిపై సమీప పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేసి, కేసు పురోగతిని పట్టించుకోవడం లేదని ఎన్‌సిఆర్‌పి ని వేదిక చెబుతోంది. ఈ కారణంగా సైబర్ నేరగాళ్ల ఖాతాల నుంచి పోలీసులు జప్తు చేస్తున్న కోట్లాది రూపాయలు బాధితులకు చేరకుండా బ్యాంకుల్లో ములుగుతోంది 2024లో తెలంగాణ నుంచి ఎన్‌సిఆర్‌పికి లక్షా 14 వేల 174 ఫిర్యాదులు అందగా ఇందులో నుంచి కేవలం 24,643 కేసుల్లోనే బాధితులు పోలీసు స్టేషన్లకు వెళ్లి నేరుగా ఫిర్యాదు చేయడంతో ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఈ లెక్కన కేవలం 21.16 శాతం కేసులే ఎఫ్ఐఆర్‌లుగా మారాయి. ఈ కారణంగా బాధితులు పోగొట్టుకుంటున్న డబ్బులు వారికి అందడం లేదని ఎన్‌సిఆర్‌పి నిపుణులు చెబుతున్నారు.

బాధితులు తాము పోగొట్టుకున్న డబ్బులను తిరిగి పొందాల ంటే కచ్చితంగా ఎఫ్ఐఆర్‌లు నమోదయి వుండాలని ఎన్‌సిఆర్‌పి నిపుణులు అంటున్నారు. బాధితులు 1930కి ఫిర్యాదు చేసినంత మా త్రాన ఎఫ్ఐఆర్‌లు న మోదుకావని, దీని తరువాత నేరుగా సమీప పోలీసు స్టేషన్లకు వెళ్లి తాము మోసపోయిన విషయం గురించి వివరిస్తే 1930లో నమోదైన ఫిర్యాదు ఆధారంగా బాధితుల నుంచి మళ్లీ ఫిర్యాదు స్వీకరించి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తారని ఎన్‌సిఆర్‌పి నిపుణులు చెబుతున్నారు. ఇలా చేస్తేనే బాధితులు పోగొట్టుకున్న డబ్బులు తిరిగి వారి బ్యాంకు ఖాతాలకు వస్తాయని వారంటున్నారు. కోర్టులో ఈ పద్ధతిని అంగీకరిస్తాయని వారు చెబుతున్నారు. ఇక చాలా కేసులో చిన్న మొత్తాలు పో గొట్టుకున్న బాధితులు 1930కు కూడా ఫిర్యాదు చేయడం లేదని ఎన్‌సిఆర్‌పి నిపుణులు చెబుతున్నారు. సైబర్ నేరగాళ్ల బారినపడ్డ వారంతా కచ్చితంగా పోలీ సులకు ఫిర్యాదు చేయడం మంచిదని వారంటున్నారు.

**గ్రామీణ ప్రాంతాల్లోని సైబర్ నేరాలపై పోలీసుల నిర్లక్ష్యం**

ఇక సైబర్ నేరాల విషయంలో చాలా కేసుల్లో పోలీసుల నిర్లక్ష్యం కూడా వుండడం మరో విశేషం. చాలా కేసుల్లో నిందితుల బ్యాంకు ఖాతాలలో డబ్బులు వు ండక పోవడంతో పోలీసులు కేసులు నమోదు చేయడం లేదని నిపుణుల పరిశీలనలో తేలింది. పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల పోలీసు స్టేషన్ల లో ఈ సమస్య ఎక్కువగా వుందని నిపుణులు చెబుతున్నారు. చిన్నపాటి సైబర్ నేరాల విషయంలో కేసులు, గొడవలు ఎందుకని బాధితులతో పాటు పోలీసులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఇతర కేసుల్లో నిందితులు పట్టుబడుతున్నా వారిపై గతంలో వున్న కేసులు వెలు గు చూడడం లేదని నిపుణులు అంటు న్నారు. ఈ కారణంగానే సైబర్ నేరాలలో రికవరీ శాతం ఐదు కంటే తక్కువగా వుంటోందని వారంటున్నారు.

# అక్రమంగా తరలిస్తున్న ధాన్యం పట్టివేత

### 7 లారీలు, ఐచర్ వాహనం స్వాధీనం

### 14మందిపై కేసు నమోదు

### వివరాలు వెల్లడించిన డిఎస్‌పి రాజశేఖర్‌రాజు




స్వాధీనం చేసుకున్న లారీలతో డిఎస్‌పి రాజశేఖర్‌రాజు, సిబ్బంది

**మిర్యాలగూడ, మే 3, ప్రభాతవార్త:** ఆంధ్రా నుండి తెలంగాణ రాష్ట్ర సరిహద్దు వాడపల్లి మీదుగా మిర్యాలగూడ ప్రాంతానికి తరలిస్తున్న సన్న ధాన్యాన్ని వాడపల్లి పోలీసులు పట్టుకున్నారు. శనివారం మిర్యాలగూడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డిఎస్‌పి రాజశేఖర్ రాజు అక్రమ ధాన్యం పట్టివేత కేసు వివ రాలను వెల్లడించారు. ఆంధ్రాలోని నరసరావు పేట, ప్రకాశం, ఒంగోలు జిల్లాల నుండి ఈ ధాన్యం మిర్యాలగూడ వైపుతరలిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం సన్నవడ్లకు ఇస్తున్న మద్దతు ధర, అదే విధంగా బోనస్‌పొందేందుకు అంధ్రాకు చెందిన కొంతమంది దళారులు ఆ ప్రాంత రైతులను మోసం చేసి ఇక్కడికి ధాన్యాన్ని రవాణా చేస్తున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. 15 రోజుల క్రితమే ధాన్యాన్ని నియంత్రించేందుకు ప్రత్యేకంగా ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులను ఏర్పాటు చేసినప్పటికీ అక్రమ మార్గంలో తెలంగాణలోకి ప్రవేశిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే 100కు పైగా లారీలను బార్డర్ నుంచి వెనక్కి పంపినట్లు తెలిపారు. నిఘా పెంచడంతో 8 లారీలతో పాటుఐచర్ వాహనంలో తరలిస్తున్న ధాన్యాన్ని పట్టుకున్నట్లు చెప్పారు. వాటిని స్వాధీనం చేసుకొని 14మందిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. సన్న ధాన్యం కొనుగోలు సీజన్ ముగిసే వరకు తనిఖీలను ముమ్మరం చేస్తామని తెలిపారు.ఈ సమావేశంలో రూరల్ సిఐ పిఎన్‌డి ప్రసాద్, ఎస్‌ఐలు మల్లికంటి లక్ష్మయ్య, శేఖర్, సైదులు, కె.సంజీవరెడ్డి పాల్గొన్నారు.

# సామాజిక మార్పునకు తెలంగాణ సర్కారు బాటలు

### నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపి మల్లు రవి

**హైదరాబాద్ మే 3, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ఒక ముఖ్యమైన సామాజిక మార్పునకు బాటలు వేసిందని వనరుల్లో, విద్యా, ఉపాధి అవకాశాల్లో అణగారిన వర్గాలకు న్యాయం చేసే దిశగా ఈ మార్పు ఉంటుందని నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవి ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయిలో కులగణనను చేపట్టాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానం చేయడం పట్ల నాగర్ కర్నూలు ఎంపీ డా. మల్లు రవి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం చేపటే కులగణనలో తెలంగాణ మోడల్‌ను దేశవ్యాప్తంగా అమలు చేయాల్సిన నమూనాగా తీసుకోవాలని తీర్మానం చేయడం ఎంతో గర్వకారణమని తెలిపారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో చేపట్టిన కులగణన సర్వేను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు.

సీఎం చొరవతో రాష్ట్రంలో కుల గణన సర్వేను సమర్థవంతంగా, శాస్త్రీయంగా పూర్తిచేయగలిగారని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో భాగమైన మంత్రివర్గం, అధికారులు, కిందస్థాయి సిబ్బంది అందరి కృషి అభినం దనీయం' అని డా. మల్లు రవి వివరించారు. సమాజంలో వాస్తవంగా ఏ వర్గాలు, కులాలు ఎంత శాతం ఉన్నాయన్న సమాచారం ప్రభుత్వం చేతిలో స్పష్టంగా ఉండాలి. అప్పుడే ఆయా వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం సమర్థవంతమైన ప్రణాళికలు చేపడుతుందని ఆయన అన్నారు. కేంద్రం కూడా తెలంగాణ మాదిరిగానే సమగ్రంగా కుల గణనను చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.అలాగే రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని రద్దు చేయాలని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీలకు రిజర్వేషన్లు అమలు చేసేలా ఆర్టికల్ 15(5)ను తక్షణమే అమలు చేయాలని డా. మల్లు రవి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ మోడల్ ను, ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వ కృషిని గుర్తించినందుకు ఆయన మరోసారి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులకు, కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి మరోసారి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో 8 కొత్త కోర్సులు

### 28 డిగ్రీ కాలేజీల్లో అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రామ్

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో 2025-26 విద్యా సంవత్సరం నుంచి 8 కొత్త కోర్సులను ప్రారంభించనున్నారు. పరిశ్రమలకు అనుసంధానంగా ఉండేలాగా.. మార్కెట్ అవస రాలకు అనుగుణంగా ఉండే కొత్త కోర్సులను ప్రారంభించనున్నారు. రాష్ట్రంలోని 28 ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో 2025-26 విద్యా సంవత్సరం నుండి అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రామ్ (ఏఈడిపి)ని ప్రవేశపెట్టనున్నారు. ఈ వినూత్న, పరిశ్రమల అనుసంధాన కోర్సులను ప్రవేశ పెట్టాలని నిర్ణయించారు. బి కామ్‌లో..బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇన్సూరెన్స్ (బిఎఫ్ ఎస్ ఐ), బికామ్..ఈకామర్స్ ఆపరేషన్స్, బి. కామ్.. రిటైల్ ఆపరేషన్స్, బిఎస్‌సి.. టూరిజం హాస్పిటాలిటీ, బిఎస్‌సి.. డిజిటల్/ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్, బిఎస్‌సి... మార్కెటింగ్ అండ్ సేల్స్, బిఎస్‌సి.. ఫార్మాస్యూటికల్ మాను ఫ్యాక్చ రింగ్ అండ్ క్వాలిటీ, బిబిఏ కంటెంట్ అండ్ క్రియేటివ్ రైటింగ్‌లో కోర్సులను ప్రారంభిం చనున్నారు. రాష్ట్రంలో 2019లో చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్ (సిబిసిఎస్)ని ప్రవేశపెట్టడం ఒక కీలకమైన సంస్కరణ. దీంతోపాటు రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్) ద్వారా 2018 నుంచి అడ్మిషన్లను చేపడుతున్నారు.

# పత్తి కొనుగోళ్లలో భారీ కుంభకోణం

### బ్రోకర్లు, ట్రేడర్ల ఖాతాలోకి రూ. 3 వేల కోట్లు

### మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపణ




శనివారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 3:** రాష్ట్రంలో పత్తి రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని బిఆర్ ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. మార్కెట్లలో వంద లాది మంది బ్రోకర్లతో దందా కొన సాగుతున్నదని ఆరోపించారు. కుట్రపూరితంగా కాంగ్రెస్ నేతలు పత్తి రైతులను ముంచుతున్నారని విమర్శిం చారు. పత్తిని సేకరించకపోవడంతో దళారులకు అమ్ముకునేలా కుట్ర చేశారని వెల్లడించారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఎర్రోళ్ల శ్రీనివాస్, మన్నె గోవర్ధన్ రెడ్డి, తుంగబాలు, వై.సతీష్‌రెడ్డి, రాఘవేంద్ర యాదవ్ లతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు పత్తి రైతులను కూడా వదిలి పెట్టలేదన్నారు. రూ.7,500 మద్దతు ధర ఉన్న పత్తిని దళారులు రూ.5 వేలకే కొని రైతులను నిండా ముంచారని చెప్పారు. పత్తి సేకరణలో రూ.3 వేల కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. పత్తి కొనుగోళ్లపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.కేసీఆర్ హయాంలో అక్టోబర్‌లోనే పత్తిని సేకరించామని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సకాలంలో పత్తి కాంటాలను ఏర్పాటు చేయలేదని విమర్శించారు. పత్తి కుంభకోణంలో కాంగ్రెస్ పెద్దల హస్తం ఉందని చెప్పారు. హైకోర్టులో పిల్ వేస్తే ప్రభుత్వం ఇప్పటికీ కౌంటర్ దాఖలు చేయడంలేదని వెల్లడించారు. బ్రోకర్లు, ట్రేడర్లు టీఆర్ నంబర్లతో అక్రమ ఖాతాలు సృష్టించి సీసీఐకి పత్తిని అమ్ముకున్నారని చెప్పారు. ఒక్కో క్వింటాల్‌పై రూ.2 వేల దోపిడీ జరిగిందన్నారు. కుట్రలో భాగంగానే కొనుగోళ్లను ఆలస్యంగా ప్రారంభించారన్నారు. 2024-2025లో 25 లక్షల మంది పత్తి పంట పండించారని, 49 లక్షలు బేల్స్ పత్తి పంట పండిందని చెప్పారు. సీసీఐ కొన్నది 41 లక్షల బేల్స్, ప్రైవేట్ ట్రేడింగ్ జరిగింది 8 లక్షల బేల్స్, సీసీఐకి అమ్మిన రైతులు 6 లక్షల 30 వేలు మాత్రమే, ట్రక్ పట్టీలు జారీ చేసినవి 9 లక్షలు మాత్రమే, 60 వేల టీఆర్ లు ప్రభుత్వం ఇచ్చింది. పత్తి మద్దతు ధర క్వింటాల్‌కు 7521 రూపాయలు అయితే ప్రైవేట్ మార్కెట్ లో రూ.5500 రూ.6000 మించలేదని తెలిపారు. సీసీ కెమెరాలు పరిశీలిస్తే దొంగలు దొరుకుతారని, 25 లక్షల మంది రైతుల కష్టాన్ని కాంగ్రెస్ నేతలు దోపిడీ చేశారని, సిట్టింగ్ జడ్జితో పత్తి కుంభకోణంపై దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. దీపావళి సందర్భంగా హైదరాబాద్ లో ఓ ఫైవ్ స్టార్ హోటల్లో సీసీఐ అధికారులు, ప్రముఖ ట్రేడర్స్ మధ్య జరిగిన రహస్య సమావేశం లో కుంభకోణానికి బీజం పడిందన్నారు. మూడు వేల కోట్ల రూపాయల మేర పత్తి రైతులను నిలువు దోపిడీ చేశారని, నకిలీ టీఆర్ నంబర్లతో పత్తి రైతులను కాంగ్రెస్ నేతలు మోసం చేశారని పేర్కొన్నారు.

పత్తి కొనుగోళ్లను సీసీఐ ఆలస్యం చేయడం వల్ల రైతులు నష్టపోయారని, ట్రేడర్లు, బ్రోకర్ల అకౌంట్లలో పత్తి పంట డబ్బులు పడ్డా యని, ఇందులో సీసీఐ,మార్కెటింగ్ అధికారుల హస్తం ఉందని ఆరోపించారు.

## మహిళలకు ప్రత్యేక బొగ్గుగనులు

### తొలి క్వార్టర్‌లో 160 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం

### సింగరేణి సిఎండి బలరామ్

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** సింగరేణి సంస్థలో మహిళా ఉద్యోగినిల సంఖ్య పెరిగిన రీత్యా వీరికి ప్రత్యేకంగా బొగ్గు గనులు కేటాయించాలని సింగరేణి సిఎండి ఎన్.బలరామ్ ఆదేశించారు. వీరి నిర్వహణలో నడిపించడానికి ఒక ఓపెన్ కాస్ట్ గనిని మరియు ఒక భూగర్భ గనిని ఎంపిక చేయాలన్నారు. అంతేకాకుండా ముందుగా ఒక పూర్తి షిఫ్టును కేవలం మహిళల చేతనే నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో శనివారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో మొదటి త్రైమాసికంలో 160 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని, 1200 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్‌ను తొలగించాలని ఏరియాల జనరల్ మేనేజర్‌లకు స్పష్టం చేశారు. గత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నెలలో సాధించిన బొగ్గు రవాణా 5.66 మిలియన్ టన్నులపై 2.7 శాతం వృద్ధితో గత నెలలో 5.81 మిలియన్ టన్నుల బొగ్గు రవాణా సాధించామన్నారు. అలాగే గత ఏడాది ఇదే సమయానికి సాధించిన 36.18 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ పై 10.6 శాతం వృద్ధితో గత నెలలో 40 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓబి తొలగించామని వివరించారు. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ లక్ష్యాలు సాధించాలన్నారు. అలాగే ఒడిశా రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించిన నైనీ బొగ్గు బ్లాకులో పనిచేసేందుకు సూపర్వైజర్ సిబ్బందిని ఎంపిక చేసి నెల రోజుల్లోగా అక్కడికి పంపించాలని చెప్పారు. కొత్తగా నియమించబడిన ఉద్యోగులను భూగర్భ గనుల్లో పనిచేసే విధంగా పోస్టింగులు ఇవ్వాలని సూచించారు. బొగ్గు రవాణా మరియు నాణ్యతపై కూడా ఆయన సమీక్షి ంచారు. నాణ్యత సరిగా లేనట్లయితే బొగ్గు అమ్మకాలు కుంటుబడతాయని, వినియోగదారులు దూరం అయ్యే ప్రమాదం ఉందన్నారు. కనుక నాణ్యతపై కిందిస్థాయి నుంచి పైస్థాయి అధికారుల వరకు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ముఖ్యంగా పూర్తి పనిగంటలు సద్వినియోగం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రధానంగా విధుల పట్ల నిరక్ష ్యంగా ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తేల్చిచెప్పారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు డి.సత్యనారాయణరావు, ఎల్.వి.సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.



రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యను అభినందిస్తున్న ప్రధాని మోడీ

## చట్టసభల్లో బిసిలకు 50 శాతం వాటా ఇవ్వాలి

### ప్రధానమంత్రికి ఎంపి ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** పార్లమెంట్‌లో బిసి బిల్లు పెట్టి చట్ట సభలలో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బి.సి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్,కృష్ణయ్య ప్రధానమంత్రికి విజ్ఞప్తి చేశారు. విజయవాడలో కలిసి ప్రధానమంత్రికి బిసిల డిమాండ్లపై విజ్ఞప్తి చేశారు. కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం పట్ల కృష్ణయ్య ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు.బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలని కోరారు. కేంద్ర విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లు బిసిల జనాభా ప్రకారం 27 శాతం నుండి 56 శాతంకు పెంచాలని కోరారు.బిసిల విద్యా, ఉద్యోగ, రిజర్వేషన్ల పై ఉన్న క్రిమిలేయరు తొలగించాలని కోరారు. బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి.

బీసీల అభివృద్ధికి ప్రత్యేక స్కీములను రూపొందించాలని కోరాడు. ఎస్సీ ఎస్టీ అట్రా సిటీ యాక్ట్ మాదిరిగా బిసిలకు బిసి యాక్ట్ తీసుకురావాలని కోరాడు. ఎస్సీ ఎస్టీ బిసిలకు ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు పెట్టాలని కోరాడు. కేంద్ర బడ్జెటులో రెండు లక్షల కోట్లు బీసీలకు కేటాయించి కేంద్రంలో బి.సి.లకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్,ఫీజు రియంబర్స్‌మెంట్ స్కీము విధానం సాచురేషన్ పద్ధతిలో ప్రవేశపెట్టాలని కోరారు. రాష్ట్రాలు అమలు చేసే పదకాలకు 60 మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వాలని కోరాడు. జాతీయ బి.సి కార్పొరేషన్ ద్వారా బి.సి కుల వృత్తులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ శాఖలలో, ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీగా ఉన్న 15 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు.ఈ డిమాండ్లు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని, ప్రధానమంత్రి చొరవ తీసుకోవాలని కోరారు.

**కృష్ణయ్య నిజమైన నాయకుడు..: ప్రధాని మోడీ వ్యాఖ్య**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ దేశంలో 40 సంవత్స రాలుగా బిసిల గురించి పోరాడుతున్న నాయకుడు కృష్ణయ్య అని ప్రధానమంత్రికి చెప్పగా ప్రధాని స్పందిస్తూ కృష్ణయ్య నిజమైన నాయకుడని, అంకితభావం గల నాయకుడు అని ప్రశంసించారు.

## భర్త ముందే భార్యకు ఆకతాయిల వేధింపులు

**హైదరాబాద్ (యూసుఫ్‌గూడ), మే 3, ప్రభాతవార్త:** భర్తతో కలిసి పబ్ నుంచి తిరిగి ఇంటికి వెళ్తుండగా మహిళను ముగ్గురు పోకిరీలు వెంబడించి, బెదరించి దాడికి పాల్పడిన ఘటన మధురానగర్ పిఎస్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, ఎపిలోని ఒంగోలుకు చెందిన ఓ మహిళ(29) భర్త, మరిది, ఆడపడుచుతో కలిసి హైదరాబాద్, రహమత్‌నగర్‌లో నివాసం ఉంటున్న తన బంధువుల ఇంటికి వెళ్లారు. వీరంతా కలిసి గురువారం సాయంత్రం బేగంపేటలోని క్లబ్ 8 పబ్‌కు వెళ్లి రాత్రి 12 గంటలకు తిరిగి ఇంటికి బయలుదేరారు. అయితే పబ్ నుంచి బయటకు వస్తున్న సమయంలో పంజాగుట్టకు చెందిన సంపత్(28), సందీప్(28), కూకట్‌పల్లికి చెందిన ఉమేష్(28) ఆమెను గమనించి వెంటపడ్డారు. భర్తతో కలిసివస్తున్న వారిలో ఒకడు వెకిలిగా మాట్లాడుతూ అసభ్యంగా ప్రవర్తించాడు. అంతేకాకుండా బీరు బాటిళ్లతో బెదరింపులకు దిగారు. బేగంపేట నుంచి రహమత్‌నగర్ వరకూ వారి వెంటపడుతూ వేధింపులకు పాల్పడ్డారు. ఈ క్రమంలో ఆమె భర్త తన భార్యను ఇంటికి చేర్చి స్నేహి తుడిని, డ్రాప్ చేయడానికి ఎస్ఆర్‌నగర్ మెట్రోస్టేషన్ దగ్గరికి రాగా మళ్లీ అదే ముగ్గురు యువకులు దాడికి దిగారు. వారు ప్రయాణిస్తున్న బైక్‌ను అడ్డగించి, ఫోన్లను బలవం తంగా లాక్కున్నారు. వెంటనే బాధితులు డయల్ 100 సహాయంతో పోలీసులకు సమాచారం అందించగా, స్పందించి మధురానగర్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ముగ్గురు ఆకతాయిలను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ట్రై సిరీస్‌లో శ్రీలంక తొలి విజయం

## 5 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా చిత్తు


**న్యూఢిల్లీ:** స్వదేశంలో జరుగుతున్న ముక్కోణపు వన్డే సిరీస్‌లో శ్రీలంక మహిళల జట్టు బోణీ కొట్టింది. కొలంబోలోని ప్రేమదాస స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో లంక 5 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 235 పరుగులు చేసింది. డెర్క్‌సెన్ (61), లారా (46) ఆ జట్టును ఆదుకున్నారు. లంక బౌలర్లలో మల్కి (4/50), విహంగ (3/41) రాణించారు. స్వల్ప ఛేదనను శ్రీలంక 46.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి పూర్తి చేసింది. హర్షిత సమరవిక్రమ (77), కవిష (61) నాలుగో వికెట్‌కు 128 పరుగులు జోడించి లంక విజయంలో కీలకపాత్ర పోషించారు. ఈటోర్నీలో ఆడిన రెండు మ్యాచ్‌లలోనూ సౌతాఫ్రికాకు ఇది రెండో పరాభవం.



మహిళల వన్డేల్లో శ్రీలంక తన నాల్గవ అత్యధిక పరుగుల వేటను పూర్తి చేసింది మరియు కొలంబోలో జరిగిన ముక్కోణపు సిరీస్‌లో దక్షిణాఫ్రికాను వరుసగా రెండవ ఓటమికి గురి చేసింది. కవిషా దిల్హారి మరియు హర్షిత సమరవిక్రమల మధ్య రికార్డు స్థాయిలో 128 పరుగుల భాగస్వామ్యం, ఇద్దరూ అర్ధ సెంచరీలు చేయడంతో, పిచ్ మందగించడం మరియు సిబ్బంది సమస్యలతో ఇబ్బంది పడుతున్న దక్షిణాఫ్రికా జట్టుపై శ్రీలంక కార్యకలాపాలను నియంత్రించింది. పదిహేడేళ్ల వికెట్ కీపర్ కరాబో మెసో శ్రీలంక ఇన్నింగ్స్‌లో 14 ఓవర్ల తర్వాత అనారోగ్యంతో మైదానం నుండి నిష్క్రమించాల్సి వచ్చింది. ఇక ఎనిమిది ఓవర్లు బౌలింగ్ చేసి 34 పరుగులకు 1 వికెట్ తీసుకున్న సునే లూస్ తన మోకాలిని టర్ఫ్‌లోకి లాక్కుని గాయాలపాలైంది, దీనితో ఆమె మైదానం నుండి బయటకు వెళ్లాల్సి వచ్చింది. శ్రీలంక జట్టులో అరంగేట్రం చేసిన ఆఫ్ స్పిన్నర్ దేవ్మి విహంగా తొలి వన్డేలోనే మూడు వికెట్లు తీసిన రెండో ఆఫ్ స్పిన్నర్‌గా రికార్డు సృష్టించగా, రెండో మ్యాచ్ ఆడుతున్న మల్కి మదారా 50 పరుగులకు 4 వికెట్లు పడగొట్టింది. అన్నెరీ డెర్క్సెన్ తొలి వన్డే అర్ధ సెంచరీతో నిర్మించిన దక్షిణాఫ్రికా మొత్తం 235 పరుగులు, ఆటలో సగం వరకు పోటీతత్వంతో కనిపించింది, కానీ శ్రీలంక మూడో ఓవర్‌లో చమరి అథపత్తును కోల్పోయినప్పుడు, అది మ్యాచ్ విన్నింగ్ అయ్యే అవకాశం ఉందని అనిపించింది. దిల్హారి మరియు సమరవిక్రమ 21 బంతులు మిగిలి ఉండగానే విజయాన్ని నమోదు చేశారు.

# జింబాబ్వేతో టెస్టుకు ఇంగ్లండ్ జట్టు ఖరారు

**న్యూఢిల్లీ:** జింబాబ్వేతో ఏకైక టెస్టు మ్యాచ్‌కు ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు తమ జట్టును ఖరారు చేసింది. ఈ నెల 22 నుండి 25 వరకూ సొంత గడ్డపై ఇంగ్లండ్-జింబాబ్వే మధ్య నాలుగు రోజుల టెస్టు మ్యాచ్ జరగనుంది. ఇదుకు సంబంధించి 13 మందితో కూడిన వివరాలను వెల్లడించింది. ఈ జట్టులో 27 ఏళ్ల పేసర్ సామ్ కుక్‌కు తొలిసారి జాతీయ జట్టులో చోటు దక్కడం విశేషం. కుక్‌తో పాటు, జోర్డాన్ కాక్స్‌ను కూడా ఈ మ్యాచ్‌కు ఎంపిక చేసిన ఇంగ్లీష్ జట్టు సెలక్టర్లు జోష్ టంగ్‌ను కూడా తిరిగి తీసుకున్నారు. ఇక కౌంటీ క్రికెట్‌లో సామ్ కుక్ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. నిలకడైన ఆటకు మారు పేరైన ఈ ఎస్సెక్స్ పేస్ బౌలర్ కౌంటీల్లో ఇప్పటికే 38 వికెట్లు తీశాడు. అలాగే ఇంగ్లండ్ లయన్స్ తరఫున ఆస్ట్రేలియా ఎ జట్టుతో మూడు మ్యాచ్‌లలో కలిపి సామ్ కుక్ 13 వికెట్లు పడగొట్టాడు. మరోవైపు జోర్డాన్ కాక్స్ 2024లోనే అరంగేట్రం చేయాల్సింది. న్యూజిలాండ్‌తో నవంబర్ నాటి మ్యాచ్‌లో ఆడాల్సి ఉండగా, ప్రాక్టీస్ సెషన్‌లో కుడిచేతి బొటన వేలికి గాయమైంది. దీంతో అప్పుడు అవకాశం కోల్పోయిన ఆటడికి మళ్లీ సెలక్టర్లు పిలుపునిచ్చారు. జోష్ టంగ్ విషయానికి వస్తే 2023లో ఆస్ట్రేలియాతో యాషెస్ సిరీస్‌లో భాగంగా లార్డ్స్ టెస్టు తర్వాత మళ్లీ జాతీయ జట్టుకు ఆడ లేదు. ఇంగ్లండ్ జట్టులో బెన్ స్టోక్స్ (కెప్టెన్), జాక్ క్రాలే, బెన్ డకెట్, ఓలీ పోప్, జో రూట్, హ్యారీ బ్రూక్, జామీ స్మిత్ (వికెట్ కీపర్), జోర్డాన్ కాక్స్ (వికెట్ కీపర్), సామ్ కుక్, గస్ అట్కిన్సన్, షోయబ్ బషీర్, మాథ్యూ పాట్స్, జోష్ టంగ్ ఉన్నారు.





## ఆర్టిస్టిక్ ఛాంపియన్‌షిప్‌లో..

# తెలంగాణ అమ్మాయి నిష్కకు రజతం


**న్యూఢిల్లీ:** పుణె వేదికగా జరుగుతున్న జాతీయ జూనియర్, సీనియర్ ఆర్టిస్టిక్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ యువ జిమ్నాస్ట్ నిష్క అగర్వాల్ సత్తాచాటింది. జాతీయ సీనియర్ ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ ఛాంపియన్‌షిప్ ఆల్‌రౌండ్ విభాగంలో హైదరాబాద్ అమ్మాయి నిష్క అగర్వాల్ రజతంతో మెరిసింది. ఈ పతకంతో ఆసియా జిమ్నాస్టిక్స్ ఛాంపియన్‌షిప్‌కు కూడా నిష్క అర్హత సాధించింది. పుణేలో జరిగిన ఈ పోటీల్లో నిష్క 43.750 స్కోరుతో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఆసియా ఛాంపియన్‌షిప్ వచ్చే నెల 12 నుంచి 15వ తేదీ మధ్య కొరియాలో జరగనుంది. ఇదే విభాగంలో సమంత (రైల్వేస్ స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డ్, 43.900), స్నేహ తరియాల్ (ఢిల్లీ, 43.750) వరుసగా ఒకటి, మూడు స్థానాలు దక్కించుకున్నారు. జాతీయ టోర్నీలో రాణించడం ద్వారా కొరియా వేదికగా జూన్ 12 నుంచి మొదలయ్యే ఆసియన్ ఛాంపియన్‌షిప్ టోర్నీకి నిష్క ఎంపికైంది.


# ఐపిఎల్25లో సమ్‌థింగ్ స్పెషల్

## తొలుత సెంచరీ.. ఆపై డకౌట్

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2025లో 52 మ్యాచ్‌లు పూర్తవడంతో, ప్లేఆఫ్స్‌కు చేరుకునే జట్లపై ఉత్కంఠ పెరిగింది. ఇదే సమయంలో ఈ టోర్నమెంట్‌లో ఇప్పటివరకు నలుగురు ఎడమచేతి వాటం బ్యాట్స్‌మెన్ సెంచరీలు సాధించడం విశేషం. ఈ 18వ సీజన్‌లో ఇప్పటి వరకు









జరిగిన మ్యాచ్‌ల్లో యువ భారత క్రికెటర్లు అద్భుతంగా రాణిస్తుండగా, పలు రికార్డులను సంఘటనలు కూడా జరిగాయి. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 4 సెంచరీలు నమోదయ్యాయి. అత్యంత ప్రత్యేకమైన విషయం ఏమిటంటే, ఈ నాలుగు సెంచరీలూ వివిధ జట్లకు చెందిన నలుగురు ఎడమచేతి వాటం బ్యాట్స్‌మెన్స్ సాధించారు. వారిలో, జీరోతో ప్రత్యేక సంబంధం ఉన్న ముగ్గురు బ్యాట్స్‌మెన్‌లు కూడా ఉన్నారు. ఈ సీజన్‌లో ఇషాన్ కిషన్, ప్రియాంష్ ఆర్య, వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మల సెంచరీలు హైలైట్స్‌గా నిలిచినప్పటికీ, ఈ సెంచరీల తర్వాత లేదా అంతకు ముందు డకౌట్‌గా అవుట్ కావడం యాదృచ్ఛికం. సన్‌రైజర్స్ హైదరాబాద్ వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ ఇషాన్ కిషన్, ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ అభిషేక్ శర్మతో పాటు, పంజాబ్ కింగ్స్ ఓపెనర్ ప్రియాంష్ ఆర్య, రాజస్థాన్ రాయల్స్ 14 ఏళ్ల ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ కూడా ఈ సీజన్‌లో సెంచరీలు సాధించారు. ఈ ఆటగాళ్లు సెంచరీ చేయడానికి ముందు లేదా తర్వాత డకౌట్ అయ్యారు. తొలిసారి సన్ రైజర్స్ హైదరాబాద్ తరఫున ఆడుతున్న ఇషాన్ కిషన్ తన తొలి మ్యాచ్ లోనే సెంచరీ సాధించాడు. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అతను 47 బంతుల్లో 11 ఫోర్లు, 6 సిక్సర్లతో అజేయంగా 106 పరుగులు చేశాడు. ఈ సీజన్‌లో ఇది తొలి సెంచరీ. కానీ, తర్వాతి మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ గోల్డెన్ డక్‌కు బలయ్యాడు. అలాగే, కిషన్ బాట్ సెంచరీ చేసినప్పటి నుంచి మౌనంగా ఉన్నాడు. పంజాబ్ కింగ్స్ యువ బ్యాట్స్‌మన్ ప్రియాంష్ ఆర్య ఈ సీజన్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. తన తొలి ఐపీఎల్ సీజన్‌లోనే సెంచరీ సాధించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఈ సీజన్‌లో మూడో మ్యాచ్‌లో, రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ప్రియాంష్ ఆర్య గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన తదుపరి మ్యాచ్‌లో, ప్రియాంష్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడి, 42 బంతుల్లో 7 ఫోర్లు, 9 సిక్సర్లతో 103 పరుగులు చేశాడు. ఈ సెంచరీ తర్వాత కూడా ప్రియాంష్ బ్యాట్ పరుగుల వర్షం కురిపిస్తూనే ఉంది. ఐపీఎల్‌లో ఆడిన అతి పిన్న వయస్కుడైన క్రికెటర్‌గా రికార్డు సృష్టించిన రాజస్థాన్ రాయల్స్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ తన మూడో మ్యాచ్‌లోనే సంచలన సెంచరీ సాధించాడు. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ కేవలం 38 బంతుల్లో 7 ఫోర్లు, 11 సిక్సర్లతో 101 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. దీనితో, అతను ఐపీఎల్‌లో అత్యంత వేగవంతమైన సెంచరీ చేసిన తొలి భారతీయుడిగా నిలిచాడు. అంతేకాకుండా, ఈ సెంచరీ ఐపీఎల్ చరిత్రలో రెండవ వేగవంతమైన సెంచరీగా కూడా నిలిచింది. కానీ ఈ సెంచరీ తర్వాత, ముంబై ఇండియన్స్‌తో జరిగిన తదుపరి మ్యాచ్‌లో అతను డకౌట్ అయ్యాడు.

# అమెరికాతో భారత్ ఢీ

## అక్టోబరు నుండి చెస్ టోర్నమెంట్

**న్యూఢిల్లీ:** ఈ ఏడాది భారత్, అమెరికా దేశాల మధ్య చెస్ టోర్నమెంట్ జరగనుంది. ఇరు దేశాలకు చెందిన టాప్ స్టార్ ప్లేయర్లు ఎదరు ఈ టోర్నీలో పాల్గొనున్నారు. దీనికి సంబంధించిన డ్రా తదితర వివరాలను నిర్వాహకులు వెల్లడించారు. అక్టోబరు 4న అర్లింగ్టన్‌లోని ఇ స్పోర్ట్స్ స్టేడియంలో ఈ చెస్ టోర్నమెంట్ పోటీలు జరుగనున్నాయి. ఇరు దేశాల నుండి ఐదుగురు ఆటగాళ్లు చొప్పున ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటారు. క్లాసికల్ ఫార్మాట్‌లో ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్ భారత్ జట్టుకు నాయకత్వం వహించి ముందుండి నడిపించనున్నాడు. అమెరికన్ సూపర్ గ్రాండ్ మాస్టర్ హికారు నకమురను గుకేశ్ ఢీ కొంటాడు. గుకేశ్‌తో పాటు, తెలంగాణ గ్రాండ్ మాస్టర్ ఇరిగేసి అర్జున్, సాగర్ షా, ఎథన్ వాజ్‌తో పాటు, భారత్ మహిళా ప్లేయర్, అంతర్జాతీయ మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్‌లు బరిలో ఉన్నారు. మొదటి బోర్డులో గుకేశ్, నకమురు తలపడనుండగా, రెండో బోర్డులో అర్జున్ గ్రాండ్ మాస్టర్ ఫాబియానో కరువానాను ఎదుర్కొంటాడు. ఇక మూడో బోర్డులో సాగర్ షా, లెవి రోజ్మన్ పోటీపడనుండగా, మిగిలిన పోటీల్లో దివ్యతో కారిస్సా యిప్, ఎథన్ వాజ్‌తో టాని టొలువా అద్యూమి తలపడతారు. కాగా టోరకనన నిబంధనల విషయానికి వస్తే బోర్డులోని ఇరు ఆటగాళ్ల మధ్య పదు రౌండ్ల గేమ్‌లు జరుగుతాయి. పది నిముషాల్లో గేమ్‌ను ముగించాల్సి ఉంటుంది. అప్పటికీ డ్రా అయితే మరో 5 నిముషాల ఆటను కొనసాగిస్తారు. షూటౌట్‌కు వస్తే మరో నిముషం అదనంగా కేటాయిస్తారు. అప్పటికీ సమ ఉజ్జీలుగా నిలిస్తే మాత్రం విజేత తేలేంత వరకూ పోటీ కొనసాగుతుంది.

# యుపిఐ సేవల్లో మరింత వేగం

**ముంబై, మే 3:** దేశంలో పెరిగిన యూపీఐ లావాదేవీల సేవల్లో వినియోగదారు అనుభవాన్ని మెరుగుపరచడానికి, అలాగే జాప్యాలను తగ్గించడానికి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కీలక చర్యలు తీసుకుంది. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలకు సంబంధించిన రెస్పాన్స్ సమయాన్ని కఠినతరం చేసింది. ఇటీవల జారీ చేసిన సర్క్యులర్‌లో జూన్ 16, 2025 నుంచి వివిధ యూపీఐ సేవల్లో వేగవంతమైన ప్రాసెసింగ్ ప్రమాణాలను అమలు చేయాలని ఎన్‌పీసీఐ బ్యాంకులు, చెల్లింపు యాప్ లను ఆదేశించింది. చెల్లింపు ప్రాసెసింగ్, లావాదేవీల ధ్రువీకరణ, రివర్సల్స్‌లో జాప్యాలను తగ్గించడం ఈ చర్య లక్ష్యం. ముఖ్యంగా లావాదేవీ స్థితిని తనిఖీ చేయడానికి గతంలో 30 సెకన్ల సమయం ఉండగా దాన్ని 10 సెకన్లకు తగ్గించారు. లావాదేవీ రివర్స్ చేయడానికి గతంలో 30 సెకన్ల సమయం ఉండగా దాన్ని కూడా 10 సెకన్లకు తగ్గించారు. అలాగే యూపీఐ ఐడీను ధ్రువీకరించడానికి గతంలో 15 సెకన్ల సమయం ఉండగా దాన్ని కూడా 10 సెకన్లకు తగ్గించారు. ఏప్రిల్ 12న యూపీఐ లావాదేవీలకు చాలా అంతరాయం కలిగింది. ముఖ్యంగా ఎన్‌పీసీఐ సాంకేతిక సమస్యల కారణంగా పాక్షిక లావాదేవీ వైఫల్యాలను అంగీకరించింది. అలాగే త్వరిత పరిష్కారానికి హామీ ఇచ్చింది. ఏప్రిల్ నెలలో దేశంలో రోజువారి యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలు 600 మిలియన్ల మార్కును చేరుకున్నాయి. ఆ నెలలో 596 మిలియన్ల లావాదేవీలను నమోదు చేసింది. మార్చిలో ఇది 590 మిలియన్లను దాటిందని ప్రభుత్వం తెలుపుతుంది. యూపీఐ మార్చి, ఏప్రిల్ నెలల్లో అనేక అంతరాయాలను ఎదుర్కొంది. అందువల్ల జీపే, ఫోన్‌పే వంటి యాప్‌ల లో తీవ్రమైన అంతరాయాలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా మార్చి 26, ఏప్రిల్ 1, ఏప్రిల్ 12 తేదీల్లో వినియోగదారులకు పెద్ద అంతరాయాలు సంభవించాయి. నెలవారీ డిజిటల్ లావాదేవీల్లో దాదాపు రూ. 25లక్షల కోట్లను ప్రాసెస్ చేసే వ్యవస్థలోని కొన్ని ఇబ్బందులను ఈ అంతరాయాలు బయటపెట్టాయి.





**న్యూఢిల్లీ, మే 3:** ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మూలం బ్యాంకులే. ఆర్థికపరమైన పరిణామాలన్నీ బ్యాంకుల ద్వారానే జరుగుతాయి. అప్పు కావాలన్నా, సంపాదించిన సొమ్ము దాచుకోవాలన్నా అన్నింటికీ బ్యాంకులే ఆధారం. లక్ష కోట్ల డాలర్ల విలువైన ఆస్తులను నిర్వహించే సంస్థలతో ప్రపంచ బ్యాంకింగ్ పరిశ్రమ ఆధిపత్యం ఉనికిని కొనసాగిస్తోంది. స్టాటిస్టా నివేదిక ప్రకారం 2025 నాటికి అమెరికాలో అతి పెద్ద బ్యాంకు. ఈ ర్యాంకింగ్స్‌లో అమెరికన్ బ్యాంకులు ఆధిపత్యం కొనసాగిస్తుండగా, చైనా బ్యాంకులు టాప్ టెన్‌లో నాలుగింటిని ఆక్రమించాయి. ఇండస్ట్రియల్ అండ్ కమర్షియల్ బ్యాంకు ఆఫ్ చైనా ఆసియాలోనే అతిపెద్దదిగా అవతరించింది. మార్కెట్ కేపిటలైజేషన్ పరంగా టాప్ 10 బ్యాంకులలో ఓ భారతీయ బ్యాంకు కూడా చోటు దక్కించుకుంది. హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్‌తో విలీనం తర్వాత భారత్‌కు చెందిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు భారతదేశంలో అతిపెద్ద బ్యాంకుగా, ప్రపంచవ్యాప్తంగా పదో అతిపెద్ద బ్యాంకుగా మారింది. 2025 మే 2 నాటికి ఇది 184.44 బిలియన్ డాలర్లు అంటే రూ.1,553,706 కోట్లుగా మార్కెట్ టర్నోవర్ కలిగి ఉంది. జెపి మోర్గాన్ ఛేజ్ రూ.57,80,495 కోట్లు, ఇండస్ట్రియల్ అండ్ కమర్షియల్ బ్యాంకు ఆఫ్ చైనా రూ.2,696,421 కోట్లు, బ్యాంకు ఆఫ్ అమెరికా రూ.2,549,084కోట్లు, అగ్రికల్చరల్ బ్యాంకు ఆఫ్ చైనా రూ.2,163,540 కోట్లు, వెల్స్ ఫార్గో రూ.1,968,702 కోట్లు, చైనా కన్‌స్ట్రక్షన్ బ్యాంకు రూ.1,8,24,265 కోట్లు, బ్యాంకు ఆఫ్ చైనా రూ.1,745,070 కోట్లు, హెచ్‌ఎస్‌బీసీ రూ.1,660,165కోట్లు, మోర్గాన్ స్టాన్లీ రూ.1,580,581కోట్లు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు రూ.1,553,706 కోట్లుగా ఉన్నాయి. ఈ రంగం నికర వడ్డీ ఆదాయం 8.94 లక్ష కోట్ల డాలర్లకు పెరుగుతుందని అంచనా. మార్కెట్ కేపిటలైజేషన్ పరంగా అమెరికాకు చెందిన జెపి మోర్గాన్ ఛేజ్ ప్రపంచంలోనే అతిపెద్ద బ్యాంకు. మొత్తం ఆస్తులపరంగా ఇది

# ప్రపంచంలోనే పెద్ద బ్యాంకులు ఇవే..





# ఈక్విటీలకు రిచ్ డాడ్ పూర్ డాడ్ రచయిత వార్నింగ్!

**ముంబై, మే 3:** స్టాక్ మార్కెట్లలో చాలా మంది పెట్టుబడులు పెడుతుంటారు. డబ్బులు ఎక్కువ సంపాదించాలనే ఆశతో స్టాక్స్‌పై సరైన అవగాహన లేకపోయినా భారీగా డబ్బులు పెట్టుబడిగా పెడుతుంటారు. అలాంటి వారికే కాక.. స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేసే అందరికీ ఒక పాపులర్ న్యూస్ చెప్పారు రిచ్ డాడ్ పూర్ డాడ్ పుస్తక రచయిత రాబర్ట్ కియోసాకి. సమీప భవిష్యత్తులో స్టాక్ మార్కెట్లు కుప్పకూలతాయని అన్నారు. అయితే ఇలాంటి పరిస్థితుల్లో ఆందోళన చెందకుండా దీన్ని అవకాశంగా భావించాలని కూడా అంటున్నారు. ఇటీవల ఆయన ఎక్స్‌లో ఒక పోస్ట్ చేశారు అందులో పలు విషయాలపై స్పందించారు. నిరుద్యోగ భయం ప్రపంచవ్యాప్తంగా వైరస్ లాగా ఎలా వ్యాపిస్తుందో వివరించారు. వాస్తవిక



గురించి చెప్పారు. రాన్నున్న మహా మాంద్యం గురించి హెచ్చరించిన తన పుస్తకంలో తాను పేర్కొన్నట్లు జరగబోతోందని అన్నారు. నా అంచనా ప్రకారం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోతుంది. స్టాక్ మార్కెట్లు క్రాష్ అవుతాయి. అందుకు భయపడొద్దు.. సిద్ధంగా ఉండాలి. దాన్ని ఒక అవకాశంలా భావించాలని అంటూ వెల్లడించారు. 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్ని తిప్పికొట్టడానికి, దానిని సంక్షోభం కంటే కూడా ఒక అభ్యాస అవకాశంగా మార్చడానికి తాను ఒక మార్గాన్ని కనుగొన్నానని ఆయన తెలిపారు. సంక్షోభ సమయంలో తెలివిగా పెట్టుబడి పెట్టాలని అన్నారు. మార్కెట్ పతన సమయంలో నిజమైన ఆస్తులు అమ్మకానికి వస్తాయంటూ పేర్కొన్నారు. ప్రపంచంలోని అనేక అంశాలు స్టాక్ మార్కెట్లపై ప్రభావం చూపుతాయి కనుక మార్కెట్లలకూలిన స్థితిలో పానిక్ సెల్లింగ్ ఒక సాధారణ విషయం అని అన్నారు. బిట్‌కాయిన్ ధర 300 డాలర్లకు పడిపోతే బాధపడతారా? సంతోషిస్తారా? అని ప్రశ్నించారు. అలా జరిగితే అది పెట్టుబడి పెట్టేందుకు ఒక చక్కటి అవకాశం అన్నారు. మీరు కొనగోలు చేసినప్పుడు లాభపడుతుంది, అమ్మినప్పుడు కాదు అని అని రాబర్ట్ అన్నారు. అయితే తాను ఈ పోస్ట్ చేయడానికి ఒక కారణం ఉందని రాబర్ట్ వెల్లడించారు. తన ప్రేక్షకులను ఆర్థికమాంద్యం గురించి సిద్ధంగా ఉంచాలని ఈ పోస్ట్ చేస్తున్నట్లు వెల్లడించారు. ఆ మహా ఆర్థిక జాగ్రత్తగా ఉండండి అని చెబుతూ నేటి ప్రపంచ ఆర్థికవ్యవస్థలో నిరుద్యోగ సమస్య మాంద్యం ఆల్రెడీ మొదలైంది అని కూడా ఆయన తెలిపారు.

# వాణిజ్యం

**ముంబై, మే 3:** అధిక రాబడి అవకాశాల కోసం చూస్తున్న పెట్టుబడిదారులు ప్రభుత్వ మద్దతు ఉన్న స్టాక్స్‌ను ఎంచుకోవడం ఉత్తమమని నిపుణులు చెబుతున్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కేవలం ఒక నెలలోనే 49 శాతం వరకు రాబడిని అందించిందని వివరిస్తున్నారు. ఈ కంపెనీ మార్చి త్రైమాసికంలో బలమైన పనితీరుతో మెరుగైన రాబడిని అందించింది. ముఖ్యంగా దాని శుద్ధి విభాగంలో ఇది లాభాలను, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని గణనీయంగా పెంచింది. ప్రస్తుతం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌ను 34 మంది విశ్లేషకులు కవర్ చేస్తున్నారు. వారిలో 22 మంది దీనికి 'కొనుగోలు' రేటింగ్ ఇచ్చారు. ఏప్రిల్‌లో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 10 డాలర్లు తగ్గితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో ఇండియన్ ఆయిల్ ఇన్వెంటరీ నష్టానికి దారితీయవచ్చని ఓ ప్రముఖ బ్రోకరేజ్ సంస్థ తన నివేదికలో పేర్కొంది. రిఫైనింగ్ మార్జిన్‌లో కొంత బలహీనత ఉన్నప్పటికీ ఈ కంపెనీ మార్కెటింగ్ మార్జిన్‌లో గణనీయమైన పెరుగుదల కనిపించింది. మార్చి త్రైమాసికఫలితాల తర్వాత నిర్వహణ లాభం అంచనాల వరుసగా 15 శాతం నుంచి 17 శాతం వరకు ఉండవచ్చని నిపుణులు చెబుతున్నారు. అలాగే ప్రముఖ బ్రోకరేజ్ సంస్థ మోర్గాన్ స్టాన్లీ కూడా ఈ స్టాక్‌కు కొను గోలు రేటింగ్ ఇచ్చి దాని ప్రస్తుత ధర కంటే దాదాపు 49శాతం ఎక్కువ ధరను రూ.205గా నిర్ణయించింది. ఇండియన్ ఆయిల్ స్టాక్‌ను పూర్వాశ్చర్య అట్లాగ మోర్గాన్ స్టాన్లీ కంపెనీ అభివృద్ధించింది. ఈ స్టాక్ రాబోయే 30 రోజుల్లో గణనీయమైన లాభాలను అందిస్తుందని పేర్కొంటుంది.

# ఐఒసి స్టాక్‌లో పెట్టుబడితో రాబడుల వెల్లువ..




# విద్యుత్ వాహనాల మార్కెట్లో టీవీఎస్ హవా

**ముంబై, మే 3:** ఏప్రిల్ 2025 నాటికి భారతదేశ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన మార్కెట్లో టీవీఎస్ మోటార్ అగ్రగామిగా అవతరించింది. గతంలో అగ్రస్థానంలో బజాజ్ ఆటో, ఓలా ఎలక్ట్రిక్‌లను అధిగమించి మరీ టీవీఎస్ ఈ స్థానానికి చేరింది. గత నెలలో టీవీఎస్ 19,736 యూనిట్లను విక్రయించింది. ఇది గత సంవత్సరంతో పోల్చితే 154 శాతం సూచిస్తుంది, అలాగే పెరుగుదల 22 శాతం మార్కెట్ వాటాతో ఉందని నిపుణులు చెబుతున్నారు. అయితే ఓలా ఎలక్ట్రిక్ 19,709 యూనిట్లను విక్రయించింది. ఇది గత సంవత్సరం కంటే 42 శాతం తగ్గుదల, 21 శాతం మార్కెట్ వాటాతో కలిగి ఉంది. అలాగే బజాజ్ ఆటో 151 శాతం వృద్ధిని సాధించి 19,001 యూనిట్లను చేరుకుంది. అలాగే 21 శాతం మార్కెట్ వాటాను పొందింది. అలాగే ఏథర్ ఎనర్జీ అమ్మకాల్లో వృద్ధిని చూపు తున్న ఏథర్ ఎనర్జీ వాటి స్కూటర్ల అమ్మకాలు 31 శాతం పెరిగి 13,167 యూనిట్లకు చేరుకున్నాయి. అంటే దాదాపు 14 శాతం మార్కెట్‌వాటా ఏథర్ పొందింది. అలాగే హీరో మోటోకార్ప్ 6,123 యూనిట్ల అమ్మకాలతో పోయిన 7 శాతం మార్కెట్ వాటాతో 540 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఓలా ఎలక్ట్రిక్ నెలనెలా అమ్మకాలు తగ్గడానికి పెరిగిన పోటీ, వ్యూహాత్మక మార్పుల కారణమని నిపుణులు చెబుతున్నారు. భవిష్‌అగర్వాల్ నేతృత్వంలోని కంపెనీ మహారాష్ట్రతో సహా అనేక రాష్ట్రాల్లో ట్రేడ్ సర్టిఫికెట్లు, వాహన రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఫోరంలో చాలా వరకు పోరాడలేనని మూసివేసి పరిస్థితికి వచ్చింది. అయితే మహారాష్ట్రలోని 100 కి పైగా షోరూమ్‌లను మూసివేయాలని ఆదేశించిందని వార్తలు గుప్పుమన్నాయి. అయితే అధికారులు నోటీసు గురించి తమకు తెలియదని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. అలాగే టీవీఎస్, బజాజ్, ఏథర్ వంటి ఈవీ స్కూటర్లకు పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో ఓలా అమ్మకాల్లో వెనుకబడింది. టీవీఎస్ ఏప్రిల్ నెలలో అత్యుత్తమ అమ్మకాలను సాధించి మొదటిసారిగా మార్కెట్లో అగ్రస్థానంలో నిలిచింది. బజాజ్ ఆటోసహేతరు దాని చేతక్ ఈస్కూటర్‌కు సంబంధించిన అమ్మకాలతో బలపడింది. ఈ కంపెనీ క్యూ4 2025ఆర్థిక సంవత్సరంలో అమ్మకాల్లో అగ్రస్థానంలో నిలిచింది.



**న్యూఢిల్లీ, మే 3:** ప్రముఖ టెక్ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్‌కు చెందిన వీడియో కాలింగ్ ప్లాట్‌ఫామ్ స్కైప్ సేవలు శాశ్వతంగా నిలిపోతున్నాయి. ఈ నెల 5 నుంచి స్కైప్ సర్వీసులను నిలిపివేస్తున్నట్లు మైక్రోసాఫ్ట్ ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా పాపులర్ అయిన స్కైప్‌కు కరోనా తర్వాత ఆదరణ తగ్గడం, మార్కెట్లో పోటీగా మెరుగైన ఇతర ప్రత్యామ్నాయాలు రావడంతో సంస్థ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. దీని వాడుతున్న యూజర్లు టీమ్స్‌కు మారాల్సి ఉంటుందని తెలిపింది. 2003లో తొలుత తన సేవలను ప్రారంభించిన స్కైప్, వీడియో కాలింగ్ ఇన్‌స్టంట్ మెసేజింగ్‌లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. 2011లో దీనిని మైక్రోసాఫ్ట్ కొనుగోలు చేసింది. 2017లో మైక్రోసాఫ్ట్ టీమ్స్‌ను లాంచ్‌చేసింది. నాటి నుంచి స్కైప్ అంతర్గతంగా పోటీ ఎదుర్కొంటుంది. అలాగే మెసేజింగ్, వీడియో కాల్స్ ఇతర సర్వీసుల కోసం టీమ్స్‌ను ప్రాథమిక కేంద్రంగా సంస్థ పూర్తిగా దృష్టిపెడుతోంది. స్కైప్ నుంచి టీమ్స్‌కు మైగ్రేట్ అయ్యేందుకు మైక్రోసాఫ్ట్ యూజర్లకు చాలా నెలల సమయం ఇచ్చింది. టీమ్స్‌లోకి లాగిన్ కావడానికి ఇప్పటికే ఉన్న స్కైప్ ఐడీలను ఉపయోగించవచ్చని తెలిపింది. ఇది యూజర్ ట్రాన్స్‌ఫర్మేషన్‌ను సులభతరం చేసింది. చాట్ హిస్టరీలు, కాంటాక్ట్‌లను నేరుగా టీమ్స్‌కు బదిలీ చేసేవిధంగా మైక్రోసాఫ్ట్ హామీ ఇచ్చింది. కాగా మార్కెట్లో టీమ్స్‌కు కూడా ప్రత్యామ్నాయాలున్నాయి. యూజర్లు వీడియో కాలింగ్ ఫీచర్లను అందించే గూగుల్ మీట్, జూమ్ లేదా వాట్సాప్ వంటి సర్వీసులు ఉన్నాయి.

# స్కైప్ సేవలకు మైక్రోసాఫ్ట్ స్వస్తి..





Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A, NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14